UNIVERSAL
LIBRARY
OU_204682
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82/S94Sr Accession No. G.7 25

Author సుబ్బ యజ్ఞశాస్త్రి, కొకిరాజు.

Title శ్రీరామ విజయము.

This book should be returned on or before the date last marked below.

శ్రీరామవిజయము

కల్యాణకాండము.

ఇది

కాకినాడ వాస్తవ్యులు:

కాశీభట్ల సుబ్బయ్యశాస్త్రిగారిచే

విరచింపఁబడి, ప్రచురింపఁబడినది.

ప్రథమముద్రణము 1200 ప్రతులు.

కాకినాడ:—పట్టమట్ట శేషగిరిరావుగారి జార్జిప్రెస్‌యందు

ముద్రింపఁబడియె.

1935.

కాపీరైట్]

[వెల 1–0–0.

పీఠిక.

—:o:—

నేను బ్రహ్మశ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారిచే విరచింపఁబడుచున్న 'శ్రీరామవిజయము' యొక్క, పూర్వకళ్యాణకాండములఁ బఠించియుంటిని. వీనియందు అమూల్యములగు నపూర్వవిషయము లెన్నియో హృదయరంజకముగా వర్ణింపఁబడియున్నవి. శ్రీశాస్త్రిగారిరచనాశైలి మృదుమధురమై, ఘనభావవిలసితమై, నీతిబోధకమై, ఆంధ్రసోదరీసోదరు లెల్లరు ననాయాసముగా గ్రహింపఁదగిన కథాసంవిధానములతోఁ గూడి, యలరారుచున్నయది.

శ్రీశాస్త్రిగారి విజ్ఞానసంపదను గూర్చి పూర్వకాండకృతి ప్రశంసలో బ్రహ్మశ్రీ బులుసు సుబ్బారావుగారు వ్రాసిన వాక్యములు యథార్థములు.

ప్రస్తుతము తెలుగునఁ బ్రకటింపఁబడుచున్న గ్రంథములు కొన్ని మనయార్య మర్యాదలకు వన్నెతేలేకుండుటయే కాక, అవమానమును గూడఁ గొనివచ్చుచున్నయవి. కావ్యపాఠమువలనఁ జదువరులకు విజ్ఞానవికాసము దయింపవలయునుగాని, నీరసభావము లుద్భవింపరాదు.

శ్రీశాస్త్రిగారిచే విరచింపఁబడుచున్న యీ 'శ్రీరామవిజయము' సనాతనార్యమర్యాదలఁ జక్కఁగాఁ దెలియఁజేయుచు, మనోహరములగు నుపాఖ్యానములచేఁ జనపులకింపుఁ గొలుపుచున్నయది. ఇట్టి యున్నతభావవిరాజితములగు కావ్యములు మనయాంధ్రసారస్వతమున బయలు వెడలుట సంతసావహము. శాస్త్రిగారు మిగతకాండములఁగూడఁ బ్రకటించి, యాంధ్రసోదరులకానందమును సమకూర్తురు గావుత. కథానాయకుఁడగు శ్రీరామచంద్రుఁడు వీరికిఁ దగు నుత్సాహశక్తి నొసంగు గావుత.

కాకినాడ,
8—5—35.

ఉప్పులూరి భీమశంకరశాస్త్రి,
బి. యే., బి. ఎల్.

శ్రీరస్తు

కృతిసమర్పణము

సుగుణభూషితులును, ఉదారస్వభావులును, నాకాప్తమిత్రులును, మండలప్రధానవైద్యాధికారము నుండి విశ్రాంతినిగైకొనియున్న శ్రీలక్ష్మీకాంతాసమేతులగు మహారాజశ్రీ ఉంగరాల సీతారామస్వామి నాయుడు L. M. & S. గారికి, వారికుమారుఁడు చి॥ హనుమంతరావునకును, చి॥ సౌ॥ లక్ష్మీనరసమాంబకును, శ్రీయువసం॥ వైశాఖశు ౧౦ సోమవాసరమున జరిగిన వివాహమహోత్సవసమయమున శ్రీరామవిజయముయొక్క ఈకళ్యాణకాండము కృతిగానొసఁగఁబడినది.

డాక్టరు ఉంగరాల సీతారామస్వామినాయుడుగారు, L. M. & S.

Retired District Medical Officer.

విజ్ఞప్తి

—:o:—

ఘనాశయులారా! ఇంతకుముందు నాచేఁ బ్రకటింపఁబడిన 'శ్రీరామవిజయ' 'పూర్వకాండము' నందు "నాయూహ" అను శీర్షిక క్రిందవ్రాయఁబడిన దానిలోఁ గాండములఁ బేర్కొనుచు, బూర్వకాండమునకుఁ బిమ్మట బాలకాండమనియు, దానికిఁబిమ్మట అయోధ్యాకాండమనియుఁ దెలుపఁబడినది కాని యిపుడు బాలకాండమునకు కళ్యాణకాండమనియు అయోధ్యాకాండమునకు రాజ్యకాండమనియుఁ బేరుల మార్చితిని.

ఈకళ్యాణకాండమునుండి శ్రీమద్రామాయణమున వాల్మీకిముని పుంగవునిచే వర్ణింపఁబడిన ప్రధానేతివృత్తమును ఆధారముగాఁ దీసికొనియుండుటచే, అపూర్వరమ్య కావ్యనిర్మాతయగు ప్రాచేతసుని పూర్వాపరజన్మగాధలగూర్చి వ్రాయఁగుతూహలినై, యామునిసింహుని చరితముతోని "కళ్యాణకాండము"ను ప్రారంభించితిని.

మఱియు, ఏమునీంద్రుని జీవితము నీతిబోధకముగానుండుటచే దీనింజదివి సహృదయులానందింతురను నమ్మికచేఁ గొంచెము పెంచి వ్రాసితిని. దేవాలయమునకు ముందు ధ్వజస్తంభమువలె, రామాయణమునకు ముందు వాల్మీకిజీవితముండుట ధర్మమని నాతలంపు.

ఈకళ్యాణకాండమును ముద్రించుటకువలయు బాధ్యతనంతను వహించి, సర్వవిధముల నాకుఁబ్రోత్సాహమును గలిగించిన నామిత్రులగు మహారాజశ్రీ ఉంగరాల సీతారామస్వామినాయుడు L. M. & S, గారికిని, గౌరవాదరములతోనీకళ్యాణకాండమునకుఁ బీఠికనువ్రాసి తమకుఁగల సారస్వతాభిమానమును వెలిబుచ్చిన బ్రహ్మశ్రీ ఉప్పలూరి భీమశంకరశాస్త్రి, బి. యే. బి యల్ గారికిని, నాకృతజ్ఞతావందనముల నందఁజేయుచున్నాఁడను.

ఇట్లు,

సుజనవిధేయుఁడు,

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి.

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు,

Retired Sanskrit Pandit,

P. R. COLLEGE, COCANADA.

శుభమస్తు

శ్రీ రామ విజయము

కల్యాణకాండము

—:0:—

శ్లో॥ సూర్యం వందే కృపాసింధుం దివ్యతేజోవిరాజితం
యద్వంశ్యాలోక కల్యాణం మన్యంతే జన్మనః ఫలం॥

ప్రథమాధ్యాయము

—: వాల్మీకి చరితము :—

శ్లో॥ కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం।
ఆరుహ్యకవితాశాఖాం వందే వాల్మీకి కోకిలం॥

సిప్రానదీతీరమున నుజ్జయినీపట్టణమునకు అయిదుక్రోశముల దూరమున సాలయను ద్విజాగ్రహారమొండు కలదు. ఆయగ్రహారవీధుల నేగునపుడు ఒకగృహమున వేదనాదమును, వేఱొకయుదవసితమున శాస్త్రచర్చయు, మఱియొకభవనమున వేదాంతవిచారమును, వేఱొండునిలయమున గానకళాభ్యాసమును, ఇకనొకమందిరమునఁ బురాణగోష్ఠియు, ఇట్టుల ప్రతిగృహమునను నేదియో విద్యావ్యాసంగము వినవచ్చుచుండును.

ఇట్లు భారతీవిహారణోద్యానవాటికయనదగు నాభూసురాగ్రహారమునకు స్వామియు, నిరతాన్నప్రదాతయు, దేవగురువిప్రాతిథి పూజాపరాయణుండును, విదిదాఖిలనిగమ నిగమాంతసారభాసురుండును, శ్రీవత్సగోత్రరత్నాకర శీతకరుండును, నగు మాధవుండను, భూసురోత్తముండు సదాచారసంపన్నయు, వినిర్మలానురాగ కళావిలసితయు, నిరుపమానసుగుణభాసితయు, నగు కమలయను, భార్యతో సుఖముగా గాపురము చేయుచుండెను.

ఆద్విజదంపతులు శ్రీహరికథాసుధాస్వాదనతత్పరులై కాలమును పావనముగా గడుపుచుండిరి. కాని వారికి యుక్తకాలమునకు సంతతి సమకూరదాయెను. అందుచేనాదంపతులు కొంచెముఖిన్నులై సంతాన ప్రాప్తికై ప్రత్యేకముగా దైవతములనారాధింప మొదలిడిరి. ఇట్లుండ నొకనాడు స్తంభుఁడను మునీశ్వరుఁడు వారింటికి నతిథిగా వచ్చెను. అంతనావిప్రదంపతులు భక్తివినయములతో నావృద్ధతాపసునకు నర్ఘ్యపాద్యాదులొసంగి, పూజించి, మధురాన్నములతో భోజనమిడి, యాదరించిరి. వారిభక్తికాబ్రాహ్మణుఁడు సంతసించి, మార్గాయాసముచే శయనింపఁగోర, వారాతనికి మెత్తనిపక్కనమర్చి, దానిపై శయనింపఁగోరిరి. పిమ్మట నావిప్రకాంతయగు కమల యామహర్షి కొంతసేపునిద్రించి లేచి, విశ్రాంతుఁడుగా నుండుటను దెలిసికొని సమీపించి, నమస్కరించి, వినయముమీర నిట్లుప్రార్థింపఁ దొడఁగెను.

కమల:—మునివరా! మాయీయాగ్రహారమున సంసారులందరు సంతానవంతులై సంతసించుచుండ, మాకేలయట్టి భాగ్యము చేకూరదాయె? మేముచేసికొన్న పాపమేమి? దయానిధీ! మాకీలోపముతీఱ, యానందముచేకూరుదారికానవచ్చుటలేదే! సంయమీంద్రా! ఇంటింటను నామకరణోత్సవములును, అన్నప్రాశనశుభములును, లోనగు మంగళములు జరుగుచుండ, మాసదనమిట్లు నిరానందనిధానమై యుండవలసినదియేనా? మునిసార్వభౌమా! యీగ్రామమున జరుగుశుభకార్యములలో విప్రకాంతలెల్లరును నిజబాలురనో బాలికలనో, మనుమలనో మనుమరాండ్రనో, చంకలనిడికొని, ముచ్చటగాఁ గన్పట్టుచుండ, నట్టి భాగ్యములేక. నిర్భాగ్యవలె నేనిలుచియుండుట, నాకమితదుఃఖమును సమకూర్చుచున్నయది.

ఓయతికులతిలకా! సుమమంజరులతోడను, ఫలగుచ్ఛములతోడను, విరాజిల్లుట రసాలలతికలకు శోభావహము. కుంకుమతిలకముల తోడను, సంతానసంతతులతోడను, విలసిల్లుట సంసారకాంతలకు మంగళావహము. తాపసరాజేంద్రా! నేడుమీరాకచే నాహృదయేందీవర మేదియో తెలియరాని వికాసమందుచున్నయది. కావున నాయందుఁ

గృపచూపించి, నాకుసంతతికలుగుటకనువగు మంత్రమునో, దైవతమునో యుపదేశించి, నావంధ్యతనుబాపి, ధన్యతనుసమకూర్పఁ బ్రార్థించుచున్నదానను. నిరాకులస్వాంతులగు మిమ్మిట్లువ్యాకులచిత్తనై వేధించుచున్నందులకు క్షమియించి, నామనోరథము సఫలముచేయ వేడికొనుచున్నదానను, అనియిట్లు దీనముగాజాలిగొలుపు పలుకులఁబలుకుచున్న యాబ్రాహ్మణయిల్లాలినిఁ గనుఁగొని యామునిశిఖామణి కరుణార్ద్రహృదయుఁడై తనలోనిట్లు తలంచెను.

"ఓహో! సతీమణులను సంతానవాంఛ యెట్లువ్యాకులపెట్టును! వీరికిసంతతిలేదను సంతాపముకలిగిననాఁడు, వారిసిరులెంతటివైనను తృణలవములకంటె నధమములుగా వారికంటికిఁ గన్పట్టునేగాని, సౌఖ్యదాయకములుగాఁ జూపట్టవు. ఈసతీతిలకములఁ ముందు సంతానప్రాప్తికై చేయునుపవాసాదిశ్రమల కంతుండ నేరదు. ఇకవీరు గర్భవిర్భావమైన ప్రథమదివసముమొదలు ప్రసవదినమువఱకును ననుభవించుకష్టములకు మేరకానరాదు. ఇంకప్రసవకాలమున వీరుచెందువేదనమును భగవంతుఁడు పురుషుఁడగుటచే నాతనికిగూడఁ దెలియశక్యముకాదు. ఇంతటితో వీరికష్టములు గట్టెక్కునా? లేదు, లేదు. శిశువునుప్రసవించినది మొదలు బిడ్డపెద్దయగువఱకు నాహూనకు వీరుచేయు నుపచారముల గణింపఁతరముకాదు. పెక్కేల? ఈమాతృదేవతలు తమజీవితాంతము వఱకు నిజజీవితాది సకలసంపదల స్వనందనానందన సంపాదనమునకై త్యజించి, సంతసించుచుందురు. కావుననే "నమాతుః పరదైవతమ్" అని సువర్ణాక్షరములతోఁ గాలఫలకముపై శాశ్వతముగా లిఖింపఁబడియున్నది.

"నిజమే యింట మాతృదేవతయుండ నామెనుపూజింపక పుణ్యసంపాదనమునకై దేవాలయములకును, పుణ్యతీర్థములకును, పోవుట వృథాయాసమే కాక పాపహేతుకముకూడనగును."

ఇటులనామునివరుఁడు తలపోసి, పిమ్మట నాభూసురసతి నవలోకించి "పుత్రీ! నీకచిరకాలములో నొకమనోహరుఁడగు నందనుఁడు జనింపగలఁడు. శ్రీహరినిధ్యానించుచుండుము. ఇంతకుమించిన యుపదేశ

మెద్దియును లేదు. శ్రీహరిధ్యానము కలుషహరము. కామితప్రదము. కావున వ్యాకులము వీడి, నిశ్చలచిత్తవై భగవంతు నారాధింపుము. అమ్మా! నీకు సౌభాగ్యసంపదలు సమకూరుఁగాక్షత నేపోయివచ్చెద." అని యాముని సంతోషవార్తను తెలుప నాకమల వికసితముఖకమలయై, మునిపాదములకు సాష్టాంగనమస్కారమొనర్చి, "నందనుఁడు పుట్టిన పిమ్మటఁ దిరుగవచ్చి, తనపూజలనందుకొని, సుతునిఁ దీవింపుమని" పరిపరి విధముల వేడికొనెను. ఆమునీంద్రుఁడు వల్లెయని, యాద్విజపల్లెనుండి వెడలిపోయెను.

కమల, మునిబోధించినరీతిని శ్రీహరిని హృదయమున ధ్యానించుచు, బలికి సేవలఁ జేయుచు, అతిథ్యభ్యాగతులఁ బూజించుచుఁ, గాలముఁ గడపుచుండెను. ఇట్లు కొంతకాలమైనపిదప శ్రీహరికృపచే నాభూసురభార్య గర్భవతియయ్యెను. అపుడాయగ్రహారికకాంతలు మోదముతో మోదకాదులనూడిదలుగాఁ గొని తెచ్చి, యాద్విజకాంతకు సారెలియ్యమొదలిడిరి.

ఇట్లావిప్రపత్ని పుంసవనాదిసంస్కారకలితయై, పదియవమాసమున నొకసుందరాకారుఁడగు నందనుఁబ్రసవించెను. వెంటనే మాధవుఁడాశిశువునకు జాతకర్మాదివిధులనెఱపి ఆబాలుఁడు స్తంభుని యాశీఃప్రభావముచేఁ గలుగుటవలన స్తంభుఁడని, నామకరణమొనర్చెను.

ఆబిడ్డఁడు క్రమక్రమాభివృద్ధినొంది, యుపనీతుఁడై సకలవిద్యలఁ గరతలామలకములట్లు గ్రహించి, అచిరకాలములోనే సకలకలాకోవిదుఁడని ప్రసిద్ధిఁగాంచుటయగాక, వినయవివేకాదిగుణభూషితుఁడై జననిజనకులకును, అగ్రహారికులకును, సంతోషసంధాయకుఁడై వర్ధిల్లఁజొచ్చెను.

ఆయగ్రహారస్వామియగు మాధవుఁడు నిజసుతునకు వివాహముచేయఁగోరి తనయగ్రాంగియగు కమలతో సంబంధముఁగూర్చి ఆలోచింపఁదొడంగెను. ఇట్లుండఁ గుంతలదేశసార్వభౌముఁడగు నృపాజయనృపాలుఁడు పండితపరిషత్తు నేర్పఱచి, దేశదేశములఁగల విద్వాంసుల కాహ్వానములఁబంపెను. ఆపిలుపునువిని స్తంభుఁడు తండ్రియాజ్ఞనుబడసి, కుంతలమున కేగి, యాపండితసభలో సపదృశమగు నిజపాండిత్య

మును బ్రకటింప, నాకుంతలవిషయాధీశ్వరుఁడు ఆద్విజకుమారుని యద్వితీయమగు వైదుష్యమునకు విస్మితుఁడై యమూల్యములగు పారితోషికములనొసంగి, సన్మానించెను.

అంతనాకుంతలరాజాస్థానపండితుఁడగు గర్గుఁడు స్తంభుని పాండిత్యమహిమకును, సౌందర్యగరిమకును, నలరి, తనపుత్రికయగు కాంతిమయి నాతనికియ్యఁగోరి, తనమనోరథమును కుంతలేంద్రునకుఁదెలుప నాయేలిక యందులకుసంతసించి, వెంటనేనిజమంత్రిని పాలగ్రామము నకుఁబంపి, బంధుసహితముగా మాధవుని స్వరాజధానియగు కళ్యాణపురమునకు రప్పించి, కాంతిమయిని స్తంభునకిప్పించి, మహావైభవముగా గళ్యాణమహోత్సవము లసాగించెను.

మాధవశర్మ పుత్రునివివాహానంతరము నూతనదంపతుల వెంట నిడికొని, బంధువులతోఁగలసి యింటికివచ్చి, నూతనవధూప్రవేశోత్సవాదులనెఱపి, బంధుమిత్రులసన్మానించి, అమితానందముతో సుఖముగాఁ గాలముగడుపుచుండెను.

స్తంభుఁడును విద్యావయోగుణరూపములతో నలరారు కాంతిమయి నిజకాంతయైయొప్ప, సంసారసుఖములనలరుచు, దలిదండ్రుల దైవతములుగా భావించిపూజించుచు, విద్యార్థులకు వేదాదివిద్యల బోధించుచు, సత్కర్మలనాచరించుచు జీవితమును ఘనముగా నడపుచుండెను. కాంతిమయియు, నత్తమామలకును భర్తకును ననువర్తినియై సకలోపచారముల జేయుచు, గృహకృత్యములయందత్తగారికెంతమాత్ర మొత్తుడు కలుగకుండ సర్వకార్యములఁ దాస్వయముగాఁగనుగొనుచు నత్తింటివారికమితానందమును సమకూర్చుచుండెను.

ఆయగ్రహారమునఁగల పిన్నపెద్దలగుస్త్రీలెల్లరును కాంతిమయి బుద్ధికుశలతను దెలిసికొని, గృహకార్యనిర్వహణమున నాయువతీమణి యాలోచనములఁ జేకొనఁజొచ్చిరి. పలుపలుకులేల? యాయూరినారీమణులకా కాంతిమయి జీవితమాదర్శకమై వెలయుచుండెను.

ఇట్టులభూసురకుమారులలో స్తంభుఁడును, జన్నికట్టుకన్నియలలో కాంతిమయియు, వన్నెగాంచియుండిరి. వారిరువురియనురాగము

నకు వారియనురాగమే సాటి అట్టియుత్తమదంపతులఁజూచి, కమలామాధవులు పరమానందభరితులై, తమయంతటిభాగ్యశాలురీభూతలమున లేరనునంతటి గర్వమును పొందసాగిరి. ఇట్లా విప్రకుటుంబము మోదముతో గాలముగడుపుచుండ, మాధవుఁడు పుత్రకళత్రాదుల దుఃఖసముద్రమునముంచి, దివికేగెను. కాలమెుక్కగతినిగడుపనగునా! స్తంభుఁడు పితృమరణమునకు విలపింప నాప్తులగుభూసురులాతనికి ధైర్యముబోధించి పితృమేధమును క్రమముగానిర్వర్తింపఁజేసిరి.

—: ద్వితీయాధ్యాయము, కుమైత్రి :—

ఆయాపత్కాలమున స్తంభునియింటికి వచ్చినబంధుబృందముతోఁ గుమతియను నొకబంధుబ్రువుఁడు వచ్చియుండెను ఆదుష్టుఁడు స్తంభునిసంపదకచ్చెరువంది, యెట్లయిననావిప్రకుమారుని విషయలోలునిగాఁజేసి, ధనమునుసంగ్రహింపనెంచి, ఆతనితోస్నేహమును నెఱపఁ జొచ్చెను. మాధవనందనుఁడు నిష్కపటస్వభావుఁడగుటచే వానివినయోక్తులకుభ్రమసి, వానినిఁ బ్రియమిత్రునిగాభావించి, వానితోఁగలసి తిరుగఁజొచ్చెను.

ఇట్టులనామోసగాడు స్తంభునిఁ దనమాటలయందు నమ్మకకల వానినిగాఁజేసికొని, యొకనాఁడిట్టులబోధింపఁదొడఁగెను "మిత్రమా! రేపుమహాశివరాత్రియగుటచే నుజ్జయినీపట్టణమునఁ గాళప్రియనాథుని యుత్సవమతివైభవముగా జరుగును. మనమాదివ్యోత్సవమును జూచివత్తమురమ్ము ఆనాఁడు పార్వతీపరమేశ్వరులు కైలాసమునువీడి, యుజ్జయినీనగరవిభవమును జూడవచ్చిరాయన్నట్లు నందివాహనారూఢులై యూరేగుదురు. సకలదిశలనుండి పండితులును సన్యాసులును, సత్పురుషులును, వేనకువేలువచ్చి, యామాదిమదంపతులగు గిరిజాచంద్రశేఖరుల దర్శించి, ధన్యతనందఁగోరుచుందురు. కన్నులున్నందుకు ఫలమాయుత్సవమును దిలకించుటయేయని తలంచెదను" ఆమోసగాని బాసలవిన్నతోడనే స్తంభుఁడుత్సవాలోకనకుతూహలుఁడై, యాకృత్రిమమిత్రునితో గలసి, కొంతద్రవ్యమునుజేకొని, యుజ్జయినికేగి దివ్యోత్సవములఁదిల

కించి, పరమానందభరితుఁడై తనకట్టిసంతోషమును సమకూర్చినందులకు మిత్రునిస్తుతించి, తిరుగవానితోఁ దనయగ్రహారమునకువచ్చెను.

ఇట్టులనాకుటిలసఖుని ప్రోత్సాహముపై నామాధవనందను డుజ్జయినికి నపుడపుడుపోవనారంభించెను ఆకుమతియుఁదనసఖులచేనుజ్జయినియందుస్తంభునకు విందులఁజేయించుచు వినోదముల సంఘటింపఁ జేయుచుఁ గ్రమముగాఁ గొంతిమునయాకాంతుని హృదయవాతావరణమును తారుమారగునట్లుచేసి ధనములఁదెప్పించి యావిత్తముతో మొదట నాటకశాలలకును, పిమ్మట నృత్యమందిరములకును దరువాత గానభవనములకును దోడ్కొనిపోవుచుఁ నిట్టుల నాభూసురకుమారుఁడెన్నఁడెఱుంగని నూత్నరుచులకు నలవాటుపడునట్లొనర్చెను.

అట్లుకొంతకాలము జరిగినపిదప నాతఁడు తనవలలోపడుటను కనిపెట్టి, యొకనాడిట్లుబోధించెను "మిత్రమా! ఈపురమునఁ దారయను గాయకశిరోమణి యొకర్తుకలదు. ఈతార సంగీతమునఁ బేరెన్నికగన్నది. ఈపాటలాధరికి బహువర్ణపరిచయముకలదు. వేణువుచేకొని కృతులను వాయించుటలో జాణ రాగములమాన్పునకుఁ బెట్టినదిపేరు. కలరవమునఁ బరభృతికయే, పెక్కేల నాభివనమున నమృతవల్లివలె నీకుటిలాలక గణికాకులమునఁ గీర్తికెక్కియున్నది మిత్రమా! నీవీతారాగానమును వినితీరవలయును. కావున మనమీసాయంతనమాగాయకీ మందిరమునకేగి సంగీతమునువినివత్తము

స్తంభుఁడు.—మిత్రమా! నాకుగానమన్న నెక్కువమక్కువయే కాని మనమటకేగి, వేశ్యాగానమును వినుటకుమాత్రము కొంచెము జంకు కలుగుచున్నది అన ఆతార్పుగాఁడిట్లుపలికెను. "మిత్రుఁడా! మనము దానింటికి గానకళకైపోవుచుంటిమికాని మరెట్టియూహతోడను కాదు. కావున సందేహముతోపనిలేదు. అని యాశ్రోత్రియశిఖామణిని తారాసదనమునకుఁగొంపోయి మొదటినాఁడు కేవలగానకళావినోదముతోడను రెండవదినమున నాట్యవైభవముతోడను, మూఁడవ దివసమున నభినయవిలాసముతోడను, నాల్గవయహమున సరససల్లాప

ములతోడను సంతృప్తునిగాఁజేయించి, తుదకావెలయాలివలలో నా
కోడగానిఁబడవైచి యాకుంటెనగాడు కృతార్థుఁడాయెను.

అదిమొదలా విప్రకుమారుఁడు నిజాగ్రహారమునువదలి యుజ్జయినియందు నొకగృహమునద్దెకుతీసికొని, యందుమిత్రులతోఁగలసి నివసించుచుఁ గ్రమముగా దారను బాసి, యాతారతోవిహరింపఁదొడగెను. మెల్లమెల్లగా నావారకాంతయుఁ దటిచ్చంచలములగు ననురాగకళావిలాసములఁ బ్రదర్శించుచు శీలభాసురుఁడగు నాభూసురసుందరాంగుని దన్నువీడి, క్షణకాలముండనేరనంతటి స్థితికిఁదెచ్చెను. "నిజమే పాపాణములకడధనమున్నచో వానినికూడ నీవారభామినులు తమతళుకుబెళుకులచేఁ గరిగింపఁజాలుదురు"

స్త్రైభుఁడును నిజముగతన్ను బ్రేమించి తనక్షేమమును గోరునది యాతారయొక్కర్తియే యనియు మిగతకళత్రాదిబాంధవులు కార్యార్థము తనతోఁగలసియున్నారనియు, తన్నువీడి యాభోగముసాని క్షణకాలముకూడ జీవింపఁజాలదనియు దలంపఁదొడంగెను "ఆహా! ఈకపటానురాగిణుల మాటలకున్న జనమోహనశక్తి మదిరావాహినులకుగూడ నుండనేరదుకదా".

తుదకావిప్రకుమారుఁడు తనకు ధనమవసరమగునపుడు నిజగ్రామమునకువెళ్ళి, యటరెండుమూడుపూటలుండి, భూములునమ్ముటయో కొదువపెట్టుటయో చేయుచుఁ దల్లిగాని, యిల్లాలుగాని తనపనులకు వ్యతిరేకముగా దేనినేనిచెప్పవచ్చినచో నాబోధలవినక వారినిఁగసరుటకును దిట్టుటకును జిరాకుపడుటకును మొదలిడువాఁడు పాపమువారితడెక్కడభారమునొందునో యనియుఁదిరుగరాకుండునేమొ యనియుఁదలంచి మారుపలుకక యింటనున్నంతకాలము సకలోపచారములజేయుచుండెడివారు ధనముచేకూరినవెంటనే యాతఁడు తల్లితోఁగాని భార్యతోఁగాని సంభాషింపకయే వెడలిపోవుచుండెడివాఁడు.

ఇటులఁగాలముసాగుచుండ నొకరేయి సాలగ్రామమునుండి గాలివానలో నొక్కపెట్టున ఆతఁడుజ్జయినికేగుటచేఁ దీవ్రముగా జ్వరము వచ్చెను. అపుడాతారాకాముకుఁడు జ్వరబాధచే తనబసలోనుండనేరక,

తారయింటికేగెను తారయు, స్తంభుఁడు జ్వరపీడితుఁడగుటనుగాంచి వేరుగానొకగదిలో మంచమువేయించి, యందాతనిపరుండఁగోరెను స్తంభుఁడ గ్రహారమునుండితెచ్చిన ధనమునంతను దలక్రిందఁబెట్టుకొని యామందిరములోఁబరుండెను తార మధ్యమధ్యవచ్చి యాతనియోగక్షేమమును గనుఁగొనుచుండెడిది. ఇట్లాద్విజసుతుఁడు రెండుదినములేమియుఁదినక యుపవసించుటచే మూడవనాడు జ్వరముతగ్గుదలకువచ్చెను అంతతార వచ్చి యిట్లుపలికెను.

తార:—ప్రాణప్రియా! మీకీనాడేమైనఁగొంచెము జ్వరముతగ్గినదియా? రెండునాళ్ళజ్వరమున కెంతచిక్కియుంటిరి! స్మితసుందరమగు మీవదనము సరోవారిని బాసిన సరసీరుహమువలె వాడియున్నది. నాకీ రెన్నాళ్ళ నుండియు నోటికికూడును కంటికినిదురయు లేవనినమ్ముము

స్తంభుఁడు:—ప్రేయసీ! జ్వరము తగ్గినదనియే చెప్పవచ్చును. కాని కాళ్ళుమాత్రము కొంచెము లాగుచున్నవి కావున నీవు బెంగటిల్లక యాహారమునుజేకొనుము

తార :—నాతిండికేమిలెండు మనోహరా! మీకాళ్ళులాగుచున్నవంటిరే నేగొంచెము పట్టుకొనా ?

స్తంభుఁడు :—కోమలాంగీ! నలినీదళాతిసుకుమారములగు నీకరపల్లవములు నాకఠినపాదముల సోకినకందును కావున వలదు క్రమముగా నొప్పులు సర్దుకొనునులే.

తార:—నాథా! నేస్వయముగా మీకుపచారముల జేసినఁగాని నామనసొప్పుటలేదు అని కరములఁజాపి, నిజకంకణనాదములు చెలంగ నాద్విజపాదముల బట్టనారంభించెను.

స్తంభుఁడు:—ప్రియా! నీహృదయ మెంతమృదువైనదియో నీచేతులును నంతమెత్తనివే నాకునీవుచేయు నదోపచారముకంటె నీయనురాగపదములేసౌఖ్యమును కలిగించుచున్నయవి అంతతారచేటిక వచ్చి తలుపుచాటునుండి "అమ్మా! యాయూరిచేరి వచ్చియున్నవాఁడు" అని తెలిపెను.

స్తంభుఁడు:—ప్రేయసీ! ఆవర కుఁడెవ్వఁడు? ఆతఁడిటకేలవచ్చె?

తార:—మోహనాంగా! మాయమ్మ నేనువలదనుచున్నను ఈ కెంపులరాజులను ఈరవ్వలకమ్మలను ఆతనియొద్దఁదీసికొని కొంతప్రక మిచ్చిమిగిలినసొమ్మునకు దిరుగరమ్మన్నది ఆకోమటిమావాళ్ళకుఁజిరపరి చితుఁడగుటచే వస్తువులనిచ్చి తిరుగవత్తునని వెడలిపోయినాడు ఇపుడా సొమ్మునకై వచ్చియుండును. ప్రస్తుతము మాయమ్మయూరలేదు. నాకడ సొత్తునులేదు. ఏమిచేయుటకుఁ దోపకున్నయది.

స్తంభుడు:—నీతల్లియెటకేగె?

తార:—ఆపెయా! మానిధిరాజులవీరయ్యతోఁగలసి శివరాత్రికి శ్రీశైలమువెళ్ళినది. తిరుగనెప్పటికివచ్చునో?

స్తంభుడు:—మోహనాంగీ! నిజముగా నీసహజసౌందర్యమునకు నగలధరింపవలసిన నవసరము లేదు.

తార:—సుభాషణా! నిజమేమీరన్నట్లు అకృత్రిమానురాగమునకు కృత్రిమాలంకారములతోఁబనిలేదు.

స్తంభుడు:—సువదనా! మనమతనికియ్యవలసిన సొమ్మెంత?

తార:—ప్రియా! ఎంతోనా అంతాచేరినరెండువేలు దాటవు అందుఁగొంతముట్టియే యున్నది. నేపోయి ఆవణిజునినెంతసొమ్మియ్యవల సియున్నదియో కనుగొనివత్తును. కానిపాపహరమగు మీపాదసేవకు విఘ్నముగా నీబేరగాడు దాపరించినాడు.

స్తంభుడు:—సుదతీ! అగుము ఆతనికియ్యవలసిన మొత్తము నీ మూటనుండితీసి ఇచ్చివేసి మిగిలినసొమ్ముఁగొనిరమ్ము దానిని నామిత్రు నకునొసంగెదను. ఆతనికేదియో ధనమవసరమున్నదని నన్నడిగియున్నా డు, నేనుతప్పక సొమ్ముతెచ్చియిచ్చెదనని బాసచేసియున్నాడను అని, తలక్రిందిశాలువమూటనుతీసి, యాగణికకందిచ్చెను, ఆవారకామినియు దానిఁగైకొని వెడలి కొంతసేపావైశ్యునితో సరససల్లాపములాడి, యాతడి చ్చిన బహుమతులఁగైకొని స్తంభుడిచ్చినధనములోనుండి సగముతస్క రించి, తిరుగస్తంభునికడకువచ్చి యామూటనటుచుంచి యామోసకత్తెతిరు గఁగాళ్ళుపట్టుచునిట్లుపలుకఁదొడంగెను.

తార :—ప్రాణేశ్వరా! నేచేయునుపచారమువలన మీకేమైన సౌఖ్యముకలుగుచున్నదియా? ద్విజవరా! మోమాటపడకుడు ఈసేవకురాలిని మీయర్ధాంగినిగా భావింపుడు.

స్తంభుడు:—వెఱ్ఱిదానా! నీవీస్తంభునకు బహిఃప్రాణమని భావింపుము. నీవు నాపైఁజూపుననురాగములోఁ బదియవవంతుకూడ నాయిల్లాలియుల్లమునలేదు.

తార:—మనోవల్లభా తమహృదయము నాయందంతటి ఘనానురాగపూరితముగుటచే నిట్లనుచుంటిరేకాని సౌందర్యమునసేమి సరససంగీతాదికళలయందేమి, మీయింటియావెకంటె నేనెక్కుడుదాననా ?

స్తంభుడు :—ప్రేమరససారా! తారా! నామాటవినుము నా జీవితకాలములో నిన్నుదక్క వెరొక్కకాంతను కన్నెత్తిచూడనని నిశ్చయింపుము నానాలుక కల్లలాడదని విశ్వసింపుము.

తార:—ప్రియానవతంసా! నాజీవితమునకంతటి భాగ్యము చేకూరునా? సరసులు సమయోచితసంభాషణులుకదా? అనుచుండ చేటిక వచ్చి "అమ్మా యీమన్నెపుదొర వచ్చియున్నవాడు" అని తెల్పెను.

స్తంభుడు:—తొయ్యలీ! ఈదొరయెవఁడు? ఈతఁడు మనయింటికిరాఁగారణమేమి?

తార:—మనోహరా! మాతల్లి తెలివితక్కువపనులేమని తెల్పుదును. ఈతఁడు మామాన్యమునకుచేరియున్న తనచేనును అమ్మకముజూప మాతల్లి పొలములో పొలమును కులములో కులమును కలయునన్నపుడుపేక్ష చేయరాదని యీపొలముకొని కొంతసొమ్మిచ్చి మిగతప్పైకమునకుఁ బత్రమువ్రాయించి, నాచేవందు సంతకముచేయించినది. ఆయప్పునకాతఁడు వచ్చియుండును. అదేమిపాపమోగాని నేను మీకు నిశ్చబ్దముగా నిదురకలిగింపఁ గోరుచుండ నీయప్పులవారినాడే రాదొడంగిరి.

స్తంభు:—చంద్రముఖీ! మీయమ్మచేసినది చాలమంచిపని ప్రక్కమడి దాటినమడిదొరకునా? కలిసినపంపులఁగొనుటలో మాతండ్రిగారు పడినపాటు నేనెఱుంగుదును. కావున విచారింపకుము. మనమా

సొమ్ము కొద్దికాలములో నిచ్చివేయుదము. నీవేగి యాదొరతో మాటలాడి పంపుము. పంపుమమాత్రముపోనియ్యకుము అనఁ తారి చిత్తమని పైకివచ్చి ఆదొరతో సరసములాడి, యాతఁడొసంగు సొమ్ములగైకొని, తిరుగవచ్చి ప్రియవల్లభా! నేటికి రెండు కటికలాకణముల చేసియుంటిరి. చాలనీరసముగనుంటిరి. కావునఁ గొంచెము గోక్షీరములనో ద్రాక్షాఫలములనో చేకొనుడు. మీ సెలవైన సేవకురాలినిపంపి తెప్పింతును. అంతచేటికవచ్చి "అమ్మా గ్రామకరణము వచ్చియున్నాడు." అని తెలిపెను.

తార:—కోపముతో సరే! క్షణక్షణమునకు ఎవరోవచ్చియున్నారని నేనునాప్రియునకు సేవచేయకుండ నడ్డుపడుచున్నదానవు. ఈకరణపిశాచము సామాన్యముగా విడిచిపోవువాఁడు కాఁడు. కావున చేటీ ఈవృద్ధజంబుకమును మాయమ్మవచ్చినపిమ్మట రమ్మనుము. పొమ్ము. ఇకముందు పాపహరమగు భూసురపాదసేవకు నంతరాయము కలిగింపకుము.

స్తంభుడు:—సుమతీ! ఈకరణమునకుఁగూడ సొమ్మీయవలసి యున్నదియా?

తార:—అనురాగసుధానిధీ! ఏమనిచెప్పుదును సిగ్గగుచున్నది. మాతల్లి మీయాధారముచూచుకొని మొన్న యీకరణముకడ నొక పాటిపెరటిని క్రయమునకుఁదీసికొన్నది. మునుపు మావాళ్లొట్టిపోయిన గొడ్లను ఇంటినుండిగొట్టివేయుచుండెడివారు. నేనదిచూచి యట్లుచేయఁ జనదనియు, నొకకొట్టముకట్టించి వానినందుంచి ధరవచ్చినప్పుడమ్మివేయుదమనియు బోధింప నీపెరటినికొని ఇందులోపాకలువేయించి వట్టిపోయినపశువులఁ గట్టుచున్నారు. అదిగో యాపెరటిసొమ్ము పూర్తిగా చేకొనవచ్చియున్నాఁడు కాబోలు "శ్రేయాంసిబహువిఘ్నాని" అన్నట్లు మీపదపంకజ కైంకర్యమునకన్నియు నాటంకములే కలుగుచున్నవి. ద్విజచరణారవిందసేవచే ముందుజన్మమునందైన ఈవెలయాలిపుట్టుక లేకుండుఁగావుతయని తలంచుచున్నదాన,

స్తంభుడు:—ప్రేయసీ! ఈతనికియ్యవలసినసొమ్మెంత ?

తార:—వెయ్యిరూపాయలకు పోవుగానే యిమ్మునని తలంచెదను. కాని ప్రాణేశా! మనమిప్పుడీతనికి సొమ్మియ్యవలను నేనేదియు సాకుఁబన్ని యీతనింతిరుగరమ్మని చెప్పిపంపివేసెదను లెండు. మీరుమీమిత్రునకు సొమ్మిత్తుమని యభయమిచ్చియుంటిరిగా' కావున ఈసామాన్యమిత్రునకొసంగి సత్యమునుగాపాడుడు అసత్యమునుమించిన పాపములేదు.

స్తంభుఁడు :—అబలామణీ! ఇట్టిస్వల్పమొత్తములకుఁ గూడఁ దిరిప్పచూడుట మర్యాదకాదు. ఆతలగడపైనీవు విన్నమాట తీసికొనివెళ్ళి కరణమునకియ్యవలసినదానినిచ్చి పంపుము. లేకున్ననీతఁడు కోపించి కొంపముంచును. సహస్రాక్షుని నేత్రములనైనఁ గప్పవచ్చునుగాని కరణముకన్ను మూయదరముగాదు. కాలునకు భయపడనివారుందురుకాని కరణమునకుభీతిల్లనివారుండరు. ఇకముందుఅప్పుచేసియాస్తులఁగొనకుము.

తార:—ఘనాశయా! మాకుటుంబమునాళ్ళు మర్యాదనపేక్షించి కులీనుల ప్రాపునుగోరిరేకాని ధనములకాశించి కులహీనుల సాంగత్యము నపేక్షింపరైరి. మరియు మాదినలుగుగువచ్చిపోవుచుండుకొంప ఎంతసంపాదించినను గృహవ్యయమునకే చాలకున్నది; అని చల్లగా నాసొమ్ముతీసికొని, పైకివెడలి కరణముముద్దుచెల్లించి ఆతడిచ్చినదానినందుకొనెను. "ఆహా! ఎంతటివివేకులును వారనారీమణుల యనురాగములు సాయంతనవారిదరాగములవలె చంచలములని తెలియజాలకున్నారు కట్టా! సకలపురుషార్థసాధకములగు దేవాలయములుండ నిఖిలజ్ఞానవిజ్ఞాననిలయములగు గ్రంథాలయములుండ! శీలైశ్వర్యసంపాదకములగు సజ్జనసమాజములుండ వానినిఁజేరక ధనమానప్రాణముల హరించి, మానవుల జీవచ్ఛవములనుగాఁజేయు, నీవేశ్యాలయదురితకూపములఁగూలి యేల! నశించుచున్నవారలో తెలియకున్నది"

—: తృతీయాధ్యాయము హితబోధ. :—

పిమ్మటనొకనాడాస్తంభుఁడు నిజమిత్రులవెంటనిడికొని సాలగ్రామమునకువచ్చి, వారినందరిని తనభవనమునఁగూర్చుండనియమించి, లోనికేగి, కాంతిమయినిపిలచి "నామిత్రులకుమనయింటనేకు సేవింపచేయ

వలసియున్నది. కావున వేగముగా భోజనమును సమకూర్చుము." అని తెలిపి మిత్రులతోఁగలసి వినోదగోష్ఠినికాలము గడుపఁదొడంగెను. అపుడాస్తంభునిభార్య భర్తయాజ్ఞానుసారము వెంటనేవంటకముల సమకూర్చియుంచెను. కానియాతఁడాటపాటలనమును కాలమెంతగడిచెనో తెలిసికొనకుండెను. పరిశీలింపనపుడు రెండుయామములకాలము గడచినది పాపమింటనతిథులుండ ముందుభుజింపఁదగదనితలంచి, యాయిల్లాలత్తగారికిఁగూడనన్నమిడక, భర్తరాకకై వేచియుండెను.

కొంతవడికాతనియుత్తమమిత్రులు స్నానమాడలేదు సరియకదా కాళ్లుకూడకడిగికొనక తమలములనమియుచు భోజనశాలకు రాఁదొడంగిరి అంతస్తంభుఁడు కాంతిమయికడకువచ్చి కోపముతో "ఇంకనువడ్డింపవేమి ? ఇంతనిర్లక్ష్యభావమా ?" అని కేకలిడ ఆసుగుణాలయ మెల్లగా నిజకాంతునితో "మీరురాకముందు వడ్డించినచోఁ బదార్థములు చల్లారిపోవునని వడ్డింపనైతిని. కోపింపకుఁడిదె సిద్ధముచేయుచున్నదాన" అని క్షణకాలములో వడ్డనపూర్తిచేసెను. అంతవారందరు కడుపారభుజించి వెడలిపోయిరి.

ఇదివఱకాశ్రోత్రియగృహమున కిట్టియవాంఛితాతిథులెన్నఁడును వచ్చియెరుఁగరు. ఆయమాఁగఢాతిథ్యమునకుఁ కమలకుఁగడుపుమండఁబుత్రునిపిలచి యిట్లుపలికెను.

కమల:—కుమారా ! వీరా ! నీప్రాణమిత్రులు? బిడ్డా ! వాతావరణమున రోగక్రిములు తిరుగునట్టుల లోకమున వంచకజనులు సంచరించుచుందురు. వారిదారులు దారాసంపన్నులగు నుదారులకుఁదగవు సంసారులు ప్రమాదమునవారితోఁ గలసినచో నతివేగముగా నిస్సారులైచెడుదురు. కావున ప్రాజ్ఞుఁడవగునీవు కొంచమాలోచించి, చేరఁదీయదగినవారెవ్వరో, చేరఁదీయకూడనివారెవ్వరో గుర్తింపుము. నీబాగును గోరియే నేనిట్లుబోధించుచుంటినికాని నిన్నుబాధింపనెంచికాదు.

నాతండ్రి ! వినుము నామాటలమనకిట్టిదురాచారులతో మైత్రియెంతమాత్రమునుదగదు కావున, వీరిసాంగత్యమును బరిత్యజించి, యు

జ్జయినికేగక, యింటనుండి సత్కర్మాచరణతత్పరుఁడవై నీపూర్వులకీర్తి సంపదల నిలువబెట్టుము. ఇట్లంటివనికోపింపకుము.

స్తంభుడు:—అమ్మా! నేనునీచులతో సహవాసముచేయుదునా? వీరుప్రాతఃస్నానములఁ జేసియుండుటచేఁ దిరుగస్నానమాడరైరి. వీరిదేశాచారముప్రకారము మడిబట్టలఁగట్టనగత్యము లేదు. వీరెల్లరును నాగరకులగుప్రాజ్ఞులు. వీరునాసౌఖ్యమునకై యవసరమున్నచో నిజజీవితములనుగూడఁ బరిత్యజింతురు వీరు నాకువారిండ్ల నొసంగునాతిథ్యమును జూచిన నీవువింతచెందుదువు వీరందరు నధికధనాఢ్యులు కావున వీరుసామాన్యులనియు నేవీరితోఁగూడి చెడుచుంటిననియు నెంచివిచారింపకుము. సదాకుగ్రామములలోఁ గాపురముండుటకంటెఁ బట్టణములలోనివసించుట ఆరోగ్యప్రదము నాగరకతాజనకము సౌఖ్యదము. అందుచే నేనుజ్జయినిలో నివసించుచుంటిని అనితల్లినోదార్చి, నిజసఖులతోఁగలసి వెడలిపోయెను.

నిజనాథుఁడుజ్జయినికి నేగినతోడనే కాంతిమయి, తనయుని యెడబాయుటకు విచారించుచున్న యత్తగారికడకేగి ఇట్లుపలికెను.

కాంతిమయి ;—అత్తా! మీసద్బోధల మీపుత్త్రులు విందురని యే తలంచితిరా? వినుమీమర్మ! వారిని మనమిపుడెంత ప్రార్థించినను ప్రయోజనములేదు ఇపుడు మీసుతుని మానసకువలయకాంతుఁడు కుటిలగణికానురాగవ్యామోహమేఘచ్ఛన్నుఁడై యున్నవాడు ఈకులటానురాగాగ్నిజ్వాలలు ధనేంధనములు పడుచున్నంతవఱకు మండుచునే యుండును. వానిసంపర్కము తీరినతోడనే ఇవ్వియుఁజల్లారును కావున మీరోర్పుగలిగి నాచేనుపచారములఁ జేయించుకొనుచుండుడు. నాకు వారు తిరుగమనలఁబ్రేమింతురను గట్టినమ్మకముగలదు మరియు మీరు కొంచముదయయుంచి నాప్రార్థనల వినగోరుచున్నదానను ఇహలోక బాంధవులు పరలోకమార్గమున జీవులకుసహాయపడనేరరు.. ప్రాణులకు శ్రీహరినామస్మరణమే సంసారసాగరతరణోపాయము కావున మీరీ తుదికాలమున హృదయాంతరమునఁ జక్రధరుని స్మరింపఁగోరెదను అని యాపుత్తడిబొమ్మ అత్తగారినోదార్చి సకలోపచారములఁజేయుచుండెను.

ఆయగ్రహారనివాసులెల్లరకు స్తంభుని ప్రవర్తనము దుఃఖజనకముగానుండెను. వారాదరముతో ననేకరీతుల నాతనికి బోధించిరి కాని ప్రయోజనమావంతయు గానరాదయ్యెను ఇట్లుండ స్తంభుఁడు తా దీసికొనివెళ్ళిన ధనమంతయు వ్యయముగుటచే ధనమునకై తిరుగనిజాగ్రహారమునకు రాగా గాంతిమయి భర్తనుభయభక్తులతో సర్వోపచారములుచేసి యాతనితో వినయముగా నిట్లు మనవిచేసెను.

కాంతిమయి :— ప్రాణేశ్వరా! మీమాతృదేవత మీరామెతోఁ దెలుపకయే వెడలిపోవుటను తెలిసికొని "ఏమీ! నాబిడ్డఁడు నాతో మాట్లాడకయే యేగెనా?" అని పలుసారులు నన్ను బ్రశ్నించిరి మిమ్ము దలచి పరితపించిరి సచ్చరితా! మీజనయిత్రి తుదివయసుననున్నవారు, మీచేతులలోఁ బ్రాణములవిడువవలెనని కోరుచున్నవారు కావుననామె జీవితాంతమువరకైన నింటనుండి మీతల్లిగారికి సంతసమును సమకూర్ప బ్రార్థించుచున్నదానను.

సదాశయా! వెలయాలిని బ్రియురాలినిగాను, ఇల్లాలినిబగదానిగాను, తలంచుచుంటిరే కాని, యోర్పుతో వారిరువురకుగల తారతమ్యమును గుర్తింపకుంటిరి రసికావతంసా పలాండుకందమునకు పరిమళమును, కులటాబృందమునకు అనురాగమును, కలుగుట గగనారవిందసదృశము శ్రోత్రియకులభూషణా! వారాంగనావదనములన నీచజననిష్ఠీవనపాత్రములుకావా? వానిముద్దిడఁగులీనులగు భూసురకుమారులకుఁ దగునా? ప్రాణనాథా! సుధాకరబింబమును గారుమబ్బులమికొనినట్లు మీవిజ్ఞానసంపదను కాని కోరికకప్పివేయుచున్నది. జ్ఞానలవములేనిమీనములు పల్లివానిగాలమునఁజిక్కి యవియున్నట్లు విజ్ఞాననిలయులగునరులు నీచానురాగజాలమునఁబడి మడియదగునా? కావున ద్విజావతంసా! భూసురకుమారులకుఁ దగిన దేవతాతిథిపూజల నెరపుచు శిష్యబృందములకుఆమ్నాయవిద్యలఁ గరపుచు మీతల్లిగారికానందమును సమకూర్చుచు అనిబ్రతిమాలుకొనుచున్న యిల్లాలినాముండరి కళ్ళెర్రజేసిచూచి ఇట్లు పలికెను.

స్తంభుఁడు:—కాన్తీలా ! ఏమి ! నీవైమనస్యము ! ఇట్లుభర్తలనిందించి, వారియానందమునకడ్డుతగులుట సతీలక్షణముగా నెంచుచుంటివా? చాలునీధర్మబోధ తెలసెనీహృదయకాఠిన్యము ఇంకనధికముగాఁ బ్రేలితివా చెంపలెత్తవారఁగలవు, అనిభూములమ్మినధనమును చేకొనిపోవనున్న నిజపతికడ్డుగాఁ జేతులుజోడించినిలచి, కాంతిమయి యిట్లుప్రార్థించెను.

కాంతిమయి :—ప్రాణవల్లభా ! వృథాగానాపైఁ గోపించుచుంటిరి నేఁజేయునది ప్రార్థనముగాని ప్రబోధముకాను. తమయింటనాకంటె వేఱొకరు మీకుమంచిచెడ్డల నివేదించువారు లేకుండుటచే నేనింతగా బ్రతిమాలుకొనుచుంటిని. అంతియకాని మిమ్మెగతాళిచేయుటకుఁగాదు. దైవముసాక్షి నాయంతరాత్మసాక్షి మీపాదారవిందములుసాక్షి అని పాదములఁబట్టఁబోవ, ఆకులటావిటుఁడు ఆకోమలగాత్రిని గాలితోఁదన్ని, నేలఁబడవేసి, వెడలిపోయెను. ఆపాటునకాసుమగాత్రి మూర్ఛితయై కొంతవడికిఁదేరి ఇట్లుచింతింపఁదొడఁగెను.

ఆహా ! ఆర్యకులసంజాతులగుపతులు అగ్నిసాక్షికముగాఁ బాణిగ్రహమొనర్చిన సతులనవమానించుటకు మొదలిడుచో ఇకహిమాంశుకరములు కలువతీగెలఁగాల్ప మొదలిడవచ్చును. మలయానిలములు మాకందసుమమంజరులదహింప నారంభించుచు, ఇస్సీ ! వెలుతురులోఁ జీకటియా ! స్నేహములోఁబరాభవమా !, సంతోషములోసంతాపమా ! తార్కికులచే న్యాయశాస్త్రమునఁ దెలుపఁబడిన పదార్థలక్షణము వట్టి కల్ల నైయాయికులు మోసగాండ్రు నిజముగాఁ బదార్థములకు స్థిరమగు గుణనిర్వచనము లేదు. కాదుకాదు నాయూహయేతప్పు గాఢనిద్రలో మానవుఁడెట్లు లోకతత్వమెఱుంగక యజ్ఞానములోఁబడియుండునో, యటులనే వ్యామోహసుషుప్తిలోఁ బడినజీవుఁడు ధర్మమెఱుంగక, యవినీతిమార్గమున సంచరింపఁదొడఁగును. నానాథుఁడిపుడు కుటిలవ్యామోహనిద్రాముద్రితనేత్రుఁడై యుండుటచే నన్ను శత్రుసమానురాలినిగా భావించి, యవమానించుచున్నవాఁడు. దైవకృపచేనాతఁడు మోహవిముక్తుఁడయ్యెనా ! నన్నాదరించి ప్రేమింపఁగలఁడు మగలు తమ్మలను చేసనంతమాత్రాన భార్యలు కినియఁదగదు.

కట్టా! ఎట్టిప్రేమయెట్లాయె! సకలకలాకోవిదుఁడును, శీలరత్నాకరుఁడును సౌందర్యరాసియు, అసమానానురాగభాసియును నగు నాప్రాణేశుఁడు నన్నవమానింపఁదొడఁగెఁగా! ఇయ్యది తప్పక నాపురాకృతపాపఫలము. ఈనాడుకాకున్న వేలోకనాటికైనను నానాథుఁడు నాపైఁబ్రసన్నతేఁజూపకుండునా! తప్పుదారులఁ బోవువారిని నిందించుట కంటెఁ బ్రేమించిబోధించుట మంచిదికాని వారులెమ్మని బాధించరని తెగనాడుట మంచిదికాదు. పాపము! మాయత్తగారు తమసుతుని ధూర్తకృత్యమునువిన్నచో దుఃఖింపఁగలరు. కావున ఆసంగతినాపాటును తెలుపఁదగదు." అనిమెల్లగాలేచి శ్వశ్రూమందిరములోనికేగెను.

"ఆహా! ఆర్యనారీమణులహృదయసీమలెంతటి వైశాల్యముకలవిగానున్నవి! వారవిలాసినీకామాంధులగు భర్తలు తమ్మవమానించిననను వారినినిందింపరు సరియకదా! వారికై విలపింపఁదొడంగుదురు. కాని సర్వజ్ఞుఁడగునీశ్వరుని సృష్టిలో నట్టిసతీమతల్లులకుఁగూడఁ బరాభవములు సంభవమగుటను జూచునపుడు అవినీతిశాసకుఁడును దయామయుఁడును అగుదేవుఁడు కలడా? యనుసందేహము కలుగకమానదు. కట్టా! నరుఁడు నీచసుఖాపేక్షచేఁ జేయుదారుణకృత్యములకు మేరయే సరాదుకదా! ఓసర్వజ్ఞా! సర్వేశ్వరా! లోకజనకా! తలిదండ్రులగుణములు నిజసంతతికబ్బునందురే! అట్టిస్థితిలో అనంతకల్యాణగుణనిలయుఁడవును అవేయప్రేమరసపాగరుఁడవును నగునీకుబుట్టిన సంతతులిట్టినగుణాలుగుటకుఁ గారణమేమి? అచేతనమగు పంకమునఁబుట్టిన పంకేరుహము మంగళామోదగుణావహమై లక్ష్మీనిలయమై వెలయుచుండ, జ్ఞానస్వరూపుఁడవగు నీనుండియుదయించిన జీవుఁడేల యమంగళగుణుఁడై అవివేకకృత్యముల నెఱపుచున్నవాఁడు? వేదాంతులు తమకేదో తత్త్వము బోధపడినట్లు నటింతురేకాని ఈజీవవిలాసరహస్యము నానంతయుఁ దెలుపఁజాలకున్నవారు. తప్పక యిది దుఃస్సూహ్యము.

అట్లు కాంతిమయి కమలభవనములోనికేగినతోడనే యాసాధ్వి కోడలినిజూచి యిట్లుపలికెను.

కమల:—తల్లీ! నీవల్లభుఁడు మనలవిడచి వెడలిపోయెనా? పుత్రి

నానందనుఁడిటుకు ధనార్థమైవచ్చుచున్నవాఁడు కాని మనపైననురాగముచేఁగాదు. పడుపుపడఁతుకల మక్కువలకుఁబస, పసిడియేకదా? గుణవతీ! భగవంతుఁడు నాకుఁబుత్త్రునిగను భాగ్యమునేకాని, వానిచేతిలోఁజను సంపదను సమకూర్చినట్లు తోఁపకున్నది. వినయహీనమగువిద్యయు విరాగదూరమగు ప్రేమయు దుఃఖమునుగలిగించునేకాని సౌఖ్యమును సమకూర్పఁజాలవు మనకనురాగమేకాని విరాగముదయింపకున్నయది కటకటా! నానందనుఁడపకీర్తి కూపమునఁ బడుచున్నవాఁడు వీనికిఁదగుగుణసాహాయ్యమును మనము కలిగింపనేరకున్నవారము.

కాంతిమయి :—అత్తా! విచారింపకుము సృష్టవస్తువులకు మార్పుసహజము స్థిరతయనిత్యము ఈనాఁడుకన్నట్లు రూపగుణాదులు రేపు చూపట్టనేరవు మీనందనుఁడిట్లు జారశిఖామణులుగా మారుదురని మీరు కలలోనైనఁదలంచితిరా? లేదు కదా! మనకుపుణ్యమున్నచోఁ తిరుగవారే రేపో యామరునాఁడో పశ్చాత్తప్తులై ధీశాలురుగా మారవచ్చును ప్రాణులభాగ్యరేఖలెట్లు తానుమారగునో యెరుంగుదురు విదుషీమణీ! అనురాగపల్లవములకున్న రమ్యత విరాగజీర్ణపర్ణములకుండునా? వేనినేని సమకూర్చుకొనుటకష్టము పరిత్యజించుట సుకరము మఱియుఁ దల్లులు పిల్లలను సతులు పతులను వీడుటయనునది యసంభవకృత్యము సంయోగవియోగములు పాంచభౌతికదేహమునకుగాని ప్రేమశరీరమునకులేవు పాత్రమున స్నేహములేకున్న దీపకళతగ్గునట్లు హృదయమునస్నేహము లేకున్న ప్రేమకాంతిమాఁగియును కావున దీపకాంతినిగోరువారు తైలమును ప్రేమకాంతినిగోరువారు స్నేహమును పోషించుచుండవలయును.

అట్లాయత్తగోడండ్రు తమమనసుల సంతృప్తములనుగాఁ జేసికొని సంసారకృత్యముల సాగించుకొనుచుండిరి అంతకొంతకాలమునకు స్తంభునిమాతయగు కమల వైధవ్యదుఃఖముచేతను, పుత్త్రుని యవినీతిప్రవర్తనముచేతను, వార్ధకప్రాబల్యముచేతను, క్రమముగాఁ గృశీభూతయైనిర్యాణకాలమాసన్నముకాఁగాఁ గోడలినిబిలిచి యిట్లు తెలిపెను.

కమల:—అమ్మా! కాంతిమయీ! నాకవసానకాలమాసన్నమయినట్లు పొడకట్టుచున్నది. నానందనుని ముఖారవిందమును కన్నులారఁ

గాంచి, ఈపాంచభౌతికదేహమును విడువవలయుననియున్నది. కావున నెవ్వరినైన నుజ్జయునికిఁబంపి, నాపుత్త్రినిరప్పించి, ఆసుందరాంగుని నాకొకసారిచూపుము నాప్రాణములు పుత్త్రీమణితో నేగకుండునట్లు చేయుము అనఁ గాంతిమయి యత్తగారి యార్తనాదమును విని హృదయము నీరైపార ఇట్లు పలికెను.

కాంతిమయి :—అమ్మా! బెంగటిల్లకుము మీనందనుల నెటులనైననిటకు రప్పింతును అనిపలికి అమెకడనుండి వెలుపలికివచ్చి తనలో నిట్లు చింతింపదొడఁగెను "పూజనీయురాలగు మాయత్తసుతునిఁజూడ పలవరించుచున్నది ధర్మనీయుఁడగు నాహృదయకైరవచంద్రుఁడు కుటిలకులటాకుహనాగ హతుఁడై కానరాకున్నవాఁడు నేనెట్లాసుహనీయుని దోడ్తెప్పించి, నాయత్తగారికి జూపఁగలనో తెలియకున్నది ఇట్టికష్టకాలమున నార్తసంరక్షకియగు పార్వతిని బ్రార్థించుటతక్క వేరొండు సాధనములేదు" అని నిశ్చయించితన కిష్టదైవతమగు కాత్యాయనీ దేవినిట్లు ప్రార్థింపదొడఁగెను.

"ఓదయాలహరీ! గౌరీ! ఇట్లసహ్యదుఃఖసాగరమునఁగూలి, యవియుచున్న ఈదీనురాలిని దయాకరములగు నీకరములసాచి యుద్ధరింపకుంట ప్రేమరూపవగు నీకున్యాయమా ? అర్ధనారీశ్వరివైన నీపురనీదాసురాలు పతిత్యక్తయై పరాభవమందుచుండ గళ్ళారఁజూచుచు నెటుల యూరకుంటివమ్మా? అమ్మా! యిట్టియాతురాలిపైఁ జాలిగొనక పర్వతపుత్త్రివనిపించుకొనకుము నాపైదయజూపి మంగళాంగివనిపించుకొనుము. ఓముక్కంటిరాణి! నామనోహరుని మానసమును శీలవంతమును గాఁజేసి, యాద్విజకుమారమౌళి నాసేవలఁజేకొనునట్లు చేయుము ఓవిఘ్నేశ్వరజననీ! నీప్రాణేశ్వరుఁడు లోకదాహకమగు హాలాహలమును బరిగ్రహించి, ప్రాణిసమూహముల సంరక్షించియుండ నీయండఁజేరియున్నభక్తుల దుఃఖములఁ బరిహరించి, ప్రోవకుంట శివకాంతవగునీకుఁ దగవుగాదు. ఓశంకరసుందరీ! నానాథునితల్లికంటికాపె తనూజునిఁజూపి పుణ్యముకట్టుకొనుము విపన్నులఁగాపాడుట నీప్రసన్నతకు చిహ్నము" అని ప్రార్థించి తిరుగనిటులఁదలంచెను. "పురుషకారములేనిదే మనో

రథము శ్రీదేరఁజాలవు అని ఈక్రిందివిధి నొకయుత్తరము తనకాంతునకు వ్రాసెను.

—: చతుర్థాధ్యాయము వినయ లేఖ :—

పావనములై యనురాగామోదభాసురములై వెలయుపతి దైవత పాదారవిందములసన్నిధికి కాంతిమయి వినయానతవదనయై సాష్టాంగ నమస్కారపూర్వకముగా వ్రాయువిజ్ఞాపనలేఖ—

శుభచరిత్రా! కమలాపుత్రా!

మీతల్లిగారు మీయెడబాటునకుఁ జాలవిచారించుచున్నారు. ఆసాధ్వీమతల్లి దేహవల్లి పరితాపపరంపరలచేఁ గ్రమముగా క్షీణించుచున్నయది వైద్యులాపెకు మందులిచ్చి ప్రయోజనములేదనుచున్నారు మాయత్తగారికి మీవదనారవిందముఁ జూచుట మీకరపుటములలో నిజజీవితసుమములర్పింపవలయునను కోరికతక్క వేఱెట్టియైహికాభిలాషయులేదు. పావనాశయా! తమకుఁదెలియని ధర్మముకలదా? తల్లినిమించిన దైవతమున్నదియా! మానవులకువందలకొలంది సుందరాంగులగు మదవతులు చేకూరుదురుగాని, వినిర్మలప్రేమపూరితస్వాంతలగు మాతృదేవతలు లభ్యమగుదురా? విద్యానిధీ! తల్లులుగతించిరేని యట్టివారీ యీశ్వరసృష్టియందు మఱికానవత్తురా? వారు స్వసుఖములబాటింపకయు వేఱెట్టిఫలములనపేక్షింపకయు, నిజనిర్యాణమువఱకు నాత్మజులపైఁ జూపుప్రేమకు సాటిలేదు. దానికదియేసాటి, తత్త్వజ్ఞా! తారకాగణములగణింపవచ్చు ఇసుకనలసులలెక్కింపనగు, సాగరతరంగశీకరములఁ బరిగణింపవలనుపడును. కాని మాతృదేవతాహృదయకోశమున నిమిడియుండు స్వచ్ఛవాత్సల్యమునకుఁ బరిమాణమును నిరూపించుటకు బరమేష్ఠికిఁగూడ సాధ్యముకాదు. అట్టియనురాగకల్పవల్లులగు తల్లుల విషయములోఁ బుత్త్రులెట్లుమసలవలయునో మీయట్టిప్రాజ్ఞులకు వేఱుగఁదెలుపవలయునా? కావునఁ గతపతియై దుర్భరవైధవ్యదుఃఖమునఁబడి, మరణోన్ముఖయై మిమ్ముఁజూడవిలపించుచున్న మాతృదేవతనిట్లు నిర్లక్ష్యముచేయుట మీయట్టిసత్కులజాతులకు, బాడిగాదు. శీలభూషణా! మీతల్లిగారికి మీరువారిసన్నిధినే యుండవలయుననియు, పైకిఁ

బోరాదన్నియుఁ గోరికయున్నను గట్టిగామిమ్ము నిరోధించిన మీరెక్కడ భారము చెందుదురోయని ఆపె సంకల్పమును వెలువరింపకయున్నవారు, ప్రస్తుతమాతపస్విని మరణాసన్నయైయు మిమ్మొకసారిచూడఁ గోరుచున్నవారు. కావున ఈయుత్తరమును చూచినవెంటనే ఇటకుదయచేయఁ బ్రార్థించుచున్నదానను మీచేతగానున్నంతవఱకు మీమాతను కాంత మిమ్మెడఁబాసిపోనేఱదు. కావునఁ గొలదిదివసములు మీరావెలయాలి వియోగఖేదమునుభరించి మీతల్లిగారికి మీదర్శనానందమును సమకూర్పవలయును.

ఈనావిజ్ఞప్తిని దివ్యచిత్తమునకుఁ దేవలయును. ఇందలితప్పులు క్షమింపవలయును.

చిత్తగించవలెను.

ఇట్లు

పరమవిధేయ

కాంతిమయి.

ఆ సాధ్వి యిట్లుత్తరము వ్రాసి, దానిని ముడఁచియుంటించి, విశ్వాసపాత్రుఁడును, వివేకవంతుఁడును నగునొక సేవకునిఁబిలచి, ఇట్లు పలికెను "ఓరీవీరా! నీవీయుత్తరమునుజ్జయినికిఁగొంపోయి, రహస్యముగా మీబాబుగారికందిచ్చి వెంటనేవారినిటకుఁ దీసికొనిరమ్ము. వారు నిన్ను "మాయమ్మయెట్లున్నది" అనియడిగినచో "వారవసానదశలో నున్నారనియు బంధువులుగుంపులుగుంపులుగావచ్చి చూచిపోవుచున్నారనియు తెల్పుము" అనివానికిఁ గొంతపైకమిచ్చి "నీయజమానులకు సొమ్మక్కఱయున్నచో దీనినొసంగుము" అనిపంపెను.

వెంటనే యాకింకరుఁడుజ్జయినికేగి, స్తంభుఁడు బసచేసియున్న యింటికిఁబోయి, యాలేఖనందిచ్చెను. అతఁడాయుత్తరమును విప్పిచూచి, కరమునఁగాసులేమినో, దల్లినిఁజూడఁగోరికనో, యింటికేగఁదలఁచెను కాని యాతనికడ బండికట్టించుకొనుటకుఁ గానిసూడ లేకుండుటచే నేమిచేయుటకునుదోపక, యాయుత్తరమునట్టె చేతఁబట్టికొనినిలచెను. వీరడదికనిపెట్టి "అయ్యా! మాయమ్మ కాంతిమయిగారు మీకు

గావలసినచో సొమ్మిమ్మని నాచేతికిప్పైకమిచ్చినారు మీరుదీనిఁ జేకొని, వేగము గా బంధువులఁ జేరవలయును లేకున్నచో మీయమ్మగారిని జీవించి యుండఁగఁ జూచుటతటస్థింపనేరదు." అని తాఁదెచ్చిన విత్తమాతనికి చ్చెను. స్తంభుఁడు దానిఁ జేకొని, యొకగుఱ్ఱపుబండి నద్దెకుఁ దీసికొని, దానిలో నెక్కి తారకడ కేగకయే వీరనితో సాలగ్రామమునకు నాసాయం కాలమున జేరి, తిన్నగఁ దనయింటి కేగెను. అపుడత్తగారి పదములనొత్తు చున్న కాంతిమయి నిజకాంతునిజూచి నమస్కరించి మరణాయాస ముచే గనులుమూసియున్నకమలను మెల్లగా తట్టిలేపి ఇదిగో మీనంద నులువచ్చియున్నారు చూడుఁడుఅనెను. ఆమాటవిన్నతోడనే మరణో న్ముఖయగు కమలతనయునిఁజూచి, కన్నులనానందాశ్రువులొలుక నిట్లు పలికెను,

కమల :—చిరంజీవీ! కుశలముగవచ్చితివా? తండ్రీ! నీముఖార విందమును దిలకించు భాగ్యములేకయే ప్రాణముల విడతుననుకొంటిని. ప్రియనందనా! నేడేకాదశియగుటచే భగవంతుడు నన్నునీచేతులలో దీసి కొనిపోయినచో ధన్యతనందుదును; అనిపలికి కాంతిమయివైపు పరికించి 'అమ్మా కాంతిమయీ! నేనికజీవింప నీవు నాసుతుని దుడుకుచేతలకు గిని యక, మనయింటిగుట్టు పరవారికిఁ దెలియరాకుండ గాపురమునుచ క్కబరచికొనుము. దుఃఖనివారిణియగు శంకరునిరాణి నీకు సౌభాగ్య సంపద నొసగి కాపాడుగావుత అని తిరుగ స్తంభుని వైపుజూచి "నా తండ్రీ! మేము నీకుశత్రువులమైతిమా? యాకుటిలకులట నీకుహితురా లాయెనా? తనయా! నిష్కలంకానురాగభాసురయు, సకలసుగుణమణి భూషితయు, మృదుమధురభాషితచతురయు, నుత్తమకుల సంజాతయు సౌందర్యశ్రీవిలసితయు, వినయోదార చరితయు నగునీసతికాంతిమయిని మించినసుదతి యీపృథివీస్థలిఁ గలదా? వివేకసాగరా? నీవిజ్ఞానమెట బోయె? ఈగృహమునుండి పావనులగు మీతండ్రిగారేగినటులనే నీహృ దయమునుండి యశస్కరమగు వివేకమెగిరిపోయెనా? కటకటా! యెట్టి సచ్చరితుఁడ వెట్లయితివి?

బిడ్డా! బిడ్డా! యికనైన దుస్సాంగత్యమునువీడి, యింటనుండి నీ వంశమర్యాదను గాపాడుము. నాకు దప్పట్టి నానాలుక తడియారిపోవు

చున్నది. నాచూపులుసన్నగిలుచున్నవి ఇక నేమాటలాడజాల భగవాను డు మీయుభయులకు తిరుగవనురాగము నొసఁగుఁగావుత! అనికళ్ళు మూసి మంచముపైఁబడిపోయెను. వెంటనే కాంతిమతి యామెనుగట్టిగఁ బట్టుకొని " ప్రాణేశ్వరా! ఆపూజామందిరములో పంచపాత్రయందుఁదు లసీజలములున్నయవి వేగమెకొనివచ్చి మీతల్లిగారినోటిలో రెండుమూ డుద్ధరిణులజలములపోయుము" అనస్తంభునకు కాంతిమతి తెలిపినటుల జేసెను అంతనామాధవకాంత సీరసస్వరముతో మూసికొనిపోవుచున్న చూపుల తో గాంతిమతియు స్తంభులఁదిలకించుచుఁ శ్రీహరినిస్మరించుచు బ్రాణము లవిడిచెను.

స్తంభుఁడంతదుష్టుఁడైనను గతజీవితయగు తల్లినిజూచి, దుఃఖావే గమునడ్డజాలక విలపింపఁదొడఁగెను ఆసమయమునఁగాంతిమతి ధైర్యము పూని నిజనాథునిచేతఁ గాసులేమియుఁగనిపెట్టి నిజాభరణమును దాకట్టువె ట్టిసొమ్ముతెచ్చి యాధనమును భర్తకొసంగ నాతఁడు బంధుసహాయము నదల్లికిఁదహనాదికర్మలఁజేసి యెల్లెట్లో యాపన్నెండుదినములఁగడపెను. అప్పటికి ఆభూసురకుమారుని చరస్థిరరూపమగు నాస్తియంతయుదావా నలముచే భూరుహసంపద దగ్ధమగునటుల వేశ్యావ్యామోహముచే నాశ నమయ్యెను కానిస్తంభునికిమాత్రము వారకామినీవ్యామోహము మరల దాయెను.

—♦ పంచమాధ్యాయము ♦—

వివేకోదయము.

అటనుజ్జయినిలోఁదార స్తంభుఁడు రిక్తహస్తుఁడగుటను దెలిసికొని వేరొకసంపన్నుఁడగు నవరసికుని నిజానురాగపాశ బద్ధునిగాఁజేసి ధన సంచయముల బిండనారంభించెను పాపమీభూసురకుమారుఁడా మోస మెరుంగక యాసారసాక్షి తానులేకున్న బ్రతుకజాలదనితలంచి, మాతృ కర్మముముగిసినతోడనే యుజ్జయినికేగి తారామందిరములోనికి బ్రవేశిం పఁబోవ, గుమ్మముకడనున్న యావేశ్యాసేవకులీవిత్తహీనుని లోనికిఁబో నియ్యరైరి. అందుచేస్తంభుఁడు కోపోద్దీపితుఁడై వారదివరకుఁదనసొమ్ము తిన్నవారగుటచే గట్టిగావారిని దిట్టమొదలిడెను అంతనావారకాంత చెంత

గోత్రగాఁజేరిన సరసుఁడు తనప్రియురాలికింకరుల నాబీదబాపఁడు తిట్టుచుండుటను సహింపజాలక తనపరాక్రమము వెలయాలికి వెల్లడియగునట్లుస్తంభునిమెడఁబట్టి క్రిందికిగెంటెను పాపమాతఁడాతోపునకు నెత్త గుగుమ్మములపైనుండి వీధులలోనిలచియున్న బురదలోఁబడి యారథ్యాకర్దమలేపముచే దేహమునవ్యాపించియున్న వేశ్యామోహతాపము చల్లారనాతఁడాబురదలోనుండి మెల్లగాఁలేచి తనప్రియురాలు కనఁబడునేమోయని వీధిలోనుండి దానిగుమ్మమువైపుచూడ మబ్బుచాటునుండి వెలువడు వెన్నెలవలె కవాటపటము మరుగుననుండి తనపైఁబడుచున్న ఆకులటయొక్క చిరునగవునుగాంచుటచే మానసముననిలచియున్న నీచానురాగాంధకారము తొలఁగ తనలోనిట్లు చింతింపఁదొడగెను.

“ఆహా! ఎంతటిమోసమునకులోనైతిని! అతిచంచలమగు నీగణికానురాగమునఁబడి, నాస్థిరచరార్థములనేకాక కులమర్యాదను, దేహారోగ్యమునుగూడఁబోగొట్టుకొంటిని కట్టా! ప్రేమకల్పవల్లియగు తల్లిని నిరాదరించితినా? సుశీలయగు నిల్లాలిని దిట్టితన్నితినా? హితబోధకులగు బాంధవుల గసరితినా? ఇట్లిందరినికాదని నేసంపాదించిన సంపదయేమి? అమేయమగు పాపసంచయము; అనంతమగునపకీర్తి అనివార్యమగు రోగప్రాప్తి ఇక నేనిపుడేమొగముపెట్టుకొని యాశ్రోత్రియాగ్రహారములోఁ గాలిడగలుగుదును? నేనెట్లాసాధ్వియగు కాంతిమయివదనము నీక్షింతును?” అని యిట్లుచింతించి యర్ధరాత్రియగుసరికినిజనివాసముచేరి ‘సతిమణీ! కాంతిమయీ!’ అని కేకవేసెను. ఆకేక యాయిల్లాలిచెవిని పడినతోడనే ఘననినదమునాలించిన కేకినివలె దేహముపులకలెత్త ప్రియసమాహ్వానసంతోషశ్రీవిలాసము నిజవదనసరోజమునఁ దాండవింపఁబరుగిడివచ్చి తలుపుదెరచి దీపపుకాంతిలోఁ గాంతిమయి నిజకాంతునిగాంచి “ప్రాణేశా! దేహమాపాదమస్తకమీ బురదయెట్లువచ్చె? మీరుధరించినవస్త్రములు కర్దమలిప్తములైయున్నయవి మనోవల్లభా! ఈనడిరేయి ఈకారుచీకటిలోదారితప్పి ఏబురదదొరువులోనైన ప్రమాదవశమునఁ బడితిరాయేమి? శ్రమచెందియున్నట్లున్నవారు స్నానమునకువేడినీళ్ళుపెట్టుదునా? ఉష్ణోదకస్నానముచే ప్రయాణపుబడలికసడలి మీయొడలుశుభ్రమగు

ను అని ఇట్లు ద్రాక్షాలిమధురములగు మురిపెంపుపలుకులచే దన్నుసం తసింపఁజేయుచున్న యిల్లాలినిఁజూచుటవలన తనవిచారమినుమడింపఁగొం చెముసేపు మూగవానివలెఁ బదులుపలుకక యొకవేడినిట్టూర్పు దీర్ఘము గావిడచి ఇట్లుపలికెను.

స్తంభుడు:—సాధ్వీమణీ! నేను మాతృహంతకుఁడను కళత్ర నిందకుఁడను కృతఘ్నుడను కులద్రోహిని. నేను నీచాతినీచయగు వేశ్య తోఁగూడి పావనచరితవగు నిన్ను బహువిధముల నవమానించితిని. నా పూర్వులుసంపాదించి నాకొసంగిన కీర్తిసంపద దగ్ధమొనర్చితిని కుమతు లలోఁజేరి చేయరానిపనులజేసియుంటిని అట్టికలుషమతిని అట్టి పాపాత్ము డను అట్టిద్రోహిని అంతటికిరాతుఁడను. కావున సతీమణివగు నీచేనెట్లుప చారములఁజేయించుకొందును? ఎటుల నీపావనవదనారవిందమును నీ క్షింతును?

సతీమణీ! నాదేహమున నంటుకొన్నది బురదకాదు జ్ఞానచందన ము గుణవతీ! నేగట్టినపుట్టముల నంటినది కర్దమముగాదు విరాగ కస్తూ రీపంకము శీలవతీ! నీవన్నయట్లు గణికామోహాంధకారముచేఁ గన్నుగా నక సన్మార్గమునుదప్పి, కుటిలానురాగ పంకపల్వమునబడితిని. చెడితిని సాధ్వీతిలకమా! నాకిదిపరాభవముకాదు. జ్ఞానోదయము నాకీవివేకోద యమైనవెంటనే యెవ్వరికంటబడకుండ నరణ్యమునకు బోనెంచితినికాని పరమపావనమగు నీవదనసరోజము నొక్కమారీక్షించి పోవనెంచి యిట కువచ్చితిని నిన్ను సందర్శించితిని కృతార్థుఁడనైతిని. ఇకపోయెద ననుజ్ఞ నొసగుము. కాంతిమయి నిజనాథుని పరితాపోక్తులవిని యాతనిహృదయ మేదియో మార్పునుచెందియున్నదని తెలిసికొని యిట్లుపలుకఁదొడగెను.

కాంతిమయి :—ప్రాణవల్లభా! ఏలయిట్లుమాటలాడుచుంటిరి? అర్ధాంగులవిడచి కాంతులొంటరిగఁ గాంతారములకేగదగునా? ఆర్య సతులు నిజపతులబాసి తామింటసుఖింపఁగోరుదురా? ప్రియవ ల్లభా! గడచినదానినిమరచి నాయుపచారములఁ జేకొనవలయును. "ప్రమాదోధీమతామపి" అనినట్లు ఎంతటిమేధావులును పెడదారులఁ బోవుట కానవచ్చుచున్నది. అనిపలికి వెంటనేయుష్ణోదకము సిద్ధముచేసి

నిజనాథునిస్నానమాడించి, ధౌతవస్త్రములఁగట్టనిచ్చి, క్షీరముల త్రాగ నొసంగి పక్కనిలిచి మెల్లఁగవిసరఁదొడఁగెను. స్తంభుఁడాసహజావ్యాజోపచారములచే శాంతచిత్తుఁడై యిటులఁదెలుపఁదొడఁగెను.

స్తంభుఁడు:—కట్టా! సాధ్వీమణీ! నన్నేదియోపెనుభూతము పట్టి, నాబుద్ధినిపెడదారినిఁబెట్టి, నన్నుచెడఁగొట్టినది. అకటా! పావనామూల్యమగు కులకాంతయొక్క యనురాగసంపదనురోసి, చంచలమగు నీచపణ్యాంగనానురాగవ్యామోహాంధకారమునఁబడి కన్నుఁగానక, తిరిగితినేకాని స్వచ్ఛానురాగజీవనవాహినియగు నర్ధాంగినవమానించి, దురంతపరితపర్వతములఁ బెంచుచుంటినని తెలియజాలనైతిని. ఈగ్రామమునఁగల పిన్నపెద్దలెల్లరకు వెగటైతిని.

కావున నేను తెల్లవారకమున్నె యీయగ్రహారమునువీడి పెద్దలకంటఁబడకుండ, ఏపుణ్యతీర్థమునకో వెడలిపోయెద నీవునాయపరాధములమఱచి నన్నుమన్నింపఁగోరెద. నాయెడబాటును సహించియుండుటను నేనిదివఱకేనీకభ్యాసము చేసియుంటిని. నాయట్టికృతఘ్నునకు సేవచేసి, పాపముసంపాదించుటకంటెఁ బావననాముఁడగు పరమేశ్వరునారాధించి సుకృతములసమకూర్చుకొనుట నీకుముఖ్యకృత్యము. నేనీవికృతస్థితిలో నింటనుండి నిన్నుబాధించుటకంటె నీకుదూరుఁడనై యుండుటయే క్షేమమనితలంపుము.

ఇకముందు అప్పులవాండ్రు తమసొమ్ముల రాఁబట్టుకొనుటకు మనగృహారామాదుల విక్రయింపమొదలిడుదురు. కావున మనమిటనుండుటతగదు. నీవును నీపుట్టినింటికేగుము. నీసోదరులు విశాలహృదయులు అందుచేనిన్ను ప్రేమించి గౌరవింపగలరు ఇకనేఁబోవనంగీకరింపుము.

కాంతిమయి:—ప్రాణేశ్వరా! మీరిటులకర్ణకఠోరముగాఁ బలుకుటన్యాయమా? మీరునన్నవమానించితిమని చింతింప జనదు. మీరు నన్నొకసేవకురాలినిగాఁ జేకొని, నాచేనుపచారములఁ జేయించుకొనుటకు మీకుహక్కుగలదు. నన్నుమీరుతిట్టవచ్చును కొట్టవచ్చును. మీకునాపైసర్వాధికారములునుకలవు. జీవితేశ్వరా! ఇటువినుడు కులకాంతలు తమగళమునమంగళసూత్రమును గట్టినపతులును, తమకమప్ర

లఁబుట్టిన సుతులును, నెంతటిదరిద్రులైనను ఇక నెంతటికురూపులైనను, ఎట్టిదురాచారులైనను, మఱెట్టిహింసకులైనను, సేవగింపక ప్రేమింతురు. ఇదివారికనివార్యమగు సహజస్వభావము దానిమరలింప భగవంతునికిఁ గూడఁ దరముకాదు.

కావున మీ రెట్టిస్థితిలోనున్నను నాకానందసంధాయకులుగాను వందనీయులుగాను నుందురుకాని, దుఃఖదాతలుగాఁగన్పట్టరు. ఈయది త్రికరణశుద్ధిలోఁ దెలుపుచున్నవాక్కుకాని బూటకపు మాటకాదు. ఇందుకునాహృదంతర్యామియగు భగవానుఁడేసాక్షి. ప్రియవల్లభా! మిమ్మువీడి పుట్టినింటికేగి నేనుసుఖించుట యెట్లుపొసగును? ధీనిధీ! పతి విప్రయోగమున సతియన్నపానాదులవిడచి, కృశించునేకాని మృష్టాన్నములదిని సుఖింపఁగోరదు. మఱియు నార్యపుత్రా! సతులుపతులకు సౌఖ్యకాలమున నుపచారముల జేయనంతగా నవసరముండదు. నిజనాధుడు దుస్థితినిఁ జెందియున్నపుడే వారికిసేవలఁజేయు మంచిసమయము కావుననన్ను వేఱుఁజేయఁదలంపక, నాహృదయపూర్వకములగు దాస్యములస్వీకరించి, నన్నానందింపఁజేయుడు సంపదయే సౌఖ్యహేతువనితలంపకుడు ప్రేమయే యానందకందమని భావింపుడు. సతి పూర్ణజీవితయగుటకు సాధనము సదానిజపతిసేవయేయని విశ్వసింపుడు.

ప్రాణేశ్వరా! మీరేకారణముననో నాయొడలితొడవులఁ జేకొనరైతిరి. మనమిపుడు వానినమ్మి యాధనములో నప్పులఁదీర్చి, కొంత యాస్తిని నిలువఁబెట్టుకొనవచ్చును. కావున నిలువనీడయుఁదినఁదిండియు మనకుండదని భయపడకుడు పతినీరసావస్థలోనుండ సతికినాభరణములతోఁ బ్రయోజనమేమి? సుగుణాలయా! మీరనినట్లు మిమ్ముతెలియరాని పిశాచమేదియొ యావహించుటచేతనే వేశ్యాసాంగత్యమునకుఁ బాల్పడితిరి. లేకున్న మీయనుపమాన శీలకాంతియేడ? ఈయవినీతి తిమిరసంపర్కమేడ? దయానిధీ! క్రూరరోగములచే సుందరరూపము వికారమునుదాల్చునట్లు కులటానురాగములచే మానసవికాసము నూలిన్యమునొందును. మీరింతవేగముగ నీవేశ్యావ్యామోహనిద్రనుండి మేల్కొందురని నేదలంపలేదు. దైవము నాకనుకూలుఁడగుటచే రాహు

ముఖమునుండి చంద్రునివలె వేశ్యామోహమునుండి మిమ్ము విడిపించి నాడు. మీరింతకుముందు నన్నేవగించుటకును ఇపుడు ప్రేమించుటకు ను నాదురితసుకృతములే కారణములు.

స్తంభుఁడు:—సతీమణీ! నిజముగా నావిరాగమునకు ప్రధాన కారణము దైవముకాదు. వినుము నాకువివేకోదయమగుటకు ముఖ్య కారణము ప్రేయసీ! నేను నామాతృకరాశ్యంతమున నిటనుండి వేశ్యాగృహమునకుఁ బరుగిడిపోతిని. అదివఱకు నారాకలకై యెదురుచూచునా కులటాభటులు నన్నానాడు వారకామినీమందిరములోనికిఁ బోనియ్యక గుమ్మముకడ నన్నడ్డగింప వారలఁదిట్టమొదలిడితిని అంతనాజారిణీ నూతనకాంతుఁడు లోనుండిపైకివచ్చి "పేలకుము, పొమ్మ" అనినన్నుఁ గ్రిందికి గెంటివేయ నేనువీధిలోనున్న బురదలోఁబడితిని నాపాటును తెరచాటు నుండి చూచుచున్న యావెలయాలు ననుఁజూచిమందహాసమొనర్చెను అదిగో యామందహాసప్రసారము పాలనుప్పువిరచునటుల నామోహమునువిరుగఁగొట్టినది. అట్టిదుర్భరావమానము సంప్రాప్తముకాకున్నచో నేనింకను మోహాంధకారమగ్నుఁడనై యుండువాడనే సందేహము లేదు. ఆబోగంపుమగువనగ వేనావిరాగహేతువు.

కాంతామణీ! కంటివా? యావెలయాలిమోసము మిమ్ముదక్కవేఱొక్కపురుషునిఁబ్రేమించుదాననుకాను." అనినన్ను నమ్మించి నాచేతనున్నధనమంతను దోచుకొని, తుదకుఁబరునిఁజేరి నన్నట్లవమానించి నదిరో అదినాపైఁజూపెడి యనురాగమునకంతులేకుండెడిది నిజముగా నావియోగముచే నాచంచలాక్షి మరణించుననుకొంటిని అంతటివిశ్వాసముగల నారీమణి వేఱొకతె లేదనుకొంటిని కంటిని తుదకుదాని తుంటరితనమును

కాంతిమయి:—హృదయేశా! ఇందువింతచెందఁదగినదేదియును లేదు. పడపుచేడియల వలపులకును మెరుపుతళుకులసొగసులకును నిలుకడయుండునా కఠినపాషాణకుట్టిమమునఁ బద్మినీలతయు, కుటిలకులటా మానససీమను విశ్వాసకాంతికయు నుద్భవమగునా ?

స్తంభుఁడు:—సతీమణీ ! ఆవెలయాలంత పెద్దవయసుది కాదు. కాని దానిచేతలతిప్రౌఢములు.

కాంతిమయి:—ఆర్యపుత్రా ! వహ్నిశిఖలు చిన్నవిగానున్నను, పెద్దవిగానున్నను దాహశక్తి కలవిగానేయుండును. అటులనే వారకామినులు పిన్నవారైనను పెద్దవారైనను మోసకత్తియలుగానే యుందురు ప్రాణేశ్వరా ! అమిత్రమిత్రబృందమేమాయె? దాగియుండెవరును మీకు సాయపడలేదా ?

స్తంభుఁడు:—ప్రేయసీ ! వారా ! దేహమునఁగలరక్తమాంసాదుల సంగ్రహించి యాకంకాళమునువీడి, వేటకుక్కలు కుణపముకడకేగురాబంధులవలె రిక్తహస్తుఁడనగు నన్నువిడచి, వేఱొక్క ధనికునికడకేగి యుందురు.

కాంతిమయి:—ప్రాణేశా! మిమ్ము మీతల్లిగారును నేనును ఆ దుండగీండ్రతోడి స్నేహమును మానుడనికోరితిమి కానియాదివసములలో మామాటలుమీచెవికెక్కవాయె ఇంతకును మనకర్మతంత్రమిట్లుండఁ బరవారిని దూరభావ్యముకాదు అని నిజనాథునికి సకలోపచారములఁ జేయుచుఁ గాలముగడపుచుండెను.

ఇటులసమయము సాగుచుండ వజ్రసమమగు నావిప్రకుమారుని దేహము వేశ్యాసంపర్కజనితములగు రోగపరంపరలచే గ్రసించి వికారాకారమునొందె తుదకాతనిదేహమాతనికే యసహ్యముగగానరాదొడగెను కాని కాంతిమయికాతఁడు సుందరరూపునిగనే కనుపించుచుండెను. ఆమె నిజనాథునికి చిత్తవిశ్రాంతిగలిగింప మధురాహారముల సమగ్రముచు సత్కథలఁబఠించుచు వీణపై శ్రీహరికీర్తనల వాయించుచు యేసమయమున నెట్లుచేసిన నిజపతికి సౌఖ్యముగానుండునో యాయా యుపచారముల సంతోషముతో నెరపుచుండెను.

స్తంభుఁడు పాడురోగములపీడకుఁ దాళనేరక నిజకాంతనుజూచి యిట్లుపలికెను. దయావతీ! కులకాంతలు కంటగన్నీరుపెట్టునట్లు పురుషులు మసలినచో నాకులము వ్యాకులమై దారిద్ర్యమున కాలవాలమై చెడుననియు వారు దుర్భరదుఃఖములకు లోనగుదురనియు పెద్దలు తెలిపియు

న్నారు ఆయూర్యోక్తి నాజీవితమున నిదర్శనమైనది అత్యుత్కట పాపము నకు ఫలమిహమునందే సంభవమగుట సత్యము క్షేత్రమున సస్యమొందిన పిమ్మట వర్షముపడినట్లు చేతధనముపోయినపిదప వివేకమేర్పడిన బ్రయో జనమేమి? బుద్ధిపూర్వకముగా సర్వస్వము పోగొట్టుకొని అంతయుదైవా ధీనమనుటసిగ్గులేనిమాట పారమేశ్వరీ! యికమీదట యమభటులు నీతో మాటలాడజాలరని తోచుచున్నది సాధ్వీమణీ నీపావనశీతలకరతల మును నాతలపైనిడి నా పాపసంతాపమును శాంతింపజేయుము అనుచుండ గుమ్మముకడ నిలచి దేవలుడను మునివరుడు "భవతిభిక్షాందేహి" అని కేకవేసెను. కాంతిమయి యామాటనువిని మునికెదురేగి నమస్కరించి మునీంద్రునిలోనికిగొనివచ్చి యామహర్షి పాదములు బల్లెరమునందుంచి ప్రక్షాళనమొనర్చి యాపూతజలములదెచ్చి తనపతికి త్రాగనిచ్చెను ఆ పాదోదకమాతని లోనికేగినతోడనే హృదయమాలిన్యములొలగ నాత డు శ్రీహరినిధ్యానింపమొదలిడెను కాంతిమయియు నిజపతికినుపచార ములజేయుచు శ్రీహరిని స్మరించుచుండెను.

పిమ్మట గొన్నిదివసములలోనే స్తంభుడు సుఖరోగపీడితుడై ప్రా ణములవిడచెను కాంతిమయి పతివియోగదుఃఖితయై భర్తకు దహనాది సంస్కారముల బంధువులచేఁజేయించి ప్రాయోపవేశమున బరమేశ్వ రుని ధ్యానించుచు జీవితమునుత్యజించి దివ్యలోకములకేగెను.

—♦ షష్ఠాధ్యాయము ♦—

పునర్జన్మము.

ప్రచేతసుఁడను మునీంద్రునకు శాంతియను సతియందుబదుగురు కొడుకులుపుట్టిరి వీరియందు గడగొట్టుబొట్టిపేరు కేశవుఁడు ఈతఁడు పూ ర్వజన్మమున గాంతిమయిభర్తయగుస్తంభుఁడే కేశవుఁడు పుట్టిననాటినుండి యు మిగతతోబుట్టువులవలె విద్యాభ్యాసపరుఁడుకాక దుష్టులతోగూడి పాడుపనులజేయుచుండెడివాడు తల్లియుసోదరులును ఈతని దుడుకుచేత లు ప్రచేతసునకు దెలియరాకుండజేయుచుండెడివారు క్రమక్రమముగా గేశవుఁడు పదియారేండ్లప్రాయమువాడై జారచోరులతోఁగలిసి విచ్చల విడిగా తిరుగదొడంగెను.

ఆసంగతి ప్రచేతసునకు దెలిపినతోడనే కేశవుని రాబిలిపించి బహు విధముల మందలించెను కాని కార్యములేకపోయెను అంతట బ్రచేతసుఁడు కుపితుఁడై కేశవుని వెంటనే యిల్లువిడచి వెడలిపొమ్మని యాజ్ఞాపించెను కేశవుఁడు ఆయాజ్ఞకు రోషియై వెంటనే యింటిని బాసి యొంటరిగా నడవులఁబడి గమ్యోద్దేశములేకయే యేగుచుండెను.

ఇటులుండ నాటవికులగు బిల్లజాతిచోరులు వానిదృఢశరీరమును జూచి వీఁడుమనకు మూటలమోయనక్కరకు వచ్చును అనివానిచేరదీసి పోషింపదొడంగిరి.

కేశవుఁడును వారితోఁగూడి తిరుగుచుఁ గొలఁదికాలములోనే విలు విద్యయందును కత్తిసామునందును నిరుపమానప్రావీణ్యమును గడించి సింహవ్యాఘ్రాది వనమృగముల నవలీలగా వేటలాడుచు గ్రమముగా దొంగవిద్దెయందుగూడ బెద్దయై తుదకాభిల్లపల్లికి వల్లభుఁడై కోయలచే దారులగొట్టించియు గోటలముట్టడించియుఁ బట్టణములదోఁపించియు ధనములనార్జించుచుఁ గొంతకాలమునకొక బోయచేడియను బెండ్లియాడి దాని యందుఁ బుత్రపుత్రికాది సంతానమునుబడసి యాసంతతికిఁ బరిణయములనొనర్చి కోడండ్రతోడను నల్లురతోడను మనుమల్త్రాఁడను మునిమనుమలతోడనుగూడి తనయిల్లు పాలవెల్లివలె ముచ్చటగొలుప బంధుపరివృతుఁడై యుల్లాసముగాఁ గాలము గడపుచుండెను.

అతఁడా బంధుబహుళమగు కుటుంబమునకు సౌఖ్యమును సమకూర్పధనములకై యొందరినోచంపించియు మఱెందరినో వికలాంగులనుగా జేయించియు స్త్రీశిశుబాలవృద్ధహత్యలకు వెనుదీయక పాపపుణ్యములన్నవన్నమాటయే యెఱుఁగక మత్తేభమువలె జిత్తమువచ్చినట్లావిపీన భూములదిరుగఁజొచ్చెను ఆయరణ్యదేశమున కేశవునిపేరు యమునిపేరుకంటెను భయంకరమై వినవచ్చుచుండెను.

ఇటులుండ సప్తమహర్షులు పుష్కరతీర్థమునకుఁబోవు నుద్దేశములో నాయడవినిబడి దారితప్పివచ్చుచుండ, కేశవుఁడు నిజపరివారముతో వేటకుఁబోయి యనేకమృగముల వధియించి వానిని దనసేవకులచే మోయించుకొని నిజావాసమునకుఁబోవుచు గంటికి మిరుమిట్లుగొలుపు

దేహకాంతులతోడను బంగరుతీగెలవలె నలరారుజడలతోడను బాలసూర్యులభాతి భాసిల్లుచు వచ్చుచున్న యామునులనవలోకించి "ఎటుబోయెదరాగుడట" అని మేఘముగర్జించునటులనరచెను వారాయరపునకు వింతచెంది నడకొండవలె తమవైపువచ్చుచున్న యాభీకరాకారునిజూచి యుటుఁగదలక నిలచిరి.

అంతవాడు వారిచెంతకేగి "మీయొద్దనున్న సొత్తులక్రిందఁబెట్టుడు కౌపీనధారులై దూరముగనిలువుడు. అట్లుచేయకున్న మీకపాలములు కపిత్థఫలములవలెఁ బగులఁగలవు" "సేవకులారా! చూచెదరేమి! వీరిచంకలనున్న సంచులలాగికొనుడు," అన వానిధైర్యమునకును, రూపమునకును, మునులెల్లరు సంతసించి, ఇట్లనుకొనిరి. "ఈమృగయుఁడెవ్వఁడో యంతర్లీనమైన దివ్యతేజములో వెలయుచున్నవాడు. ప్రస్తుతమీతఁడు క్రూరుడైయున్నను, మునుముందు లోకోపకారకార్యనిర్మాత కాఁగలడని తోచుచున్నయది. కావున వీనిమానసమున జ్ఞానభానూదయమును -గావించి, వీనిహృదయకంజము నావరించియున్న యజ్ఞానతుహిననివహముఁ దొలిగించి దానినివికసింపచేతము.

"పరోపకారసమర్థుఁడగు సోదరుఁడిట్లు వ్యర్థుఁడగుచుండ గనులారగాంచి యూరకపోరాదు" అనినిశ్చయించి ఇట్లు కేశవునితో సంభాషింపఁదొడంగిరి.

మునులు:—సోదరుడా! త్వరపడకుము మాసంచులనీకొసంగుదుము వేటనాడియాలసియున్నటుల కానవచ్చుచున్నవాడవు మేమును మార్గాయాసముచే బడలియున్నవారము కావున నీమఱ్ఱిచెట్టునీడను కొంచమువిశ్రమింతము. అననామునులమాటలచే భాషాణాతికఠినమగు వానిహృదయము కొంచెము మెత్తనాయెను. అందుచేనాతఁడు వారితో గలసి చెట్టునీడను గూర్చుండనంగీకరించెను. అంతవారందరును వటతరుఛాయనుపవిష్టులైరి పిమ్మటఁ గుంభసంభవుఁడిట్లా వ్యాధునిగూర్చి ప్రశ్నింపఁదొడగెను.

అగస్త్యుఁడు:—తమ్ముఁడా! నీవెవ్వఁడవు? మమ్మేగునిమిత్తమ

ద్దగించుచుంటివి ? నీకుఁగావలసినదేమి? అనవాఁడు తనపరిచారకులవైపు జూచెను. అంతవారిలోనుండి యొకకోయబంటు లేచియిట్లుపలికెను.

కోయ:—తెసదారులారా! ఈయయ్య మాకోయసామి ఈతని పేరు కేశవుఁడు ఈయడవినేలయంతయు నీయేలిక యేలుబడికి లోఁబడి నడిచే మాదొరయానలేక ఏమానిసియు నిందుఁజేరుటకుఁగాని యిందుండి వెడలుటకుఁగాని వలనుకాదు. మాయొడయుని డాకకుఁబుడమిదొరలెల్లరు గడగడవడఁకుచుందురు. కావున, మీరుబ్రతుకఁదలఁచితిరేని మాఱు మాటాడక, మీకడనున్న సొమ్ములనొసంగి మాసామికడ సెలవుఁజేకొని వెడలిపొండు లేకున్న మనఁజాలరు."

అత్రి:—సోదరులారా! మేము మీప్రభువునకు విధేయులము కాని విరోధులముకాము మాసొత్తుల మీదొరయధీనము చేతుము మీసామియానకానిదే యీకోనదాటి పోవువారముకాము కానితమ్ములారా మీప్రభువరుని దివ్యరూపమును జూచినతోడనే, మాకానందముదయించినదికాని, భయమొదవలేదు. కావునఁగొంచెము మీయేలికతో మాటలాడుభాగ్యము మాకుఁగలిగింపుఁడు అనఁ గేశవుఁడాయగస్త్యుని ప్రేమోక్తులకానందించి యిట్లుపలికెను.

కేశవుడు:—ముసలితపసులారా! మీరునాతోనేమి మాటలాడదలంచితిరో జాగుసేయక తెలుపుఁడు చాలప్రొద్దెక్కినది నారాకకై నా బంధువులు వేచియుందురు వారునేనేగినగాని నోటఁగూడిడరు.

కశ్యపుఁడు:—ఓకోయఱేడా! నీవదనారవిందసౌభాగ్యలక్షణము చూడ నీవు ముందుసకలలోకవంద్యుఁడవగుదువని తెలియవచ్చుచున్నయది మేము కాలత్రయవేదులమగు మహర్షులము తమ్ముఁడా! మా మాటలవిందువా నీవుతప్పక నరులకేకాక దేవతలకుఁగూడ పూజనీయుఁడవగుదువు. సందియములేదు. సోదరుఁడా! నీవుప్రాణులమడియఁజేసి గడించినపాపములు పర్వతాకారముగాఁ బెరుగుచున్నయవి. నీకంటికి నవికనుపడుటలేదుకాని మేము యోగులమగుటచే మాకంటికిస్పష్టముగా గన్పట్టుచున్నయవి. మిత్రుఁడా! నీవాపాపౌఘముల నెట్లుతరింపగలవా! యనిజాలికలుగుచున్నయది సోదరుఁడా! నీవాపాపసంచయమును బాపు

కొనకుంటివా దురంతరదుఃఖముల ననుభవింపవలసినవాడవగుదువు. కావున నీక్షేమమును గొంచెమోర్పుతో నాలోచించికొనుము ముసలితనము నిన్ను ముట్టడింపకమున్నె పున్నెము లెన్నుఁగనుఁగొనుము. వార్ధకము పైఁబడినచో నీబంధుసంఘమే కాదు నీకరచరణాద్యంగసంచయము కూడ నీకుస్వాధీనముకానేరదు కావున బొందెశిథిలముకాకముందే సంసారబంధమునుండి తప్పించుకొనఁ బ్రయత్నింపుము.

కేశవ:—పాపమా! అదినాకెప్పుడును కనపడలేదే! నాకంటబడినచో దానినినల్లినివలె నలిపివేసియుందును. క్రూరములగు సింహశార్దూలాది మృగములనేలపైఁబెట్టికొట్టునాకు పాపమొకలక్ష్యమా? కావున పిచ్చితపసులారా పాపమునకుభయపడకుడు.

భరద్వాజుఁడు:—తమ్ముఁడా! పాపము కంటికగపడునదికాదు. దానికిరూపములేదు కానిదానిశక్తి యనివార్యము దానిమూలముననే ప్రాణులకు జరామరణాది దుర్భరదుఃఖములేర్పడుచున్నవి.

కేశ:—రూపములేనిదానిని సంహరించుటయెట్లు? అందుకుసాధనమేమి?

విశ్వామిత్రుడు:—దానిని పుణ్యఖడ్గముచేఁ దునియలుగాఁజేయవచ్చు వైరాగ్యానలముచే దహింపవచ్చు ఇకవేఱెట్టిప్రయత్నముచేతను ఛేదింపశక్యముకాదు.

కేశ:—పుణ్యమా! ఏమి యీక్రొత్తమాటలు! ఆర్యా! దానిస్వరూపమెట్టిది?

గౌతముఁడు:—తమ్ముఁడా! అదియుఁజూపునకుఁగానరాదు దానికినాకారములేదు కాని దానిమూలముననే పాపసంచయము పటాపంచలగుచున్నయది దివ్యానందముసమకూరుచున్నయది.

కేశ:—ఈపాపపుణ్యములు ఎట్లుకలుగుచున్నవి?

వసిష్ఠుఁడు:—ప్రాణిహింసచేఁ బాపమును జీవసేవచేఁ బుణ్యమునుపుట్టుచున్నది.

కేశ:—అట్లైన నిత్యమును పరహింసచేయునాకుఁ బాపమే కాని పుణ్యము లేదన్నమాటయే?

అగ:—అగును అటులనే నీకిపుడు చేకూరియున్న దంతయుఁ బాపసంచయమే యావగింజయంత పుణ్యముకూడలేదు.

కేశ:—మునివరా! ఇదినిజమా? ఇకనాపాపమెట్లు తొలంగునో తెలుపుడు.

అగ:—సోదరుఁడా! ఒకబరువైన పెద్దరాతిబండను ముక్కలు ముక్కలుగాభాగించి పదుగురు పంచుకొనినచో దానిభారముతగ్గునటు లనే, నీచేఁబోషింపఁబడుచున్న నీయాప్తులు నీవొనర్చిన పాపసంఘము ను బంచుకొన్నచోఁ బాపము తేలికయగును.

కేశ:—అట్లగుచో నాబంధుగులెల్లరు నామాటకడుగుదాటు వారుకారు నాయందమితగౌరవములోనున్నవారు వారునేగోరినతోడనే నాపాపములఁబాల్గొందురు.

అగ:—పిచ్చివాఁడా! ఎంతపొరబడుచుంటివి నీవారు నీపాపము నెంతమాత్రముఁ బంచుకొనరారు పోయికనుగొనుము తెలియును బంధువులయందము

కేశ:—సంయమివరా! నాచుట్టములగుట్టు మీకేమి తెలియును. నేవారిని రాజకుమారులట్లు గారవించుచుంటిని కష్టమంతయునాది సుఖమంతయు వారిది అట్టిస్థితిలో వారునాచరితములఁ జేకొనుటలో సందేహ ముండఁబని లేదు.

అగ:—ఓ! కోయమన్నీడా! ఈబంధుతంత్రము నీకంతగాఁదెలియదు కావుననే యిట్లు పిచ్చినమ్మకములో నమాయకుఁడవై బాంధవమును ప్రశంసించుచుంటివి తమ్ముఁడా! చుట్టములజేరి పాపవిభాగమునుగూర్చి పలికి చూడుము అపుడుబంధుగుల పొందులోని పసందు తేటపడును. అనవాడు వెంటనే యింటికేగెను

— సప్తమాధ్యాయము —

బంధుసంభాషణము.

కేశవుఁడు తిన్నగానింటికేగి బంధువులనందరఁ జేరఁబిలిచి యిట్లు పలికెను.

" నాప్రియబాంధవులారా! మీరెల్లరు నాచేసుఖముగా బోషింపబడుచున్నవారలుకదా? ఇపుడు మీరునాకు గొంచెము సాయపడవలసిన సమయమువచ్చినది కావున నేనుగోరినట్లు మీరు చేతురా?

బంధు:—భిల్లసార్వభౌమా! మీయాజ్ఞలకు మేమెన్నడేని మారాడియుంటిమా? నేడేల యిట్లువింతగా మాట్లాడుచుంటిరి మేమునెరవేర్చవలసిన పనియేదియో తెలుపుడు చేతులుకట్టుకొని దానినెరవేర్తుము

కేశ:—ఏంకులారా! మిమ్ముబోషింప నేననేక ఘాతుకకృత్యములుజేసియుంటిని; అందుచే పాపముపెక్కుపెరిగి. పర్వతాకారముతో గన్పట్టుచున్నది దానిని మనమందరము సమభాగములుగా బంచికొనవలసియున్నది ఇదియే మీరుచేయవలసిన సాహాయ్యము.

బంధు:—ఓబోయతేడా! ఈలోకములో బాపముల బంచుకొను భాగస్వాములు ఇదివరకుబుట్టలేదు ముందుబుట్టబోరు చుట్టములు తమవారికి సాధ్యమగుసాయముచేతురు కాని, పరలోకభంజకమగు పాపమునుబంచుకొందురా? మఱియు నీవుగృహయజమానివగుటచే మమ్ముం బోషించుట నీకువిధి నీవు వ్యవసాయముచేసి పోషింతువో వర్తకము సాగించిరక్షింతువో లేక చౌర్యమొనర్చి పాలింతువో మాకుందెలియదు అయ్యా ఇదివరకు నీవుచేసినవ్యాపారము పాపజనకమగుచో ఇకముందు మంచిమార్గమున సంచరించి మముబోషింపుము మేము నిన్నుపాపములజేసిరక్షింపుమనికోరలేదే నీకును మాకును సంబంధముకలదు కాని నీదురితములతో మాకెట్టిసంబంధమునులేదు మఱియు పాపమెన్నడును పంచికొనదగిన పదార్థముకాదు అదికర్తనంటియుండునుగాని వానివిడచి ఇతరులకడకేగదు".

కేశవుండాబంధుభాషణములకని వీతచెంది తనపుత్రికల సంబోధించి ఇట్లుపలికెను. నందనలారా! మనయింటచేరి, మనధనములం గొల్లగొట్టి, తినుచున్న ఈకపటబంధువేషధారులు కార్యకాలమున సాయపడక, నన్నునిర్లక్ష్యము చేయుచున్నవారు కంటిరే! వీరిదుర్న్యాయము వీరెప్పటును మానకుంబరులే మనకుమేలుసేయనొల్లరు. కావున

మనకుమనమే సాయపడవలయును మీరునాకనుంగు కూతులగుటచే నాపాపములఁ బంచుకొనుడు.

పుత్రికలు:—తండ్రీ! నీవు మమ్ముఁ బరులకొసంగి, వేరుచేసితివి తండ్రిగడించిన సంపదలోఁ బుత్రికలకు దాయభాగములేదని ధర్మశాస్త్రములు వాకొనుచున్నవి. అందుచే జనకునిసొత్తంతయుఁ దనయులకు జెందునుగాని కూతులకుఁ జేరనేరదు. కావున నీధనసంచయమునకుఁ గానిఁ నీపాపసంఘమునకుఁగాని మేముదాయాదినులము కాజాలము ఆమాటలవిని కేశవుఁడు పుత్రులఁజూచి యిట్లుపలికెను.

కేశ:—ఆత్మజులారా! వింటిరా! మీసోదరీమణులయుక్తులఁ దనయులారా! నేఁబరలోకమునకేగినఁ దిలోదకములనొసంగి నాకుసాయపడవలసినవారలు మీరే కావున నందనులారా! నాపాపములలోఁ బాల్గొనినాకానందమును గలిగింపఁగోరుచున్నవాడను.

పుత్రులు:—ప్రియజనకా! లోకమునఁదండ్రులు సుతులనభివృద్ధిలోనికిఁదెచ్చుట ఫలాపేక్షచేఁగాదు. కేవలవాత్సల్యమే యందులకుఁ గారణము నీవు మమ్ముచక్కఁగఁ బోషించుచున్నమాట నిక్కువము. తండ్రియెన్నడును పుత్రులబాగునే కోరునుగాని, తాఁదెచ్చికొన్నపాడు రోగములను తాగడించిన పాపౌఘములనునందనులకంటగట్టగోరఁడుఅట్టి స్థితిలో నిహపరములఁ జెడఁగొట్టుపాపములు మాకేలయంటగట్టఁ గోరుచుంటివి? ఇదివఱకు నీవొక్కఁడవే మముఁబోషించుచుంటివి. అందువలనకలిగినపాపములనుగూడ నీవొక్కఁడవే భరింపవలయును. ఆమాటల విని యాబోయతేఁడు వెరగంది నిజకాంతను చేరఁబిలిచి, ఇట్లుప్రశ్నించెను.

కేశ:—ప్రేయసీ! చూచితివా! మనవారికృతఘ్నతల రారా జలవలె మనధనములతో సుఖముగాఁ బెరిగి తుదకు నేవీరిసాయమపేక్షింప నిట్లునిరాకరించుచున్నవారలో ఈమోసగాండ్రతో నాకుఁబని లేదనది. నీవునాకర్ధాంగివగుటచే మనమిరువురముకలసి పాపమును సమభాగముగా జేసికొందము పతికిసతియు, సతికిఁబతియుఁ,గతి కావున రమ్ము వీరివిడిచిపోదము.

భార్య:—నేస్తకాడా! జీవులు సుఖాసక్తిచేఁ గలయఁగోరుదురు దుఃఖభీతిచేఁ దొలఁగిపోదురు ఈయది సకలప్రాణిసాధారణధర్మము నీవు నన్ను సుఖానుభవమునకై చేరఁదీసితివి కాని, దుఃఖప్రాప్తికిఁ గాదు కదా? అటులనే నేనును సౌఖ్యానుభూతికై నిన్నాశ్రయించియుంటిని కాని దుఃఖసంపాదనమునకై కాదు. ఇదియే సంసారమునందలి కలయికలకుఁ బ్రధానకారణము కావున నీకిష్టమున్న నాకై కష్టపడుము లేకున్న నన్ను విడిచి వెడలిపొమ్ము అంతియకాని పాపవిభాగమునుగూర్చి పల్లెత్తుమాటపలుకకుము నిన్నెవ్వరో సంసారదూరులు మానుండి విడఁదీయఁ జూచుచున్నవారు వెర్రివేదాంతము తలకెక్కించుకొని మమ్ము విడచి వెడలిపోవకుము ఇకముందు ముసలితనము రానున్నది యొంటరిగా నుండఁజాలవు యోజించుకొనుము మనము కలిసిరాలేదు కలసిపోనేరము ఎడబాటులేని కలయిక యిలపైని లేదు, ఈరహస్యమును దెలిసికొనుము ఆకోయరాణిపలుకులు విన్నతోడనే ఆబోయయొకయునిగుండె ఝల్లుమన దీర్ఘముగా వేడియూర్పు విడచి యొక్కపరుగున మహర్షులయొద్దకువచ్చి వారిపాదములకడ సాష్టాంగముగాఁబడి యిట్లుపలికెను.

కోయ:—సర్వజ్ఞులారా! గురువరులారా! నాయూహయంతయు గల్లయైనది నేను నావాళ్ళు అనుకున్నవాళ్ళు వట్టికూళలు కాని హితులెంతమాత్రము కారు ఇకనాకోయరాణియో ఏమవాణి దయామయులారా ఇకమీరే ఈదీనసోదరునకు సంసారబంధమోచనము చేయదగు దేశికేంద్రులు నన్ను దాసునిగా జేకొని నేనొనర్చిన యపరాధముల క్షమియించి రక్షింపుడు మిమ్ముఁజూచినది మొదలు నాచిత్తమేదియో దుర్జ్ఞేయమగు పరితాపమొందుచున్నయది మున్నెన్నడు నాకిట్టిహృత్తాపము జనింపలేదు నాకు సుదివసములు రానున్నవని తోచుచున్నయది మీదర్శనమగుటచే నాపూర్వపుసొంపు తెలియవచ్చుచున్నయది మహర్షులారా మొదట నేనొక విప్రకుమారుడను. దుర్జనసహవాసదోషముచే నిట్లు క్రూరాతిక్రూరుఁడనుగా మారితిని. దివ్యజ్ఞానసంపన్నులగు మీకు నాజీవితమును గూర్చి తెలుపనగత్యములేదు నన్నీదురంతచింతాసాగరములోనుండి ఎట్లుకాపాడుదురో మీదేభారము అనికన్నీరు విడువఁదొడఁగెను.

అగ:——తమ్ముఁడా! నీవింతకుముందుజన్మమున సతీలలామయగు నీకులకాంతను అవమానించుటచే నీకికిరాతభావము సంప్రాప్తమాయె. నీకాసాధ్వి తుదికాలమున నొసంగిన పావనమగునిపాదోదకప్రభావముచేఁ గిరాతభావముపోయి వైరాగ్యోదయమయ్యెను. విచారింపకుము నిన్ను సన్మార్గమునకుఁ ద్రిప్పుటయే మాయభీష్టము సోదరుఁడా! నీచుట్టాలపస దెలిసెనా? నీచిత్తమిపుడు విరాగమునొందియుండెనా?

కేశ:——మునివరా! తెలిసె సంసారసారము. సూర్యోదయముచేఁ జీకటి ఎగిరిపోవునట్లుల మీసందర్శనముచే సంసారవ్యామోహాంధకారము తొలగిపోయినది ఇదిసత్యము.

అగ:——అట్లయిన నీవానదీజలములస్నానమాడి రమ్ము నీకు మంత్రోపదేశముచేతును. అనఁగేశవుఁడామహర్షివాక్యములవిని హర్షవికసితమానసుఁడై యచటియాపగలో నవగాహనమొనర్చి మునికడకు రాగా నాకుంభసంభవుఁడు వానిచెవిలో "మరా" యను మంత్రమును పదేశించి "ఓవిరాగీ! మేముతిరుగ వచ్చువఱకు శీతవాతాదులకు జంకక ఇటనిలచి తదేకదృష్టితో "మరామరా" యని యెడతెగకుండ స్మరింపవలయును. ఈమంత్రమే నిన్నుఁ బరమపావనునిగాఁ జేయును మేమిటనుండఁగనే జపప్రారంభముచేయుము అనిబోధింప దృఢసంకల్పుఁడగు నాకేశవుఁడు సప్తర్షులకుఁ బ్రదక్షిణనమస్కారములొనర్చి, యుత్తరాభిముఖుఁడై చేతులుజోడించి చిత్తమునేకాగ్రముగాజేసి మంత్రము జపించుచు నగమువలెఁజలనములేక యన్నపానాదులపేక్షింపక తపమాచరింపఁదొడంగెను. మహర్షులును వానినిశ్చలధ్యానసమాధికి సంతసించి తమయుపదేశము ఫలించునని విశ్వసించి వెడలిపోయిరి.

ఆహా! సజ్జనచిత్తవృత్తులెంతటి దయావిలసితములు ఉత్కృపాళులగు మహర్షులు క్రూరజనములఁజూచి జాలిచెందుదురేకాని వారినిందింప మొదలిడరు. సర్వప్రాణుల నాత్మసమముగా నాదరించి ప్రేమింతురే కాని ద్వేషింపరు. కావుననే కఠినహృదయుఁడగు కేశవునిఁ గృపానిధులగు మునులు క్రౌర్యరహితుఁడై సంసారవిరాగియై నిశ్చలసమాధినిష్ఠుఁడై

తపమాచరించునంతటి వానినిగామార్చిరి. సాధువులు లోకమునకుం జేయుమేలు సామ్రాట్టులు కూడ నెఱపం జాలరు."

"రజోగుణాంచితులగు రాజేంద్రులు తమ్మాశ్రయించువారలం గాపాడుదురు. తమకువ్యతిరేకముగా సంచరించువారల సంహరింపంగోరుదురు. సత్వగుణభాసితులగు సాధుచంద్రులన్ననో నిజపరభేదము లేక ప్రాణికోటినంతను బ్రేమించి బాగుసేయనభిలషింతురు."

—: అష్టమాధ్యాయము :—

శ్లోకోదయము.

కేశవుండట్లు కొన్ని వేలసంవత్సరములు ఏకాగ్రచిత్తవృత్తితో నన్యమెఱుగక "మరా, మరా," అని స్మరించుచుం దపమాచరించెను. సప్తర్షులును సకలతీర్థములసేవించి తిరుగంగేశవుండున్న యరణ్యమునకువచ్చి చూడనాతండు కానరాడాయె. అంతనాతాపసులు వానికై వెతకమొదలిడి యొకపుట్టకడకురాగా నావామలూరు రంధ్రములనుండి "మరా,మరా" అనునాదము వినరాదొడంగెను. వారానాదము నాకర్ణించి యావల్మీకముకడకేగి యందుంగేశవుండున్నాడని నిశ్చయించి కమండలువులతో నదీజలము దెచ్చి యాపుట్టపై గుమ్మరింపందొడంగిరి యాశీతలోదకధారలచేం బుట్టమట్టియంతయుంగరుగ నటనిశ్చలసమాధినిష్ఠుండైయున్న నిజశిష్యుని దేహము విద్యుత్కాంతివిలసితమగు జలదముమాడ్కి మెఱయుచుంగాననయ్యెను.

మునులాదివ్యరూపునింజూచి తాముచేసిన యుపదేశము ఫలించినందులకు సంతసించిరి. అపుడగస్త్యుండు కేశవుని చెవిలో "రామా, రామా, రామా," అనిబిగ్గరగాం జపించెను. ఆపావనరామనామనాదము శ్రోత్రకుహరమునం బడినతోడనే స్థాణువువలె నిశ్చలుండైయున్న యాకేశవుండు మెల్లగాంగన్నులువిప్పి, కట్టెదుటనిలచియున్న మునివరులంగనుంగొని "వందేగురుబ్రహ్మభ్యః" అని వారిపాదములకు సాష్టాంగముగా వందనమొనర్చెను. వారాతనిపైం గమండలూదకములంబ్రోక్షించి "మహాత్మా! పావనోదారచరితుండవైతివి. నీవువల్మీకములో నుండి వెలువడుటచే నిదిమొదలు నీకు వాల్మీకియని పేరుప్రసిద్ధముకాం

గలదు. తాపసో త్తమా! ముందు శ్రీహరి నీవుజపించిన రామనామ ములో లోకసంరక్షణార్థము నరుఁడుగాఁ బుట్టనున్నవాఁడు. మేమా పురుషో త్తముని పావననామమును దివ్యదృష్టిచేఁగనుఁగొని, నీకుఁ దారుమారుచేసి 'మరా'యని నీయప్పటిస్థితినిఁబట్టి యుపదేశించితిమి. అదియేసంతతావృత్తిచే 'రామ'యగును శ్రుతిసుఖదమగు పదముగా మారినది. భగవంతుఁడు నాదస్వరూపుఁడగుటచే నన్ని పేరులాతనినే బోధించును. అజ్ఞులు నాదరహస్యమును దెలియనివారగుటచే భగ వన్నామములఁగూర్చి తగవులాడుదురు. కాని తత్వమునుదెలిసికొనఁ జాలరు.

ఇకముందునీవు పూతాత్ముఁడవగుటయేకాక నిన్ను స్మరించిన వారినిఁగూడ, పుణ్యాత్ములనుగాఁ జేయుదువు. సోదరుడా! మేముపోయి వచ్చెదము సెలవొసంగుము" అన వాల్మీకి వారిమంత్రోపదేశముచేతను వారి పవిత్రపాదోదకసేచనముచేతను, దివ్యజ్ఞానసంపన్నుఁడై సకల విద్యలొక్కపెట్టున స్ఫురింప, విద్వద్వరేణ్యుఁడై యామునిసార్వభౌము లకుఁ బ్రదక్షిణనమస్కారములొనర్చి "గురుచంద్రులారా! మీకటా క్షముచే ధన్యజీవితుఁడ నైతిని దయాసాగరులారా! ఇకముందు నేనే కార్యము చేయ మొదలిడినను మీకువందన మొనర్చి కార్యారంభమునకు గడంగుదును. మిమ్ములవినా నాకు వేరు దైవతములు లేరు"

"ఆహా! కృపానిధులారా! నల్లరాతికంటెనుకఠినమగు నాహృద యమును నవనీతాతిమృదులముగా మార్చితిరే! కాటుకకొండవంటి నాపాపసమూహమును అనలలవము దూదిపింజనువలె దహించితిరే! మీరు నాకొనర్చిన యుపకృతికిఁ బ్రత్యుపకారము చేయ నాకుశక్య మగునా? మీరుసదా నన్నాశీర్వదించుచు నాక్షేమమును గనుగొను చుండవలయునని ప్రార్థించుచున్నవాఁడను."

మునులు:—తపోనిధీ! మనమిపుడభేదభావము కలవారమగుటచే నాత్మస్వరూపులముకాని, గురుశిష్యులముకాము కావునమమ్ముఁ బ్రా ర్థింపఁబనిలేదు. నీవును మానంటివాఁడవే మేము పోయివచ్చెదము. నీవు సచ్చిదానందస్వరూపుఁడవై జీవన్ముక్తుఁడవగుదువు" అనివెడలిపోయిరి.

వారు వెడలినపిదప నావాల్మీకి సురభికుసుమలసల్లతావితానసుందరమై స్వాదుఫలభరనమ్రతరుపాళీపరికలితమై కలకూజితరాజితశుకపికాదిద్విజ కులసంకులమై, సకలప్రాణిలోకసౌఖ్యావహమై, పావనగమనానదీజలప్రవాహభాసురమై యొప్పు నొకమనోహరవనప్రదేశమున నాశ్రమము నిర్మించుకొని, యందునివసించుచు బ్రేమకళాభాసితుండై, ద్వేషతిమిర దూరుండై అహింసయే మోక్షసాధనమనియు, పరహింసయే నిరయ హేతువనియుఁ, దపోవనము మూరుమోగునటుల బోధించుచుఁ గ్రమ ముగా లోకవిఖ్యాతనాముండై తేజరిల్లఁదొడంగెను.

ఆవాల్మీకిసంయమీంద్రుని లలితబోధలు మునికుమారుల నాక ర్షింపఁ గొంతకాలమున కామహర్షి తపోవనము వటుకదంబబంధురమై విలసిల్లెను. వాల్మీకి ముందావిద్యార్థిబృందములను శీలసంపన్నులను గాఁజేసి, పిమ్మటవిద్యల నుపదేశింపఁదొడంగెను "నిజమే కన్నున్నను వెలుతురులేనిచో నిరర్థకమగునట్లు నీతిలేకున్నచో విద్యయుండియు, వ్యర్థమగును. కావుననే యార్షవిద్యాభ్యాసము సదాచారముపై నాధా రపడియున్నయది. ఆర్షదేశికులు శీలములబరీక్షించి శిష్యులఁజేర్చుకొనెడి వారుకాని యనాచారుల నాచార్యులు చేరదీసెడివారుకారు.

ఆతపోవనమునఁగల యంతేవాసులలో భరద్వాజుఁడను శిష్యుఁ డు వాల్మీకిమునీంద్రునకుఁ బ్రియతముఁడుగానుండెను. ఇటులుండ నొక నాటిరేయి వాల్మీకికిఁగలలో శంఖచక్రవనమాలావిభూషితుఁడగు శ్రీమ న్నారాయణుఁడు ప్రత్యక్షమై యటుపిమ్మట నీలోత్పలదళశ్యామసుంద రుఁడగు నరుఁడుగామారి నిజకృపావలోకనముల నతనిపైఁబ్రసరింపఁజేసి "ఓయీ భక్తవరుఁడా! నేనీరూపముతో భూలోకమున నవతరించియున్న వాఁడను." అనిపలికి యంతర్ధానమాయెను. వెంటనేయాతఁడు మేల్కొని నలుగడలఁబరికించి ఎక్కడను ఆమోహనాకారుఁడు కానరాకుంటచే ఖిన్నుఁడై, స్వప్నావలోకితమగు నాస్మితసుందరరూపమును దనమానస మున నిడికొనిధ్యానించుచు నాదివ్యరూపుఁ డెచ్చటనున్నవాఁడోయని తలంచుచు, వ్యాకులచిత్తుఁడైయుండ, నారదమునీంద్రుఁడు పాపహర ములగు శ్రీహరిలీలల మనోహరముగ వీణపైవాయించుచుఁ దనదివ్యగా

నము చే చేతనాచేతనపదార్థములన్నియు నిశ్శబ్దములైనిలువ, దివము నుండి లిన్నగా వాల్మీకి తపోవనమునకువచ్చెను.

అంతనాపుట్టచూలి యావేల్పుజడదారికెదురేగి యర్ఘ్యపాద్యాదులచేనర్చించి, పర్ణశాలలోనికిఁగొనివచ్చి దర్భాసనాసీనునిగాఁజేసి వినయము మీఱ నిట్లుపలికెను. "ఓసతతతపస్స్వాధ్యాయనిరతా! నారదమునీంద్రా! బంధురాంధకారమునఁబడియున్నవానికి దీపముకానవచ్చినట్లు తెన్నుగానక చిత్తవ్యాకులముతోనున్న నాకు నీవుప్రత్యక్షమైతివి.

యతిపుంగవా! దివ్యమానవసృష్టియందు నీకుఁదెలియరాని దేదియు లేదు. అందుచే నాసందేహమును దీర్చిసంతోషమును సమకూర్పఁ బ్రార్థించుచున్నవాఁడను.

నారదుఁడు—మునివరా! నీసందేహమేమి?

వాల్మీకి:—చతురాననందనా! ప్రస్తుతమీభూలోకమున సకలకల్యాణగుణభాసురుఁడును, సమస్తజీవసమ్మోహనాకారుఁడును, ఆర్తజనావనదీక్షాసంపన్నుఁడును, అనన్యసామాన్యపరాక్రమభాసమానుఁడును నిత్యసత్యవ్రతపరాయణుఁడును, అగునరుఁడెవ్వఁడైనకలఁడా? అట్టిఘనోదారపావనచరితుఁడున్నచో నెచ్చటనున్నవాఁడు? మునీంద్రా! మొన్నరాత్రి నాకట్టిదివ్యపురుషుఁడు స్వప్నమున దర్శనమొసంగి తానీభూలోకమున నవతరించియుంటినని బోధించి యంతర్ధానమైనాఁడు నాటినుండియు ఆనరోత్తముఁడెచ్చటనున్నవాఁడోయని చింతించుచుంటిని కానియింతవఱకా పురుషవరేణ్యునిగూర్చి బోధింపఁదగిన దివ్యజ్ఞానసంపన్నులు కానరారైరి ఇపుడు నాసుకృతపరిపాకవశమున మీరునాకు దర్శనమొసంగితిరి. కావున నాయఁదుదయయుంచి నాకానరవరుని చరితమును వివరింపుము. అనిప్రార్థింపఁ ద్రిలోకసంచారియుఁ త్రికాలవేదియు నగు నాత్రిదశముని వాల్మీకిహృదయపరితాపమును గ్రహించియిట్లుపలికెను

నార:—వాల్మీకిమునీంద్రా! నీవుతెలిపిన కల్యాణగుణములన్నియు సామాన్యముగా మానవునియందుండుట దుర్లభము. కాని నీవడిగిన కళ్యాణగుణాకరుఁడగు నరుఁడిపుడు కోసలదేశమున నిక్ష్వాకువంశమునందు దశరథునకుపుత్త్రుఁడై రామాభిధానముతో రాజ్యమేలుచు

న్నవాఁడు అని యా శ్రీరాముని దివ్యచరితమును సంగ్రహముగా బోధించెను. వాల్మీకి యాచరితమునువిని సంతుష్టాంతరంగుఁడై నారదుని బహువిధముల స్తుతించెను. నారదుఁడును వాల్మీకిచేఁ బూజితుఁడై భగవన్నామసంకీర్తనము చేయుచు దివికేగెను.

వాల్మీకి నారదాభివర్ణితమైన శ్రీరామచరితమును వినుటచే హర్షోత్ఫుల్లహృదయుఁడై భరద్వాజుఁడు వల్కలకమండలులఁ బట్టికొని, వెంటరాగా మాధ్యందినసవనార్థము తమసానదీతీరమున కేగి, "భరద్వాజా! చూచితివా! ఈతమసావాహిని! ఎంతమనోహరముగాఁ గన్పట్టుచున్నదియో! చక్కెరవలెఁ జక్కఁగాఁ గన్పట్టుచున్న తెల్లనియిసుక రేవులతోడను, సజ్జనమానసములవలె వినిర్మలములై ప్రవహించుచున్న పావననీరపూరములతోడను, ప్రఫుల్లారవిందసౌరభసుందరములగు శీతవాతపోతములతోడను, హృదయంగమములగు జలవిహంగమకలకూజితములతోడను తీరలతానికుంజపుంజమనోహరములగు తరుసమూహములతోడనుగూడి చేతోహరమై ఈస్రోతోవహము తేజరిల్లుచున్నయది.

ఈతమసాతరంగిణీ నిర్మలజలముల స్నానమాచరించి మధ్యాహ్నకర్మకలాపమును ముగింతును. కావున బిడ్డా! నీచేతనున్న స్థాలినీపులినస్థలినుంచి స్నానవసనముల నొసఁగుము" అనభరద్వాజుఁడు అవగాహనచేలములఁ జేతికందిచ్చెను. అంతనాపుట్టపట్టి యాకట్టఁ గట్టికొని తీరమునుండి తీర్థములోనికిదిగుచుఁ జెవులకింపుగొలుపు విహగకూజితమునువిని, తలపైకెత్తి చూడ బార్శ్వస్థమగు నశ్వత్థవృక్షముపైఁ గవగూడియున్న గువ్వలజత కానవచ్చెను ఆపావురపుజంటను ఆజటాధారి చూచుచుండ జీవహింసయే జీవనాధారముగాఁగల దయావిహీనుఁడగు వేటకాఁడొకఁడు వాఁడికోలచే నాగువ్వలజతలోనుండి నొకపిట్టను నేలబడఁ గొట్టెను. అపుడు తన్నువీడి రక్తసిక్తమైనదేహముతో నేలపైఁబడి కొట్టుకొనుచున్న తనమొగపులుగుఁజూచి, కొమ్మపైనుండి కూడికకాని పాటునకు దీనముగాఁ గూయుచున్న యాగువ్వపెంటిని చూచినతోడనే దయామయుఁడగు నావల్మీకచూలి జాలిగొని కన్నులశోకవారిక్రమ్మ గోపమునుబట్టఁజాలక, యట్లన్యాయముగా సుఖపరవశమైయున్న క్రౌం

చమును జంపిన యాతూళనుజూచి తిట్టఁబోవ, వాల్మీకివదనమునుండి శ్లో॥ మానిషాదప్రతిష్ఠాంత్వమగమః శాశ్వతీస్సమాః। యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితం॥ అని యప్రయత్నముగా నొకయపూర్వగీర్వాణశ్లోకవాణి వెలువడెను. అట్లప్రయత్ననిర్గతమైన కరుణరసవాహిని వెలికివచ్చినతోడనే వాల్మీకి యానూత్నఛందస్సునకు వింతచెంది, చెంతనిలిచియున్న భారద్వాజునితో నిట్లుపలికెను.

వాల్మీ:—పుత్రా! భరద్వాజా! ఏమి! యీవిచిత్రఛందఃప్రసారము గతపతియై విలపించుచున్న క్రౌంచశకుంతినిఁజూచి శోకతప్తుడనై పలికినశాపోక్తి తంత్రీలయసమన్వితముగా గానముచేయఁదగు శ్లోకముగామారినది. నేనిట్లుపలుక నెట్టిప్రయత్నముచేయలేదే! మఱియు నేనెన్నడిట్టి హృద్యమగు పద్యమునువినియుండలేదే! ఆహా! భరద్వాజా! కంటివా? యీఛందస్సుయొక్క చందమును!

భర:—గురుసార్వభౌమా! నిజమే కేవలమామ్నాయఛందోమంత్రముల వినునాచెవులకీ యపూర్వశ్లోకము మనోహరముగా వినవచ్చినది. తపోనిధీ! మీహృదయకుహరాంతర్లీనమైన గానరూపిణియగు వాణి మీముఖారవిందమునుండి యిట్లీశ్లోకరూపమున వెలువడియుండును. కవిత్వమప్రయత్నముగా నావిర్భావమైనపుడే సహజసుందరశైలితోడను మనోహరభావసంపదతోడను గూడిశోభించును సహజకవితకున్నసొగసు కృత్రిమకవనమునకుండనేఱదు. అనిపలికి తిరుగ గురుపఠితశ్లోకమును స్వయముగాఁబఠించెను వాల్మీకిభరద్వాజుఁడొనర్చినపద్యగానమునువిని పరమానందభరితుఁడై తమసాజలములస్నానమాడి సంధ్యావందనాదులఁదీర్చి, కలశహస్తుఁడై శ్లోకమునుబఠించుచు భరద్వాజుఁడు తనవెంటరా నావామలూరుసముద్భవుఁడు అప్రయత్నముగాఁ సంప్రాప్తమైన నవీనపద్య భారతీసాక్షాత్కారమునకు మాటిమాటికి విస్మయమందుచు నిజాశ్రమమునుచేరెను

—♦ నవమాధ్యాయము బ్రహ్మసందర్శనము ♦—

అచటివటువులాశ్లోకము నొకరినుండియొకరువిని సంతోషముతో దానిఁగానముఁజేయుచుండఁబ్రాచేతసుఁడు విస్మయానందభరితుఁడైయా

శ్లోకవిర్భావమునకుఁ గారణమేమయియుండునా! యనియాలోచించు చుండ, సకలజగన్నిర్మాతయగు విధాతసత్యలోకమునుండి వాల్మీకిమహర్షి యాశ్రమమునకు మరాళవాహనముపై వచ్చెను ఆచతురాననునిఁజూచి వాల్మీకి బ్రహ్మనందమొంది ప్రత్యుద్ధానవందనములొనర్చి, కరపుటము లుసంఘటించి నిలువ నానలువ నలుమోములనుండి చిరునగవులుప్రస రింప వాల్మీకినవలోకించి యిట్లుపలికెను

బ్రహ:—మునివరా! నీవదనమునుజూడ నీవేదియో క్రొత్తవింతనుగని వెఱగందియున్నటుల తెలియవచ్చుచున్నయది నీవెఱగునకుఁ గారణమేమి?

వాల్మీ:—భారతీరమణా! నీకుఁదెలియనిదేదియుండును; అయిననువినుడు మనవిచేసెదను. కమలాసనా! నిన్ననేనొక విషాదకరమగు నిషాదకృత్యము నవలోకించి ఖిన్నుఁడనై క్రూరుఁడగునావ్యాధునిఁ దిట్టబోవ నప్రయత్నముగా నవీనఛందస్సొకటి నానోటినుండివెలువడినది. దానిందలంచి వింతచెందియుంటిని. అని యాశ్లోకమును పఠించెను.

శ్లో॥ మానిషాదప్రతిష్ఠాంత్వం మాగమశ్శాశ్వతీఃసమాః।
యత్క్రౌంచమిధునాదేకమవధీః కామమోహితం॥"

బ్రహ్మ:—కవివరా! నాప్రేరణముచే సరస్వతి నీవదనసరసిజమునుండి, ఈనవీనశ్లోకరూపముతో నావిర్భవించినది సందియములేదు. ఈశ్లోకరాజమున పైకినిషాదపరమగుశాపోక్తియు లోపలమానిషాదపరమగు మంగళోక్తియు నిగూఢముగానిమిడియున్నవి. వినుము మొదటి భావమును "ఓనిషాదుఁడా! కామమోహితమగు క్రౌంచమిధునమునుండి మగపిట్టను గొట్టిజంపితివికావున నీవచిరకాలములోనే నశింతువుగావుత." రెండవభావము "ఓరమారమణా! కుటిలస్వభావముగలరాక్షసమిధునమునుండి పురుషుని సంహరించితివి. (అనగా ఓసీతాసహచరా! రామా నీవు మండోదరీరావణలలోనుండి కుటిలాశయుడగు రావణుని గూలనేసితివి కావునశాశ్వతకీర్తినంది యీవసుంధరఁ జిరకాలముండువు కావుత!) అని యిట్లుచింతితముగాఁ చింతితార్థప్రదమగు మంగళార్థము గూడ నీపద్యమందువెలయుచున్నది. కావున నీవీశ్లోకరత్నములతోఁ

పావనమగు శ్రీరామచరితమును విరచించి యాదికవివై ప్రఖ్యాతినందుదువు. మున్ను నీకు రామకథను నాయాజ్ఞచే నారదుఁడు బోధించి యున్నవాఁడు. మఱియు నాయనుగ్రహముచే జానకీజాని చరితమంతయు నీకుఁ గరబదరసదృశమై కానవచ్చును. నీవు విరచించిన రామాయణకావ్యము భువమున నగసముద్రాదులును, దివమున సూర్యచంద్రాదులును, ఉన్నంతకాలము లోకానందసంధాయకమై తేజరిల్లఁగలదు. పాపహరమగు శ్రీరాముని పావననామ ముచ్చరింపఁబడునంతవఱకు నీవు నాలోకమున బ్రహ్మానందముగా నివసింపఁగలవు. మున్ను నీవొనర్చిన యఖండరామనామతపమునకు ఫలము శ్రీమద్రామాయణకావ్యమునకుఁ గర్తవగుటయే. నీవు కలలోఁగన్న నీరదసుందరాకారుఁడగు రాముఁడే ఈమహాకావ్యమునకు నాయకుఁడు. పూతచరితయగు సీతయే నాయిక. కావున మునివరా! కాలహరణ మొనర్పక వెంటనే కావ్యనిర్మాణమునకుఁ బూనికొనుము. అని యావిరించి వచించి, యంతర్ధానమాయెను.

సరసిజాసనుఁడేగినపిదప ముదితమానసుఁడగు నాప్రాచేతసుఁడు మొదటఁగలలో నీలనీరదశ్యాముఁడగు నరుఁడు ప్రత్యక్షమగుటను, ఆవెనుక నీరదమండలమునుండి నారదుఁడు తనకడకువచ్చుటను, పిమ్మటఁ గ్రౌంచీకరుణావలోకనజనితశోకము శ్లోకముగాఁ బరిణమించుటను ఆవెంటనే చతురాననసందర్శనమగుటను ఆపరమేష్ఠి తన్ను రామాయణ మొనర్ప నాజ్ఞాపించుటను దలంచి విస్మితుఁడై శిష్యులెల్లరు దానుచ్చరించిన శ్లోకము నుచ్చైస్స్వరముతో శ్రుతిసుఖముగా గాన మొనర్పుచుండ బులకితగాత్రుఁడై యారాత్రియంతయు శ్రీరామచరితమును హృదయమున బ్రత్యక్షముచేసికొని, యరుణోదయమునకు ముందుగానే స్నానసంధ్యాదివిధులు నెరవేర్చి దర్భాసనాసీనుఁడై సప్తర్షివందన మొనర్చి శ్రీహరిని ధ్యానించి శ్రీమద్రామాయణమును హృద్యములగు పద్యములతో విరచించెను.

«నవరసకిసలయదళవిలసితమై లలితపదసుమసముదయశోభితమై మంజులభావామోదమేదురమై సుమధురార్థఫలకదంబబంధురమై శ్లోకకోకిలకలరవనాదసుందరమై పాపతాపాతపవారకశీతలచ్ఛాయావృతమై పుణ్యసంపాదనానుకూలమూలవిరాజితమై గీర్వాణభాషాలవాలపరివే

ష్ఠితమై సకలాభీష్టసంపాదనానుకూలమై, వెలయురామాయణపారిజాతమహీరుహమును సృష్టించి వాల్మీకిమహర్షి శాశ్వతకీర్తి నిలఁబడెను. భారతదేశము సారస్వతవిషయమునను సర్వదేశాతిశాయియై చెన్నొందుటకీరామాయణకావ్యమే ముఖ్యకారణము ఈకావ్యసుధానిధి కరుణరసవర్ణనములచేఁ బాషాణములఁగూడఁ గరిగింపఁజేయును. నీతికథావివరణములచే నాయసమానసములనుగూడ రసవంతములనుగా నొనర్చును ప్రేమవైభవప్రకటనములచే కర్కశాశయులఁగూడ నొక్కముద్దగా జేయఁజాలును శౌర్యప్రతాపప్రచారములచేఁ దృణలవములనుగూడఁ దేజోవంతములనుగాఁ బరిణమింపజేయును క్రౌర్యవర్ణనములచేఁ గ్రావ్ణాదులనుగూడ సిగ్గుపడఁజేయును పెక్కులమానవసంఘమును మార్తాండమండలమువలెఁ దేజోవంతమునుగాఁ జేయసమర్థమైయున్నయది

కవులెల్లరిందలి కల్పనాచమత్కృతులను భావోన్నత్యములను, నవరసవిలాసములను ప్రకృతివర్ణనములను తమకావ్యముల నింపియున్నవారు జనులలో వర్షధారలఁదడవనివారును, పూర్వకవులలో రామాయణసారము నాస్వాదింపనివాఁడును లేఁడు చక్కనియుపమానములనిచ్చుటలో వాల్మీకియే యుపజ్ఞుఁడు "ఉపమా కాళిదాసస్య" అనులోకోక్తి ప్రాచేతసునకుఁ బిమ్మట అని తెలుపవలసియున్నది.

వాల్మీకి ఇట్లుమనోహరమగు నపూర్వకావ్యమునువిరచించి దీనిని హృద్యముగా గానమొనర్పఁదగినవారెవ్వరా! అనిపరిశీలింపసాగెను. ఇట్లు నిజకావ్యగానార్హులగు ధీశాలురకై నిరీక్షించుచుండ గానకళాకోవిదులును కింనరకంఠులునగు కుశలవులువచ్చి పాదములకువందన మొనర్చి వినయావనతవదనులైనిలువ వాల్మీకిమహర్షి హర్షనిర్భరహృదయుఁడై, ఆకవల నవలోకించి వీరలే రామాయణగానార్హులని నిశ్చయించి వారికి నిజకావ్యమునుబోధింపనెంచి అసీతానందనులచే స్నానమాడించి నవవల్కములఁగట్టించి తూర్పుముఖముగాఁ గూర్చుండఁబెట్టి మహర్షుల ధ్యానించి సాకల్యముగా రామాయణమునుబోధించెను.

అసమానమేధాసంపన్నులగు సీతానందనులు సీతాచరితసుందరమగు రామాయణమును కంఠపాఠమొనర్చి విపంచీనాదములతో నిజ

కంఠస్వరముల మేళగించి మహర్షులమ్రోల హృద్యముగా గానమొన ర్పఁదొడంగిరి.

ఆజగన్మోహనగానము కర్ణపుటములబడినతోడనే మునివరేణ్యు లెల్లరు సమాధులఁజాలించి, సభకూడి శ్రీరామకల్యాణగుణకీర్తనమును వీనులొగ్గివిన మొదలిడిరి కుశలవులును మహర్షులకానందమభివృద్ధియగు నటుల వీణవాయించుచు రామాయణమును బాడనారంభించిరి ఆపావన గానమునకు సంయమీంద్రులు వింతచెంది ఓహో! యేమియీగానమా ధుర్యము, ఆహా! యేమియీపద్యరచనాచాతుర్యము అయ్యారే! యేమి యీగాయకనైపుణ్యము ఔరా! ఈలలితకంఠస్వరులు స్వరూపసంప దచేతను వీణానినదమాధుర్యముచేతను నిజకోకిలకంఠస్వరములచేతను మానవమానసములనేకాక తిర్యగ్జంతుహృదయములఁగూడ మోహపర వశములనుగా జేయుచున్నవారలు అనిప్రశంసించుచు గానాంతమున మునులు వారలదీవించి ముద్దులిడి సంతోషముతో నొకముని కమండ లువును వేఱొకతాపసి వల్కలములను ఇకనొకజడదారి జన్నిదమును మఱియొకసంయమి కృష్ణాజినమును ఇకనొకఁడు కావిగట్టు మొలనూలును ఇట్లువారివారికింపగు వస్తువులనొసంగిగారవించిరి.

క్రమముగా నామైథిలీసుతులు వాల్మీకియాజ్ఞపైని ఆరామాయ ణమును జానపదసంఘముల, ముంగలను నాగరజనసమూహముల మ్రోలను స్త్రీసమాజములయెదుటను గానముసేయ మొదలిడిరి ఆకుశ లవులొకనాడుత్తరకోసలదేశరాజధానియగు సాకేతనగరమున రాజవీ థిని సీతాచరితమునుగానమొనర్చుచు దిరుగఁజొచ్చిరి. అపుడాహృద యావర్జకమగు జనకజాకుమారగానము చెవినిఁబడినతోడనే అయో ధ్యాపురజనులు నిజకృత్యములట్టెపరిత్యజించి స్త్రీబాలవృద్ధము గుం పులుగుంపులుగాఁజేరి యాగానమును వినఁదొడంగిరి.

భరతాగ్రజుఁడగు రాముఁడామనోహరసంగీతనాదమును రాజ మందిరములోనుండి యాకర్ణించి, లక్ష్మణునిబంపి, యాసోదరగాయకుల నిజసభామందిరములోనికిరప్పించి మణిమయకాంచనాసనములనొసంగి యాదరించి, బంధుమిత్రామాత్యాదులు పరివేష్టింపఁగొలువుదీర్చి సీలో

త్పలదళశ్యామసుందరులగు నాచిన్నియన్నదమ్ముల సోయగమునకు లోసంతసించి, నిజానుజులకు నాయములకూప సంపదనుజూపి యిట్లు పలికెను.

శ్రీరాముఁడు.—ప్రియసోదరులారా! సుందరాకారులగు నీకవలు తమకంఠస్వరముల వీణానాదములతోఁ జొనిపి పాడుచున్నయీమనోహర కావ్యగానము నామానసమును సంమోహింపఁజేయుచున్నది కావున ఈబాలురభాగుగా గానమొనర్ప నేర్పాటుచేయుఁడు. అనభరతుఁడు; మునిబాలకులారా ! మొదటినుండియు మీనేర్చినగేయమును గానమొనర్పుడు ఈకోసలసార్వభౌముఁడు మీపాటనుసావకాశముగా వినఁగుతూహలియై యున్నవాడు అనితెలుపఁ, గుశలవులు వీణలశ్రుతి చేసి శ్రోత్రానందజనకముగా రామాయణమును గానమొనర్పమొద లిడిరి. ఆగానమునువినుచున్న సభాసదులెల్లరు చిత్రార్పితరూపముల వలె నిశ్చలులై యాకర్ణింపఁదొడగిరి.

సభాస్తారులట్లగుటలో వింతయేమున్నది. ఇప్పటిదికాక యుగాంతరములజరిగినదైనను, కవిదివ్యజ్ఞానసంపన్నుఁడుకాక, యేకతిపయపద వేదియొ యగుసామాన్యుఁడైనను వాణిపావనగీర్వాణికాక, యేకోయ భాసయైనను, గాయకులుకింనరకంఠులుకాక యేమోటుపాటకాండ్రై నను, శ్రుతివీణకాక యేతోలుతిత్తియైనను గానస్థలిమహారాజమందిర ముకాక యేరచ్చపావిడియైనను, శ్రీరామకథ, వినునపుడు జనసమూహముల నానందపరవశములనుగాఁజేయుచుండ, ఆత్రేతాయుగమున శ్రీరామచంద్రసభామంటపమున వాల్మీకిమునిచే గ్రొత్తగావిరచింప బడి, విపంచీశ్రుతితోఁగూడి, కుశలురగు కుశలవులచేగానమొనర్పఁబడుచున్న రామచరితము సాకేతవాసుల నిశ్చేష్టులనుగాఁజేసియుండదా? అట్లుభరతునిచే నియుక్తులై కుశలవులిట్లు రామకథను బాడమొదలిడిరి

దశమాధ్యాయము.

—♦ కుశలవగానము ♦—

శ్రీమంతంబగు నార్యావర్తంబున మధురపావనజలపూరితము లయిన సరయూనదీప్రవాహములతోడను సర్వసస్యశోభితములైన

కేదారనివహారములతోడను, వివిధరుచ్య ఫలభాసుందరములయిన రమ్యోద్యానవనములతోడను సంపన్నజనపూర్ణగ్రామసముదాయముల తోడను, విరాజితమై ఉత్తరకోసలమను జనపదము త్తరదిశకలంకార ముగా వెలయుచున్నయది.

నిస్తులానందరంజితమగు నాదేశమునకు మనురాజేంద్రునిచే నిర్మితమై, పండ్రెండు యోజనములు పొడవును మూడుయోజనములు వెడల్పునుగలిగి అయోధ్యయను పట్టణము రాజధానియై తనరారుచున్న యది ఆపురవీధులన్నియు విశాలములై తిన్నగాఁగనుపట్టుచుండును. వానికిరుప్రక్కల మిన్నోరయు మేడలవరుసలు మూసముకోసి యచ్చు దీసినట్లుల యొక్కపోలికతోఁ గానవచ్చుచుండును. ఇరుకులేక విడివిడి గఁగట్టఁబడిన యాపణపంక్తులతోఁగూడి విపణిమార్గములు సకలవస్తు రత్నసంపూర్ణములై చూపుల నాకర్షించుచుండును అనగరరాజవీధి యతివిశాలమై వంకరలేక యాత్రాగతజనసంఘములతో నిండినదువ నశక్యమైయుండును. ఆరాజమార్గముపొడుగునఁ బరాగపటలము పైకెగురకుండ పన్నీటితోఁదడుపఁబడి, సుమమాలికాచ్ఛాదితమై తెల్లగాఁదారాపథమువలెఁ గనుపట్టుచుండును.

మఱియు నాపురమునవొకదిశను యజ్ఞశాలలనుండి వెలువడు ధూమమును, వేఱొకదిక్కున యంత్రాగారములనుండి వెలికివచ్చు పొగయు నేకమైఘనశ్రేణులతోఁగలయఁ బైకేగుచుండును. అనగర రాజమార్గవెలయు లలితకళామందిరముల సంపదలనవలోకించునపుడు చూపరులు తామే దేవేంద్రాది దివ్యభవనములలోనో యున్నయట్లుల భావింతురేకాని భువమునఁదిరుగుచున్నట్లుల దలంపరు.

ఆరాజధానియందుగల యద్భుతవిశేషమేమన నచ్చటి కలాశాలలయందుఁ జదువుకొనువిద్యార్థులకు నివసించు భోజన వేతనాది వ్యయములతో నిమిత్తములేదు. వానినన్నిటిఁ గోసలాధిపతియే కనిపెట్టుచుండును. ఆసాకేతనగరమున నిర్మితములైన నాటకసౌధముల కేగి వానియందుఁ గుశీలవులచేఁ బ్రదర్శింపఁబడు నిజదేశరూపకముల నీక్షించునపుడు సభ్యులు తామాగాథలు జరిగినసమయమున నాయా

పాత్రలతోఁగలసి యున్నట్టులనే తలంతురు కాని నాటకముల నవలోకించుచున్నట్టులఁ దెలియఁజాలరు. పరదేశములనుండి యయోధ్యాపట్టణమునకు వచ్చు యాత్రికులకు మర్యాదలతో సకలసౌకర్యముల సమకూర్చు ధర్మసాసాదములెన్నియో యానగరమునఁ గలవు. మఱియు నాపురమునఁ గాపురముండు ప్రతిగృహమేధియు నతిథుల దైవతముల వలె భక్తితోఁ బూజింపనెంచువాఁడె, ఆపుటభేదనమున వంటపూటి యిల్లు కంటికగుపడదు. ఎంత వెదకినను ఇతరపట్టణములయందువలె నా నిగమమునఁ గంచుకాగడాలువేసి వెతకినను వంచకుఁడు కానరాఁడు. సృష్టియందుఁగల పదార్థములన్నిఁటి నావీటఁ జూడవచ్చును కాని యసత్యము జాడమాత్రము కానరాదు. ఆపురనారీమణుల సౌభాగ్యసంపదలఁ దిలకించి సురకాంతలు స్వర్గమునువీడి సాకేతమునఁ గాపురముండ గోరుచుందురు. నిజమారయ నయోధ్యాపట్టణమును జూచినపిదప దేవరాజధానియగు నమరావతీపట్టణము నిర్మింపఁబడినదియో లేక సుపర్వపురమును జూచినపిమ్మటఁ సాకేతనగరము కట్టఁబడినదియో తెలియదు

ఇటుల సకలసంపదలతోఁ దులదూగు నాసాకేతనగరమున శౌర్యౌదార్యాది గుణకలితుఁడగు దశరథుఁడను నృపాలుఁడు ధర్మకంచుకధారియై న్యాయఖడ్గముచేఁబూని ప్రజలఁ బాలించుచుండెను. ఆరవివంశశేఖరుని పాలనమున మంత్రులుమొదలు సేవకులవఱకునుగల రాజోద్యోగులందఱు ప్రజాసేవాపరాయణులై నిజపాలకయశమునకై స్వప్రాణములఁగూడ సమర్పింపఁ జూచుచుందురు. ప్రజలన్ననో రాజశాసనముల కడుగుదాటక భయభక్తులతో సంచరించుచుందురు. ఇట్లు దశరథుఁడసమాన యశోవిరాజితుఁడై కోసలదేశమును చక్కఁగాఁ బాలించుచుండెను.

ఒకనాఁడా కోసలరాజమౌళి మృగయావినోదాభిలాషియై పరివారజనము వెంటరానడవికేగి ధనుర్బాణములఁ జేకొని మృగములసంహరించి శిబిరమునకు మరలివచ్చుచు నెదుటనొక యాఁడలేడికానరా దానిం గొట్ట వింటనలుగునుదొడిగి యాకురంగిపైకేగ నామృగి రెండవదండ

ధరునివలెఁ దనవైపువచ్చుచున్న దశరథునీక్షించి, పరువిడఁజాలక మనుష్యవాక్కులతో నిటులఁ బలుకఁదొడఁగెను.

నృపసార్వభౌమా! నన్ను మీనిశితబాణముచే హతమొనర్పకుడు కరుణించి వినుడు నానుడువుల దయామయా! నేను నిన్ననే ప్రసవించిన బాలెంతరాలను. ఆకలిబాధచే నీదివసమున నేబచ్చి గరికిపోచలఁ గొరికి తినవచ్చితిని. పాపము నాశిశువులాకటిబాధ కోర్వఁజాలక పాలకై నేనేగిన దిక్కునకుఁ జూపులఁబరపి, నారాక కెదురుచూచుచుండును అపసికూనలు లేతగడ్డిపరకలఁగూడఁ గొరకి నేరవుకదా! మీయట్టి కృపాళువులు జాలిగొని మృదులతృణలవకబళముల నోటికందించినను తిననెరుగవు. కావున, నేనేగి వానికిబాలిచ్చి యాకలితీర్చి మీసన్నిధికిఁ దిరుగవత్తును. అప్పుడుమీరునన్ను మీయిష్టానుసారము చేయవచ్చును నన్నువిడుచుట మీకంగీకారముకాదేని, మీకు కావలసినది మాంసము కనుక నాపొదుగుతక్క తక్కినదేహమునుండి యామిషమునంతను జేకొని, ననువిడువుడు నేఁబోయి యాలేకూనలకుఁ బాలనిచ్చి ప్రాణముల విడుతును.

రాజేంద్రా! సంతానముఁగన్నవారు నిజసంతతి సంరక్షణమున కెంత శ్రమచెందుదురో యెంతపరితపింతురో యాసంగతిని సంతానహీనులగుజీవులు తెలిసికొనఁజాలరు. దయానిధీ! బిడ్డలఁగన్నవారి దారులకును సంతతిలేనివారి త్రోవలకును బోలికయేకుదురదు, ఆరెంటికిని కరికరమునకును, దోమతొండమునకు నున్నంతభేదముండును. తనయులఁగన్నవారి మానసములు నవనీతకోమలములై యలరుచుండును. సుతులులేనివారి హృదయములు పాషాణాతికఠినములై దనరుచుండును. మహారాజా! ఈలోకమునఁగల చేతనజాలమంతయు సంతానతంతువులచే నంటఁగట్టఁబడియున్నది. అట్టిసంతతిపాశమేలేకున్న యెవరికివారేకాని యొకరికొకరు కానేరరు.

కావున భూపవరేణ్యా! నాపలుకులకుఁ గినియక నాపై దయయుంచి, నన్నుఁ బ్రస్తుతమువిడిచి, కళ్లార నాబాలకములఁ గాంచుభాగ్యము నాకు సమకూర్పుడు. అని కన్నీరుపిడుచుచు తనయెదుట నిలచి

యున్న యాలేడినిమాచుటచేఁ జాలియుఁ దాని మానవాలాపముల వినుటచే విస్మయమును నిజమానసమున నంకురింప దశరథుఁడా హరిణకాంతనుజూచి యిట్లుపలికెను.

దశరథుడు:—ఓకురంగీ! నీకభయమొసంగితిని నీవిట్లు మానుషభాషతో మాటలాడుట యెట్లు సంప్రాప్తమాయెఁ? నీవృత్తాంతమెయ్యది? అన నాయాడలేడి భయమువీడి, యిట్లు బదులుపలికెను.

లేడి:—రాజేంద్రా! వినుము నాకీనోదంతము వివరింతును. కృపాళూ! నేఁదొలిజన్మమున నుజ్జయినిని నివసించు తారయను వేశ్యను. నేనాజన్మమున స్తంభుఁడను విప్రకుమారుని మోసగించి, యాతనిసర్వస్వము నపహరించి, కష్టకాలమున నాద్విజోత్తముని నవమానించినందుకుఁ బిమ్మటిజన్మమునఁ గిరాతాంగననై పుట్టితిని.

ఆవిప్రనందనుఁడగు స్తంభుఁడును, రెండవజన్మమునఁ బ్రిచేతసునకుఁ గేశవనామమునఁ బుత్రుఁడుగాఁబుట్టి, నిజధర్మములవిడనాడి, క్రూరుఁడై కోయలలోఁగలసి, క్రమముగాఁ బ్రబలుఁడైనన్ను బెండ్లియాడెను నేనాతనివలన సంతానవతినై, యాతనిచే సౌఖ్యముగాఁ బోషింపఁబడుచుంటిని ఇటులుండ నామగఁడొకనాడు నన్నుఁబిలిచి, పాపవిభాగమున నాసాహాయ్యమునుగోర నేను హానిమాటలవినక, నిరాకరించితిని. అందుచే నా కేశవుఁడు సంసారవిరక్తుఁడై యెచ్చటికో వెడలిపోయెను.

సంపాదకుఁడును, సాహసికుఁడునునగు నాపతి యేగినపిదప నా కోడండ్రును, నానందనులును, నన్నీసడింపఁ దొడంగిరి. అంత నేను వారు నాపైఁజూపు ననాదరముచేఁ బశ్చాత్తప్తనై, పతి యవమానమునకు ఫలము సంప్రాప్తమైనదని తలంచుచు, నాభర్తను వెదకుచు నరణ్యమునఁ గేశవా! కేశవా! యని పిలుచుచుఁ దిరుగ మొదలిడితిని. కాని యావిప్రోత్తముఁడు ఎక్కడను గానరాకుండెను. అటులఁదిరుగుచు నే నొకనాడు వేసవికాలపు వడగాడ్పునకుఁ దాళఁజాలక, యొకచెట్టునీడను జేరి యటనిలచితిని. అపుడా మధ్యాహ్నతీవ్రాతప సమయమున నెల్లని గిరిరేణుమధ్యమునఁబడి భగ్గుమని కాల్లుమండుచుండ నందుండి కదుల నేరక దుఃఖపడుచున్న శంఖుఁడను ముసలితపసి దూరముననుండి నన్నుఁ

జూచి "ఓయమ్మా! నన్నీ మండుటిసుకలోనుండి యాచెట్టునీడకు జేర్పుము. నీకమితపుణ్యము చేకూరఁగలదు" అనియడిచెను.

నేనావృద్ధతాపసుని సంతాపమునుజూచి, యాతని యార్తవాదమునకు జాలిచెంది, నేఁదొడిగియున్న పాతచెప్పులఁ జేతఁబట్టికొని యాయాతపతప్తరక్తసైకతదేశమున నిలచియున్న మునికిముందుఁ బడునట్లు వడిగా విసరితిని. దైవానుకూల్యముచే నాపాదుకలు మునిచేతికందునట్లు పడినవి.

ఆసంయమివాండ్రు్రేఁడా యుపానహములఁ దొడిగికొని, యాసికతాస్థలినుండి నాయొద్దకువచ్చి తోడనే మూర్ఛనొంది నేలఁబడిపోయెను అంత నేనాతనిచేతనున్న సాఱబుట్టనుజేకొని, తమసానదీజలములఁ గొని తెచ్చి, యామునిపైజల్లి లేజిరుజొంపములఁజేఁబూని విసరితిని ఆశైత్యోపచారముచే శంఖుఁడు కొంతయలసటతీర నావైపు చూచి మెల్లగా నిట్లుపలికెను.

శంఖుఁడు:—తల్లీ! నీవు నాప్రాణములఁ గాపాడితివి. నీవు నాకాసమయమునఁ బాదుకాదానమొసంగకున్న నేనాకాలినయిసుకలోఁబడి, మాడి మడిసియుండును. అమ్మా! చూడుము. నాయరికాళ్ళెట్లు బొబ్బలెక్కియున్నవియో యని, పాపమాముదుసలి తనపాదతలములఁ జూపెను. నేను మఱ్ఱిపండ్లవంటి యాయెఱ్ఱని వ్రణములఁజూచి, భీతిల్లి వెంటనే యింగుదీతైలమునుదీసి, యాపుండ్లకుఁబట్టించితిని నాసేవకా మునివరుఁడు సంతసించి తిరుగ నిట్లుపలికెను.

శంఖుఁడు:—తల్లిరో! నాపైనీకింత దయవచ్చుటకుఁ గారణమేమి ఓయవ్వా! నీవిట్లొంటరిగా నుంటకు హేతువేమి? నీవృత్తాంతమేమి? అని ప్రశ్నింప నేను నాయప్పటిచరితమును వివరించితిని నాగాథనువిని, ఆ యోగిపుంగవుఁడు యోగదృష్టిచే నాభూతభావిజన్మముల గాథలఁ దెలిసికొని నాకిట్లు బోధించెను.

శంఖుడు:—సోదరీ! నీవు పూర్వజన్మమున వేశ్యగానుండి పావనచరితుఁడగు భూసురకుమారు నవమానించుటచే నీజన్మమునఁ గోయపూబోడివై పుట్టి నీభర్తను నిర్లక్ష్యముచేయుటచే, ముందుజన్మమున

నాఁడు లేడివై పుట్టితివి. ఇపుడు వృద్ధతాపసుఁడనగు నాకుఁ జెప్పులనొసఁగి, కాపాడుటచే మృగీజన్మమునకుఁ బిమ్మట శబరనారీమణివై పుట్టి, బ్రహ్మచారిణివై మునులసేవించి, యాజీవితాంతమున నరరూపుఁడగు శ్రీహరిని దర్శించి, యాపురుషోత్తముని బూజించి, పునరావృత్తిరహితమగు మోక్షమునందఁగలవు ఈజన్మమున నీకునాథుఁడైన కేశవుఁడు లోకవంద్యుఁడగు మహర్షిపుంగవుఁడు కాఁబోవుచున్నవాఁడు నీవాతనిఁజూడఁజాలవు కావున నీవీదినముమొదలు దయాశౌచాదులలోఁగూడి, కామక్రోధాదులవీడి, శ్రీహరినిధ్యానించుచు దేహయాత్రనుముగింపుము. నాకృపచే నీకు రాఁబోవు లేడిపుట్టువునందుఁ బూర్వజన్మస్మృతియు, మానుషవాక్కును జేకూరఁగలవు. అనిబోధించి తమసాజలములస్నానమాడి వెడలిపోయెను. ఆపిమ్మట నేనామహర్షి బోధించినరీతిని నాజాతిసహజమగు జీవహింసాదులవిడనాడి శ్రీకాంతుని స్మరించుచుఁ గిరాతీదేహమునుజాలించి ఈహరిణీరూపములోఁబుట్టితిని. ఆయతివరుని కటాక్షముచే నాకీ మానవవాణియు, గతజన్మస్మృతియు, సమకూరినవి మహారాజా! ఇయ్యదినాజన్మపరంపరావృత్తాంతము అని తెలిపెను.

దశరథుఁడా లేడిమృదువులవిని, తానొనర్చుచున్న జీవహింసకు వగచి, సంతానమునుగూర్చి యాహరిణిపలికిన మనోహరోక్తులచే మనసుకరఁగఁ దనకంతవఱకు సంతతిలేమిస్ఫురణమునకురాఁగాఖిన్నుఁడై యాకురంగినివిడచి వ్యాకులచిత్తుఁడై వెంటనే మృగయావిముఖుఁడై యయోధ్యకేతెంచి, ప్రబలమగు సంతతిచింతచే నన్నపానాదులఁజేకొనక కృశింపఁదొడంగెను.

—: ఏకాదశాధ్యాయము. యాగప్రయత్నము :—

ఇట్లులుండ సుమంత్రుఁడొకనాఁడు దశరథమహారాజును సందర్శింపఁగోరి, యారాజేంద్రునిప్రాసాదమునకేగి, చిక్కిపక్కపైఁ బరుండియున్న దశరథునిఁజూచి, చనువుగలవాఁడగుటచే నిట్లుప్రశ్నించెను. “కోసలరాజేంద్రా! భూలోకమున నిస్సపత్నుఁడవై, నాకలోకమున సురేంద్రాభయప్రదాతవై వెలయుచున్నవాఁడవు నీప్రతిల్లన్నను నిత్య

మంగళములతోడను పచ్చనితోరణములతోడనుగూడి, సంతోషసాగరమున నోలలాడుచున్నవారలు. సకలసుగుణసంపన్నులును, అసమానపాతివ్రత్యకలాకలితలునగు ముప్పురు రాణులు సహధర్మచారిణులై సేవించుచుండ సకలక్రతువులొనర్చి, దీనులపాలిటి చింతామణివని ప్రసిద్ధిగాంచియుంటివి. ఇంకనీకోశములనున్న ధనసంపద, కుబేరునినవనిధులయందుంగూడ నున్నదియో లేదో. ఇట్లుసకలైశ్వర్యములతోడను సమస్తానందములతోడనుగూడి వెలయుచుండియు నిట్లుకృశించియుండుటకు. గారణమేదియో తెలియవచ్చుటలేదు. సామాన్యముగా నృపాలురంగృశింపంజేయు వ్యసనములు నీకు స్వప్నమునందుంగూడం గలుగనేరవుకదా! ఇంకనీకార్శ్యమునకుం గారణమేమి? రాజేంద్రా! ఈకోసలప్రజలు నీదర్శనము లేకుండుటచే బెంగటిల్లుచున్నవారు విధేయులమగు మేమెల్లరముమీయాజ్ఞలనెరప సంసిద్ధులమైయుండ మీరిట్లుమీయభిమతమేదియో మాకుందెలుపక పోవుట ధర్మముకాదు.

దశరథుండు:—మిత్రుండా! సుమంత్రుండా! సంతతిలేనినాడన్ని సంపదలున్ననువ్యర్థములే. వానివలననావంతయు సంతోషముకలుగనేరదు. ప్రియసఖుండా! నాకుసంతానముకలుగుభాగ్యములేదు. అందుకనువగు వయసేగి చాలకాలమాయెను. ఇంకనాకుంబుత్రులుకలుగుటయెట్లు? ఈసూర్యవంశమభివృద్ధిచెందుటయెట్లు? నామానసమును సంతతిలేదనెడి సంతాపము, బాధించుచుండుటచే నిట్లన్నపానాదులురుచింపక సన్నగిలుచుంటిని. అంతియకాని నీకుందెలుపరానిమరెట్టివ్యసనమును నామానసము నాక్రమించియుండలేదు.

సుమంత్రుఁడు—కోసలరాజమౌళీ! మీరుసంతతికై యింతచింతింపంబనిలేదు మీకచిరకాలములో లోకకల్యాణముల సమకూర్పసమర్థులును, సౌందర్యజితకందర్పులును, సౌభ్రాత్రకళాకలితులును సకలలోకవిఖ్యాతకీర్తులునగు నలుగురు నందనులు కలుగంగలరు ఇందుకుసందియములేదు. కావునరాజేంద్రా సంతాపమువీడిసంతోషమును బొందుము

దశరథుఁడు—పిచ్చివాడా! మేఘములులేనిమింటనుండి ఘననీరధారాసంపాతముకలుగునా? పుణ్యహీనులయింటనుండి నందనసంపద

సంభవమగునా? సహృదయులాప్తులఁ దమప్రియవచనములచే సంతాప విరహితులనుగా జేయఁజూతురు ఇదిసన్నైత్రీలక్షణము.

సుమంత్రుఁడు—దశరథసార్వభౌమా! సూర్యవంశ్యపాలితులిచ్ఛ కములాడి ప్రభువులమెప్పులఁ బడయఁగోరువారుకారు కోసలరాజ్య మున నచేతనములుగూడ "సత్యంవద,ధర్మంచర" అనిబోధించునుకాని బొంకనేరవు ఇయ్యది ఇనకులరాజ్యవైభవచిహ్నము రాజేంద్రా! వినుడు నేఁదెలుపుసత్యమును.

దశరథుఁడు—అప్తుఁడా! శ్రుతిసుఖదమగు నాసువార్తామృతము నాపీనులనింపి నాహృదయతాపమును జల్లార్పుము.

సుమంత్రుఁడు—రాజేంద్రా! వినుఁడు మున్నొకతఱి సనత్కు మారుఁడు మహర్షులతోఁబ్రసంగించుచు మీకు ఋష్యశృంగుని యను గ్రహముచే నలుగురు లోకోత్తరులగు సుతులుదయింతురని తెలిపియు న్నాఁడు నేనాసమయముననటనుండుటచే నాసువార్తనువింటిని కావున మీకులగురువులగు వసిష్ఠమునీంద్రులతో నాలోచించి, విభండకసుతుని దోడ్కొనివచ్చి'పుత్రకామేష్టిగొనర్చి సంతతిసంపద నందగోరుచున్నవాఁ డను.

దశరథుఁడాశ్రుతిసుఖదములగు సుమంత్రవచనములనాలించి, వెంటనేవసిష్ఠుని రాఁబిలిపించి యిట్లుప్రార్థింపఁ దొడంగెను.

దశరథుఁడు:—గురుచంద్రా! వసిష్ఠమునీంద్రా! సంతతికై సం తాపమందుచున్న నాకీలోకమంతయు శూన్యముగాఁ గానవచ్చుచున్న యది జాగ్రత్స్వప్నసుషుప్తి సమయములందంతటను పుత్రముఖావలో కనకాంక్షయే కాని వేఱొండుకోరిక కలుగకున్నయది కావున సర్వసమ ర్థులగుమీరలు నాకుఁ బుత్రప్రాప్తి యెటులకలుగునో యోజింపుడు. లేకున్న నేఁబ్రజాహీనుఁడనై కోసలప్రజలఁ బాలింపఁజాలను గురూ త్తమా! ఈసుమంత్రుఁడు విభండకనందనుని సాహాయ్యముచే నాకు నలుగురునందను లుదయింతురని యొకయితిహాసమును దెలిపియున్న వాఁడు, మీరు యోగదృష్టిచే నదియెంతవఱకు నిజమోకనుఁగొనుడు.

వసిష్ఠుఁడు:—దశరథభూపాలచంద్రా! చింతిల్లకుము. నేనంతయుఁ

తెలిసికొంటిని. మానవమనోరథములీడేరుటకు భగవదనుగ్రహము కూడ తోడ్పడవలయును. ఆదివ్యసాహాయ్యము లేనిచో మానవప్రయత్నము లూషరక్షేత్రప్రక్షిప్త బీజములవలె వ్యర్థములగును గాని ఫలింపనేరవు. కావున నీవు భగవత్ప్రీతికై విధివిధానానుసారము అశ్వమేధయాగమును భక్తిశ్రద్ధలతో నాచరింపుము. ఆయాగాంతమున నీకుఁ జింతితార్థసిద్ధి చేకూరఁగలదు. ఈసుమంత్రుఁడు తెలిపినది సత్యము. కావున నీవంగదేశమునకేగి, వినయప్రపత్తులతో విభాండకసుతునిఁ దోడ్కొనిరమ్ము. యాగసంభారముల సమకూర్ప మంత్రుల నాజ్ఞాపింపుము

దశరథుఁడు:—మునీంద్రా! నన్నునిమిత్తమాత్రునిఁగా నిలువఁబెట్టి యెల్లొనర్చిన నీక్రతువు నిర్విఘ్నముగాను, నిరుపమానముగాను, నెఱవేఱును. యాభారమంతయు మీరే వహింపవలయును. సుమంత్రాదిసచివులెల్లరు మీయాజ్ఞలకుబద్ధులై యుందురు. నేనిపుడే యంగరాజధానియగు చంపావతీనగరమునకేగి, ఋష్యశృంగమునీంద్రుని శాంతాసహితముగాఁ గొనివత్తును.

వసిష్ఠుఁడు:—రాజేంద్రా! నీవినయమర్యాదలకు సంతసించితిని. అధ్వరకార్యములకనాహూతుఁడైనను నేగవలయునని, శాస్త్రము తెలుపుచున్నది. అట్టిచోనిట్లు నీచేప్రార్థితుఁడనైన నాకుఁగ్రతుకార్యముల సాహాయ్యపడుట విధియైయున్నది. కావున నీవుఋష్యశృంగునిఁ దోడ్కొనివచ్చినతోడనే, నాకుఁగబురంపుము. నేఁదిరుగవత్తును. నీకుసుపుత్రావాప్తియగుఁగాక! అనివెడలిపోయెను.

దశరథుఁడు వెంటనేయంగదేశమునకేగి, ఋష్యశృంగుని భార్యాసహితముగా సమాదృతుఁజేసికొనివచ్చి పూజించి, నిజమందిరమునవసింపఁజేసి యామహర్షి కడ సెలవుగైకొని వసిష్ఠునియొద్దకేగి, శాంతాపతి రాక నెఱింగింప, నాయరుంధతీకాంతుఁడు దశరథునితో సాకేతమునకు వచ్చి సుమంత్రునిఁబిలిపించి యిట్లుపలికెను.

వసిష్ఠుఁడు:—మంత్రిపుంగవా! మనకోసలసార్వభౌముఁడొనర్చు నశ్వమేధమునకు భూవలయమునఁగల చక్రవర్తులనందఱిని గౌరవపురస్సరముగాఁ బిలిపింపుము. నీవుస్వయముగా మిథిలాధిపతియగు జనక

రాజేంద్రుని నాహ్వానింపుము. ముందా రాజచంద్రునితో సీతయజనంద నునకు బంధుసంబంధమేర్పడనున్నయది అని తెలుప సుమంత్రుఁడావసి ష్ఠశాసనమును శిరమునదాల్చి వెడలిపోయెను. వశిష్ఠుఁడు సాయంసం ధ్యావందనాకాలమై దశరథునివీడి, సరయూనదీతీరమునకేగెను. దశ రథుఁడును ఈసువార్తను నిజకాంతలకుఁదెలుప నంతఃపురమునకుఁ జనెను.

ఇట్టులుండ గ్రీష్మతాపముచేఁ బీడితులగు పాంథులు ఛాయామ హీరుహమూలము నాశ్రయించునట్లు రావణప్రతాపానలముచేఁ బరిత పించుచున్న దేవతలు క్షీరోదధితీరమునచేరి వినమ్రమౌళులై కరపుట ములసంఘటించి ఇట్లుప్రార్థింపఁదొడంగిరి.

దేవతలు:—ఓక్షీరసాగరశయనా! నీరజనయనా! అవాఙ్మానస గోచరమగు నీమహిమమును మేమెట్లు తెలిసికొనఁగలము. నీవుభక్త వత్సలుఁడవగుటచేఁ దివ్యమూర్తిరూపము లఁదాల్చి, సృష్టిస్థితిలయశక్తుల తోఁగూడి ప్రత్యక్షమగుచుందువు. లేకున్న నిన్ను ధ్యానించుటయెట్లు? సగుణములగు పాంచభౌతికపదార్థములను మాత్రమే తెలిసికొనసమ ర్థములగు నింద్రియములు నిర్గుణుఁడవును నిరూపుఁడవును నగునిన్నెట్లు గ్రహింపఁగలవు?

ఓకరుణాసాగరా! నీవుకర్తవగుటకుఁగారణము నిజభక్తత్రాణా పేక్షయే అంతియకాని నిరీహుఁడవగునీకుఁగావలసినదేదియున్నది ? సుధామయునిచంద్రికకు శైత్యముగుణమైనటుల, దయామయుఁడవగు నీకృపకు దీనావనములక్షణము. లోకమునఁ గలసమస్తమతములును నిన్నుఁజేరి యానందించుటకు వేఱువేఱుమార్గములఁ జూపుచున్నయవి. యాత్రోవలన్నియు వివిధమార్గములనేగు నదీప్రవాహములు సాగర మునఁగలియునట్లు నీయందేలయమగుచున్నయవి. విరాగులగుయో గులు సంతతాభ్యాసనిరుద్ధవృత్తికల మానసములతోనానందస్వరూపుఁ డవై హృత్పుండరీకకర్ణికాంతరమున వెలుగందునిన్ను గాంచుచున్న వారు. సరాగులగుసంసారులు నీయవతారరూపముల కాలయముల నిర్మించి, నీప్రతిమల గంధపుష్పాదులచే నర్చించుచున్నవారు ఇవెవ్వ

యు నెరపఁజాలని పామరజనులు నీపావననామముల స్మరించుచున్న వారు. నీవు వారివారి యోగ్యతకుఁ దగినరీతిని వివేకసంపదల నొసంగి, కాపాడుచున్న వాఁడవు.

ఓ జగద్రక్షకా! మేమాపన్నులమై నీపాదారవిందములకు మ్రొక్కులిడి మాయాపదలఁ బాపికొనవచ్చితిమి. కావున నో కృపాసాగరా! తెమ్ము శేషతల్పమునుండి రమ్ము మముఁ బాలింప ఆలింపుమీ నిలింపుల మొఱల ఓ చక్రాయుధా! రావణకుంభకర్ణాది దైత్యవీరులు మహాబల గర్వితులై, దయాదాక్షిణ్యములఁ బాటింపక, విచ్చలవిడిగా సంచరించుచు జీవకోటుల హింసించుచున్న వారు. వారి నరికట్టువారు చూపట్టరు. వారికి లోఁబడనివారు కానరారు.

ఓ పురుషోత్తమా! నీచుఁడగు రావణుఁడు సజ్జనుల సంహరించుచు సతీమతల్లులఁ జెఱఁగొనుచు, మునివరుల బాధించుచు, ముల్లోకముల నొక్కరీతిని వేధించుచున్న వాఁడు.

ఆ నిశాచరుఁడు మమ్ముఁ గింకరులనుగాఁ జేసికొని మా చే సేవలనంది కొనుచున్న వాఁడు. మా కాంతలఁ గొంపోయి వారిచే దనయింట నూడిగములఁ జేయించుచున్నాఁడు. ఇట్లు స్త్రీపురుషాదులమందరము నాత్మగౌరవముల విడనాడి, వానికడ దాస్యములఁ జేయుచున్నను ఆ యవ్యవస్థితచిత్తుఁడు మదిరామాంసాదుల మెక్కి మత్తెక్కి మమ్ము బాధించుచున్న వాఁడు మా యవస్థలిట్లున్నయవి

ఇదివఱకు సురసార్వభౌముఁడై సౌఖ్యమే కాని కష్టమన్న నెట్టిదియో కలనైనఁ గాంచియెఱుంగని త్రిదివచక్రవర్తియగు నీయుపేంద్రాగ్రజుఁడు చెందుచున్న యవమానపరంపరలకు దరిలేదు. వియల్లోకనందనోద్యానావని రావణునకు పానకేళీవిలాసనిలయమైనది. తఱచు వాడటకువచ్చి చేయునభాగ్యచేష్టలఁ దలంపసిగ్గగుచున్నది. దివ్యలోకవాసులగతియే యిట్లుండ భూలోకనివాసుల మాట చెప్పనేల? పరాత్పరా! పలుబాసలేల? యాకసమున సంచరించు చంద్రసూర్యులు గూడ వానియిచ్ఛచొప్పున వచ్చుచుఁ బోవుచు నుండవలయునే కాని కాలానుసారముగా నుదయాస్తమయముల నందవలను కాదు. భూమిపైనుండు నగసముద్రా

దులు నిలకడగానొక్కచోటనుండవలనుకాదు. వానియూహానుగనిపెట్టి తాలుమాలగుచుండవలయును. ఇట్లుప్రకృతికూడ వానికిగడగడ లాడుచున్నయది. ఓకృపాజలనిధీ! ఇట్లింతకాలము మమ్మువానిక్రూరపాలనమున నుంపఁదలంచితివి? ఓదీనావనా! యనన్యగతికులమై నీపాదసరసీరుహాములపైఁబడి ప్రార్థించుచున్నమమ్ముఁ గాపాడఁప్రార్థించుచున్నవారము సర్వజ్ఞుఁడవగు నీకుమేము మాకష్టములఁదెలుపవలెనా? ఐనను పురుషకారముఁజూపకున్న నీకుదయకలుగనేరదేమో యనుభావముచే నిటకుఁబ్రార్థింప వచ్చితిమి.

భక్తవరదా! మున్ను నీవు వామనరూపుఁడవై యదితికశ్యపులకుఁ బుట్టినపుడు నిన్నుగన్న యదితి నీమోహనవామనరూపమును వీడఁజాలక, నిన్నావటురూపముతో గొంతకాలమాపెయొద్ద నుండఁగోరెను. అంత నీవాసాధ్వీమణితో "ముందుజన్మమున నీకునందనుఁడనుగాఁబుట్టి నీసంతోషమీడేర్తు నంటివి" అపుడచ్చట నేయున్న యదితి సవతులగు కద్రూవినతలుకూడ నవనతవదనలై నిన్నుఁబుత్రునిగాఁబ్రార్థింప, భక్తపరాధీనుఁడవగునీవు వారిమనోరథములఁగూడ నీడేర్తునని వరములనొసంగి యంతర్ధానమైతివి.

ఇపుడాకశ్యపుఁడు భూతలమున సూర్యవంశమునందు దశరథుఁడనుపేరితోఁ బుట్టియున్నవాఁడు. ఆయదితీ కద్రూవినతలు కౌసల్యాకైకేయీసుమిత్రా నామములతో జన్మించి, యాదశరథనృపాలునకు రాణులై, నీరాకకెదురుచూచుచున్నవారలు. కావున కామితార్థప్రదుఁడవగునీవు వారికినందనుఁడవైపుట్టి యాసతీమణుల మనోరథముల నీడేర్చి, రాక్షససంహారమొనర్చి, నీకరుణావలోకనకాంతులచే నిశాచరబాధాతిమిరమునుండి లోకములనుద్ధరింపుము. అనియిట్లు పరితాపపక్వమానసులై దేవతలుప్రార్థింప ఆనవనీతకోమలస్వభావుఁడగు శ్రీహరి దీనాతిదీనులై పాలకడలిదరిని నిలిచియున్న సురలనవలోకించి, నీలేంద్రమణిపర్వతతటమునఁ బ్రకాశించుచంద్రికవలె నీలనీరదసుందరమగు నిజవదనమండలమునఁ జిరునగవువెలయ ఆమాధవుఁడు సుధామధుర

ఘారావమములగు వారుౘల నాక్షీరసాగరతరంగమధ్యమునుండి ప్రతి ధ్వనింపఁజేయుచు నిట్లుపలికెను.

విబుధవరులారా! భయమందకుఁడు పాపాత్ముఁడగు నారాత్రిం చరరాజును సపరివారముగాసంహరించి, లోకములకు సౌఖ్యములసమ కూర్తును. నేనిదె మానవలోకమున భానుకులాలంకారుఁడగు దశరథ భూపాలునిరాణులగర్భములందుఁ జతుర్విధనరరూపములతో జన్మింపఁ బోవుచున్నవాడను. మీరును నాకుసహాయులుగ వానరరూపములతో భూమియందవతరింపుఁడు. అని యానిగమాంతవిహారి యంతర్ధాన మయ్యెను. అంత నాసుపర్వులు ఆమురహరిగిరములవిని యలరి దశర థుఁడుచేయు నశ్వమేధమునకు వెడలిపోయిరి.

—' ద్వాదశాధ్యాయము :—

కుమారజననము.

అంత సకలజంతుసంతతిసంతసజనకమగు వసంతసమయమురాఁగా నటసరయూనదికుత్తరతటమున నిర్మితమైన యజ్ఞవాటికయందు వసిష్ఠము నీంద్రుఁడు దశరథరాజేంద్రునిచే నశ్వమేధసంకల్పముఁ జేయించెను.

పాపహనోదకములగు నాక్రతుకలాపములఁజూచుటకు నన్నిది క్కులనుండియుఁ జాతుర్వర్ణ్యసంజాతులగునార్యులు సాకేతమునకువచ్చి దశరథునిచేనాదరింపఁబడి యాగవిధానముల సావధానముగాఁ దిలకించు చుండిరి. ఆక్రతుదివసములయందు ఆమ్నాయసారవిమలగు ఋత్విజులు సామగానమొనర్చి దేవతలనాహ్వానింప దివ్యతేజోమండలభాసితులగు విష్ణ్వాదిదేవతలు యజ్ఞవాటికలోనికవతరించి స్వయముగా నిజభాగము లఁజేకొనుచుండిరి.

ఇంకనాయజ్ఞసమయమున జరిగినమహోత్సవములకు మితిగానరా కుండెను. అట్టిమహాధ్వరము నెన్నఁడు నేచక్రవర్తియుఁజేయలేదని దేవతలే స్తుతింపఁదొడంగిరి. ఆయాగముముగిసినతోడనే దశరథుఁడు కోసలరాజ్య మును గొన్నిభాగములుగఁజేసి ఋత్విక్కులకు దక్షిణగానొసంగఁభోవ నిరీహులగునాయాజకులు వదాన్యుడగునాదశరథునితో నిట్లుతెలిపిరి. "దశరథసార్వభౌమా! ఈకోసలరాజ్యసీమను నీవుపాలించుచుండుటచే

సిరికాటపట్టై సౌఖ్యములకునికిపట్టై వెలయుచున్నయది. ఈరీతినిధరావలయమును పాలింపనీవేసమర్థుఁడవు రాజేంద్రా! మాకీరాజ్యమువలను. దక్షిణలియ్యకున్నఁగ్రతుఫలము సమకూరనేరదుకావునఁ గొంచెముధనమొసంగి యాగఫలమందుకొనుము దశరథుఁడువీరరాగులగు ఋత్విక్కులమాటలాలించి వారికమితధనమొసంగి సత్కరించెను.

ఆయశ్వమేధాంతమున దశరథుఁడు వసిష్ఠానుజ్ఞాతుఁడై ఋష్యశృంగునిట్లుప్రార్థించెను. "శాంతావల్లభా! మాసూర్యవంశనందనమున నందనమందారములుదయించుటకై నాచేఁబుత్రేష్టిని జేయింపఁ బ్రార్థించుచున్నాఁడను. విభండకసుతుఁడాదశరథోక్తులనాలించి కనులుమూసి క్షణకాలముధ్యానించి ఇట్లుపలికెను.

ఋష్యశృం:—దశరథరాజేంద్రా! భానుకులదీపకులగు నలుగురు నందనులు నీకుకలుగుదురు అనితెలిపి పుత్రకామేష్టిని ప్రారంభింపఁజేసి అగ్నియందాజ్యహోమములఁజేయ తూర్పుసముద్రమునుండి బాలసూర్యునిపగిది యాయగ్నికుండమునుండి ప్రాజాపత్యపురుషుఁడు పైకివచ్చి దశరథునిజూచి యిట్లుతెలిపెను.

ప్రాజాపత్య:—కోసలేంద్రా! భక్తిశ్రద్ధలతోనీవొనర్చిన యాగమునకుఁ బరమేశ్వరుఁడు సంతసించి నీకుసంతానముకలుగుటకీదివ్యపాయసమును నాచేఁబంపినాఁడు. కావున సుపుత్రప్రదమగు నీసువర్ణపాత్రముననున్న చరువుచేకొని నీరాణులకొసంగుము. అని ఆపాయసపాత్రమొసంగ నానరేంద్రుఁడు నమస్కారపూర్వకముగా నాపాయసభాజనమును జేకొనెను. తోడనేయజ్ఞపురుషుఁడంతర్ధానమాయెను.

అంతనాదశరథుఁడు పరమాన్నప్రాప్తిచేఁ బరమానందభరితుఁడై వసిష్ఠఋశ్యశృంగులయనుమతిని ఆపాత్రమును భార్యలకొసంగనేగుచు నిట్లువితర్కించెను "సుమంత్రుఁడులోనగువారు నాకునలుగురుపుత్త్రులు కలుగుదురని తెలిపియున్నారు. ఈపాయసభక్షణముననఁగదా సంతతికలుగుట దీనిమూఁడుగాఁజేసి నాపత్నులకిచ్చినచో ముగ్గురుపుట్టుదురుగాని నలుగురెట్లుకలుగుదురు. ఇఁకనీచరువును నాల్గుభాగములుగాఁజేసి యిద్దఱికినొక్కొకభాగమును మిగిలినరెండుభాగములు వేఱొక్కతెకునిచ్చిన

మొదటివారికొక్కొక్క సుతుఁడును మూఁడవయామెకిద్దఱు నందనులుఁ బుట్టుదురు.

కాని యట్లుహెచ్చుతగ్గుగాఁబాయసము నొసంగినచోఁగుమారులుపుట్టుటకుముందు గృహకలహములుదయింపవచ్చును. కావున నేనీ పాయసము రెండుగాభాగించికౌసల్యాకైకేయులకిచ్చెదను వారిరువురుగను సుమిత్రకుఁదమభాగములలోనుండి కొంతభాగముతీసి తప్పకయొసంగుదురు ఇట్లుచేసిన సుతోత్పత్తియు సంతోషప్రాప్తియు సమకూరఁగలవు. అనినిశ్చయించుకొని రాణులకడకేగెను.

పాయససంప్రాప్తి సువార్తనువిని దానికైయెదురుచూచుచున్న యాకాంతలుముగ్వురు దశరథునకెదురేగి నమస్కరింప నాతఁడుపాయసప్రాభావమును వారికెఱింగించి సగముపాయసమును కౌసల్యకును మిగిలినసగపాలు కైకేయికినొసంగెను ఆరాణులిరువురు తమనాథుఁడొసంగిన పాయసభాగముల సంతోషముతోనందికొని ఇంగితజ్ఞలగుటచేఁ దమభాగములలోనుండి సగముపాలుసుమిత్రకు మైత్రితోనొసంగిరి. సుమిత్ర వారొసంగిన పాయసభాగములరెంటినిజేకొనెను. అంతనారాజకాంతలు ముగ్గురునుశ్రీహరినిస్మరించుచు నాపరమాన్నమును భక్షించిగర్భవతులైరి.

దశరథపత్నులు సీమంతాదిసంస్కారకలితలై నెలలునిండి పండ్రెండవనెలప్రవేశింపఁ త్రేతాయుగమున విళంబినామసంవత్సర చైత్రశుద్ధనవమీబుధవారమునఁబునర్వసూనక్షత్రయుక్తకర్కటలగ్నమందు మధ్యాహ్నసమయమున సర్వగ్రహానుకూలమగు సుముహూర్తమున శ్రీహరి కౌసల్యాగర్భమునవర్భకుఁడై జనించెను. దయామయుఁడగు నారమాపతి పుట్టింటఁ గౌసల్యకు దివ్యదృష్టినొసంగి నిజరూపముతో దర్శనమొసంగెను.

ఆపుణ్యాత్మురాలు నీలేందీవరశ్యామసుందరమును, పీతాంబరచ్ఛాయావిభాసితమును, సరసిజారుణనేత్రశోభాకలితమును, నవరత్నకుండలమండిత గండభాగవిలసితము ను, శంఖచక్రగదావనమాలా విభూషిత చతుర్భుజవిరాజితమును, స్మితసుందరవదనారవిందశోభితమును, కో

టిసూర్యప్రభాభాసమానమునగు నాదివ్యరూపమును జూచి నిశ్చేష్టయై నిలిచి పిమ్మట నిట్లు స్తుతింపఁదొడఁగెను.

కౌసల్య:—ఓసచ్చిదానందస్వరూపా! నీమహిమముల నిగమాంతములే వర్ణింపనేరకున్నయపుడు నాయట్టియబల యేపాటిది? ఓప్రపన్నార్తిహరా! నీకు భక్తులయెడ నెంతవాత్సల్యముకలదో నేడు తెలిసికొంటిని. మున్నెన్నఁడో నేఁగోరినవరమును జ్ఞాపకముంచుకొని నేడు నాకడుపున పుత్త్రుఁడవై పుట్టితివి. ఇయ్యది వాత్సల్యలక్షణముకాదా? ఓపతితపావనా! సంసారసాగరమగ్నయై పతిసుతాదులయందు మమతచెంది యీర్ష్యాసూయాదులచే నితరులహింసించుచు సంచరించు సామాన్యబుద్ధి కలదానినిగాఁజేయక సదాసుధాసమమగు నీపాదారవిందభక్తి మధుపానమత్తచిత్తనై విహరించు వివేకముకలదానినిగాఁ జేయుము. ఓయఖండతేజస్వరూపా! నేనిఁక నీదివ్యతేజమును జూడఁజాల. ఇంతటితో నీదివ్యరూపమును జాలించి ప్రాకృతశిశురూపుఁడవై నీబాలలీలలచే నాముద్దుముచ్చటలఁదీర్పఁగోరుచున్నదానను. ఓకరుణానిధీ! నీనడకల సోయగమునుజూచుటకును, నీబాలభాషితముల నాలించుటకును, నీనీలాలకముల దిద్దుటకును నీలేబుగ్గలముద్దిడుటకును, పాలిచ్చి నిన్నుజోకొట్టుటకును, నాహృదయము వేగిరపడుచున్నయది, ఈదివ్యప్రభారూపమును జూడఁజాలకున్నయది కావున నన్నుఁదల్లినిగాను నిన్నుఁ దనయునిగాను మార్చి నరనాటకసూత్రధారివై నామనోరథమీడేర్పుము అని యిటుల నాకౌసల్య ప్రార్థింప అనంతరూపుఁడగు నాపరమపురుషుఁడు కౌసల్యకుఁ బ్రాకృతదృష్టినొసంగి తనదివ్యరూపమును జాలించి మానవడింభరూపుఁడై పురిటింటఁగారుకారుమని యేడ్వఁదొడంగెను. కౌసల్యయు ప్రాకృతచిత్తయై యాశిశురోదనమును విని యానందపరవశయయ్యెను.

“ఆహా! అమేయశక్తిసంపన్నుఁడును, దిక్కాలాద్యనవచ్ఛిన్నుఁడును, నిర్వికారుఁడును నగుపరాత్పరుఁడు పరిమితదేశమగు సూతికాగృహమున మానవశిశురూపుఁడై రోదనముచేయుట భక్తవాత్సల్యముకాకమఱేమి యున్నది? తల్లులు సామాన్యముగాఁ బుత్త్రులుదయిం

చుట కెన్ని తపో పుణ్యములఁజేసి యుండవలయును. ఇఁకనిట్టి దివ్యకుమారులఁగనుటకు వారిపుణ్యములెంతలై యుండవలెనో తెలుపఁదరమగునా? దీనింబట్టిచూడఁ బుణ్యమునకు సాధ్యముకాని కార్యమేదియును లేదని స్పష్టమగుచున్నయది. సురవందితుఁడగు గోవిందుఁడు మానవస్త్రీకి నందనుఁడై జన్మించునట్లుచేసిన దీ సుకృతముకాదా?"

అట్లుకౌసల్యకు శ్రీహరిపుత్త్రుఁడై పుట్టినపిదపఁ గైకేయి యానాఁడే నవమివెళ్ళిన దశమీఘటికలలోఁ బుష్యమీనక్షత్రయుక్త మీనలగ్నమునందుఁ గుమారుని బ్రసవించెను. అపిమ్మట ఆశ్లేషానక్షత్రయుక్త కర్కటకలగ్నమున సుమిత్ర నిరువురసుతులఁగనెను.

ఇట్లు శ్రీమన్నారాయణుఁడు నిజాంశములచే దశరథమందిరమునఁ జతుర్విధరూపములతో నవతరించినతోడనే దివినుండిదేవతలు దుందుభిధ్వానములుచెలరేఁగ సుమవర్షములఁగురిసిరి. పరిమళభరితములగు చల్లగాలులు మెల్లగాఁబ్రసరించెను. కోకిలాదివిహగములు చెవులకింపుగాఁ గూసినవి. గోకదంబకములు వత్సలకుఁబాలఁజేపినవి. తరులతాదిభూజములు ఫలకుసుమములతో నిండిపోయినవి. గంగాదినదీనదములు నిర్మలజలప్రవాహములతో నలరారినవి. దిక్కులన్నియుఁ బ్రశాంతములైనవి. ఇట్లు శ్రీహరిజననదివసము చేతనాచేతనవస్తు మోదావహమై వెలసెను.

దశరథుఁడు తనపత్నులుమువ్వురును సుఖముగా సుతులఁ బ్రసవించిరనువార్త విన్నతోడనే పులకితగాత్రుఁడై నేత్రములనుండి యానందాశ్రుబిందువులు జారఁదిన్నగా సూతికాగృహములోనికిఁ బరుగిడి నలుగురుకుమారులఁ గన్నులారఁగాంచి సంతృప్తుఁడై పురిటింటినుండి పైకివచ్చి జాతకర్మలజరిపించి సుస్నాతుఁడై మహావైభవముగాఁ బుత్త్రోత్సవముల నెఱపెను.

ఆనాడు కోసలప్రజలసంతోషమునకును, వారొనర్చిన మహోత్సవములకును మేరకానరాదయ్యె. పట్టణమెటుచూచినను నవీనశోభాగ్యకళాకాంతులతో నలరారఁదొడంగెను. బాలుఁడు మొదలు వృద్ధుఁడు వఱకును గల పురజనులెల్లరును ఆబాలరూపుఁడగు పరాత్పరునిఁజూడ

గుంపులుగుంపులుగా రాఁదొడంగిరి. ఆశిశురూపములఁజూచి తమకుఁ గన్నులున్నందుకు సార్థకములాయెనని తలంచి యానందించిరి.

దశరథనరపాలుఁడు పురుడువెళ్ళినతోడనే వసిష్ఠమహర్షి నాహ్వానించి నిజసుతులకు నామకరణోత్సవముల జరిపింపుఁడని ప్రార్థింప నవసిష్ఠభగవానుఁడు కౌసల్యానందనునకు రాముఁడనియు, కైకేయీసుతునకు భరతుఁడనియు, సుమిత్రాపుత్రులలో పెద్దవానికి లక్ష్మణుడనియు, చిన్నవానికి శత్రుఘ్నుఁడనియు నామకరణములఁ జేసెను.

"ఓహో! కాలత్రయవేదియగు వసిష్ఠమునీంద్రుఁడే నాఁడు రాముఁడని నామకరణమొనర్చెనో యాదివసము మొదలు నేటివఱకు ఆపావననామము శ్రీదమై, సుఖదమై, దుఃఖనుదమై, కలుషహరమై, ప్రణవస్వరూపమై, సకలలోకకళ్యాణ సంధాయకమై, భక్తజనమనోరథ సంధాన సంతానకమై, క్రూరదానవకులాటవీ దావానలమై, సతీజన మానసతాపనివారక మలయానిలమై భూమ్యంతరిక్షములు మారుమ్రోగునట్లు భారతదేశమంతటను స్మరింపఁబడుచున్నయది.

ఓసోదరీసోదరులారా! స్మరింపుడు పాపహరమగు రామనామమును లిఖింపుడుశుభప్రదమగు రామనామమును పఠింపుడుజ్ఞానసంధాయకమగు రామచరితమును ఈరామనామమునుమించిన పావననామము శ్రీహరినామములలో వేఱొకటిలేదు దీనికిదేసాటి. భారతదేశము భాగ్యవంతమగుటకును కీర్తియశోవిరాజితమగుటకును ఈశ్రీహరినామమే ముఖ్యసాధనము.

త్రయోదశాధ్యాయము

—♦ బాలలీలలు ♦—

నామకరణోత్సవములు ముగిసినవెనుక దశరథుఁడు చీటికిని మాటికిని "రామా రామా" యనిహృదయముప్పొంగఁ బుత్రునిఁబిలువఁ దొడంగెను. ఆకోసలేశునిరాణులును నొక్క-మనస్సుతో నొకమందిరముననే నివసించు నిజశిశుముఖారవిందములఁదిలకించి యానందించుచుండెడివారలు.

ఆరామాదిబాలకులు క్రమక్రమముగా నెదుగుచు మణికుట్టిమ ప్రదేశములపైఁ బ్రాకుటకుఁ బ్రారంభించిరి. వారితల్లులు ఆబాలకుల ముందు బంగరుబొంగరములను మణికందుకములను బడవేసి వానికై వడివడిగఁ బ్రాకుచుండుటను చూచిసంతసించి చంకలనిడికొని ముద్దులిడుచుండెడివారు మరియునాబాలకులు చంద్రకాంతోపలభాగములపైఁ బ్రాకునపుడు ఆఫలకములఁ బ్రతిబింబించిన నిజరూపములఁ జూచి వానినరచేతులతోఁ దట్టుచుఁ దల్లులవైపుబోసినవ్వులతోఁ జూడ నా రాజకాంతలు పక్కుననవ్వి వారినెత్తికొని గట్టిగఁ గౌగలించి లాలించెడివారు అటుపిమ్మట ఆబాలురు తప్పటడుగులచేతను లేయొగరుమాటల చేతను దమ్ముఁగన్నవారిని సంతసింపఁ జేయఁదొడంగిరి వారలబాలలీలలు సాకేతవాసులకు నిత్యోత్సవజనకములై వెలయుచుండెను.

క్రమముగా నాదశరథకుమారులు పంచవర్షీయప్రాయులై తోడిబాలురతో నాడుకొనుచుండ నారదమునీంద్రుఁడు నరకుమారరూపుఁడగు నరహరినిదర్శింపఁగోరి బ్రాహ్మణభిక్షుకరూపముతో నడమ చేతదంబురను కుడిచేతఁజిఱుతలను జేకొని హరినామసంకీర్తనము చేయుచుసాకేతరాజవీధినిరాఁదొడంగెను.

అపుడాపురవాసులెల్లరు నారదహరిగానమోహితులై యెక్కడి పనులక్కడనేవిడచి గుంపులుగుంపులుగా బిచ్చగానివేసమును దాల్చి వచ్చుచున్న నారమునివెంట నేగఁదొడంగిరి. "నిజమే శ్రీహరిలీలాగాన సుధావాహినికున్న మనోమోహనశక్తి వేతెట్టిలలితగానమునకును లేదు."

ఇట్లాపౌరులు ఆబాలవృద్ధముఁదనవెంటరా నారదుఁడు సాకేత దుర్గద్వారముదాటి కౌసల్యామందిరము ముందరనిలచి రమామనోహరుని విలాసముల నింపుగాగానముసేయఁదొడంగెను. అపుడు తమ్ములతోఁగలిసి తల్లులమ్రోల నాడికొనుచున్న రాముఁడు నారదసంగీతరవమునువిని నిజానుజులువెంటరా గుమ్మముకడకుఁబరుగిడివచ్చి యాకపట విప్రయాచకునకు నమస్కరించి కటితటమునఁగరములనునిచి యొయ్యారముగానిలచెను.

అపుడు నారదుఁడు అనాద్యనంతదేశకాలవ్యాపియగు విశ్వరూ

పుడమిపై దేండ్లకుఱ్ఱఁడైనదుమునఁ జేతులుంచికొని నిజాసదృశలావణ్యమును జూపుటనుగాంచి తనివితీరనాజగన్మోహనుని యొయ్యారమును దిలకించి యంతరంగమున బ్రహ్మానందరసము తరంగీకరింప నిట్లుప్రస్తుతించెను.

"ఓవరేందీవరదళశ్యామసుందరా! ఇందిరామానసకైరవసుధాకరా! నీవిపుడుతాల్చియున్న మోహనాకారముయొక్క సొంపును ఇంతకుఁబూర్వంపు టవతారములయందు జూపవైతివి. మఱియు నీవు వైకుంఠమున బరిపూర్ణరూపముతో నున్నపుడుకూడ నింతటిసొగసును వహింపవైతివి.

ఆహా! వందారుజనకామితమందారా! నన్ను నీతోఁగూడ నీదశరథమందిరమున నీకుఁదమ్మునిగాఁగుంటిమాని సఖునిగానైన కాదు, కాదు, దాసునిఁగానైన నేలనిలపైఁబుట్టింపవైతివి? నేజేసికొన్నపాప మేమి? దయాళూ! దాసులపైనీకింత మోడిపాడియా? కాదు. నినుగేలిసేయరాదు ఏమన నీవునాకీదాసరివేసము వేయ మనసుపుట్టింపకున్నచో నేనునీదగు ముద్దురాపట్టిసోయగమును జూడగలిగియుందునా?" అని పైకిట్లుపలికెను.

"ఓముద్దుబిడ్డలారా! నాకుబిచ్చమిడరా?" అనరాముడిట్లుపలికెను.

రాముఁడు:—విప్రోత్తమా! నిలచియుండుడు మేములోనికేగి మాయమ్మలనడిగి బిచ్చములదెచ్చియిత్తుము. అని తమ్ములతోఁదల్లుల కడకేగి ఆమాయామానుషబాలకుఁడు "అమ్మలారా! ఒకబీదపాఱుఁడు మనగుమ్మముకడనిలచి బిచ్చమడుగుచున్నవాఁడు. కావున మాకేవైననొసంగుడు మేమువానినిగొనిపోయి ఆవిప్రోత్తమునకొసంగుదుము" అన నారాణులు వారిముద్దుపలుకులనాలించి సంతసించిరి. తోడనే కౌసల్య తనతనయుఁడగురాముని దోసిలియందు నింద్రనీలమణులఁబోసెను. కైకేయి తననందనుడగు భరతునియంజలియందు నాణెముత్తెములనింపెను. సుమిత్ర తనసుతులలో లక్ష్మణునికరపుటమునఁ గెంపులను, శత్రుఘ్నుని హస్తపద్మములఁ బచ్చలనునిడెను, అంతనాబాలురు తమమాతలువెంట రా ద్వరితముగనారదునిసజ్జకువచ్చి రతనములనిడఁబోవ నావేల్పుతపసి నవ్వి యిట్టులపలికెను.

"సార్వభౌమనందనులారా! నాకీయుచేలనములను రత్నములకు బెట్టితేను. నిగమాంతవాక్యసారతండులములుఁ గొనితెచ్చియుంను." అన రాముఁడు "భూసురోత్తమా! బాగుగఁజూడుడు. ఇయ్యవి చిత్కళావిల సితములగు బియ్యములుకాని రత్నములుకావు." అని నిజాంజలిపుటము లఁజూప వారిదోసెళ్ళనిండఁ దెల్లనితండులములు కానవచ్చెను.

అంతనామిన్నుదారిజడదారి యారతనములు బియ్యముగామా రుటనుజూచి యచ్చెరువంది సంతోషముతో "నాతండ్రులారా! రండు, రండు. తండులముల నాజోలినిండఁబోయుడు. ధన్యుఁడనైతిని." అన రాముఁడు మోమునలేనగవొప్ప ననుజసహితుఁడై యాపేదబాపన దాసరిసంచిలో బియ్యముబోసి నమస్కరింప నానారదుఁడు "సకల లోకములకును దానవబాధలుతొలంగి సౌఖ్యములుసమకూడుగావుత." అనిదీవించి తిరుగఁగళ్యార నాదివ్యసుందరాకారుఁడగు బాలరామునిఁ జూచి ఇట్లుస్తుతించెను.

"ఓయఖండాద్వితీయచిదానందస్వరూపా! నీవు భక్తాభీష్టసంపాద నమునకై దేహవిరహితుఁడవయ్యు, ననంతరూపుఁడవై, నామరహితుఁ డవయ్యు, సకలపదాభిధానుఁడవై నిర్గుణుఁడవయ్యు, ననంతకల్యాణగుణ నిలయుఁడవై నిరీహుఁడవయ్యుఁ, బ్రవృత్తిమగ్నుఁడవై అవాప్తనిఖలకా ముఁడవయ్యు యాచకుఁడవై సమస్తజగజ్జనకుఁడవయ్యుఁ బరకుమారుఁ డవై ఇట్లు నీయనంతకరుణావిలాసములను కనుపఱచుచుందువు. అతసీ కుసుమ శ్యామసుందరుఁడవగు నీవెవ్వరిమానసముల స్మరింపఁబడుదువో యట్టిపవిత్రులకుఁ బరపరాభవదుఃఖములెట్లుకలుగును. అట్టినీభక్తులకు ఘనవిభవములెట్లు చేకూరకుండును ? ఓజగన్నాటకసూత్రధారీ ! శుభ్రత్యంతవిహారీ! శీఘ్రముగఁబెద్దవై క్రూరరాత్రించరానీకములఁదును మాడి ధర్మసంస్థాపనమొనర్చి లోకములఁగాపాడుము" అనిభగవన్నామ గానముచేయుచు వెడలిపోయెను

దశరథరాజకాంతలావిప్రరూపుఁడగు నారదుని మనోహరగాన మునువిని సుందరాకారులగు సుతులమోములనుదిలకించి ఆవదనముల యందుఁ గోత్రవిన్నాణమునుగాంచి అబ్బురమంది అమితానందముతో

సుతులనెత్తిచంకలనిడికొని ముద్దులిడిదీవించుచు మందిరములోనికి వెడలి పోయిరి.

అట్లుబాలలీలావినోదములతో ఆరాజపత్నులు సంతోషముగాఁ గాలము గడుపుచుండ శ్రీరాఘవద్వాదశివచ్చెను. ఆనాడాసతీమణులు శ్రీహరినిఁబూజింపఁదలంచి రామాదినందనులకు నాటబొమ్మలను, పప్పుబెల్లములనొసంగి "బిడ్డలారా! యింటనాడుకొనుచుండుడు. ఇప్పు డెవత్తుము" అని తెలిపి దాదులఁబిలచి "పిల్లలనిటునటుఁబోకుండ జాగ్రత్తగాఁజూచుచుండుడు. మేమునోములనోచికొని వేగముగావత్తుము." అని యాజ్ఞాపించి సరయూనదికేగిస్నానమాడి కౌసల్యాభవనమునకు వచ్చి నూతనకౌశేయాంబరధారిణులై నుదుటఁగుంకుమతిలకములఁబెట్టి కొని మంగళాలంకారకలితలై మణిమయస్తంభములచేతను, మౌక్తిక తోరణములచేతను, బంగరుపెమ్మెలచేతను నవరత్నసింహాసనములచేతను నలంకృతమై కుందమందారకురవకాది కుసుమశోభితములగు సువర్ణభాజనములతోడను, కర్పూరాగరుచందనాది సుగంధద్రవ్యభాసురములగు నవరత్నకరండములతోడను గూడి లక్ష్మీనిలయమువలె నొప్పుపూజామందిరమునకేగి, కాయలతోఁగూడియున్న యుసిరికకొమ్మలుకల బంగరుతులసికోటనందుంచి, కాంచనాసనాసీనలై, ధాత్రీతులసీసమేతుఁడైన శ్రీహరినిబూజింప మొదలిడిరి.

కాని వారిమానసములు పూజలుపైనిలువక నిజనందనులవైపేగఁ దొడంగెను. ఇట్లు తల్లులఁపూజలుజరుపుచుండ రాముఁడు తమ్ములతోఁ గూడి పరుగిడి పూజామందిరముకడకువచ్చి తమయమ్మలు చూచుచుండఁ బూజామందిరములోనికిఁ జొరబడి, సోదరులతోనాడఁదొడంగెను. అంతమడిగట్టియున్న యారాణులు "బిడ్డలారా! మైలబట్టలతో దేవతామందిరములోనికేగరాదు. కావున మాతండ్రులారా! పూజాద్రవ్యములనంటక వెంటనేపైకిరండు మీకుఁజేతులనిండఁ గండచక్కెరలఁబెట్టుదుము మీరు మామాటలువిని రాకున్నఁగొట్టుదుము" అనిరి.

అంతరామాభిదానుఁడగునరహరి తనతల్లులకు నిజమహిమలఁ జూపఁదలంచి వారుచూచుచుండఁగనే యనుజులతో నాపూజామందిర

మున నదృశ్యుఁడాయెను. వారుతమబిడ్డలఁగానక వారేమాయిరని కలవరపాటుతో నాదేవాగారమును గలయఁజూడఁదొడంగిరి కానియందు నిజనందనులు కానరారైరి. ఇట్లు వారు కలఁగొంది చూచుచుండఁగనే ఆమందిరమునందలి మణిస్తంభములనాల్గింటిని బట్టుకొని, గిరగిరఁదిరుగుచుఁ దమ్ములతోఁ రాముఁడు కానవచ్చెను. అదిచూచి వారచ్చెరువంది “బాలలారా! ఇట్టికొంటెచేతలఁ జేయఁదగునా? రండిపాటికై.” అనవారు పకపకనవ్వుచు రాకుండుటచే నాసాధ్వులు ఆశ్చర్యములనున్న పువ్వుల వారినిగొట్టలోనికివిసిరి. ఆసమయమున రాముఁడుసోదరులతోఁ గలసి శేషశాయిగామారి శ్రీ, భూ, నీలాసేవ్యమాన చరణారవిందుఁడై సనకసనందనాది దివ్యసూరివందితుఁడై సర్వలోకానందజనకములగు మందహాసములతో నొప్పు నిజముఖేందీవరకాంతు లామందిరమున వ్యాపింప శంఖచక్రాదిదివ్యాయుధధారియై తల్లులకుఁ బ్రత్యక్షమాయెను.

దశరథకాంతలు ఆదివ్యమంగళమూర్తిని సందర్శించినతోడనే నిజప్రాకృతవ్యామోహములొలఁగ దివ్యజ్ఞానసంపన్నలై రామతత్వమును తెలిసికొని చేతులుజోడించి యిట్లుప్రార్థించిరి. “ఓయమేయాఖండశ్రీసంపన్నా! ఆపన్నజనదుఃఖహరణా! హరిహరబ్రహ్మాదిదేవతులే నీమాయలకులోనై నీస్వరూపసంపదలఁ దెలియఁజాలక దిగ్భ్రమజెంది తిరుగుచుండ మానవదేహధారిణులై సంసారకర్దమమునఁ బడియున్న మాబోటియబలలగతి ఏమని తెలుపవలయును? ఓయన్నా! మాయందుఁగరుణాళుఁడవగుటచే నిట్లుమాకుప్రత్యక్షమైతివి. ఈయది నీనిర్హేతుకజాయమానకటాక్షలక్షణము కానిపరమాత్మా! ఈనీదివ్యతేజోరూపమును ధ్యానింపఁదగినమనోబలము మాకులేదు. మేమజ్ఞానముచే నీవునిగమాంతవేద్యుఁడవగు శ్రీహరివని ఎఱుంగఁజాలక మాకడుపునఁబుట్టిన నందనుఁడవని భావించుటచేఁ ప్రత్యక్షదైవమవగునిన్ను విడచి మేమునీవిగ్రహములకుఁ జేయుచున్నపూజలకుఁగోపింపక మాయందనుగ్రహముంచి తిరుగఁగుమారరూపములతోఁ బ్రత్యక్షమై మాతృబుద్ధితో మాచేయు నుపచారములఁజేకొని మాకునందనానందము సమకూర్పుము.” అనిప్రార్థింప భక్తవత్సలుఁడగు నరహరి వారికివెనుకవైపునఁ దమ్ములతోనిలచి

మడికట్టియున్నతల్లులు తాముముట్టినఁ గోపింతురేమోయను భయమును నటించుచు మెల్లగా "అమ్మలారా! మేము మిమ్ము ముట్టికొనవచ్చునా ? తల్లులారా! మాచేఁగూడఁబూజలఁ జేయింపరా ?" అనిపలుక అమ్మో హానకంఠనాదము చెవులఁబడినతోడనే యారాణులు వెఱగంది వెనుకకుఁ దిరిగిచూడఁ జేతులుజోడించుకొని భయభక్తులతో నిలిచియున్న రాముఁడు సోదరులతో వారికిఁగానవచ్చెను.

అపుడు పుత్త్రప్రేమవశంవదలైన యాసతీమణులు "మాతండ్రులారా! యుడుపులవిడచిరండు ముట్టుకొండు" మన రాముఁడు తమ్ములతోదుస్తులఁదీసి వారికడకేగ నాకాంతామణులు కనులనానందాశ్రుపులుక్రమ్మ వారినిచేరఁజేరిముద్దులిడి తొడలపైఁగూర్చుండఁబెట్టికొని పూజలఁబూర్తిసేయమొదలిడ రాముఁడిట్లుప్రశ్నించెను.

రాముఁడు:—మాతృదేవతలారా! ఇపుడు మీరుచేయుచున్న వ్రతముపేరేమి ?

కౌసల్య:—నయనాభిరామా! రామా! ఈయది క్షీరాబ్ధివ్రతము.

లక్ష్మణుఁడు:— మాతలారా! దీనివలనఁగలుగులాభ మేమి?

కైకేయి:—సుగుణనిలయా! దీనివలనసకలసంపదలు సమకూరును

భరతుడు:—జనయిత్రులారా! మనకన్నిసిరులున్నవే? ఇకనీవ్రతము చేయనేల ?

సుమిత్ర:—ముద్దుబిడ్డా! ఇంతకంటెను హెచ్చుసిరివచ్చుటకు.

శత్రుఘ్నుఁడు:—జననులారా! అట్టిపేరాశతగునా ?

తల్లులు:— బిడ్డలారా! వికటప్రశ్నలచే మాపూజలకడ్డురాకుడు నోములుముగిసినపిమ్మట మీప్రశ్నలకు బదులుతెలుపుదుము.

శత్రుఘ్నుఁడు:—అట్లైన ఆబంగారుగిన్నెలోని పాయసమును మాకొసంగుడు. మాటలాడము.

సుమిత్ర:—తండ్రీ! పాయసము భగవంతునకు నివేదింపనిదే ముందుమీకీయఁగూడదు.

లక్ష్మణుఁడు:—అమ్మా ! ఆభగవంతుఁడెక్కడనున్నాఁడు ?

కైకేయి:—కుమారరత్నమా ! ఆతఁడు జగమంతటను నిండి యున్నాఁడు.

భరతుడు:—అట్లైనమాయందునుకలఁడా ?

కౌసల్య:—వివేకనిధీ ! అందుకుసందేహమేమి? మీయందును మాయందును, దోమయందును, తుదకు ఇసుకనలుసునందును, కూడఁ గలఁడు.

రాముఁడు:—అట్లైనఁబాయసమును మాకేలనివేదింపరు ?

సుమిత్ర:—రవికులజలధిసోమా ! రామా ! వ్రతవిధిననుసరించి పూజలముగించినతోడనే మీకొసంగుదుము త్వరపడకుడు.

కుమారులు:—తల్లులారా ! అట్లైననతిశీఘ్రముగ నోముల ముగింపుడు మాకాకలియగుచున్నయది. అన వత్సలలగు నాతల్లులు వేగముగాఁబూజలబూర్తిచేసి తమసుతులకు భగవన్నివేదితములగు పాయసాదులనొసంగి యానందించిరి.

—: చతుర్దశాధ్యాయము :—

గురుకులవాసము.

కోసలచక్రవర్తి రామాదినందనులకు నైదవయేట నక్షరాభ్యాసముచేయించి వారికయ్యవారులచే విద్యలనేర్పింపఁదొడంగెను. ఆబిడ్డలొజ్జలు చెప్పుటయేతడవుగాఁ బాఠములనొప్పచెప్పఁదొడంగిరి. ఇట్లానృపసుతులు కొలదికాలములోనే బడిచదువులయందుఁ గృతార్థులైరి. పిమ్మటవారికిఁబదియవయేడు రావెంటనే కోసలాధిపుఁడు వసిష్ఠమహర్షిని దోడ్కొనివచ్చి యుపనయనములజరిపించి బ్రహ్మోపదేశమొనర్చెను.

అపుడాబ్రహ్మచారివేషధారులగు రాజనందనులు గురునియజ్ఞానుసారము వారివారితల్లులకడకేగి "భవతిభిక్షాందేహి" అని కాంచనపాత్రములఁ జేతులఁబట్టుకొని భిక్షావందనమొనర్ప ఆతల్లులు నూతనయజ్ఞోపవీతములతోడను, మృగాజినములతోడను, ముంజమేఖలలతోడను పంచశిఖలతోడను పచ్చగోచులతోడను మఱియూడల దండములుగాఁ జేకొని తమముందర నిలిచియున్న నిజనందనవటురూపములఁ దిలకించి

యానందకళాకలితవదనలై నవరత్నములతో వారిచేతులనున్న బంగరుగిన్నెలనింపి, దీపించి, సువర్ణాక్షతల వారిశిరములపై వేసిరి.

ఆక్షత్రియబ్రహ్మచారులు తమమాతలొసంగిన మణిగణముల వసిష్ఠమునీంద్రునకొసంగి నమస్కరింప నాతఁడామణిస్తోమముల సాకేతవాసులగు భూసురవరులకు సమర్పింపఁజేసెను. దశరథుఁడు వటువులకు మేధాజననసంస్కారములు ముగిసినవెంటనే వేదాదివిద్యల నభ్యసింపఁజేయుటకుఁ దనకుమారుల వసిష్ఠాశ్రమమునకుఁబంపనెంచి వారిఁజేరఁజీరి యిట్లుబోధించెను.

దశరథుఁడు:—కుమారులారా! మీరువసిష్ఠమునీంద్రులతో గురుకులమునకేగి యామ్నాయవిద్యల నభ్యసింపవలసియున్నది. కావున గురువులయాజ్ఞలకుబద్ధులరై వినయవిధేయతలతో మెలంగుచు గురువుల యాశీస్సులకుఁ బాత్రులగుచుఁ బ్రాజదవ్రులఁబ్రాజ్ఞులరై వేగముగారావలయు మిమ్మెడఁబాసి నేనుండఁజాల అన వారుచిత్తమని తండ్రికినమస్కరించి తల్లులకడకేగి యిట్లుపలికిరి.

పుత్రులు:—అమ్మలారా! మానాయనగారి యాజ్ఞానుసారము గురుకులమునకేగి వసిష్ఠభగవానులకడ వేదవిద్యలనేర్చికొని వేగముగా వత్తుము మాకుసెలవొసంగుడు అన ఆదశరథకాంతలు కన్నులవెమ్మొగాశ్రువులుకృమ్మ వానిపైటకొంగులతోనద్దికొని సుతులముద్దిడి యిట్లు పలికిరి.

తల్లులు:—మాతండ్రులారా! మిమ్మువిడనాడి, యేగెదరా? బిడ్డలారా! ఇటబడిపంతుళ్ళకడఁ జేసినకొంటెపనుల అటమునీంద్రులకడఁజేయక వినయసంపన్నులరై విద్యలనారితేరి వేగమురారండు. మిమ్ము వీడి క్షణకాలముకూడ నుండఁజాలము. అని తెలుప రాముఁడిట్లుపలికెను.

రాముఁడు:—వాత్సల్యామృతతరంగిణులారా! తల్లులారా! మేమిటబడిపొజ్జలకడఁ జేసినయాగడముల దేశికేంద్రులగు మహర్షులసన్నిధిని జేయనగునా? కొలదిజలములుకల కుల్యలనుదాటనగునుగాని అపారజలతరంగ భీకరములగు మహార్ణవముల లంఘింపనగునా? కావునఁ

దల్లులారా! భీతిల్లకుఁడు మేము జాగరూకులమై వేదవేదాంగముల నేర్చి కొందుముకాని కొంటెచేతలు చేసి తాపసులకుఁ గోపములఁ దెప్పింపము. వారికుపచారములు చేసి దీవనల నందికొందుము. అన ఆరాణులు మువ్వురు రాముని వినయోక్తులకానందించి సుతుల దీవించి పంపిరి.

వసిష్ఠమహర్షి రామాదుల వెంటనిడికొని తపోవనమునకేగి యచటి విద్యార్థులతోఁ గలిపి యారాకొమరులకు విద్యలబోధింప ఆ రాజసూనులతివేగముగా నాలుగు వేదముల సాంగముగా గ్రహించిరి. గురువరుఁడలరి సకలకళల నభ్యసింపఁ జేసెను ఆ రాజనందనులును గురువులు చేయు పరీక్షలయందుఁ గృతార్థులగుటయే కాని తేలిపోవుట నెఱుంగరు. మఱియు సార్వభౌమనందనులు రాజసము చూపక వినయముతో గురుశుశ్రూషల నెరపుటయు కాక సహపాటులగు ద్విజవటువులకుఁ గూడ నుపచారములఁ జేయుచు ఆ గురుకులమునందలి విద్యార్థిమండలికి వినయమర్యాదలఁ గరపుచుండిరి.

అట మున్ను విద్యల నభ్యసించుచున్న బాలకులు రామాదులతోఁ గలసి చదువనారంభించినది మొదలు తమకు నవమేధలు నయింప ననాయాసముగా గురుబోధల గ్రహింప సమర్థులైరి అందుచే పటుజన శత్రువగు వేత్రము వారి నేత్రములకుఁ గానరాకుండెను. "సత్సహవాసములచే సౌఖ్యములు చేకూరుటయు దుఃఖములు దూరమగుటయు సహజమే కదా".

ఆయరుంధతీవల్లభుఁడట్లు విన్నమాత్రముననే తమ్ములతోఁ గలసి విద్యల గ్రహించుచున్న వటూత్తముఁడగు రాముని దివ్యరూపము తన మానసమునాకర్షింప బ్రహ్మానందపరవశుఁడై నోటమాటరాక నిశ్చలుఁడుగానున్న సమయములెన్నియో కలవు. "లోకమునఁ బ్రాజ్ఞులగు బాలురకు విద్యలఁ గరపునపుడు వారి తెలివితేటలఁ గని యొజ్జలుప్పొంగుచుంద అట్టి యప్రాకృతదివ్యమంగళవిగ్రహుఁడును, వివేకసాగరుఁడునగు పటపత్రశాయి వటురూపధారియై తనయొద్దవిద్యల నేర్చునపుడుపాధ్యాయుఁడైయున్న యావసిష్ఠుని భాగ్యమెన్నఁదరమగునా? ఆతని యానందమునకు మేరయుండునా?

వసిష్ఠుఁడట్లా మన్నయవిద్యలనన్నిటిని సంపూర్ణముగా వారికి నేర్పి యారాజసూనుల నసమాన విద్యాకోవిదులనుగాఁ జేయుచు నొకనాడు రామలక్ష్మణభరతశత్రుఘ్నులఁబిలచి “చక్రవర్తి నందనులారా! ఈనాడు మీరా సోదరులు నలువురును విడివిడిగా నాశ్రమకార్యముల నెరవేర్పవలసి యున్నది. నేడు మీరాంతగుటచే బ్రహ్మచారి ధర్మానుసారము గురు సేవలఁ జేయవలయును.” అన రాముఁడిట్లు పలికెను.

రాముఁడు:—గురూత్తమా! శిష్యులు గురుదైవతములకు వినమ్రులై, సేవలనెరపకున్న నిహపరముల రెంటను నింద్యజీవితులగుదురు గురుశుశ్రూషయే విద్యార్థులనున్నతస్థితికిఁ దేగలదుగాని స్వేచ్ఛావిహారముకాదు. కావున మమ్ముసార్వభౌమపుత్రులగు దురభిమానులనుగాఁ దలంపక కింకరులనుగా భావించి మేము చేయవలసినపనుల విధింపుఁడు.

వసిష్ఠుఁడు:—రామచంద్రా! నేడు మీరుచేయవలసిన కృత్యములవినుడు. రామా! నీవిటనుండి యరణ్యమునకేగి సాయంతనహోమమునకు సరిపడు పలాశసమిధలఁ దేవలయు. లక్ష్మణా! నీవు నదీజలముల ఘటములతోఁగొని తెచ్చి యాశ్రమవృక్షకముల యాలవాలములనింపవలయు భరతా! నీవు ఇటకుసమీపముగానున్న విప్రగ్రామముల కేగి కులకాంతలయాచించి మధుకరములఁగొని రావలయు. శత్రుఘ్నా! నీవు నందినీధేనువును దోలికొని వెళ్ళి నదీతీరములఁజక్కఁగమేపి సంధ్యాకాలమునకు తిరుగఁదోడ్కొనిరావలయు అని యాజ్ఞాపింప నాచక్రవర్తితనూభవులు తలలువంచి “చిత్త” మనినమస్కరించి తమతమవిధుల నెరప వెడలిపోయిరి.

రాముఁడు తనకాచార్యుఁడు విధించిన ఇంధనాహరణమునకై ధనుర్బాణములఁ జేకొని యరణ్యమధ్యమునకేగి హోమార్హములగు పలాశసమిధలవెతకుచుఁ గొంతముందునకేగి కావలసిన సమిధలనేరి కట్టగట్టఁదొడంగెను.

—♦ పంచదశాధ్యాయము ♦—

గుహచరితము.

పూర్వము వసిష్ఠపుత్రుఁడగు మహోదయుఁడు “విశ్వామిత్రము

హర్షి, పంచముఁడైన త్రిశంకుని స్వర్గమునకుఁబంప యజ్ఞమును జేయింప బోవుచున్నవాఁడు. మిమ్ముందరఁదోడ్కొని రమ్మనినాఁడు" అని కౌశికశిష్యులు తెలుప పక్కుననవ్వి "ఒకమాలవాఁడు జన్నముసేయునా? వేఱొక రాచవాఁడు యాజకుఁడుగానుండునా? ఆయాగమునకు జేజేలువత్తురా? ఆమాలకూటిని దిన్నవారు బాపలగుదురా?" అనిపరిహాసించెను. విశ్వామిత్రశిష్యులు వానినిందావచనములఁ దమగురుని కెఱింగింప నాగాధేయుఁడు కోపోద్దీపితుఁడై "నన్నుబరిహాసించిన మహాపాపుఁడగుమహోదయుఁడు ద్విజత్వమువీడి నిషాదుఁడుగాఁ బుట్టుగాక" యని శపించెను.

వసిష్ఠనందనుఁడా శాపమును తెలిసికొని తండ్రికడకేగి జరిగినగాథను నివేదించిఖిన్నుఁడై "తండ్రీ! తాపసేంద్రా! నన్నిశబరజన్మమునుండి గాపాడవా?" అని ప్రార్థింప నావశిష్ఠభగవానుఁడిట్లు బోధించెను.

వసిష్ఠుఁడు బిడ్డా! కౌశికశాపమనుభవింపక తప్పదు కాని నీకాశబరజన్మమున రామనాముఁడగు రమాపతి ప్రాణదానమొసంగును. అది మొదలు నీవాపురుషోత్తమునకు ప్రాణసఖుఁడవై యారామావతారాంతమున శ్రీహరితో వైకుంఠమునకేగఁగలవని బోధించెను మహోదయుఁడు విశ్వామిత్రశాపానుసారము శృంగబేరపురాధిపతియగు రోహునకు గుహుఁడనుపేరఁ బుత్రుఁడైపుట్టి పరమభక్తుఁడై తండ్రియనంతరము నిషాదరాజనైస్వకులోచితవృత్తిని కాలముగడపుచుండెను.

ఆగుహుఁడొక దివసమున వేటకై రాముఁడు సమిధలఁ జేకొనుచున్న విపినమునకువచ్చి కొన్నిమృగముల వేటాడి యామృగముల సేవకులచే శృంగబేరమునకుబంపి వేటయలసటచే నొకచెట్టునీడకేగి యాతరుచ్ఛాయను విశ్రమింపఁగొంచెము నిదురపట్టెను. ఆస్వప్నములో నాగుహుఁడు భగవంతుఁడు తన్నుద్ధరింపసిద్ధముగానున్నయట్లు కలఁగని లేచి కలలోఁగాంచిన దివ్యరూపుని ధ్యానింపఁదొడంగెను.

ఆసమయముననే కొందఱుమునిబాలకులు లేగదూడలమేపుచుండ దూరమునుండి తోడేళ్ళగుంపులు ఆయావుకొదములపైకి రాఁదొడంగెను లేగలావృకసమూహముల రాకనుగనుగొనితోడనే తోకలఁ బైకెత్తి బెదరుపాటుచూపులతోఁ జెల్లాచదరై పరుగిడఁదొడంగినవి,

అపుడు వానినిమేపుచున్న సంయమికుమారులు దూరమునుండి పరుగిడి వచ్చుచున్న తోడేళ్ళమందలనుజూచి భీతులై చెట్టునీడను భగవంతుని ధ్యానించుచున్న గుహునికడకువచ్చి "ఓధనుర్ధరుఁడా! మమ్మాపదనుండి యుద్ధరించి పుణ్యముకట్టికొనుము." అన ఆభీతమునిసుతకంఠనాదము చెవినిబడినతోడనే "భయములే"దని తెలిపి వెంటనేవారితోనేగి ప్రాణిపోవుచున్న గోశాబకములఁజేరఁదీసి, ఆయావుదూడలను, ఆమునిసుతులను నొకకొండగుహాలోనుంచి వింటనమ్మునుసంధించిగుహాద్వారమునకడ్డముగానిలచెను.

అంత నావృకయూథము లెక్కపెట్టనఁ దనమీఁదఁబడనుండ బాణపరంపరలచేఁగొన్నింటిని నేలఁగూల్చెను. కానిక్రమక్రమముగా నాతోడేళ్ళమితములై చుట్టుముట్ట సంహరింపనేరక తానభయమొసంగిన ప్రాణులుహతులగుదురను భయముదయింపఁ జేయునదిలేక ఇట్టికష్టకాలమున ఈశ్వరధ్యానముతక్క వేఱొండుసాధనము లేదనినిశ్చయించి ధనుర్బాణముల నేలఁబడవైచి చేతులుజోడించి యిట్లు సర్వవ్యాపకుఁడగుభగవంతుని నుతింపఁదొడంగెను.

గుహుఁడు:—ఓదీనజనబంధూ! కృపాసింధూ! నీవీసమయమున నాపైఁదయఁజూపకున్న గోవత్సములును, తాపసనందనులును, క్రూరవృకములనోటఁ బడుటతప్పదు. కావున వేగముగాఁబరుగిడివచ్చి నిరపరాధులగు జీవులఁగాపాడి నీదయాళుత్వమును బ్రకటింపుము. ఓభక్తవత్సలా! మున్ను నీవు మొసలిచేఁబట్టఁబడి బ్రతుకుఁజాలింపనున్న గజరాజుచేఁ బిలువఁబడి వైకుంఠమునుండి యిటకుఁబరుగిడి కాపాడితివని వినియుంటి. ఆనమ్మకముచేనిపుడు మముఁగాపాడరమ్మని పిలుచుచుంటి. ఏమీ! నీవిటకుమముఁగాపాడరావా? నానీరసకంఠస్వరము నీకువినఁబడలేదుకాఁబోలు. లేకున్న నాపన్నార్తిహారుఁడవగు నీవురాకుంటయెట్లు. బిగ్గరగాఁబిలుతును. వినుమునామొఱను ఓభక్తవత్సలా! వెంటనేమముఁగాపాడుము. అని కొండగుహాలు ప్రతిధ్వనించునటులఁ గేకవేసి, యలసి నేలపైఁబడిపోయెను.

ఆయార్తనాదము సమీపమునసమిధల మోపుకట్టుచున్న యార్తశరణ్యుఁడగు కౌసల్యానందనుని చెవినిబడినతోడనే కట్టెలుకట్టుటనట్టె విడచియొకయున్నతస్థలమునకేగి యాయార్తనాదము వినవచ్చిన వైపునకుఁ జూడనేలపైనొకపురుషుఁడును, వానిపైఁగ్రూరవృకసమూహములును గానవచ్చెను. వెంటనే ధనువునఁబావనాస్త్రమును సంధించి యాతోడేళ్ళను సుడిగాలి పండుటాకులనువలె పైకెగురఁగొట్టి పరుగుపరుగున నా గుహునిచెంతకేగి మూర్ఛితుఁడై చైతన్యములేక నేలపైఁబడియున్న యాదీనమానవసోదరుని లేవనెత్తెను.

అట్లాదివ్యపురుషుని పావనకరస్పర్శమైనతోడనే యాశబరనాయకుని దేహమునకును మానసమునకును గ్రొత్తవికాసముదయింప మెల్లగాఁగన్నులువిప్పి తన్నుఁబట్టుకొనియున్న నీలేంద్రమేచకదేహుఁడగు రామునిఁగాంచి విస్మితుఁడై, ఇట్లుప్రశ్నించెను.

గుహుఁడు:—మహాత్మా! మీరెవ్వరు? సుకుమారాకారులగు మీరీక్రూరమృగాటవికి రాఁగతంబేమి? నాదీనాలాపములనాలించి నన్నును, తపసిబుడుతలను, లేగదూడలను, గాపాడవచ్చిన దీనబాంధవుఁడవగు మాధవుఁడవైయుందువా? అటుఁగాక యుమాధవుఁడవగుభవుఁడవా? అదిగాక భారతీవల్లభుఁడవగు నలినోద్భవుఁడవా? నీదివ్యముఖారవిందకళావిశేషమును జూడమానవమాత్రుఁడవుగాఁదోఁచుటలేదు.

శూరాగ్రణీ! ఒక్కకేకతో నీవిటకువచ్చి యీకందరములోనున్న మునిసుతులను, గోవత్సములను, నన్నును, గూడ మృత్యుముఖమునుండి కాపాడియుంటివి. మీరెవరైననేమి? ఈనాఁడు మొదలు నాకు మీరే యుపాస్యదైవతమైతిరి. మీమోహనరూపమును జూచినదిమొదలు నాహృదయ మనిర్వాచ్యానందము నందుచున్నది. ఏదియోక్రొత్తవికాసముఁ జెందుచున్నది. ఇందుకుజన్మాంతర సుకృతసంస్కారమేదియో యుండవలయును లేకున్న ఈకిరాతునకుమీదర్శనభాగ్యమబ్బుటయెట్లు? ఆర్యా! మీవటువేషమునుజూడ మీరుక్షత్రియకుమారులైనట్లు స్పష్టమగుచున్నది ఓయాపన్నరక్షకా! మిముగన్న మేటి యేలికయెవ్వరు? మీనామమేమి? మీపదపద్మవిన్యాసములచే ధన్యమైనదేశమెయ్యది ?

రాముఁడు:—ఓయార్యసోదరుఁడా! నాపేరుతోఁబనియేమి పొద్దుగ్రుంకుచున్నయది ఈనీరెండ జారకమున్నే నేనుసమిధలఁదీసికొని, మాగురుకులమునకేగవలయును కావుననేఁబోయెద తిరుగఁగలిసికొందము అనుచుండఁ బర్వతదరీగర్భమునుండి లేగలనుదీసికొని ద్విజబాలురు పైకివచ్చి తమ్ముఁగాపాడిన వేలగానికినమస్కరింపఁబోవ నాగుహుఁడు వెఱ్ఱితమ్ములారా మిమ్ములను, మీలేగలను, నన్నును సంరక్షించినదీనదయామయుఁడు కనుకవీరికివందనమొనర్చి చీఁకటిపడకుండ దూడలఁదోలికొని మునిపల్లెకేగుఁడు" అన నామునినందనులాయానందరూపుని జూచి విస్మితులైనమస్కరించి "ఆర్యా! సెలవొసంగుఁడు మామునిపల్లెకుఁబోవుదుము" అన రాముఁడు మందహాసముతో "ద్విజనందనులారా మీకు వందనములు నేనుమీయాశీర్వాదములకు నర్హుఁడనుగాని వందనములకుఁ బాత్రుఁడను కాను.

మునికుమారులు:—ఓదివ్యరూపా వందనార్హుఁడగుభగవానుఁడు సర్వాంతర్యామియై యన్నిటనుచున్నవాఁడు కావున మావందనములాదీనజనమందారునకే చెందును అని లేగలఁదోలికొని, వెడలిపోయిరి.

గుహుఁడు:—ఓప్రాణదాతా! అయాచితముగ మముఁ గాపాడిన మీరు నేఁబ్రార్థించుచున్నపుడు మీపావననామాదులఁ దెలుపకుంట న్యాయమా? ఓయసమానసుందరరూపా! మీనామస్మరణమే నాకు ముక్తిదాయకమని భావించుచున్నాఁడను. కావున శ్రుతిసుఖదములగు మీనామధేయాక్షరములవినిపింపుఁడు.

రాముఁడు:—సోదరుఁడా! నేనుకోసలరాజేంద్రుఁడగు దశరథుని నందనుఁడను నన్నురాముఁడనిపిలుతురు. మిత్రమా! నీయూరుపేరులెయ్యవి ?

గుహుఁడు:—సార్వభౌమనందనా! నేనొకశబరనాయకుఁడను నానివాసము శృంగబేరపురము నన్నుగుహుఁడనిపేర్కొందురు. పురుషోత్తమా! ఏమిమీయవ్యాజకరుణాకటాక్షము నేనుమిమ్ము మీపేరుపెట్టి పిలువకయే నన్నుఁగాపాడవచ్చితిరే ?

రాముఁడు:—ప్రియసఖుఁడా! దివోత్సవములకును, దీనరక్షణములకును, పిలుపులతోఁబనిలేదు క్షత్రియకుమారులకని కంటఁబడిన యాపన్నులఁ గాపాడుటయే లేకున్న వారాక్షత్రియజాతికి నవమానకరులగుదురు. సోదరుఁడా! గుహుఁడా! నేనేగినాయంతన హోమమునకు మాగురువులకు సమిధలనందఁజేయవలయును. మనకలయిక శాశ్వతముగానుండుగాక!

గుహుఁడు:—ప్రభూత్తమా! మీయట్టిసజ్జనులతో మైత్రి సాప్తపదీనమనుమాటనిక్కువము. రామచంద్రా! యాచిదుగులమోపు నా మూఁపునఁబెట్టికొని, మీతో నాశ్రమమునకు వచ్చుటకంగీకరింపవలయును.

రాముఁడు:—మిత్రుఁడా! వలదు. సమిధలనేస్వయముగాఁ దీసికొనివెళ్ళవలయునుగాని పరులచేఁబట్టించుకొనిపోరాదు అట్లొనర్చినచో గురునియానల నతిక్రమించినవాఁడనగుదును. గురువులు నన్ను రాజసునిగాఁదలంచి కోపింతురు.

గుహుఁడు:—ఆర్యా! కోమలరూపులగుమీచే కఠినములగు కట్టెలఁ దెప్పింపఁజూచుటచూడ మీగురువులు కఠినహృదయులుగాఁ గన్పట్టుచున్నారు.

రాముఁడు:—ఓయీ! నీవుతలంచినదితప్పు దయామయులగు గురువులు శిష్యులకుఁగష్టసుఖములు తెలియవచ్చుటకుఁ గార్యములవిధించుచుందురుకాని బాధించుటకుఁగాదు. విద్యార్థులు సుకుమారులుగానే యుండుచో ముందువారెందుకును బనికిరారు. సోదరుఁడా! ఇక నేపోయి వచ్చెద.

గుహుఁడు:—ప్రభువరా! నేనీయరణ్యమునకువచ్చి మీదర్శనమునకై యెదురుచూచుచుందును. మీకనువగునపుడు నాకుదర్శనమొసంగుచుండఁగోరెద. అని గుహుఁడు రామునిపాదములకు వందనమొనర్చెను. రాముఁడును సమిధలఁజేకొని, వెడలి పోయెను. గుహుఁడు రాముని కళ్యాణరూపమును ధ్యానించుచు నిజపురమునకుఁబోయెను " ఆహా! స్నేహములెట్లెప్పుడుకలుగునో యెఱుఁకనిచెలి

యకు అకోసలచక్రవర్తిపుత్త్రుఁడగు రాముఁడేడ ? ఈపల్లెతేసకొడు కుఁడగు గుహుఁడేడ ? వీరిరువురకుఁ బ్రాణమైత్త్రికలుగుటయేడ? కాదు కాదిట్లుసం దేహింపఁబనిలేదు. విధివిధానములత్యద్భుతములు. అయ్యవి యెట్టివిరుద్ధవస్తువులకును స్నేహసంబంధమును సమకూర్పఁగలవు. చుక్కలతేఁడగు చందమామకును, నడవినిదిరుగాడు చెవులపిల్లికిని కలయికక లుగ లేదా ? ఇందుఁకువిధివిలసితమేకదా కారణము."

—: షోడశాధ్యాయము :—

ఆచార్యోపదేశము.

అంత దశరథతనయులు శాణవలయమునరాపుడుపడిన రత్నముల వలె గురుకులమునఁజదివింపబఁడి ప్రకాశింపఁదొడఁగిరి.

వసిష్ఠమునీంద్రుఁడు సకలవిద్యానిష్ణాతులైన దశరథపుత్త్రులఁ జూచి, ఇట్లుబోధించెను. భూపాలనందనులారా! మీరుసార్వభౌమపుత్త్రులయ్యు వినయసంపన్నులరై విద్యార్థిసోదరులతో సుహృద్భావముతో మెలఁగితిరి. ముందుమీరుప్రజాపరిపాలకులు కాఁబోవుచుండుటచేఁ గొంచెముధర్మమునుబోధింపఁదలంచితిని." అనరాముఁడిట్లు పలికెను.

రాముఁడు:— దేశికేంద్రా! మేముచదివినవిద్యలొకయెత్తు మీరు బోధింపనున్న ధర్మమొకయెత్తు కావునమాకు ధర్మబోధఁజేయఁ బ్రార్థించుచున్నవారము.

వసిష్ఠుఁడు:—దశరథసూనులారా! మీరెల్లరు శమాదిగుణసంపన్నులరై సత్యమునువిడువక, ప్రజాసౌఖ్యముల సమకూర్పఁబ్రయత్నింపుఁడు. కాముకిరాతుఁడు కాంతలనెడివలలఁబన్ని, మానవమృగములఁ బట్టఁజూచుచుండును ఆశాపిశాచము కాంచనదీపకాంతులఁజూపి అందు మనుష్యశలభములఁ బడఁగొట్టఁజూచుచుండును. కావున జితేంద్రియులరై, సంచరింపుఁడు. ప్రేమనుజూపుటయే మానవత్వలక్షణమనియు, ద్వేషమునుప్రదర్శించుటయే, పశుతాచిహ్నమనియుఁ దెలిసికొనుఁడు వివేకమునువికసింపఁజేయునదియే విద్యయనియు, గర్వమునగలిగించునది, యవిద్యయనియు, భావింపుఁడు

రాముఁడు:—గురువరా! దీపకళలు చీఁకటినిఁబోఁగొట్టునటుల దేశికోపదేశములు అజ్ఞానములఁబోనడంచును.

లక్ష్మణుఁడు:—ఆచార్యోత్తమా! మీరుమమ్ముఁ బుత్త్రులనువలెఁ బ్రేమించి సుఖముగా సర్వవిద్యలఁబోధించియుంటిరి మీయప్పులదీర్ప మేమెన్నిజన్మముల నెత్తవలయునో?

భరతుఁడు:—గురుచంద్రా! విద్యాభ్యాసకాలమునఁ దెలిసీతెలియక మాచేసిన యపరాధముల క్షమియింపవలయును.

శత్రుఘ్నుఁడు:—అరుంధతీరమణా! మావలన గురుదక్షిణలఁ గైకొని మమ్ముఁగృతార్థులనుగాఁ జేయఁగోరుచున్నారము.

వసిష్ఠుఁడు:—భూపాలబాలకులారా! మీరుగురుకులమున నెరపిన శుశ్రూషలే గురుదక్షిణలు అంతకుమించిన వస్తువులు గురువులకు వేఱొండులేవు రేపు మిమ్ము, ఆయోధ్యకుఁ దోడ్కొనివెళ్ళెదను కావున నీనాఁడు విద్యార్థులకందరకును విశ్రాంతినొసంగితిని. తెలిపెను. ఆమాటవిని, యారాజనందనులు విద్యార్థులకడకేగి, ఇట్లు పలికిరి.

రాముఁడు:—విద్యార్థిసోదరులారా! మిమ్ముఁవిడచి, మాతల్లిదండ్రులకడకువెళ్ళుటకు మనసొప్పకున్నయది వటుసోదరులారా! ఋతుకాలములలో వసంతసమయమట్లు మానవజీవితసమయములలో విద్యాభ్యాసకాలము మహానందజనకము మిగతసమయములింతటి సౌఖ్యదములుకాఁజాలవు.

వటువులు:—రామచంద్రా! నీవు మమ్ముఁవీడిపోఁగుదువా? మాయన్నా! నిన్నుఁబాసియుండఁజాలము నీవుమాకు సఖుఁడవై సోదరుఁడవై, గురుఁడవై దైవమవై బహువిధామూల్యవిషయములమనోహరముగా బోధించి మాకు వివేకమును సమకూర్చితివి అయ్యా! నీమృదుహాస సుందరములగు సంభాషణములను సంతోషజనకములగుచేష్టలను మేమెట్లు? మఱవనేర్తుము? రాజనందనులారా! మీరు సార్వభౌమపుత్త్రులనుతలంపులులేక, మేముమీతో సమానులవలెఁ దిరిగినందుల కేమియుననుకొనకుడు సోదరులారా! సార్వభౌములరై ప్రజలఁగన్నబిడ్డలనువలెగాపాడుడు

మీరు సింహాసనాసీనులైయున్నపుడు మీయీతాపససోదరులను మఱవకుఁడు.

లక్ష్మణుఁడు:—సోదరులారా! మానవుఁడులోకములో దేనినైన మఱచునుకాని సహపాఠులతోడి సాహచర్యమును మఱచునా?

భరతుఁడు:—అన్నలారా! మేముయువరాజులమైనను లేకమహారాజులమైనను మీకుననుంగుచెలికాండ్రముగానే యుందుముగాని వేఱువిధముగా నుండఁబోవము మాము మేముమఱచిననాఁడు మిముమఱతుమేమొ!

శత్రుఘ్నుఁడు:—మిత్రులారా! నిసర్గసుందరములును శాంతపావనములును, సంతుమిూంద్రభాసురములును, సకలకలానిలయములును నగుసీగురుకులనివాసములు కంఠమునఁబ్రాణములున్నంతవఱకుఁగంటికగుపడుచునే యుండునుకాని మఱపురాఁజాలవు.

రాముఁడు:—సదాశయులారా! గురుకులమిత్రులారా! ఆచార్యదైవతముల నారాధించుచు, శీలశ్రీవిలసితులై, మనయొజ్జలకుఁగీర్తిసంపాదింపఁబ్రయత్నింపుడు. మేముపోయివచ్చెదము. అని, విద్యార్థిబృందములువెంటరాఁ దమ్ములతోఁగలసి, యచటితాపసులకడకేగి, నమస్కరించి "మునివరులారా! సెలవొసంగుడు. అయోధ్యకేగెదము." అననామునులు రాజనందనులారా! మీకీర్తిసుధాలేపములచే దిక్కుడ్యములఁ బ్రకాశింపఁజేయుచు దీనజనబాంధవులరై, చిరకాలమునర్థిల్లుడు." అని దీవించిరి.

అటనుండిశ్రీరాముఁడు సోదరాంతేవాసులతోఁగలసి మునిబాలికలకు విద్యలఁగఱపుచున్న అరుంధతీదేవియొద్దకేగి యిట్లుపలికెను.

రాముఁడు:—అమ్మా! అరుంధతీదేవీ! రేపుమాగురువులు మమ్మయోధ్యకుఁబంపనిశ్చయించిరి. మాకుమిముువదలి తల్లులకడకేగమనసురాకున్నది. గురుశాసనమనుల్లంఘునియమగుటచే నేగుచుంటిమి. కావున మావినయపూర్వకవందనములందుకొని, దీవించిపురమునకునేగననుజ్ఞలసీయఁగోరుచున్నవారము.

అరుంధతి:—తనయులారా! చదువులఁబూర్తిచేసితిరా? మీతల్లులకడకేగుదురా? పుత్రులారా! చిరంజీవులరై మీయుదారకృత్యములచే జగత్ప్రసిద్ధిఁగందుడు. బిడ్డలారా! భూజములుఘనచ్ఛాయాసమేతములైనపుడే పథికజనసంతాపముల నడఁచి వారికిసౌఖ్యములఁ సమకూర్పఁగలవు. భూజనులు వరజాయాకలితులైనపుడే యర్థిజనుల గారవించి సంతృప్తులఁజేయఁగలుగుదురు. కావున రాజనందనులారా! అచిరకాలములోనే యనుకూలలగు కన్యలఁబరిణయమై, యావైవాహిక శుభవేషములమాకుఁజూపఁగోరుచున్నదానను.

భరతుఁడు:—గురుపత్నీ! అట్టివరకళత్ర కరగ్రహణములు సమకూరుట మీయనుగ్రహ ప్రభావమువలననేకదా? అన నచటిమునికన్యకలిట్లు పలికిరి.

మునికన్యలు:—ప్రియసోదరులారా! ఈతపసితోడఁబుట్టువుల మనవకును ఈయరుంధతీమాత తెలిపినటుల మీరుపెండ్లియాడి యామావదినెలమాకుఁ జూపఁగోరుచున్నారము.

లక్ష్మణుఁడు:—సోదరీమణులారా! తోఁబుట్టులఁదోడ్కొని వెళ్లని పరిణయోత్సవములుండునా? మీరుమాతోఁగావలదా? రాముఁడటనుండి సోదరులతోఁగలసి సాయంకాల సంధ్యావందనాదులకు వెడలిపోయెను.

ఆమఱునాడు తెల్లవారినతోడనే వసిష్ఠమునీంద్రుఁడు రామాది సోదరుల వెంటనిడికొని, అయోధ్యకునచ్చెను. దశరథుఁడు వసిష్ఠునకెదురేగి, పూజించెను. రామాదులు తండ్రికినమస్కరింప వారలదీవించి, యానందనిర్భరహృదయుఁడాయెను. అపుడు వసిష్ఠుఁడిట్లుపలికెను.

వసిష్ఠుఁడు:—నృపేంద్రా! నీతనయులన్నివిద్యలయందు నుత్తీర్ణులైయున్నవారు. ఇదివఱకీయార్యావర్తమున నింతటిమేధావంతులగు రాజనందనులుదయింపలేదు. నీవుచేసికొన్నసుకృతముచే నిట్టిసుగుణభూషితులగు సుతులుకలిగిరి. ఇట్టి సత్సంతానమునుగనుటచే నీవును, ఇట్టి సచ్ఛిష్యులఁబడయుటచే నేనును, ధన్యులమైతిమి. రాజేంద్రా! నీవికవీరి సాహాయ్యమున రాజ్యభారమును సడలించుకొని, విరాగివై పరమునకుఁ బాటుపడుము.

దశరథుఁడు:—మునీంద్రా! నాపుత్రులు మీతపోవనమునను
న్నంతకాలము నేనట్టిపరిపాలనకార్యములను జూచియెఱుంగఁ బ్రాజ్ఞుల
గుసచివులే సర్వమునుసాగించిరి. గురువరా! మీతోఁదెలుపనేమి? ఆసు
తవియోగదివసములన్నియుఁ జీకటిరాత్రులుగానేయేగినవి నేనిక సంసా
రవిరాగినగుటయెట్లు ?

వసిష్ఠుఁడు:—రాజేంద్రా! సందేహమేమి? పశువుమొదలు పర
బ్రహ్మమువఱకుఁగల చేతనులకు సుతానురాగమొక్కరీతినివ్యాపించి
యున్నది. రాజచంద్రా! విరాగమభ్యాససాధ్యముకాని వినికిచేఁజేకూ
రునదికాదు. కనుకనీనందనులకు ననువగుకన్నియల సమకూర్చి, సంసా
రులనుగాఁజేసి నీవువైరాగ్యాభ్యాసమునకుఁ బ్రయత్నింపుము.

దశరథుఁడు:—గురూత్తమా! నేనిదివఱకాప్రయత్నములోనే
యుంటిని. కాని నాకుమారులకుఁదగు కన్యకామణులు కానరాకున్న
వారు. కావున సర్వజ్ఞులగుమీరిటఁ గొంతకాలముండి, మీశిష్యులకు
సరియగుకన్నియల నిర్ణయించి వివాహములనెరపఁ గోరుచున్నవాఁడను.

వసిష్ఠుఁడు:—భూపవరేణ్యా! నీకోరికనాకభీష్టమే నేనునునీతన
యుల విడచియుండఁజాలకున్నవాఁడను. కావునఁ గొంతకాలమిటనివసిం
తును. అని స్నానసంధ్యావందనాదులకు సరయూనదికి వెడలిపోయెను.
దశరథుఁడును పరమానందభరితుఁడై సుతులతో నంతఃపురములోని
కేగెను.

సప్తదశాధ్యాయము.

—: విశ్వామిత్రాగమనము :—

దశరథభూపాలుఁడొకనాడు కొలువుదీర్చి నిజనందనులవివాహముల
గూర్చి వసిష్ఠాదులతో నాలోచించుచుండెను. ఆసమయమున నిజతపో
వహ్నికీలలచే క్షాత్రతామ్రమునుగరిగించి, సువర్ణబ్రహ్మర్షివిగ్రహము
నుగాఁ బోతపోసిన తపసిఱేఁడగు విశ్వామిత్రుఁడు రాజమందిరద్వార
ముకడకువచ్చి, ద్వారపాలకులతోఁ దనరాకను మహారాజునకెఱింగింపు
డన వారులోనికేగి, తమయేలికతో గాధేయునిరాకనెఱింగించిరి.

వారిమాటలవిన్నతోడనే యానృపాలుఁడు దిగ్గునగద్దెనుండి దిగి, విశ్వామిత్రునికడకేగి, నమస్కరించి సభామంటపములోనికిఁదోడ్కొనివచ్చి, రత్నసింహాసనముపైఁ గూర్చుండఁబ్రార్థించి, చేతులుజోడించి, ఇట్లుపలికెను.

దశర:—కౌశికమునీంద్రా! మీరాకచేఁగోసలరాజ్యము భాగ్యవంతమైనది; సాకేతనగరము పుణ్యక్షేత్రమైనది. మావంశము ధన్యతనందినది. నాజీవితము సార్థకమైనది. తాపసరాజేంద్రా! మీరాకకుఁ గారణమేదియో తెలియఁజేయుడు నాజీవితము మొదలు సర్వస్వమును మీయభీష్టమునకై ధారపోతును.

విశ్వామి:—ఓక్షత్రియకులతిలకా! ఇట్లతిథులరాగానే యాదరించుట నీకతగును. నేనెట్టికష్టకార్యమును చేయుమందునో తెలియకముందే, ఇట్లుఘనముగా సంభాషించుటచూడ నీయట్టిలేఁడు ముల్లోకములలో లేడని తెలుపనగును.

దశర:—తాపససార్వభౌమా! అర్థిజనమనోరథపూరణమునకు సంసిద్ధుఁడుగాని పార్థివుని, సంపదలును, సామర్థ్యములును, అడవినిగాసిన వెన్నెలలవలె నిరర్థకములగును.

విశ్వామి:—దశరథరాజేంద్రా! మీసూర్యవంశజులు అర్థిజనప్రార్థనాధికములగు సంపదులనొసంగుదురని సుప్రసిద్ధివహించియున్నవారు వసిష్ఠశిష్యులరగు మీకిట్టివిశాలహృదయములుంటలో వింతలేదు. రాజేంద్రా! నీఘనోదారసంభాషణముల విన్నతోడనే "ఇట్టిపరోపకారరమణీయమగు క్షత్రజాతినిబాసి, యాచనాపరుఁడగు బాపఁడనుగా మారితినే"యను పశ్చాత్తాపమునాకుఁగలుగుచున్నయది. ఓత్యాగశీలా! కోసలభూపాలా! వినుమునాయీస్థితమును. మారీచసుబాహులను రాక్షసులు నేయాగదీక్షితుఁడనై, యజ్ఞమారంభించినతోడనే హోమకుండమునఁ గుండలతో రక్తములగుమ్మరించుచుఁ, దట్టలతోమాంసఖండముల విసరుచుఁ, క్రతుధ్వంసము చేయుచున్నవారు. నేనువారల నవలీలగా సంహరింపఁగలను కానిక్రతుదీక్షితుఁడనై యుండుటచే శస్త్ర

ప్రయోగమునకుఁగాని, శాపప్రయోగమునకుఁగాని, వలనుకాకున్న యది.

ఆదీక్షాకాలమున నాప్రక్కనిలచి, యాగధ్వంసకులగు రాక్షసుల సంహరించి, నాయాగమును గాపాడుటకు శూరాగ్రగణ్యుఁడగు నీజ్యేష్ఠపుత్రుని రాముని నవనీరదశ్యాముని నాకొసంగుము అన ఆకౌశికునికోరిక చెవినిఁబడినతోడనే పిడుగుపాటునకు మహీధరమదురునట్లు ఆమహీకాంతుఁడు బెదరి, సింహాసనముపైనొఱిగి, యెట్టకేలకు స్మృతినంది కౌశికునితోనిట్లుపలికెను.

దశర:—దయామయా! గాధేయా! నానందనుఁడగురాముఁడు పదునారేండ్లకు లోఁబడిన పిన్నవయసువాఁడుకాని ప్రౌఢుఁడగువీరుఁడు కాఁడు. అట్టిరాజీవలోచనుఁడు రాత్రించరయోధులతో నెంతమాత్రము యుద్ధముసేయఁదగఁడు కావున రాముని విడువుఁడు నేను చతురంగబలములతోఁగూడి, మీతోవచ్చి రక్కసులయుక్కడఁచి, మీచేనవభృథస్నానము చేయింతును.

విశ్వామి:—రాజేంద్రా! రాముఁడేమియుఁ జేయఁజాలని బాలుఁడనిభావింపకుము. నాకును, మహాతేజశ్శాలియగు నీయరుంధతీకాంతునకును, తత్త్వవేత్తలగు మునివరులకును, రామునినిజతత్త్వముతెలియును. కావున రామునిసామాన్యునిఁగాఁ దలంపక నాకొసంగుము.

దశర:—కౌశికసంయమీంద్రా! ఇల్లువిడిచి పైకెన్నొంటరిగా బోనెఱుంగని రాముఁడేడ? రక్కసులతోఁ బోరుటేడ? రాముఁడిప్పటికిని తల్లికడనేనిదురించునుకాని విడిగాఁబరుండనేరఁడు. కావున మన్నించి రామునివిడువుఁడు నాచేమీకువలయు కార్యములఁజేయించుకొనుఁడు.

విశ్వామి:—కోసలాధిపా! కేవల పుత్త్రప్రేమచే సర్వసమర్థుఁడగు రామునినసమర్థునిఁగాఁ దలంచుచుంటివి. రాముఁడు నీవుతలంచినట్లు అసమర్థుఁడగుచో నేనాతనియాచింపవత్తునా? భూపాలా! ఏలయీలీలబేలతనము పాలయ్యెదవు? రామునినాకొసంగుము.

దశర:—మునీంద్రా! కోపింపక, నావిన్నపమాలింపుడు. లేక లేక నాకీతుదిముదివయసున దైవకృపచే నందనులుదయించిరి. వారిని

నేను క్షణకాలమైనను విడచియుండ నేరను. అంతియకాదు నాపుత్త్రులం దరిలోను రాముఁడు నాకుఁ బ్రియతముఁడు. అందుచే రామునిమీతోఁ బంపఁజాల క్షమియింపుఁడు.

విశ్వామి:—ఓఱేఁడా! నీవింతయసత్యవాదివా? ఇంతటిమోస గాఁడవా? ఇంతకుఁ బూర్వము నీవాడిన ఘనోదారవాక్యములనాలించి నపుడు "క్షత్త్రియజాతినెడబాసితినే" అనివగచితిని. కాని ఇపుడు నీకుటి లోక్తుల నాలించినతోడనే జన్మజన్మాంతరములకునుగూడ వంచనాకో విదులగు క్షత్త్రియులకులమున బుట్టరాదని తలంచుచుంటిని.

రాజా! నీపుత్త్రుల క్షణముకూడ విడువనేరవా? అట్లైన వారినిగురుకులమున కెట్లుఁ బంపఁ గలిగితివి? అమ్మలకడనేకాని యుండ నేరనినీపిల్లలట్టి దరుతలములనెట్లు సహించిరి? దశరథా! చాలుంజాలు తెలిసెనీయావిపస ఇట్లుశుష్కప్రతిజ్ఞలచే నర్థులమోసబుచ్చుచు, చిరంజీవివైయుండుము. ఇట్టియోగ్యతకలనీకడ నీవసిష్ఠుఁడు గురుఁడుగానుం డుటకెట్లంగీకరించెను? ఊఁ! ఏలనాకీవితర్కము. అన్నా! చెవిటివానియొద్ద శంఖమూదినట్లు లుబ్ధునికడవ్యర్థముగాఁ బ్రార్థనావాక్యములఁ బలికితినే? ఇక వేఱొకయుత్తమక్షత్త్రియునికడ కేగుట మంచిది.

దశర:—తాపసేంద్రా! మీకుఁగావలసినది రాక్షససంహారము కాని రామాపహరణముకాదుకదా! అట్టిస్థితిలో రాక్షసయుద్ధములలో వారితేరిన నేనువచ్చి, వారిసంహరింతునని ఘోషించుచుండ నన్నువిడచి వేఱొకనికడ కేగన్యాయమా? ఇందునామోసమేమియున్నయది? మీరు కోరినకార్యమును నేను నెఱవేర్చనని పలికినపుడుకదా! మీరిట్లు కఠినముగానుడువవలయును.

విశ్వామిత్త్రుడు:—చాలు నీసాహాయ్యము ఇపుడేకదా "తుది ముదివయసుననుంటి" నంటివి. అట్టిజరఠుడవు విల్లుబట్టఁజేయియు, నిలువఁగాళ్లును, వణఁకుచుండ దృష్టిదోషివై, నిశాచరవీరులఁ గొట్టవత్తుననుట కెట్లు సిగ్గుపడకుంటివి? అనివసిష్ఠునిఁజూచి ఇట్లుపలికెను.

విశ్వామి:—సోదరుఁడా! వసిష్ఠమునీంద్రుఁడా! నేనేగెద నీవీ యసత్యవ్రతునిఁబట్టికొని చాకులాడక నందినీకల్పితములగు సంపదలసా

ఖ్యముగా ననుభవింపుము." విశువృమీపాటికి తేనిపౌరోహిత్య కృత్యమును అని యాసనమునుండిలేచి, వనమహీరుహముల దహింపఁబూనుచు వెడలిన దావానలముభంగి, మండిపడుచున్న కౌశికునిఁ జూచినతోడనే సభాసదులెల్లరు "నేఁడేదియో విపరీతకార్యము జరుగనున్నది." అనిభీతిల్లఁదొడంగిరి. అంతవసిష్ఠమహర్షి లేచి, దశరథునితో నిట్లుపలికెను.

వసిష్ఠుఁడు:—అజతనయా! ఆడినపలుకులకై యసువులనుగూడ నిర్లక్ష్యముగాఁద్యజించు దానవీరులఁగన్న భానువంశమున జననమొంది, ధీరుఁడవనియు, ధీమంతుఁడవనియు, దానశౌండుడవనియు, ప్రసిద్ధిఁజెందిన నీవుపలికినట్లుసేయక వెనుకంజవేయుట పాడికాదు. ఇదియునుఁగాక, సంతసింపఁదగు సమయమున వ్యర్థముగాబెగడొందుచుంటివి. వినుము త్రిలోకముల నొకక్షణములో సృష్టింపగలిగినట్టియు, వేఱొకసృష్టితో వానినిగిట్టింపఁజేసినట్టియు బ్రహ్మర్షియనిపేరొందినట్టియు, విశ్వామిత్రుఁడు నరదానాపేక్షియై యిటకువచ్చుట నీభాగ్యముకాకమఱేమి? ఆనాఁడు బలికి వామనరూపుఁడగు శ్రీహరియు, ఈనాఁడునీకు బాపనరూపుఁడగు కౌశికుఁడును ప్రతిగ్రహీతలుగాసమకూరిరి. ఇదిసంతసహేతువుకాదా?

మఱియు నపూర్వములగు దివ్యాస్త్రవిద్యల రామునకుపదేశింప నెంచి, కాఱడవులదాటి, క్రతుసంరక్షణమిషచే, రామునిఁగొనిపోవ వచ్చినాఁడు అంతియకాని దానవభీతుఁడై రాలేదు మారీచాదులేకాదు దిక్చక్రమునఁగల రక్కసులందరు నొకపెట్టునఁ దనపైకివచ్చినను నొక్క కోలతోనారినేలఁగూలనేయఁగలఁడు. శాపానలముచే రాత్రించరాటవిని మొదలంటదహింపగలఁడు ఈతాపసవీరుఁడు తనయొద్దనున్న దివ్యాస్త్రముల గడ్డిపోచలకుపదేశించి ప్రయోగించినను ఆగడ్డిపరకలు రాక్షసానీకముల దూలలవములవలె దహింపగలవు. ఆవాహకశక్తి యస్త్రవిద్యయందుఁగలదుకాని యభ్యాసకునియందులేదు. అట్టియపూర్వధనుర్వేదము నభ్యసించుటకు నర్హులగుద్విజకుమారులు తండోపతండములుగాఁ దనయాశ్రమముననున్నను, వారికుపదేశింపక నీసుతునివిద్యార్థినిగా వరించుచున్నవాఁడు మామిత్రుఁడగునీగాధేయుఁడు బాపఁడయ్యు క్షత్రికులాభిమానమునుమాత్రము వీడనేరకున్నవాఁడు. కావుననే ఇతరకుల

మునందలి కుట్టిలవదలి, రాక్షోమయుఁడగు రామునికి దివ్యాస్త్రవిద్యల ను పదేశింపఁగోరుచున్నవాఁడు.సంస్కారములు బాహ్యరూపముల మార్పఁ జాలునుకాని, మానసికవృత్తుల మరలింపనేరవు. రాజులుబ్రాహ్మణులైన ను, బ్రాహ్మణులురాజులైనను కులాభిమానబీజములంతరంగమున మొల కలెత్తుచునేయుండునుకాని శూన్యములుకానేరవు.

ఓకౌసల్యారమణా ! మాయుపలకక వెంటనేరాముని విశ్వామి త్రునికొసంగి నీక్షత్రియకులమర్యాదను నాపురోహితకులగౌరవమును నిలువబెట్టుము. అనిబోధింప దశరథుఁడు నిజసుతులఁబిలిపించి రామునితో నిట్లుపలికెను.

దశర:— రామచంద్రా! ఈవిశ్వామిత్రమహర్షి యాగవిఘ్న కారులగు రాత్రించరుల నీచేసంహరింపఁజేసి యజ్ఞమునుసాగింపఁగోరి నీకైవచ్చియున్నవాఁడు. నేనునిన్నుబంపసమ్మతించితిని. కావున వీరివెంట నేగి క్రతువునుగాపాడి, కీర్తినిగొనిరమ్ము.

రాముఁడు:— సుతవత్సలా ! కోసలాధిపా ! మీయాజ్ఞానుసార ము కౌశికమునీంద్రులవెంటనేగి వారియాగమును సాంతముగాసందర్శిం చి, వారియాశీస్సులనందుకొని, వత్తును కానితండ్రీ ! నాకుబహిఃప్రాణ మగు లక్ష్మణునిగూడ నాతోఁగొనిపోవుటకంగీకరింపవలయును.

దశర:— రామా ! ఇదికోరదగినది కాదు. మీరిరువురు నెడబాటు లేనియున్నదమ్ములు. సౌమిత్రిని నీతోఁదీసికొనిపోవచ్చును అనిరామ లక్ష్మణుల విశ్వామిత్రునకునొప్పజెప్పి జాగుసేయకుతమమిచ్చుంపవేడెను. శ్రీరాముఁడు కౌశికునకునమస్కరించి "మునిరాజేంద్రా! మేము మా తల్లులకడకేగి వారిసెలవులగైకొనివచ్చుటకు నను జ్ఞనొసంగవలయును" అనవిశ్వామిత్రుఁడిట్లుపలికెను. "నయనాభిరామా ! రామా ! మీరు తప్పకతల్లులకడకేగి వారియంగీకారములను ఆశీర్వాదములను జేకొని రండు తొందరలేదు." అనరాముఁడు! "మహాభాగ్యము పోయివత్తుము." అని తెలిపి తమ్మునితోఁతల్లులకడకేగి నమస్కరించి ఇట్లుతెలిపెను.

రాముఁడు:— మాతలారా! వింటిరికదా? విశ్వామిత్రాగమనవా ర్తను?

కౌసల్య:—కుమారా! తెలిసికొంటిమి. నిన్నుబిలువవచ్చిన సేవకులవలన.

కైక:—రామచంద్రా! ఆయుగ్రతాపసి యెందులకువచ్చె?

సుమిత్ర:—రామా! అతఁడు తిరుగమనకులగురునితోఁ గయ్యమాడనెంచెనా? లేకయేదియేని యాగముచేయనెంచెనా?

రాముఁడు:—సాధ్వీమణులారా! ఆమహర్షి కలహాకాంక్షచే రాలేదు మఱేమన ఆతపసిచేయుచున్న జన్నముచు రక్కసులు సాగనీకున్నవారట వారిని సంహరింపఁజేయుటకై నన్నుఁదీసికొనివెళ్ళవచ్చినాడు కావున ఆశీర్వదించియనుజ్ఞనొసంగుడు.

కౌసల్య:—అయ్యోబిడ్డా! ఆతపసికి బుద్ధిసడలెనాయేమి? లేకున్న నీరజలోచనుఁడవగునీవెక్కడ! ఆక్రూరనిశాచరవీరులెక్కడ? ఇంతమాత్రము యోచింపకుండునా?

కైకేయి:—ప్రియనందనా! నినువారిలోఁబంప సాకేతసార్వభౌములంగీకరించిరా?

రాముఁడు:—సందేహమెందులకు అర్థిమనోరథములనీడేర్చుటయే ప్రభాకరాన్వయనందనపారిజాతములకు సహజలక్షణముగదా?

సుమిత్ర:—సుధామధురభాషణా! రవికులభూషణా! అట్లగుచో నీవుకౌశికయాగసంరక్షణమొనర్తువన్నమాటయే.

రాముఁడు:—సతీమణీ! మీయాశీఃప్రభావముచే, నేనొక్కరుఁడకాదు. నాతమ్ముఁడు లక్ష్మణునితోఁగలసి, యామునికియాగఫలము సమకూర్పనభిలషించుచున్నవాఁడ.

కౌసల్య:—రామా! నీవుమమ్మొడబాసిపోవుటకునేనంగీకరింపను.

సుమిత్ర:—అక్కా! కోసలసార్వభౌముఁడు రామునిబంపబాస చేసియుండ మనమునివారింపనగునా?

కౌసల్య:—సోదరీ! కాకేమి అంతగావచ్చిన నేనాకౌశికునిపాదములపైఁబడి పుత్త్రభిక్షముపెట్టుమని ప్రార్థింతును. వసిష్ఠుని రామగమనము నివారింపుడని వేడికొందును. అంతియకాని యంతకమూపులగు రక్కసులవాతఁ గొడుకుపడ నంగీకరించుదానఁగాన్.

కైకేయి:—పట్టమహిషీ ! అట్లుపట్టుపట్టిన "రాజమంచివాఁడే కాని రాణులుగయ్యాళులు" అను లోకాపవాదమునకు లోనగుదుము. కావునఁ గొంచెము తాళుము.

లక్ష్మణుఁడు:—అమ్మా ! కౌసల్యాదేవీ ! మొన్నమాయన్నదమ్ముల వసిష్ఠునితో గురుకులమునకు సంతోషముగాఁ బంపి ఇపుడేల కౌశికునితో నంపఁజంకుచుంటివి ?

కౌసల్య:—లక్ష్మణా ! అదివిద్యాభ్యాససమయమగుటచే గురువులతో నేగనంగీకరించితిమి.

భరతుఁడు:—జననీ ! అదివిద్యాభ్యాససమయము ఇదివిద్యాప్రకాశసమయము. అమ్మా ! విద్యార్థులు తామునేర్చినవిద్యలఁ బ్రదర్శింప నేరనినాఁడు వారువిద్యావిహీనులతో సమానులేకాని యధికులుకాఁజాలరు.

శత్రుఘ్నుఁడు:—తల్లీ ! మాయన్నభరతుఁ డెలిపినటుల మణులు శాణమునరాయఁబడి కాంతివంతములై వెలయును రాజకుమారులు రణమునరిపులతోఁబోరి, తేజోవంతులై వెలయుదురు. కావున మాయన్న నేర్చినవిద్దెలకు వన్నెరానున్నపుడు తామడ్డుపడఁజనదు.

సుమిత్ర:—అక్కా ! కౌసల్యాదేవీ ! సర్వజ్ఞులగు వసిష్ఠభగవానులయనుమతిని మనప్రాణేశ్వరులు రామునికౌశికునితోఁ బంపుచున్నవారు. కావున వాత్సల్యవశంవదవై వేరుగాఁదలఁపకుము.

కౌసల్య:—సోదరీమణులారా ! నాకంటెమీకే రాముఁడెక్కుడుప్రేమాస్పదుఁడు మీయిష్టానుసారము చేయుఁడు. రాముఁడాకౌసల్యోక్తులకు సంతసించి భరతశత్రుఘ్నులఁజూచి ఇట్లుపలికెను.

రాముఁడు:—సోదరులారా ! భరతశత్రుఘ్నులారా ! మాపై ధ్యానముంచి తలిదండ్రులయాజ్ఞలనేమరకుఁడు పోయివచ్చెదము.

భరతుఁడు:—అన్నా ! రామచంద్రా ! నీవుమాకండ్లకగపడుచున్నయపుడే నిన్నుస్మరించుమేము నీవుమాకుదూరమై యున్ననాఁడు తలంపకుండుటెట్లు ?

శత్రుఘ్నుఁడు:—అన్నా! రాక్షసవధి జేసి తిరుగవచ్చునప్పుడు మా కేమి తెత్తువు.

రాముఁడు:—చిన్ని తమ్ముఁడా! రాజనందనుల మెచ్చింపఁదగిన వస్తువులు తాపసాటవియందున్నా? సోదరుఁడా! కౌశికమునీంద్రుని కృపచే నపూర్వభాగ్యమేదియేని సమకూరుచో నందుమన మందరము సమభాగులమే. అని సుమిత్రతో నిట్లుపలికెను. "జననీ! సుమిత్రాదేవీ! నాతో లక్ష్మణునిగూడఁ దోడ్కొనిపోవ సమ్మతింపవలయు."

సుమిత్ర:—రామచంద్రా! ఇదికోరనక్కరలేదు. నీతో నీచరణము లెట్లవినాభావముగానుండునో అటులనే నీపదపంకజసేవకుఁడగు లక్ష్మణుఁడును నీతో నెడబాటులేనివాఁడే బాలశూరుఁడా! రాక్షసులఁ గూలనేసి తపసియాగమునుగాచి మీతల్లులకువీరమాతలనెడి కీర్తినిగొనిరమ్ము పొమ్ముసుఖముగామునితో రాముఁడు "చిత్త"మని తల్లులవీడ్కొని విశ్వామిత్రునికడకువచ్చి నమస్కరించి నిలచెను. అంతవిశ్వామిత్రుఁడా రాముని వినయసంపదకు సంతసమంది వసిష్ఠదశరథులతోఁ బోయివత్తునని పలికి రామలక్ష్మణులవెంటనిడికొని వెడలిపోయెను.

అష్టాదశాధ్యాయము.

—♦ తాటకాసంహారము ♦—

"ఓహో! ఏమియావిశ్వామిత్రుని భాగ్యము. వీతరాగులగు పరమహంసలు శ్రుత్యంతవిహారియగు నేయానందాద్వైతరూపునిఁ దెలిసికొనఁ బ్రయాసపడుదురో; యట్టిపురుషోత్తముఁడు నృపకుమారరూపుఁడై ప్రభువువెంటఁ బరిచారకునివలెఁ దనవెంటరాఁ బ్రయాణమొనర్చుచుండెను." కౌశికుఁడట్లు రామలక్ష్మణులతో నయోధ్యనువీడి, యామ్యక్రోశముల దూరమేగి, తనపిఱుంద మోమునఁజెమటలు మొలకలెత్తఁ, లలాటమున నలకలల్లలాడ, చిఱునగవుతోఁ దూణీరము భుజస్కంధమునను ఎడమచేతఁగోదండమును, కుడిచేత బాణమును, బట్టుకొని తమ్మునితోనడచివచ్చుచున్న మోహనరూపుఁడగు రామునిఁజూచి ఆనందభరితుఁడై యిట్లుపలికెను.

కౌశికుఁడు:—కౌసల్యానందనా! మీసోదరులముఖవైఖరిఁ జూడఁ గొంచెమాయాసము చెందియున్నట్లు కానవచ్చుచున్నవారు. కావున నదీజలములనాచమన మొనర్చి యిటురండు మీకు రెండు విద్యలనుప దేశింతును. వీనినిగ్రహించుటచే నిద్రాహారములు లేకున్నను, నెట్టికష్టములును గలుగనేరవు.

ఆమాటలువిన్నతోడనే రామలక్ష్మణులు జలములనాచమించి, విశ్వామిత్రునుండి విద్యలగ్రహించిరి. ఆవిద్యలు వారియందుసంక్రమించినతోడనే బాలసూర్యులవలెఁ దేజరిల్లఁదొడంగిరి.

అటవారారాత్రి దర్భశయ్యలపై శయనించిరి. తెల్లవారినతోడనే విశ్వామిత్రుఁడు దర్భలపైఁగనులుమూసి నిదురించుచున్న యారాజకుమారులఁజూచి "కౌసల్యానందవర్ధనా! రామా! సూర్యోదయము కానున్నయది స్నానాదికృత్యములఁ జేయవలసియున్నది కావున లెమ్ము తమ్మునితో" అన రాముఁడు వెంటనే లేచి, తమ్మునిమేల్కొల్పి, ప్రాతస్నానాదులఁదీర్చికొని, మునివెంటనేగుచు నొకదివ్యాశ్రమమును దిలకించి కౌశికునిట్లుప్రశ్నించెను.

రాముఁడు:—మునివర్యా! ఈదివ్యాశ్రమమెవరిది? ఇందలిమునులు ప్రత్యక్షశివస్వరూపులుగాఁ గానవచ్చుచున్నవారు ఈస్థలమహాత్మ్యమును దెలుపుడు.

విశ్వామి:—రామచంద్రా! చక్కఁగ గుర్తించితివి. ఇయ్యది శివమహిమతోఁగూడినవనమే వినుము దీనియుదంతమును కౌసల్యానందనా! మున్నొకపుడు పురహరుఁడు విరాగియై తీవ్రసమాధిని గన్నులు మూసికొని తనలోనున్న యద్వితీయానందస్వరూపమును ధ్యానించుచు నన్యమెఱుఁగక యిటఁ దపమాచరించుచుండెను. అట్లుఘనవిరాగియై యున్న హరునకుఁ బరిచర్యల నెఱప నగరాజు తనతనయయగు గౌరిని నియమించెను. ఆపార్వతి చంద్రశేఖరుని సేవించుచుండ, స్వార్థపరుఁడగు దేవేంద్రుఁడు విరాగియగు కపర్దికిఁ గాత్యాయనిపై ననురాగమును బుట్టించి, యాపురహరుని సంసారినిగాఁ జేయఁదలఁచి, సుమాస్త్రునిరాఁ

బిలిపించి, మంచిమాటలతో నాపూర్వులుకానిలాలించి, యామనసిజుని శివునిభార్యలీపిప్రియునిగాఁ జేయఁబుఱిగొల్పెను.

పాపమాపిచ్చివాఁడగు పంచశరుఁడు సురపతియొక్క తేనిపలుకుల కుబ్బి, సాధ్యాసాధ్యముల గాఁ రింపక యే "క్షణములోఁబశుపతిని గిరిజా మోహపాశబద్ధునిగాఁజేయుదును" అనిప్రతినఁజేసి, ఒకమనోహరమగు వసంతసమయమున శివాశ్రమమునకేగి, కోకిలకలకూజితములను, సౌరభలసితములగు మలయమారుతములను, నవరాగకలితములగు కిసలయ బాణములను, సహాయములనుగాఁజేకొని, దూరమునుండి వెండికొండ వలెఁ దేజరిల్లుచున్న మహేశ్వరునీక్షించి, చకితచేతస్కుఁడై యామీనకేతనుఁడు జేజేలకడఁ దాఁజేసినబాస, పిలువఁబెట్టికొనఁగోరి, చేతనున్న చెఱకువింట, మావిచిగురాకుతూపును దొడిగి యామూక్కంటిని గురిపెట్టికొట్టెను.

అంత నాసహకారకిసలయాశుగము సూలియుల్లమునదాకి, సమాధినిభేదింప నావిషమనయనునకుఁ గామమంకురింపలేదుకాని, క్రోధమావిర్భావమాయెను. అందుచే నారుద్రుఁడుగ్రుఁడై, నిజఫాలనయనాగ్నిజ్వాలలచేఁ గామునిబుగ్గిచేసెను. "నిజమే! సామాన్యభూపుల కోపములే సంసారుల భస్మముచేయుచుండ, జగదీశ్వరాగ్రహము మన్మథునిమాడ్చివేయుటలో వింతయేమున్నయది."

అంత హిమాచలతనయ తనభక్తిప్రపత్తులచే నాశంకరుని నశంకరునిగాఁజేసికొని, యాతనికర్ధాంగియై కృతార్థురాలయ్యెను. అదిమొదలీపుణ్యతపోవనభువిని నివసించుమునులు ఇందుశేఖరుని ధ్యానించుచు నిందుఁదపమాచరించుచున్నవారు. ఇట మీనకేతనుఁడంగహీనుఁడగుటచే నీదేశమునకంగదేశమని పేరువచ్చినది. రామచంద్రా! మనమీ రాత్రి యిటఁగడపి, తెల్లవారినతోడనే జాహ్నవీనదినిదాటి, ముందు నకుఁబోవుదము అని, అచటిమునులొసంగిన ఫలమూలాదులఁజేకొని కౌశికుఁడు రామలక్ష్మణులఁగుశశయనములపైఁ బరుండఁజేసి, తెల్లవారక మున్నే నృపకుమారులతోగంగాతీరముఁజేరి యచటిసంయమీంద్రుల

పూజలనందుకొని, భాగీరథినిదాటి వెడలుచుండ, రాముడు ముందొక నిర్జన భీకరాటవినిగాంచి, యిట్లుప్రశ్నించెను.

రాముఁడు:—మునీంద్రా! ఈముందుగానవచ్చు నరణ్యము పేరేమి? ఇదియిట్లుసత్త్వశూన్యమై యుండఁగారణమేమి?

విశ్వా:—రామచంద్రా! నీకుదీనివృత్తాంతము తెలుపఁదగిన దియే. వినుము ఈవిపినమునకుఁ దాటకాటవియనిపేరు. దీనియందుఁ దాటకయను యక్షాంగనయొకర్తు భర్తనుబాసి, భయంకరనిశాచరీ రూపములోఁ దిరుగుచుండును. ఇందుఁగలసత్త్వములన్నియు దానివాతఁ బడినవి. అందుచే నీప్రదేశముజంతుసూన్యమై యున్నయది.

రాము:—ఆర్యా! యక్షకాంతలు లోకోత్తరసుకుమారసుందరాంగులని ప్రసిద్ధికలదే! అట్టిస్థితిలో దీనికీ రాక్షసరూపమెట్లువచ్చె?

విశ్వా:—వినుము. సుకేతుఁడను యక్షనాయకుఁడు అజునిగూర్చి తపమొనరింప నాయబ్జాసనుఁడు ప్రత్యక్షమై "నీకేమికావలయు" నని యడుగ నసుకేతుఁడు నాకుఁసహస్రనాగములబలముకల సుతుఁడు కావలయును" అని కోరెను. వాణీపతి యదివిని "నీకుఁబ్రస్తుతము పుత్రుఁడు కలుగఁడు నీవుకోరినదానికి వేయిరేనుగులసత్త్వముకల పుత్త్రికపుట్టును" అని యంతర్ధానమయ్యెను. అంతఁగొంతకాలమునకు సుకేతునకు వేయిమదగజములబలముకల యొకకూతురుపుట్టెను. అతఁడాబిడ్డకుఁ దాటకయని పేరుపెట్టి అల్లారుముద్దుగాఁ బెంచికొనుచుండెను. ఆబాలికయుఁ గ్రమక్రమముగాఁబెద్దదై, పర్వతరూపములో నడగొండవలె సంచరింపఁదొడంగెను. ఆకాలముననే జంభుఁడనురాక్షసుఁడు సురేంద్రుని సంహరింపఁదగుసుతునిఁ బడయఁగోరి, శివునిగూర్చితపమొనర్చి యాదేవదేవునివలనఁ బదివేలయేనుగులబలముగల పుత్త్రునిఁబడసి, యానందననకు సుందుఁడనినామకరణమొనర్చెను. జంభుఁడు మహాబలుఁడగునందనునితోఁగూడి, దేవతలను పీడింపఁదొడంగెను. దేవతలు వానిబాధకుఁ దాళఁజాలక, యగస్త్యమునీంద్రునికడకేగి, జంభసుందుల విజృంభణమును దెలిపిరి ఆప్పుడుకుంభజుఁడు దేవేంద్రునకు రాక్షసాంతకమగు

సస్త్రముననొసంగి, ఇంద్రునిచే జంభునిఁజంపించెను. సుందుఁడంతటఁ గుంభజునిపైఁబగపట్టియుండెను

ఇటులుండ సుకేతుఁడు తనతనయయగు తాటకకు వివాహయోగ్యమగు వయసురాఁగా, నామెకుఁ దగుభర్తను సమకూర్ప యత్నించుచుండెను. నారదుఁడీసంగతిని దెలిసికొని, సుకేతునికడకేగి సుందునకుఁ దాటకనొసంగుమని తెలిపెను. సుకేతుఁడు వెంటనేతననందనను సుందునికిచ్చి పెండ్లిచేసెను.

సుందుఁడా సుందరాంగితోఁ గూడి కాపురముచేయుచుండ, ఆదంపతులకు మారీచుఁడను కొమరుఁడుపుట్టెను. పిమ్మట సతీపతి సుతులు ముగ్గురు లోకవినాశనవ్రతకంకణముల ధరియించి, ప్రాణులఁబీడింపఁ దొడంగిరి. వారినిసంహరించువారలు కానరాకుండిరి. ఇటులుండ,

అగస్త్యుఁడొకనాడు ప్రయాగకేగుచుండ సుందుఁడుచూచి తన తండ్రినిజంపిన పగఁదీర్చుకొననెంచి, యాసాగరపాయి కడ్డముగా నిలచి "నిలువుమెటకుఁబోయెదవు? చిక్కితివిన్నినాళ్ళకు" అనికరవాలమును దూసివధకుఁబోవ నాసంయమీంద్రుఁడు హూంకారముచే వానిని సంహరించెను.

ఆసంగతిని తాటకామారీచులు తెలిసికొని అగస్త్యుని జంపఁబోవ "దుష్టులారా! సుందసుందరీనందనులారా! మీరు యక్షరూపములను వీడి రాక్షసరూపములతో నుందురుగాక!" అనిశపియించి వెడలిపోయెను. అదిగో ఆలోపాముద్రాకాంతునిశాపముచేఁ దాటకామారీచులు నిశాచరరూపులైరి. అదిమొదలు తాటక భీకరరాక్షసరూపమై, యీయటవిని నివసించును. ప్రాణులఁబీడించుచున్నయది. దీనిమూలమున నెన్ని యోగాశ్రమములు జనశూన్యములగుచున్నయవి కావున రామచంద్రా! నీకీక్రూరరాక్షసిని గడతేర్ప ప్రాణిసమూహములఁ గాపాడుము నేను నిన్నీమార్గమునఁ దీసికొనివచ్చుటకుఁగారణము నీచేఁదాటకాసంహారము చేయించుటకే.

రాముఁడు:—గురువరా! పెద్దలయాజ్ఞలువిమర్శింపక యాచరింప తగినవియే. కాని, మునీంద్రా! ఈస్త్రీవధ లోకనిందాకరమని నాహృద

ఘము బెదరుచున్నయది. నన్ను మీయానకు రాదువానినిగాఁదలంపక నాకుధర్మమునుబోధింపఁ గోరుచున్నవాఁడను

విశ్వా:—క్షత్రియకులవరా! బెదరఁబనిలేదు; దుష్టసంహారము రాకొమరులకు విధివిహితము పుణ్యప్రదము యశస్కరము: పెద్దపులులు నల్లత్రాఁచులు, లోకదుష్టజంతువులెట్లు స్త్రీపుంభేదములేక సంహరింపఁబడునో యటులనే స్త్రీపురుషభేదమును బాటింపక దుష్టులశిక్షింపవలెను. దండనము దోషమునుబట్టి చేయవలయునుగాని లింగభేదమును బట్టికాదు. నీవియొక్కరక్కసిని జంపితివేని వేనవేలజీవులఁ గాపాడినపుణ్యాత్ముఁడవు కాఁగలవు కావున సంశయమునువీడి, యీకౄరరాక్షసిని సంహరింపుము. ఇందు స్త్రీహత్యాదోషమింతమాత్రమును లేదు. అనుచుండఁ బర్వతగుహలు ప్రతిధ్వనించునటుల బొబ్బలిడుచు, నాకసమునఁ గారుమబ్బువలె నొకభయంకరవ్యక్తి కానవచ్చెను. రాముఁడానడగొండవలె గనబడుచున్న యాభూతాకృతిని లక్ష్మణునకుఁజూపి యిటులుపలికెను.

రాము:—తమ్ముఁడా! కంటివా! దీనిభీకరాకారమును! నిజముగా దీనినికనుగొన్నమాత్రాన దుర్బలమానసులు ప్రాణములనట్టెవిడుచుటకు సందేహములేదు కాని సోదరుఁడా! ఈవృద్ధాంగనను జంపఁజేతులాడకున్నయవి కావున దీనికరచరణములనరకి, నేలఁగూలనేతును. చూడుమనుచుండగనే, యాదండుముండ రామలక్ష్మణులఁజూచి, బిగ్గఱగనార్చి యడవిలోనిదుమ్ము దోసిళ్లతోఁదీసి, వారిపైఁజల్లుచు, గొండరాలను విసరనారంభించెను వెంటనేరాముఁడు దానికాలుసేతులఁదెగనఱకెను.

అంతనాయక్షి పక్షివలె నెగురుచు లక్ష్మణునిమీఁదికిరాగా నాతఁడు కత్తిచేదానిముక్కుసెవులఁగోసెను. అటుపిమ్మట నానిశాచరి రాక్షసమాయలఁబన్ని, యాయడవియంతయు నంధకారబంధురముగాఁ జేసి, రక్తమును వర్షింపఁదొడఁగెను. మొగులురుముసట్లు చెవులుపగుల ధ్వనిసేయనారంభించెను. అపుడుకౌశికుఁడు "రామా! రామా! జాగుసేయక యీకౄరరాత్రించరిని సంహరించి, గోబ్రాహ్మణాదిప్రాణివ్రాతమునకు మేలుసమకూర్చుము." అనరాముఁడు ధనస్సునశబ్దభేది

ఘాణమునుసంధించి, చీకటిలోనార్పుచున్న యాతాటకఁగుండెపగులఁ గొట్ట నాపాపాత్ముఁరాలు హా! చచ్చితినని” యార్చినేలపైఁబడెను.

అపుడు ఖేచరులు పుష్పవర్షముల రామునిపైఁగురిపించిరి.

—: ఏకోనవింశత్యధ్యాయము :—

దివ్యాస్త్రోపదేశము.

విశ్వామిత్రుఁడు పరమానందభరితుఁడై రామునిఁగౌఁగలించుకొని “దశరథనందనా! యెంతకాలమునకీయరణ్యముఁ దాటకా పీడావిముక్తముఁగాఁ జేసితివి ! ఇకనిట మునిసంఘములు నీపేరఁబల్లెలఁగట్టికొని, నిత్యమునినుదలంచుచు సుఖముగానుండఁగలరు పథికులు నిర్భయముగా నీయటవీమార్గమునఁ బ్రయాణముల సాగింపఁగలరు. మనమీరాత్రి యిందునివసించి, రేపుసిద్ధాశ్రమమునకేగుదము. ఇకనీయడవికి రామకాననమని పేరువచ్చును. ఇందుఁదపమాచరించువారికిఁ జిత్తశుద్ధియు, భగవద్భక్తియుఁ గలుగఁగలవు అనివరమొసంగెను.

ఆనాఁడే యాయరణ్యము క్రొత్తసింగారముతో వెలయఁజొచ్చెను. ప్రశాంతమగు నాసాయంతనసమయమునఁ బక్షిసంఘములు సంతసముతోఁ బరిగిడివచ్చి వృక్షాగ్రములవ్రాలి చెవికింపుగాఁగూయుచు గూడులఁగట్టమొదలిడెను. అందలిమహీరుహములు సందెకెంజాయను మించు లేఁజిగుళ్ళఁదొడుగ నారంభించెను. సింహవ్యాఘ్రాదిశ్వాపదములు మహీధరకందరముల జేరఁదొడంగెను. అజహరిణాదిసాధుమృగములు లతాకుంజముల నిదురింపనేగెను. మునిముచ్చులటకువచ్చి, కుటీరనిర్మాణములకై స్థలనిర్ణయములఁ జేయఁదొడంగిరి. ఇట్లాతాటకాటవి విహగగణకూజిత సుందరమై మృగనివహనిరంతరమై; మునిసమాజసమావృతమై కౌశికహృదయానందజనకమైరామచంద్రమందహాసచంద్రికాలసితమై విలసిల్లెను.

విశ్వామిత్రుఁడారాత్రి యటసంతోషముగాఁగడపి, తెల్లవారినతోడనే సరసీజలముల రామలక్ష్మణులతోఁగూడి స్నానమాడి, ఉత్తరాభిముఖముగ రామునిఁగూర్చుండఁబెట్టి తాఁబ్రాఙ్ముఖుఁడై “రామచంద్రా నీధైర్యస్థైర్యములకు సంతసించితిని. నీకునాకడనున్న దివ్యాస్త్రములు

నుపదేశింపనెంచితిని. సుధీమణీ! గురుఁడు విద్యార్థులకు వారియర్హతను దెలిసికొని, విద్యలనుపదేశింపవలయును గాని, పాత్రాపాత్రలదెలియక త్వరపడిచనువుల బోధింపరాదు. అందులో నస్త్రవిద్యల నుపదేశించునపుడు, శిష్యులబాగుగాఁ బరిశీలింపవలయును. అందుచే నీసామర్థ్యమును దెలిసికొనువఱకు నీకస్త్రములబోధింపనైతిని ఇప్పుడు నీవొనర్చిన తాటకాసంహారము ఇంద్రాదిదేవతలకుఁగూడ శక్యముగాకుండెను. అంతటి మహాబలసంపన్నయగు రాక్షసిని నీవనాయాసముగా సంహరించి, నీయనుపమానపరాక్రమమును ప్రకటించితివి. కావున నీవుదివ్యాస్త్రగ్రహణమునకెంతయుఁ దగియున్నవాడవు రామచంద్రా! సమంత్రకముగా నస్త్రవిద్యలఁజేకొనుమన రాముఁడు వినయముతో నాయస్త్రగ్రామమునుజేకొని, దివ్యతేజోవిభాసితుఁడాయెను.

కౌశికుఁడటనుండి రామలక్ష్మణులతో ముందునకేగుచుండఁ గౌసల్యానందనుఁడొక సుందరతరముగువనమునుగాంచి యిట్లుప్రశ్నించెను.

రాముఁడు:—మునీంద్రా! మహోన్నతతరుషండమండితమై, గోహరిణాదిపశుసందోహసుందరమై, శుకశారికాదివిహగకూజితమోహనమై, చేతోహరకాసారవారివిహారి మరాళరాజిరంజితమై, నిగమాభ్యాసపరమునికుమారగీయమాన సామగానాకర్ణనాగత కిన్నరీసందోహబంధురమై, ద్వేషదూరమై, ప్రేమనిలయమై, నందనవనమునుమించి ఆగిరిదరిని గానవచ్చుచున్న వనమెవ్వరిది? దానిపేరేమి? దీనింజూచినతోడనే నామానసమున నేదియో తెలియరాని యానందముదయించుచున్నయది.

విశ్వా:—రామచంద్రా! సిద్ధాశ్రమమని పేరు. పూర్వము శ్రీమన్నారాయణుఁడిట వటురూపముఁ దపమాచరించి, చింతితార్థసిద్ధినందుటచే, దీనికిసిద్ధాశ్రమమని పేరువచ్చినది. ఇందుఁదపమాచరించు వారికిఁ దప్పకయిష్టార్థసిద్ధికలుగును. అందుచే నసంఖ్యాకులగు మునులిందుఁ దపములసలుపుచున్నవారు నేనిందే యాగముచేయఁదలంచితిని అని యాగాధినందనుఁడు ఆదశరథనందనులతో సిద్ధాశ్రమమునఁ బ్రవేశించినతోడనే, యందలిమునులెదురేగి వారలఁబూజించిరి, రామలక్ష్మణులు

మునులకెల్లరకు నమస్కరించి పిమ్మట కౌశికునితో రాముఁడిట్లు పలికెను.

రాముఁడు:—కౌశికమునీంద్రా! యీనాఁడే మీరు యాగదీక్షకు బూనఁగోరుచున్నవాఁడను నేనును నా సోదరుఁడు లక్ష్మణుఁడును, మీజన్నమునకు నంతరాయము రాకుండఁ గాపాడుదుము. నాయంతరాత్మ విజయము సమకూరునని బోధించుచున్నయది.

విశ్వా:—మిహిరకులాలంకారా! నృపకుమారసింహుఁడవగు నీవు ధనుర్ధరుఁడవై నీయనుజునితో నిటనుండ, దనుజమదగజములకు యాగకాసారమును గలంపఁ దరమగునా నీవు తెలిపినటుల, నేనీనాఁడే యాగారంభ మొనర్తును అనిపలికి వెంటనే యాగదీక్షఁ జేకొనెను. ఆవెంటనే రాముఁడచటిమునుల నిట్లు ప్రశ్నించెను.

రాముఁడు:—మునివరులారా! సవనమును సాగకుండఁ రక్కసు లెప్పుడు వత్తురో తెలుపఁగోరుచున్నాఁడను.

మునులు:—రామచంద్రా! యీనాఁడు మొదలు షడ్రాత్రముల వఱకు జాగరూకుఁడవై యాగమును గాపాడవలయును. ఈయాఱుదివసములలో నెప్పుడో యొకప్పుడు మారీచుఁడు తనపరివారముతో రాగలఁడు. కౌశికుఁడు యాగదీక్షితుఁడగుటచే మాటలాడఁడు. కావున నీవప్రమత్తుఁడవై యుండవలయును. రాముఁడామాటలువిని, తమ్మునితో రాత్రిందివములు యాగమును గాపాడఁదొడంగెను. అయిదుదినములవఱకు యజ్ఞము నిర్విఘ్నముగా సాగెను. ఆఱవపొద్దు రాఁగానే రాముఁడు "తమ్ముఁడా! మనమీనాఁడు బహుజాగరూకులమై యుండవలయును తప్పక యీదివసమున రాక్షసులు వత్తురు" అనుచుండ మొదట నాకసమున నల్లని మబ్బులు క్రమ్మినటులు కానవచ్చెను. పిమ్మట నురుములవంటిధ్వనులు వినవచ్చెను. ఆవెంటనే రక్తవర్షము ప్రారంభమాయెను. ఆనెత్తురువానచే యాగవాటికయంతయు వసంతముచల్లినట్లుగాఁ గానవచ్చెను. ఆవెనుక మాంసఖండములు పడఁదొడంగెను. అపుడు రాముఁడు తలపై కెత్తిచూచుసరికి మారీచసుబాహులు నిజానుచరులతో నాకాశమునఁ గానవచ్చిరి. రాముఁడానిశాచరులఁ దిలకించి లక్ష్మణునితో నిట్లుపలికెను

రాముఁడు:—లక్ష్మణా! బాణవాధములు మేఘములవలె నభోమండలమున గుమిగూడియున్నవారలు కనుఁగొనుము.

లక్ష్మ:—అన్నా! ఈనీచనిశాచరులు హోమకుండముపై పేగుచున్నవారు. కావున వీరటకేగకమున్నె సంహరింపవలయును లేకున్న యజ్ఞమును బాడుసేయుదురు.

రాముఁడు:—లక్ష్మణా! ఇదె, కనుఁగొనుము మారీచునిముందుఁ గూలనేతును. అని కోదండమున మానవాస్త్రమును సంధించి మారీచునిఁగొట్టెను. వాఁడా బాణవేగముచే నూరు యోజనముల దూరమేగి సముద్రమునఁబడెను. ఆమారీచపాతమునుజూచి క్రుద్ధుఁడై తనపైకివచ్చుచున్న సుబాహునిఁజూచి, యాయాజానుబాహుఁడగు రాముఁడు ఆగ్నేయాస్త్రముచే వానిని నేలఁగూలనేసెను. అంతఁనంతరిక్షమున మిగిలియున్నరక్కసులను సౌమిత్రి వాయవ్యాస్త్రముచే సంహరించెను.

ఇట్లాయినకులనందనులు దావానలము జీర్ణపర్ణముల దహించునటుల ఆదానవసంఘమును జక్కాడ రాక్షసభీతిచే దుప్పలలోను, తుప్పలలోను, దాగియున్నమునులు పైకివచ్చి రామచంద్రునిట్లుస్తుతింపఁదొడంగిరి.

మునులు:—దశరధనందనా ! తపోనిధియగు నీగాధేయుఁడు రాక్షసబాధచే యజ్ఞమునుబూర్తిఁజేయఁజాలక, యనేకపర్యాయములు విఫలమనోరథుఁడాయెను. ఈనాటికి మీసోదరబాహువీర్యముచే నిశాచరసోదరులు సపరివారముగాఁ గూలుటవలనఁ గౌశికుఁడు యాగఫలమును బొందుభాగ్యశాలియయ్యెను. రామచంద్రా! దేవేంద్రాదులను గూడ లక్ష్యముసేయని మారీచునిమాయలు నీకడ సూర్యునిముందుఁ జీకట్లట్లు చెదిరిపోయినవి.

రాముఁడు:—తాపసోత్తములారా! ఈరక్కసులదునుమాడినది మాపరాక్రమముకాదు ఈవిశ్వామిత్రమహర్షి మాకుప్రసాదించిన యస్త్రప్రభావము. మేమునిమిత్తమాత్రులము దావతాపమడంచి భూరుహములగాపాడునది వర్షమా? మేఘమా? కావునఁ బైవిషయమున మేఘుఁడెట్లు సంస్తవనీయుఁడో, యీవిషయమున ఘనులగు కౌశిక

మునీంద్రులే స్తుతిపాత్రులుకాని వర్ణ్యస్థానీయులమగు మేముకాము అని పలుకుచుండఁ గౌశికుఁడు యాగమును నిర్విఘ్నముగా సమాప్తిచేసి, యజ్ఞశాలనుండిపైకివచ్చి, దిక్కులన్నియు దానవపీడారహితములై, శాంత్యానందములతో శోభించుచుండుటనుజూచి, నిజమనోవియద్వీధియుండి యానందచంద్రకౌముదీకాంతులు మందహాసరూపమున వెలువడ, వీర కుమారశేఖరుఁడగు రామునిఁజూచి ఇట్లుపలికెను.

విశ్వా:—శూరాగ్రేసరా! రామచంద్రా! నీసాహాయ్యముచే కృతార్థుఁడనైతిని. సూర్యకిరణములకుఁ జీకటులఁబారఁదోలుటయు, రవి కులజులకు రాక్షసులఁగూలనేయుటయు, సహజగుణములు. లక్ష్మణా! ఇకముందనలమునకు ననిలముసహాయమగునటుల, లోకకంటకులగు రాత్రించరుల సంహరించుటలో నీవు రామునకుఁదోడై, లోకానంద మును సమకూరునట్లుచేయుము. అని రామలక్ష్మణులఁజేరఁదీసి, కౌగ లించి "మీకుమంగళావాప్తియగుగావుత" అనిదీవించెను. అపుడచటి మునులెల్లరు "తథాస్తు" అనిపలికిరి. అంత రాముఁడు వినయమువీూర గాధేయునితో నిట్లుపలికెను.

రాముఁడు:—కౌశికసంయమీంద్రా! జనులు తమప్రతిబింబ ములనద్దములయందుఁజూచికొని, యానందించునటుల ఉపాధ్యాయులు అంతేవాసులయందు ప్రతిఫలించిన నిజవిద్యలఁదిలకించి, సంతసించుచుం దురు. నిజమారయ, శిష్యవత్సలురగు నాచార్యోత్తములొసంగు జ్ఞాన సంపదకు సమమగుభాగ్యము వేఱొండుకలదా? అట్టిప్రేమస్వరూపులగు దేశికశిఖామణులయొక్క యప్పుఁదీర్ప విద్యార్థులెన్నిజన్మములెత్తవల యునో! తెలియదు గురువరా! తాము మాకస్త్రవిద్యలనుపదేశింపకున్న మేమీమాయావులగు దానవుల నిర్జింపఁదగుదుమా? దేశికేంద్రా! ఇక ముందుమీకింకరులు నెరవేర్పవలసిన సేవలెవ్వియో తెలుపఁగోరుచు చున్నవాఁడను. అనిచేతులుజోడించి శిరమువంచి, నిలచియున్న రాముని వినయసుందరోక్తుల కచటిమునులానందించి ఇట్లుపలికిరి.

మునులు:—అహా! రామచంద్రా! అస్త్రములచే నిజప్రతాప వలతేజమునుబ్రకటించి, పలుకులచే వినయమలయానిలశీతలతను బ్రిస

రింపఁజేయుచుంటివి కౌసల్యానందనా! కౌశికయాగము సమాప్తమైనదని తలంచి, సాకేతమునకేగక కొంతకాలము మాకు నీమోహనరూపమును, నీమృదుమధురోక్తులను, కనుటకును,వినుటకును, అవకాశమును కలిగింపవలయును. మఱియునో సుందరరూపా! మిథిలాధిపతియగు జనకనృపాలుఁడు సర్వదేవతామోదావహమగు యాగము జేయుచున్నవాఁడు. మమ్మాక్రతువునకు నాహ్వానించియున్నవాఁడు నీవుకూడ నీతమ్మునితో నటకురాఁగోరుచున్నవారము రామచంద్రా! యావిదేహరాజేంద్రుని యింటదర్శనీయమగు శివశరాసనముకలదు దానిని సురాసురవీరులెవ్వరు నెక్కిడఁజాలకున్నవారు నీయట్టివీరకుమారునకు ఆమారవైరిశరాసనము ప్రమోదము కూర్పఁగలదు

విశ్వామి:—దశరథనందనులారా! ఈతాపసోత్తములు తెలిపినదంతయుసత్యము. మనమాశీరధ్వజుని యాగమునకేగుట పుణ్యజనకము శుభప్రదము.

రాముఁడు:— గురూత్తమా! మీయాజ్ఞలకుబద్ధులము. మమ్ము మీయిష్టానుసారము నడిపింపవచ్చును. అన కౌశికుఁడు రామలక్ష్మణుల వెంటనిడికొని, మునులుముందునడువ, సిద్ధాశ్రమమునుండి మిథిలకుఁబ్రయాణమునుసాగించి ప్రొద్దుగ్రుంకఁబోవువేళకు శోణనదతీరముచేరెను వారటసాయంతనకర్మకలాపము నివర్తింపఁజేసి సుఖాసీనులైయుండ రాముఁడు కౌశికునిట్లుప్రశ్నించెను.

రాముఁడు:—మునివరా: ఈశోణనదమునువ్యాపించి, మనోహరములగు నారామములతోడను సస్యసంపన్నములగు పొలములతోడను, అలరారుచున్న ఈదేశము పేరేమి? దీనిని బాలించువారెవ్వరు?

కౌశికుఁడు:— కౌసల్యానందనా ! వినుమీదేశచరితమును దీని నాకర్ణించుటచే మానసమునఁ గొత్త పరివర్తనము కలుగును. అనియిట్లు తెలుపనారంభించెను

—:వింశత్యధ్యాయము:—

కుశోపాఖ్యానము

పూర్వమొకప్పుడు సృష్టికర్తయగు పరమేష్ఠి భూలోకమున ధర్మార్థకామమోక్షములనెడి చతుర్విధపురుషార్థముల జక్కఁగ నెరపి,

లోకమునకు ధర్మమునుబోధింప సమర్థుఁడగుసత్పురుషునిఁబుట్టింపనెంచి, యంజలిఘటియించి, కనులుమూసి, మానసమున శ్రీహరినిధ్యానింప దోసిలియందొకశిశువు కిలకిలనవ్వుచుఁబడెను. అపుడాసరసిజాసనుఁడు కనులఁదెఱచి, నిజాంజలిపుటమునఁనున్న శిశువునుగాంచి, ఆబిడ్డను భూమికిఁగొనివచ్చి, జాహ్నవీపులినతలమునఁ బరుండఁబెట్టి, వెడలిపోయెను

అంతనుషస్స్నానమునకై గంగాతీరమునకువచ్చిన మహర్షులు తేజఃపుంజములతో నలరారుచున్న యాచిన్నిపాపనిఁజూచి వత్సలురై, యాబాలకుని మునిపల్లెకుఁగొంపోయి, తాపసకాంతలకొసంగి, ఆబాలునకుఁ గుశుఁడని నామకరణమొనర్చిరి. మునిభామినులు సుందరరూపుఁడగు నాకుశునిఁ బ్రేమాతిశయముతోఁ బెంపఁదొడంగిరి. కుశునకుపనయన వయసురాగానే మునులాతనికి వడుగుచేసి, వేదాదిసకలవిద్యలనేర్పిరి.

కుశుఁడు కుశాగ్రబుద్ధియగుటచే నచిరకాలములో సకలకలాకోవిదుఁడై అసమానరూపశోభాన్వితుఁడై, నిరుపమానబ్రహ్మచర్యవ్రతగరిష్ఠుఁడై, తపమాచరింపఁదొడంగెను. ఇటులుండ, విదర్భాధిపతి యగుసహదేవుఁడు మాఘస్నానములకై సకుటుంబముగా గంగానదికేగి, యావేల్పుటేటియొడ్డునఁబటకుటీరముల నెలఁగొల్పి, వానియందువిడిసి, జాహ్నవిలో మాఘస్నానములఁజేయ నారంభించెను.

ఆవిదర్భసార్వభౌమునకు సురూపగుణశోభితయగు వినతయను పుత్రికకలదు. ఆకన్యకామణి యొకనాఁడు గంగాతీరమునందలి పర్వతశ్రేణులయొక్కయు, వనరాజులయొక్కయు, జలపాతములయొక్కయు, సహజసౌందర్యములఁదిలకించు కుతూహలముతో నిజప్రియసఖులఁదీసికొని భాగీరథీతటమునఁ గొంతదూరమేగి, ముందటయోగాసనాసీనుఁడై, కనులుమూసి మానసమునఁ గమలాక్షునిధ్యానించుచున్న యోగికుమారునిఁజూచి, యాతనియసదృశరూపమునకు నెరఁగంది, చెంతనున్నసఖులతో నిట్లుపలికెను.

వినత:—నెచ్చెలులారా! కాంచితిరా! యీకమనీయాకారుఁడగు తాపసకుమారుని. మునిసుతులలోనింతటి రూపసంపన్నులుందురా? ఆహా! నేనొనర్చుచున్న గంగాస్నానమునకుఫలము వెంటనేచేకూరినది.

అట్టిపుణ్యమే లేకున్న నాకీపూతచరితుని మోహనరూపమును గనులారఁ గాంచు భాగ్యమెట్లు సమకూరును?

సఖులు:—రాజపుత్రీ! ఈనవయౌవనసుందరాకారుఁడు మున్ను పార్వతికై తపమాచరించిన చంద్రశేఖరునివలెఁ జెన్నారుచున్నవాఁడు. ఈతపసికొమరుఁడు దేనినిబడయఁగోరి తపమొనర్చుచున్నవాఁడో?

వినత:—సఖులారా! విహాయూహాసరికాదు. ఈసుకుమార సౌందర్యరాశి గరళకంఠుఁడగు నాగభూషణునివలె లేదు ఆశూలినినిర్జింపఁ దపమాచరించుచున్న సుమశరునివలె నున్నవాఁడు.

సఖులు:—మోహనాంగీ! నీకట్లుతోఁపవచ్చును. సరేకాని వినతా! ఈపూవిలుకాని సోయగమువానిచెంత రతియుండిన నెట్లుండునం దువు?

వినత:—నెఱజాణలారా! తెలిసెమీహృదయము. ప్రియసఖులారా! సతులుపతులపజ్జ నవతులుండఁగోరుదురా?

సఖులు:—సుముఖీ! రతివిరహితుఁడు పతియైనఁగలుగుభాగ్య మేమి? అందుచే నీయతీంద్రనందనుఁడనురాగయుతుఁడై నచో బాగుగ నుండుననిమా భావము. ఇటసవతిమాటయెందుకు? ఓహో! రతియన వేఱొకకామినియని తలంచియుంటివికాబోలు. వరానురాగమన్న నిట్టిది యేకదా!

ఇటులనాకన్యాలలామలు మాటలాడుచుండ మారాకారుఁడగు నాసంయమికుమారుఁడు యోగసమాధినిఁజాలించి, కనులువిప్పి, తన ముందటనిజతపస్సిద్ధియోయనునట్లు సఖులతోనిలచియున్న యామృగేక్షణనీక్షించి,చంద్రికనుడిలకించిన చక్రవాకముకరణి పరిచలితహృదయుఁడై తనలోనిట్లుతలఁపదొడంగెను."నేనీకానలోమున్నెన్నఁడునిట్టి చకోరాక్షిని గాన ఈనీలవేణి గంగానదీతీరవిహారాభిలాషచే నచ్చరలతోనచ్చిన సురేంద్రనందినియైయుండునా? లేక పాతాలాధిపతియగు నాగరాజతన యయైయుండునా? అదికాక ఈయుభయలోకసుందరీమణులఁ జులకఁన జేయఁ గమలభవునిచేఁగొత్తగాఁబుట్టింపఁబడిన అపూర్వనారీతిలకమయి యుండునా? అయయో! నేనెంతతప్పుపనిచేయుచుంటిని! నిష్కళంక

మగు బ్రహ్మచర్యవ్రతమేడ? పరకాంతాప్రశంసావ్యాపారమేడ? కాదు. కాదీసుందరి పరసతి కానేరదు. నాయంతరాత్మ యన్యకాంతలవర్ణింప సాహసింపదు. కావున నీనీరజాక్షి వరార్థినియగు వామనేత్రియే సందేహములేదు. కాని నాభావసరసిజముకుళములు వికసించి, మనోరథశ్రీ విలసితములగుటకు సుకృతభాస్కరకరప్రసార ముండవలయునుకదా?” అని అటనుండి సాయంతనస్నాన సంధ్యావందనాదులకుఁ గంగానదికి వెడలిపోయెను. కాని ఆకుమారతాపసమానసమృగము విదర్భరాజకుమారీ విలోలావలోకన శరవిద్ధమగుటచే, కుశునకు వశముకాక భ్రమింపఁదొడంగెను. కుండినరాజనందినియగు వినతయు నిజహృదయపంజరగతమగు భావకీరమా మునికుమారసహకారముపైవ్రాలి తిరుగగూటికిఁ జేరకుండుటచే వ్యాకులచిత్తయై, చెలికత్తెలతో వెడలిపోయెను.

“అగును సమానసుగుణతంతువులతో నేయఁబడిన యనురాగపటమునకున్న పటిమయు, స్నిగ్ధతయు భిన్నగుణములతో నల్లఁబడినరాగచేలమునకుండనేరవు. మఱియుఁ బ్రేమావిర్భావ హేతువులగమ్యగోచరములు. వానియుత్పత్తిబీజముల నన్వేషింపబోవుటయన, ప్రేమస్వరూపమగు పరబ్రహ్మమును దెలియగోరుటయు. యెక్కడికుండినపుర మెక్కడిగంగాతీరము? ఆసార్వభౌమనందినియెక్కడ? ఈతాపసనందనుఁడెక్కడ? ఆహా! అశ్రుతాదృష్టపూర్వులగు స్త్రీపురుషుల హృదయారవిందములనుండి రెప్పపాటుకాలములో బయలువెడలిన యనురాగసౌరభములొండొంటితో నభేదముగా నేకీభవించి ప్రియజనామోదహేతువులయ్యె. ఇయ్యదియే నిసర్గానురాగోదాహరణము.”

అంతవినత మునితనయునందలిమమతచే స్నానపానాదులయందు విముఖతఁజూపుచుండుటను, ఆపెతల్లియగుశాంత కనిపెట్టి, సఖులవలన రహస్యమునుదెలిసికొని, వినతనుపిలిచి, యిట్లుప్రశ్నించెను.

శాంత:—పుత్రీ! నీవేలయిట్లువ్యాకులచిత్తవైయుంటివి ? నీమనోరథమేమి ? సంశయింపక నీయభిలాషనువివరింపుము అన వినతయువనతవదనయై తనకామునితనయునిపైఁ బ్రేమోదయమగుటను తెలియఁజేసెను. ఆవిదర్భేశునిరాణి తననాథునితో వినతకోరికనుదెలిపెను.

ఆవిదర్భరాజేంద్రుఁడు తనపుత్రికకౌతుకమీడేర్పఁదలంచి పురోహితునిపిలిచి, ఆమునికుమారునిచరితము తెలిసికొనినమ్మిన నావిప్రోత్తముఁడు గంగాతీరతపోవనవాసులవలనఁ గుశునియోగ్యతాతిశయములఁదెలిసికొని విదర్భాధిపతికడకువచ్చి యిట్లుపలికెను.

పురో:—రాజేంద్రా! ఆమునినందనుఁడు సర్వవిధములమనవినతకుఁ దగినవరుఁడుగానున్నవాఁడు నీవీమాఘస్నానసమయమున ఈపావనగంగానదీతీరమున, ఆమునికుమారునకు నీకుమారికను కన్యాదానమొనర్చుటచే సామాన్యకన్యాదానముకంటెఁ గోటిమడుంగులధికమగు ఫలమును బొందఁగలవు. నీపితరులు పుణ్యలోకముల శాశ్వతసుఖములనందఁగలరు. అని కుశునివృత్తాంతమును వివరించెను.

సహదేవుఁడు, పురోహితోక్తులు తనకుహితముల గుటచేతను, ఆకాలమునసిరులకంటె శీలములకే యెక్కుడువిలువ యుండుటచేతను, ఆమునికుమారునకు వినతను గన్యాదానమొనర్పఁగోరి, కుశునిఁదోడ్కొనివచ్చి వానిపాదముల గంగాజలములతోఁగడిగి, కన్యాదానమొనర్చెను.

కుశుఁడు బ్రహ్మచర్యమునువిడచి, గార్హస్థ్యమునఁబ్రవేశించి, గృహస్థధర్మముల యథావిధిగసాగించుచు, ధర్మకామములకర్థము ముఖ్యమగుటచే ధనుర్వేదరహస్యవేదియగునాతఁడు ధరావలయమునఁ గలరాజుల నవలీలఁగాజయించి, అద్వితీయచక్రవర్తియై ధర్మార్థకామముల సమముగాఁబాలించుచు, సజ్జనవంద్యుఁడై, రాజ్యమేలుచుండెను. కొంతకాలమునకా కుశమహీపాలునకు వినతయందుఁ బురుషార్థముల వలెఁ గుశాంబ, కుశనాభ, అధూర్తరజస, వసువులను నలుగురుసుతులుకలిగిరి. ఆకుమారులు ప్రాజ్ఞులైనతోడనే కుశుఁడు రాజ్యమును నాలుగుభాగములుగవిభజించి నలుగురుపుత్త్రులకిచ్చి, గార్హస్థ్యమునుండి వానప్రస్థమునఁ గాలముఁగడుపఁ భార్యతోఁదపోవనమునకేగెను.

తండ్రియాజ్ఞానుసారము నాల్గవకుమారుఁడగు వసువు ఈశాననదప్రాంతదేశమునకుఁబ్రభువై, గిరివ్రజపురమును రాజధానిగఁజేసికొని, ప్రజలఁబాలించుచుండెను. రెండవవాడగు కుశనాభుఁడు మహాప్రతాప

శాలియై, మహోదయమనుపురమును రాజధానిగనొనర్చుకొని, జనుల నేలుచుండెను. ఈకుశనాథరాజేంద్రుఁడు ఘృతాచియను నారీమణిని బరిణయమై, యామెయందు బరమేశ్వరకృపచే నిరుపమానగుణలావణ్యవతులగు నూర్వురుకొమరితలఁబడసెను. వారెల్లరు క్రమముగానెదిగి, పదునారేండ్లప్రాయముగలవారై, వనవిహారకుతూహలములో నుద్యానవనమునకేగి, జలక్రీడలనలుపుచుండిరి. అపుడు దక్షిణదిశనుండి యాదారినుత్తరదిక్కునకు మెల్లగనేగుచున్న మలయగంధవహుఁడు, వారివిహారలీలలఁదిలకించి, నిజచిత్తమధుపము, ఆవారిజముఖులకడకేగ, ఆదాక్షిణసమీరుఁడు మనోహరరూపమునుదాల్చి వారిదరిఁజేరి, ఇట్లు పలికెను.

సమీరుఁడు:—బింబాధరలారా! నేనుమీరూపవిలాసములఁ జూచి, మిమ్మువరియింపవచ్చితి. కావున నన్నుఁబతినిగాఁజేకొనుడు.

కన్యలు:—ఓయీ! నీవెవ్వఁడవింతనిర్భయముగా మాటలాడుచుంటివి? మేమెవ్వరమో తెలిసికొంటివికాబోలు. లోకైకవీరుఁడగు కుశనాథసార్వభౌమునిపుత్రికలము. శీలవ్రతపరాయణలము.

సమీరుఁడు:—తనుమధ్యలారా! మీరెవ్వరో తెలిసియేవచ్చితిని కానినన్నుమీరుగుర్తింపనేరక, మాటలాడుచున్నవారు. నేను సర్వజీవులకు బహిరంతర్వ్యాప్తినైసంచరించు మలయసమీరుఁడ. కామరూపుఁడ. సుదతులారా! మీరునన్నుఁజేపట్టితిరా! చంచలమగు మానవరూపమునువిడచి, నిత్యానందజనకమగు త్రిదశవయస్సుతోఁగూడి, చిరంజీవినులుకాగలుగుదురు. మఱియునాతోఁగూడి భూలోకవనములయందును, దివ్యలోకోద్యానములయందును, సంచరింపఁగలుగుదురు.

కన్యలు:—ఓయనిలుఁడా! నిలకడలేకసదాగతివైననీవు మమ్ముఁ జూచి చలచిత్తుఁడవగుటలోవింతలేదు. ఓగాలివేల్పా! సర్వాంతర్యామివైననీకు మాహృదయనైర్మల్యమెట్లుతెలియదాయె? సమీరుఁడా! నీస్థితిగతులమేమెరుంగుదుము. కావున మమ్మునవమానించి దుఃఖములఁబాల్పడక వచ్చినదారినేగుటమంచిది.

సమీరుఁడు:—కన్యకలారా! అధికప్రసంగములఁజేసి, చేఁజిక్కినయమరభర్తను జెడఁగొట్టుకొని, ఏమర్త్యునో మెడఁగట్టుకొని, వైధవ్యదుఃఖమునఁబడక, నన్నుఁబడసి, నిత్యసౌభాగ్యములనందికొనుఁడు

కన్యలు:—ఓకాముకుఁడా! వనవిహారలోలలగు సతీమణులకడకు సిగ్గులేకవచ్చుటయకాక, మర్యాదహీనుఁడవై మాటలాడుట దివ్యమర్యాదయా? ఆర్యవంశసంజాతలగు కన్యల దివ్యసంపదలుకాని, అమరయౌవనములుకాని, మోహపెట్టఁజాలవు. వారు దయామయులగు తలిదండ్రులఁబాటింపక పరులఁబరిణయమాడఁగోరరు. ఆర్యమానినులపరిణయాభిలాషలు కులమర్యాదావిలసితములుకాని, స్వేచ్ఛావిహారమలీమసములుకావు.

సమీరుఁడు:—మందయానలారా! దూరమాలోచింపుఁడు. నాయట్టిదివ్యరూపునిఁబోఁగొట్టుకొనకుఁడు.

కన్యలు:—సమీరుఁడా! చాలునీస్వార్థపరతాప్రబోధము. నీవెడగుప్రసంగములు మాజనకునిచెవిసోకినచో నీకుమోసమువాటిల్లును. వేగముఁగాఁబొమ్మిచ్చోటువాసి. ఆవారిజాక్షులపలుకుల విన్నతోడనే మలయానిలుఁడు కాలానలుఁడై "మదవతులారా మీకింతకావరము తగునా? కన్యలఁగామించుట కానిపనియా? కానిందు మీపొగరడంతును. ఈనాడుమొదలు మీరందరుకుబ్జలై కురూపములతో నుండుదురు కావుత" అనిశపియించెను.

రాజకన్యలాశాపోక్తినివిని, కోపోద్దీపితలై, ఇట్లుపలికిరి.

కన్యలు:—ఓకామాంధుఁడా! నీకుమేము ప్రతిశాపమొసంగఁగలము. కాని, యదిక్షమావ్రతపరాయణలమగు మాకుఁదగినపని కాదు. ఇతరుల హింసించుశక్తియుండుటకంటెఁ బరబాధలసహించు తాలిమి యుండుటయే, వరమనితెలిసికొమ్ము. పతితపావనుఁడగు భగవానుఁడు నిరపరాధలమగుమమ్ముఁ గాపాడఁగలఁడు. అని నిజమనోహరరూపములు కురూపములుగా మార లజ్జితలై, చీకటిపడువఱకందుండి, చీకటిరాగానే, మేలిముసుఁగులతో నారాజకన్యలు తండ్రికడకేగి, యాతనిపాదములపైఁబడి దుఃఖింపఁదొడంగిరి.

కుశనాభుఁడు కుబ్జరూపులైయున్న కూఁతులఁజూచి, సంభ్రాంతచిత్తుఁడై, ఇట్లుపలికెను.

కుశనాభుఁడు:—కటకటా! బిడ్డలారా! మీకీయసహ్యాకారము లెట్లువచ్చె? పూజ్యులెవ్వరికైన నపచారములఁజేసియుంటిరా?

కన్యలు:—తండ్రీ! మేమెట్టిదోసములను జేసియెఱుంగము. అని జరిగినదంతయు పూసగుచ్చినట్లు తెలిపిరి. ఆమాటలువిని యాతఁడుసంతసమంది ఇట్లుపలికెను.

కుశనాభ:—పుత్రికారత్నములారా! యెంతటిశాంతిమినిఁజూపియుంటిరి! కుమారికలారా! స్త్రీలకుఁగాని పురుషులకుఁగాని, ఓర్పునుమించినసంపద లేదు. మీయుక్కసెల్లం క్షాంతియుక్తమనసుకలవారై, నిష్కారణముగామిమ్ముశపించి, యవమానించిన సమీరుని పైఁగినియక, సైరణసేయుట ప్రశంసనీయము. పుత్రికలారా! దానయజ్ఞధర్మములన్నియుఁ, దితిక్షపై నాధారపడియున్నవి. మొదట మీవికారరూపములఁజూచి, విచారించితిని కాని, మీనిరుపమానక్షమావిభవమును, తెలిసికొనినపిమ్మట సంతసమందితిని బిడ్డలారా! గతించినదానికివగవక, దీనావనపరాయణుఁడగు నారాయణుని ధ్యానించుచు నంతఃపురముల నుండుడు. దుఃఖసమయమునధైర్యమును, పరమేశ్వరధ్యానమును, దుఃఖనివారకములు సంతోషావహములు. ఇకముందీదేశము కాన్యకుబ్జమని వ్యవహరింపఁబడుఁగావుత. అనిబోధించి, వారిని రాణివాసమునకంపెను కాని నిజతనయలదుస్థితికిఖిన్నుఁడై వారికి వివాహములఁజేయుట యెట్లునాయని చింతింపఁదొడఁగెను.

—: ఏకవింశత్యధ్యాయము :—

బ్రహ్మదత్తోపాఖ్యానము.

అఖండబ్రహ్మచర్యవ్రతసంపన్నుఁడును, పరమభాగవతోత్తముఁడును, నగు చూళియను భూసురతాపసోత్తముఁడు గంగాతరంగిణీతీరమునఁ దపమాచరించుచుండెను. ఇటులుండ, ఊర్మిళాపుత్రికయగు సోమయను గంధర్వకన్య యాచూళితపోవనమునకువచ్చి బ్రహ్మతేజోవిరాజమానుఁడగు నాతాపసపుంగవునివలన సుతునిఁబడయఁగోరి, యామునిని

శ్రేష్ఠునకు నుపచారములఁ జేయ మొదలిడెను. ఇటులఁ గొంతకాలమునుగ డువ నాయతిమాళియగు చూళి తనకు భక్తిపూర్వకముగ సేవచేయుచున్న యాగంధర్వకాంతను జూచి, ఇట్లు ప్రశ్నించెను.

చూళి:—శుభాంగీ ! నీ వెవతవు ? నాకిట్లిల సేవఁ జేయుచుంటివి. నీభక్తికి మెచ్చితిఁ గావలసినదానిని గోరికొనుము అన ఆననజితసోమయగు నాసోమ సంతుష్టాంతరంగయై యంజలి ఘటించి, శిరమువంచి, ఇట్లు పలికెను.

సోమ:—సరసిజాసనసమప్రభావా! మహానుభావా! నేనొక యువివాహితనగు సోమయను గంధర్వకన్యను నేను బ్రహ్మతేజోభాసమానుఁడును, తపఃప్రతాపవిరాజమానుఁడును, నగు కుమారుని మీవలనఁ బడయఁగోరి మిమ్ము సేవించుచుంటిని కృపామయులగు మీరలు నామనోరథమీడేర్పవలయును ఆకోరికను విన్నతోడనే బ్రహ్మచారియగు చూళి గుండెజల్లుమనని శ్చేష్టుఁడై, యొకింతయూరటనంది, ఇట్లు పలికెను.

చూళి:—సతీమణీ ! నేవిరాగినై బ్రహ్మచర్యవ్రతముపూని పరబ్రహ్మను పాసించుచుంటిని నాకు వివాహేచ్ఛ లేదు కావున నన్ను వీడి, వేఱొక్కని వేడికొని నీమనోరథమీడేర్చుకొనుము.

సోమ:—మునిచంద్రా ! మీతో నాకు బాహ్యవివాహవిధి జరుగకున్నను మానసికపరిణయము జరిగినది. కావున నేను పూర్వపతిని విడచి, వేఱొకపురుషునిఁ జేరుదానఁగాను కావున మీతపోమహిమచే నొకపుత్త్రుని సృజియించి ప్రసాదింపుము. అందుచే మీకు బ్రహ్మచర్యవ్రతమును, నాకేకపత్నీవ్రతమును, సమకూరును. చూళియాసోమయుక్తికి మెచ్చి, కరుణాళుఁడై యోగశక్తిచే నొకశిశువును సృజియించి సోమ కొసంగెను.

అంతనాసోమ చూళియొసంగినసుతునకు బ్రహ్మదత్తుఁడను నామమిడి, పెంచుకొనుచుండెను. ఆసోమానందనుఁడు క్రమాభివృద్ధి నొంది, కరమాలయొక్క మహిమయుఁ, గరవాలముయొక్క శక్తియు, సహాయముపై వెలయ రాజులజయించి, యొకనూతనరాజ్యము నుసృష్టించి, దానికిఁ గాంపిల్యమనుపట్టణము రాజధానినిగాఁ జేసి, యందు రాజ్యమేలుచుండెను.

ఇట్లుండ నిజకన్యకలకు వరుల నెట్లుసమకూర్తునాయని విచారించు చున్న కుశనాభునికడకుఁద్రిలోకవార్తాహారియు, నిత్యబ్రహ్మచారియు, స్వేచ్ఛావిహారియు, నగువేల్పుజడదారివచ్చెను. ఆనారదుఁడు రాఁగనే యామహోదయపురాధిపతియగు కుశనాభుఁడు దివ్యమునికిఁ బూజలొనర్చి, యుచితాసనముపైఁగూర్చుండఁబ్రార్థించి యిట్లువిన్నవించెను

కుశనాభ:—నారదమునీంద్రా! మీకీసృష్టియందుఁ దెలియరానిరాజకుమారులువేరు. నాకడవివాహయోగ్యలగు కన్యలున్నవారు. వారికనువగువరునినిరూపించి నావ్యాకులముతీర్పఁ బ్రార్థించుచున్నవాఁడ. మునీంద్రా! కన్యలఁగన్నవారిపాట్లెరికి తెలియును? మీరు నిత్యబ్రహ్మచారులగుటచే సాంసారికసంతాపములెఱుఁగక, నిత్యానందముతో విచ్చలవిడిగా ముల్లోకముల సంచరించుచున్నవారు.

నారదుఁడు:—కుశనందనా! నీవు నేను స్వేచ్ఛగాఁదిరుగుచుంటి ననుకొనుచుంటివి. నీకునీసంసారబాధయొకట్టే. నేను సర్వలోక సంచారినగుటచే నాపాట్లకుమితిలేదు. రాజా! నిజమారయఁ బరులకై పాటుఁబడుటయే పరమేశ్వరప్రీతిహేతువు వినుమునీకన్యలకనురూపుఁడగు వరునిఁదెలుపుదును. కాంపిల్యనగరమున బ్రహ్మదత్తుఁడను ద్విజకుమారుఁడు రాజ్యమేలుచున్నవాఁడు. అతేఁడవివాహితుఁడు. మహిమాఢ్యుఁడు నీపుత్రికలనాతనికొసంగి ధన్యుఁడవుకమ్ము. అనివెడలిపోయెను.

కుశనాభుఁడు వెంటనేకాంపిల్యమునకేగ, బ్రహ్మదత్తుఁడు రాజమర్యాదలతో నామహోదయాధీశునకు స్వాగతమొసంగి "మహారాజా! తమరిటకుదయచేయఁగారణమేమి?" అనిప్రశ్నింపఁనాతడిట్లు పలికెను.

కుశనాభ:—ద్విజకుమారా! నేనునాకుమారికలకు వరార్థినై యుండ, నారదమునీంద్రుఁడు నాకడకువచ్చి, నీగుణాతిశయముల వర్ణించుటచే నిన్నుఁబ్రార్థింపనిటకువచ్చితిని.

బ్రహ్మదత్తు:—ఆర్యా! వినేయునిఁబ్రార్థింపఁదగునా? మీకోరికనునాజననికినివేదించి, యామెకిష్టమైనచో మీయభీష్టమీడేర్తును. ఆమెవలదనినచో నాపైఁగోపింపక,దీవింపఁగోరుచున్నవాఁడను. మాయమ్మయానలేనిదే నేనెట్టిపనియుఁ జేయఁజాలను.

కుశనాభ :—సోమానందనా! తల్లినినిర్లక్ష్యముచేయువానిని నేనల్లునిగాఁగోరను. కావున నీవుమీయమ్మయనుమతినినడచుటయే నా యభిమతము. అన బ్రహ్మదత్తుఁడు తల్లికడకేగి, నమస్కరించి, కుశనాభునియభిలాషను దెలుప, సుందరాంగులగు చక్రిపుత్రికలఁ గోడండ్రగాఁబడయఁగోరుచున్న యాగంధర్వకాంత సుతునిదీవించి, రాజకన్నియలఁబెండ్లియాడి భార్యలవెంటనిడికొని, సౌఖ్యముగారమ్మనెను.

బ్రహ్మదత్తుఁడు తల్లియనుమతిని కుశనాభునితోమహోదయపురమునకేగి, వివాహకాలమునఁ గుబ్జలగు రాకొమరితలనవలోకించి "మాయమ్మ సౌందర్యనిధులగు వధువులనపేక్షించియుండ నేనెట్లికుబ్జలఁజేకొందును? పరిగ్రహింపనంగీకరించి ఇపుడెట్లునిషేధింతును? ముందువెనుకలాలోచింపక,త్వరపడిభాషసేయరాదు. నేనుసద్బ్రహ్మచారినేయగుచో, మాతృభక్తుఁడనేయగుచో, నాకరస్పర్శమైనతోడనే వీరుకురూపములు పోయి సురూపలుకాకుందురా?" అనినిశ్చయించి, యాకన్యకలకరములఁబట్టిగ్రహించినతోడనే వారెల్లరు దివ్యసౌందర్యసంపన్నలై, అమరకన్యలుకూడ తమకీడురారన్నట్లు తేజరిల్లఁదొడంగిరి. కుశనాభుఁడును, ఆతనియర్ధాంగియగు ఘృతాచియు తమసుతలయనుపమానరూపవైభవములను, అల్లునియసమానశక్తిసంపదను బరికించి, యానందించి, యల్లునకమూల్యాభరణాది పారితోషికములనొసంగిరి.

బ్రహ్మదత్తుఁడట్లుసన్మానితుఁడై వరకాంతికలితలగు కాంతామణులతోఁ గాంపిల్యనగరమునకువచ్చి, కళత్రసహితుఁడై తల్లియగుసోమకునమస్కరింప నామెవారినదీవించి, కులరూపగుణశోభితలగు కోడండ్రతోడను, నిజాజ్ఞానువర్తియగు సుతునితోడను సుఖముగాఁగాలముగడుపుచుండెను.

అటమహోదయమునఁ గుశనాభుఁడు తనపుత్రికలు రూపవతులై యనురూపుఁడగుభర్తను బడయుటచే నమితానందమునందెను కాని, పదునాఱేండ్లవఱకుఁ దనకన్నులయెదుటఁబెరిగిన ఆత్మజాతలు తన్నువీడి, యత్తవారింటికేగుటచే నేమియుఁదోపక, వ్యాకులమంద మొదలిడెను. "నిజమే! తరంగిణులుపుట్టినచోటుననిలువక, కడలికడకేగునట్లు, కొమరిత

లును పుట్టినింటనుండక, యత్తవారికడ కేగుదురు సాగరము తరంగచంచలత లేక యుండనియట్లు, సంసారి యంతరంగవ్యాకులత లేక యుండ నేరఁడు."

అట్లు కుశనాభుఁడు తన్ను విడిచియత్తవారింటి కేగిన యానళినదళాయతాక్షుల గుణసాహససంపదలఁ దలంచుచు, వారివియోగమునకుఁ గుందుచుండ నొకనాటిరేయి యాతనిస్వప్నములో నాతనితండ్రియగు కుశుఁడు ప్రత్యక్షమై "పుత్రరత్నమా! ఏలయిట్లు చెంగటిల్లెదవు? కన్యకలు పతులకడ కేగక తలిదండ్రులకంటియెదుటనుందురా? అప్పుఁ జేకొన్నవాడు తాఁదెచ్చినధనమును వడ్డితోఁ జెల్లించి, ఋణదాతకొసంగునట్లు, కన్యలఁగన్నవాడు బాలికలఁజక్కఁగఁ బెంచి, కట్నములతో వరులకు సమర్పింపవలసినదే. కావున పుత్రేష్టినెఱపి కులాలంకారుఁడగు కుమారునిఁ బడయుము." అని అంతర్ధానమాయెను.

వెంటనే కుశనాభుఁడుమేల్కని, తండ్రిబోధలఁ దలంచుచుఁ దెల్లవారినతోడనే కులగురువులరావించి, పుత్రీయేష్టినిసాగించి, ధృతాచియందు గాంభీర్యజలధియగు గాధియను తనయునిఁబడసెను. రామచంద్రా! ఆతేజశ్శాలియగుగాధియే నాజనకుఁడు నేనాతనికిజన్మించుటచే గాధేయుఁడననియుఁ, కుశసంతతివాఁడనగుటచేఁ గౌశికుఁడననియుఁ బిలువఁబడుచున్నవాఁడను. దశరథాత్మజులారా! మీరువినఁదగినదియు, వినియానందింపఁదగినదియు, సతీలలామయగు మాయక్కసత్యవతిగొప్ప జీవితము.

రాముఁడు:—గాధినందనా! గృహమునకుఁగాని, దేశమునకుగాని కీర్తిసంపదల సమకూర్చువారలు సతీకల్పవల్లులే. గంగాదిపావననదీప్రవాహజీవనములెట్లు భారతదేశమును భాగ్యవంతముగాఁజేయుచున్నవియో యటులనే సావిత్రీప్రభృతిసతీతిలకముల జీవితకథావాహినులును దేశమును సౌభాగ్యవంతమునుగాఁజేయుచున్నయవి. వీనినివినుట సంతోషావహము. పాపహరము కావున సత్యమగు సత్యవతీచరితమునుమాకు వినిపించి, సుకృతానందముల సమకూర్పఁగోరుచున్నాఁడను.

కౌశికుఁడు:—ఇనకులతిలకా! కౌసల్యాపుత్రకా! నాపితామహుఁడగు కుశనాభుఁడు మాతండ్రిగాధి బాల్యుఁడైనతోడనే, కాన్యకుబ్జరాజ్యమున నాతనినభిషిక్తునిఁగాఁ జేసి, భార్యయగు ఘృతాచితోఁ దపోవనమునకు వెడలిపోయెను. అపిమ్మట గాధిరాజేంద్రుఁడు రాజమాన్యుఁడై స్వయంవరమున విదర్భరాజనందినియగు భానుమతినిఁ బరిణయమై యామెయందు సత్యవతినిబడసెను. సత్యవతియు శుక్లచంద్రకళవలె క్రమముగా నెరుగుచు, సంపూర్ణయౌవనకాంతికలితయగుటచే మాతండ్రియామెకుఁ దగుచక్రవర్తినందనుని సమకూర్పఁబ్రయత్నించుచుండెను. కానియా తేజశ్శాలికోరినట్లు సార్వభౌమనందనుఁడల్లుఁడుకాక భూసురసుతుఁడు జామాతయయ్యెను.

రాముఁడు:—కౌశికమునీంద్రా! సర్వసమర్థుఁడగుగాధిచక్రవర్తి రాజనందనునల్లునిఁగాఁ గోరుచుండ నందుకువిపరీతముగా విప్రజాతుఁడెట్లుజామాతయయ్యె? అదివిని కౌశికుఁడిట్లు సత్యవతీచరితమును దెలుపఁదొడంగెను.

ద్వావింశత్యధ్యాయము.

—♦ సత్యవతీచరితము ♦—

పూర్వము కృతవీర్యవంశజులగుక్షత్రియులు నీతిదూరులై ద్యూతాదులకై సర్వసంపదలఁ బాడుసేయుఁదొడంగిరి. ఆసందుఁగనిపెట్టి, కుమతులగుమంత్రులు కుతంత్రములఁబన్ని, పన్నులనపహరింపమొదలిడిరి. అందుచేనారాజ్యము ధనహీనమై, దరిద్రస్థితికివచ్చెను. ఆకార్తవీర్యులు సొమ్ములఁదెమ్మని మంత్రులబాధింపఁ బ్రెగ్గడలాబాధలఁదప్పించుకొనుటకొక యుక్తినిబన్ని, ఇట్లుతెలిపిరి.

మంత్రులు:—ప్రభూత్తములారా! మమ్మేల బాధించెదరు? మీధనాగారములురిత్తలైయుండ మేము ధనములనెక్కడనుండి తేఁగలుగుదుము? ఏలికలారా! వినుఁడు ధనముగలతావెరింగింతుము. నృపవరులారా! మీపూర్వులగు సార్వభౌములు శ్రోత్రియభక్తులగుటచే భృగువంశజులగు భూసురలకు అమితములగుధనరాసుల దానమొసంగియున్నారు. ఆబాపలాసొమ్ములఁ గుశీదవ్యాపారముచేఁబెంచి, కోట్లకుపడ

గలెత్తియున్నవారు. కావున మీరు మము బాధింపక, వారికడకేగి, యాచించియో, శాసించియో, ధనములసంపాదింపుడు. మేమీలోపునఁ బ్రజలనుండి క్రొత్తపన్నుల రాఁబట్టుదుము. అని తెలిపినతోడనే, మదిరాపానమత్తులగు నాయేలికలు యుక్తాయుక్తవిచారహీనులై యాకపటామాత్యబోధలకలరి "క్షత్రియులకు యాచ్ఞామార్గము గర్హ్యమనియు, దండోపాయమే శ్లాఘ్యమనియుఁ దలంచి, ఆయుధపాణులై భార్గవాగ్రహారముపైఁబడి, "మాపెద్దలు మీకొసంగినధనముల మీరు వడ్డీలకిచ్చి పెంచిదాచియుంచితిరంట వానిని వెంటనే మాకొసంగిపంపుడు. లేకున్న శస్త్రాగ్నికీలలకాహుతికాఁగలరు" అన భార్గవులిట్లు పలికిరి.

భార్గవులు:—కార్తవీర్యకులాలంకారులారా! శౌర్యశిఖామణులారా! మీపూర్వులు మాపూర్వులకు యజ్ఞయాగాదులకో! హవ్యకవ్యాదులకో! సమర్పించిన ధనములానాఁడే వ్యయమైయుండును కాని యింతవఱకు మాయిండ్లనిలచియుండునా? మేముకాని మాపెద్దలుకాని ధనలోలుపులమై మీపెద్దలొసంగినధనముల వడ్డీలకిచ్చి పెంచియుంచిన వారము కాము. క్షత్రియులెక్కడనైన ధనములనిలువఁజేసి, కుశీదవృత్తిని నెరపుటఁగంటిరా? వైదికులయిండ్ల నిలువయుండునవి ధనములు కావు ఇంధనములు మీకెవ్వరో మోసగాండ్రు మాకడ ధనములుకలవని కుబోధలఁజేసియున్నవారు. కావున మీరాతులువలమాటలకు మోసపోక సత్యాసత్యముల నోర్పుతో విచారింపుడు.

కార్తవీర్యులు:—బాపనయ్యలారా! మేముమీతో శాస్త్రవాదములఁజేయరాలేదు. మాఱుమాటాడక సొమ్ములనిత్తురా? లేక మాచేఁ జత్తురా? రెండేమాటలు.

భార్గవులు:—అపూర్వవీరులారా! బాపలపైననా? మీబలపరాక్రమములు. వినుడు మేమసత్యములాడువారము కాము. మాకడధనములులేవు. మీరేమిచేసినను సరే. నీచులగున్నపాలరరాజ్యములజీవించి నిత్యదుఃఖములనందుటకంటె ఒక్కమారుచచ్చుటయే మేలు. ఆమాటలువిన్నతోడనే యాపలుగాకిరాముూకలు స్త్రీలనక, శిశువులనక, వృద్ధ

లనక, క్రూరకిరాతులు మృగముల వేటాడునట్లా శ్రోత్రియుల సంహరిం పఁదొడంగిరి.

“ఆహా! కాంచనకాములకును, కాంతాకాముకులకును, దయా దాక్షిణ్యములుండవుకదా! జనులనుదినమును, ఈకాంతాకనకములకై పగులఁజంపుటయో, తాముచచ్చుటయో, కానవచ్చును. కట్టా! చంచలములగు ధనసంచయములకును, క్షణభంగురములగు వనితాసౌఖ్యములకును, దామెంతకాలమనుభవించినను తరుగరానిపాపములకుఁ బాల్పడుచున్నవారు. విషపాషాణాది మారణవస్తువులీకాంతాకనకములవలె మానవసంఘమును జంపనేరవు.”

అట్లాక్రూరులగు కుపతులు కృపాణపాణులై, కృపావిహీనులై, విప్రప్రాణముల బలిఁగొనుటకు మొదలిడిరి. ఆదారుణమారణసమయమున, బూర్ణగర్భవతియుఁ బతివ్రతాశిరోమణియు, భార్గవకులాలంకారుఁడగుచ్యవనుఁడను భూసురోత్తమునకునర్ధాంగియు, నగు ఆరుషియను సాధ్వీమణి భీతయై, నిజగర్భసంరక్షణాపేక్షచే, గృహమునువదలి పారిపోవుచుండ, దుండగీడులగు నారాచవారు, ఆమెధనములమూటఁగట్టి నడుమునకుఁజుట్టికొని గర్భంపుమిషతోఁ బట్టుకొనిపోవుచున్నదని తలంచి, యాసాధ్వివెంటఁబరుగిడఁజొచ్చిరి. ఆచ్యవనపత్ని తనపిఱుందఁ దఱిమికొనివచ్చుచున్న రాక్షససములగు నారాచకూళలఁజూచి, వేగముగానేగుచుండ, నాసాధ్వీమణిగర్భముజారి, యాపెయూరు దేశమునఁబడెను. అంత నాయిల్లాలు బిడ్డనుదీసి యొడిలోవేసికొనుచుండ, ఆపాపాత్ములటకేగి, దివ్యతేజోవిభాసియగు శిశువును చూచినతోడనే యంధులైరి. “సాధ్వీ పీడయూరకపోవునా?” అట్లుగ్రుడ్డివారైన యాధూర్తభూభర్తలు చేయునదిలేక చేతులుజోడించి యాసాధ్విని “మాయపరాధముల క్షమియించి నేత్రదానమొసంగుము” అనిదీనాతిదీనులై ప్రార్థింప, ఆశ్రోత్రియకాంత నవనీతసమానస్వాంత యగుటచే వారిపైఁజాలిగొని, ఇట్లుపలికెను.

ఆరుషి:—సోదరులారా! దుష్టశిక్షణమును, శిష్టరక్షణమును వ్రతముగా భావించు క్షత్రియకులమునఁబుట్టి, మీరేలయిట్టి బ్రహ్మహత్యకుఁబాల్పడితిరి? బిడ్డలారా! మీకిదివఱకుఁ జూపులుండియు నంధు

లైయుంటిరేకాని నేత్రవంతులై మెలఁగఁజాలరైతిరి. తనయులారా! పావనమగు పృథివీపతిత్వమునెట్లు వమ్ముచేసికొంటిరి. యమదండనములనుండి యెట్లుతప్పించుకొనఁదలంచుకొంటిరి? మీయట్టిపరహింసకులు చిరంజీవులగుటకంటెఁ గడతేరుటయే సమంజసము. పరోపకారి పరమమునిసములు బ్రతికినను మేలే. మిమ్ముఁగన్నతల్లులెట్టి దురితాత్ములో తెలియరాదు. లేకున్ననిట్టిపాడుబిడ్డలఁ బడయుదురా?

కార్తవీర్యులు:— తల్లీ! మామంత్రులు మమ్ముమోసగించుటచే వారికపటోక్తుల హితబోధలుగాఁదలంచి, యీదారుణబ్రహ్మహత్యకుఁ బాల్పడితిమి మాయమ్మా! బిడ్డలమగు మాయందువాత్సల్యముంచి మా యపరాధముల మఱచి, మమ్ముఁగాపాడుము. ఇప్పుడు మేముపశ్చాత్తప్తులమై, మాయొనర్చినహత్యలఁ దెలిసికొంటిమి.

ఆరుషి:—కుమారులారా! మీకునిజముగ పశ్చాత్తాపముకలిగినచో నాయీబాలకునిఁబ్రార్థింపుడు. నాకీపట్టి శ్రీహరికటాక్షముచే బుట్టినవాఁడు. మీయంధతను బోఁగొట్టఁజాలినవాఁడు. అనవారాశిశువునిట్లు ప్రార్థించిరి.

కార్తవీర్యులు:—ఓపతివ్రతానందనా! మాపైఁగరుణించి, మా యపరాధములక్షమియించి, మాకుఁజూపులఁబ్రసాదింపుము. నిన్నికముందు మాకుఁగులవేల్పుగానారాధింతుము.

ఆరుషి:—ఓవిలోలాలకా! బాలకా! అవినీతులగు నీనృపతులు కుమతిబోధలచేఁ జేసినయపరాధములక్షమింపుము వీరింజూడ జాలి కలుగుచున్నయది. వీరలు నేత్రవంతులైనచో నేసంతసింతును. అన, దివ్యప్రభావసంపన్నుఁడగు నాబాలకుఁడు కనులుతెఱచి, వారివైపుచూచిన తోడనే ఆదుష్టులకు నష్టమైనదృష్టి తిరుగఁజేకూరెను. అంతనాధరాకాంతులు ఆజననీనందనులకు వందములొనర్చి తాముచేసిన పాపకార్యములకుఁజింతించుచు వెడలిపోయిరి.

పిమ్మటనారుషి యిల్లుచేరి, యాపిల్లనికి ఔర్వుఁడనిపేరుపెట్టి పోషించుచుండెను. ఆబాలుఁడు క్రమక్రమముగాఁబ్రౌఢుఁడై తల్లివలనఁ గార్తవీర్యుల కిరాతకృత్యములఁదెలిసికొని, ఆరాజవంశమును మూల

చ్ఛేదము చేయఁ దీవ్రముగాఁ దప మొనర్చుచుండెను. ఆబాలతాపసతపోవ
హ్నిచే జగము సంతాపమొందఁజొచ్చెను. అంత దేవతలాయౌర్వునితప
స్సును మాన్పింపనేరక, యాతనిపితృదేవతలకడ కేగి యౌర్వునితపము
వారించి, లోకతాపమును దొలగింపఁగోరిరి. దేవతలకోర్కెపై నాతనిపి
తరులు వానికడ కేగి "బిడ్డా! నీతపముచే లోకమునకుఁ దాపము కలుగు
చున్నది కావున శాంతచిత్తుఁడవై తపమును చాలించి, లోకమునుగాపా
డుము.

ఔర్వుఁడు:—పితృదైవతములారా! క్రూరులగు క్షత్త్రియులఁ
గడతేర్పవలయునుగాని కాపాడరాదు. ఆకిరాతులు మనభార్గవవంశమున
కొనర్చిన యపకృతికంతుకలదా? ప్రాజ్ఞులు రోగనివారణమునకును,
రిపుమారణమునకును, పూనుకొనకున్నచో నారోగ్యకీర్తులఁ బడయనే
రరు. కావునఁ దండ్రులారా! నాప్రయత్నమునకడ్డు తగులకుఁడు. మీకు
మ్రొక్కెద.

పితరులు:—భార్గవకులాలంకారా! కుమారా! బ్రాహ్మణుల
కుఁ గ్రోధముండఁజనదు. వారుక్షమాప్రధానులుకాని, క్రోధనిధానులు
కారు మఱియు నీతపోవహ్నిచేఁ బ్రాణిలోకము పరితాపమొందుచున్న
ది. కావున మాతండ్రీ! లోకోత్తాపజనకమగు తపమును చాలించి, గుణ
వతియగు కన్యకను బరిణయమాడి, మాకుసంతసమును సమకూర్పుము.
అన నాయౌర్వుఁడు శాంతాత్ముఁడై తపము చాలించి, పితృదేవతలకు
వందనమొనర్ప, వారౌర్వునిదీవించి వెడలిపోయిరి.

ఔర్వుఁడు పితరులుకోరినరీతిని పరిణయమాడఁగోరి, జరిగినవృ
త్తాంతము తల్లికినివేదించి, యా సాధ్వియాజ్ఞానుసారము మాళవరాజపు
త్రికయగు మాళవిని పెండ్లియాడి, యామెవలన ఋచీకుఁడను పుత్రుని
కందళియను పుత్రికను బడసి, కందళిని దూర్వాసునకొసఁగి, సంసార
మును ఋచీకునకొప్పజెప్పి, అతఁడు భార్యతో వానప్రస్థమునెరప వెడ
లిపోయెను.

తండ్రియనంతరము ఋచీకుఁడు బ్రహ్మచర్యవ్రతపరాయణుఁడై
కాలముగడుపుచుండ, భార్గవశమున మహర్షులు వానియింటికిరాగాఁ

బ్రిత్యర్థానాదిసత్కారములొనర్చి వారినిభోజనమునకు నామంత్రింప, "మేము అవివాహితునియింట భుజింపము." అనివెడలిపోయిరి అంతనా మాళవీసుతుఁడు పెండ్లియాడనఁగాని, పెద్దలకాతిథ్యమొసంగ నర్హతకలుగనేరదని నిశ్చయించి, మాతండ్రియగు గాధికడ గుణవతియగు కన్యక కలదనివిని, మాతండ్రికడకేగి, మాయక్కసత్యవతినిమ్మనికోరెను.

అప్పుడు గాధిరాజేంద్రునకు మాయక్కదక్క వేఱుసంతానములేకుండుటచే నాపె నతిగారాబముతోఁ బెంచుకొనుచుండెను. అందువలన ఆబీదబాపనికిఁ దనపుత్రికనీయమనసొప్పక, నిరాకరించిన శపియించుననితలంచి యొకయుక్తినిబన్ని, ఇట్లుబలికెను. "విప్రకుమారా! ఒకచెవినలుపును మిగతదేహమంతయుఁదెలుపును గలవెయ్యిగుఱ్ఱముల నెవ్వరుతీసికొనివత్తురో వారికినాకూతునిత్తునని శపథముచేసితిని. నీవట్టినీలకర్ణముగల ధవళాశ్వములఁ గొనితెచ్చినచో నీకునాపుత్రికనిచ్చుటకు సందేహములేదు" అనెను. ఋచీకుఁడట్లైన నాకిరాత్రిగడువొసంగుము రేపుసూర్యోదయమైనతోడనే నల్లచెవులుగలవెల్లతేజులఁ దెచ్చియిత్తు" నన మాతండ్రి "వల్లె" యనెను. అంతయోగసిద్ధిగల యాభూసురకుమారుఁడు మాతండ్రికోరినరీతిని తెల్లవారువములసృష్టించి, తెల్లవారినతోడనే గాధినరేంద్రునకుఁజూప నాతఁడుమాఱుమాటాడనేరక, సత్యవతినిచ్చి వివాహమొనర్చె. మాయక్కనాతనితోఁబంపెను. కానిధనహీనునితో సార్వభౌమనందన యెట్లుకాపురముచేయునా? యని పుత్రికానురాగముచే విచారింపఁదొడఁగెను.

ఋచీకుఁడట్లు సత్యవతినిబరిణయమాడి, యాపెతోఁగాపురము చేయుచుండెను ఇట్టులుండనొకనాడు దారుణమగుదావానలము ధూమస్తోమముతోఁగూడి చెలరేగి, తాపసకుటీరములఁజుట్టుముట్టనుండ, పొగచే కన్నులుగానరాక తల్లులకైపిల్లలును, పిల్లలకైతల్లులును, భర్తలకై భార్యలును, పత్నులకైపతులును, విలపించుచునొండొరులఁబిలిచికొనుచు భీతులై గోలచేయుచుండ సత్యవతి వారియాక్రందనధ్వనులనాలించి, తనపాతివ్రత్యమహిమచే నాకసమున కాఱుమబ్బులసృష్టించి, వర్షధారలచే దావానలమును శాంతింపఁజేసి, వారినందరిని సంరక్షించెను.

వేఱొకతఱిని మునిగణములు శిష్యబృందములతో ఋచీకుని యింటికినతిథులైరాగా వారికినాతఁడు భక్తితో భోజనమిడఁగోరి, సత్యవతికాసంగతిని దెలుప ఆపెయింటసోలెడుబియ్యములేకున్నను వెంటనే పాతివ్రత్యమహిమచేఁ బదార్థములసమకూర్చి వంటలసిద్ధముచేసెను. అంతమాభావపరమానందముతో "మహాత్ములారా! వంటయైనది. భోజనమునకు దయచేయుడు." అనవారు "మాకుచలిబాధమిక్కుటముగానున్నయది. కావున నుష్ణోదకములసిద్ధముచేయింతువేని భోజనమునకు వత్తుమనిపలికిరి ఆమాటలవిని అవ్యవధిగా నసంఖ్యాకులగుమునివరులకు వేడినీళ్ళెట్లుసమకూర్తునా? యని ఋచీకుఁడు చింతించుచుండ మాయక్కయది తెలిసికొని, భగవంతునిప్రార్థించి, యుష్ణోదకపూరితమగు నొకనదినినిర్మించి, యందాతాపసుల స్నానముచేయఁబ్రార్థించెను. వారానఖంపచములగు నదీనీరములస్నానమాడి, రుచ్యపాకములభుజియించి, సత్యవతిపాతివ్రత్యమునుప్రశంసించి, యావేడినీళ్ళయేటికిఁ గౌశికియని పేరిడి, జీవనదినిగాఁజేసి, ఆనదియందుస్నానమాడినవారికి నభీష్టసిద్ధియగునని పలికి వెడలిపోయిరి.

ఋచీకుఁడు మాయక్కపాతివ్రత్యమునకు సంతసించి "సాధ్వీమణీ! నీకేమికావలయునో కోరికొనుము." అనిపలుక సత్యవతియిట్లు తెలిపెను.

సత్యవతి:—ప్రాణేశా! నాతల్లిమాళవీదేవికిని నాకును సుతులు కలుగునట్లు వరమొసంగుడు. మాయమ్మకుఁబుట్టుబిడ్డఁడు క్షత్రియతేజోవిరాజమానుఁడుగా నుండవలయును. నాకుకలుగుసుతుఁడు మీవలెనే బ్రహ్మతేజోవిభాసితుఁడుగా నుండవలయును. అనమాభావ మాయక్కకోఁనట్లు పుత్రులనీయఁగోరి, యాగమొనర్పనుండ; మాతండ్రి మాతల్లితో మాయక్కకాపురమెట్లున్నదోచూడ నాఋచీకాశ్రమమునకువచ్చెను. ఆరాజదంపతులనాతఁడు సాదరముగఁబూజించి, తాఁదలపెట్టినయాగముపూర్తిచేసి, మంత్రపూతమగు పాయసమును వేఱువేఱు గిన్నెలలోనుంచి, సత్యవతితోనిట్లుపలికెను.

ఋచీకుఁడు:—సతీమణీ! ఈరెండుగిన్నెలలోను పాయసముంచితిని. అందుమొదటిగిన్నెలోనిపాయసము మీతల్లిభుజింపఁదగినది. రెండవగిన్నెలోనిపరమాన్నము నీవుచేకొనఁదగినది. ఈరెంటిని హోమవేదికకడనుంచుచున్నాడను. మీరుస్నాతలైవచ్చి మీమీపాయసపాత్రములఁజేకొని, పరమాన్నముల భక్తితోభుజియింపుఁడు. దానినీవుకోరినట్లు పుత్రులుపుట్టుదురు.

ఆమాటలవిని సంతానాతురలగు నామాళవీసత్యవతులు స్నానమాడివచ్చి, ప్రమాదవశమునఁ బాయసపాత్రములఁ దారుమారుగఁజేకొని, యందలిపాయసమునుభుజించిరి తోడనేఋచీకుఁడువచ్చి, పాత్రములుమారుటనుజూచి "సత్యవతీ! నేఁదెల్పినట్లుచేయకపోవుటచే నీగర్భమున క్షత్రస్వభావుఁడగునందనుఁడును, నీతల్లికడుపున సాత్వికస్వభావుఁడగుసుతుఁడును పుట్టుదురు." అనసత్యవతిభీతయై, ఇట్లుప్రార్థించెను.

సత్యవతి:—ప్రాణేశ్వరా! నాకుఁబుట్టువాఁడు బ్రాహ్మణస్వభావముకలవాఁడుగాను వానికిఁబుట్టువాఁడు క్షత్రస్వభావుఁడుగానుండునట్లును అనుగ్రహింపవలయును.

ఋచీకుఁడు:—సతీమణీ! నీవుకోరినరీతిని సంతానముకలుగును. సంతాపమందకుము అనియూఱడించెను. అటులనే మాతల్లియగుమాళవికి నేనును, మాయక్కసత్యవతికి జమదగ్నియు, బుట్టితిమి. ఆజమదగ్నికి క్షత్రియస్వభావుఁడగు పరశురాముఁడుదయించెను. అనియిటుల విశ్వామిత్రుఁడు నిజవంశక్రమమును దెలిపెను. ఆకౌశికవంశానుపూర్వకగాథనువిని రాముఁడిట్లుపలికెను.

రాముఁడు:—కౌశికమునీంద్రా! అసదృశమగు మీవంశచరితము బహువిధవిశేషములతో నలరారుచున్నయది. ఇట్టిసొంపగు గాధిగాధను తెలిపి మమ్మానందింపఁజేసితిరి. మానవులకీచరితమెన్నియో గుణపాఠములఁగఱపుచున్నయది అనిప్రశంసించెను. విశ్వామిత్రుఁడా రాత్రి శోణనదతటమునఁగడపి, తెల్లవారినతోడనే అచటినుండిబయలువెడలి మధ్యాహ్నసమయమునకు జాహ్నవీతీరముచేరెను.

త్రయోవింశత్యధ్యాయము.

—♦ గంగావతరణము ♦—

జాహ్నవీతటమున నొకవటముక్రింద వారందరు సుఖాసీనులై యుండఁ గౌసల్యానందనుఁడు కౌశికునిఁజూచి, యిట్లు ప్రశ్నించెను.

రాముఁడు:—పావనచరితా! మాళవీసుతా! పాపహారిణియగు నీగంగాతరంగిణి యవతరణవృత్తాంతమును వినఁ గుతూహలమగుచున్న యది. కావున దయయుంచి, యీజాహ్నవీచరితమును వినిపింపఁ బ్రార్థించుచున్నవాఁడను.

విశ్వామి:—సుధామధురభాషణా! రవికులభూషణా! కలుషహారమగు నీభాగీరథీచరితము జనులకత్యానందముతో నాకర్ణింపఁదగినది. అందులో మీయినవంశసంభవులకుఁ దప్పక వినఁదగియున్నది. వినుము. పూర్వము ప్రజాపరిపాలనతత్పరుఁడును, శూరాగ్రేసరుఁడును, సూర్యవంశసంభవుఁడునగు, సగరుఁడను సార్వభౌముఁడు విశ్వంభరావలయమును బాలించుచుండెను.

ఆచక్రవర్తికి విదర్భరాజాత్మజయగు కేశిని జ్యేష్ఠభార్య. వినతాసుతయగు సుమతి ద్వితీయభార్య. వీరిలోఁ గేశినికి నసమంజసుఁడను నొక పుత్త్రుఁడును, సుమతికి సగరనామధేయులు అరువదివేలనందనులును, పుట్టిరి. ఇట్లనేకోత్తరసుతసహస్రసమేతుఁడై యాసగరచక్రవర్తి సురగణపరివృతుఁడైన దేవేంద్రునివలెనె సకలైశ్వర్యసంపన్నుఁడై రాజ్యపాలన మొనర్చుచుండెను.

ఇటుల సుఖముగాఁ గాలము గడుచుచుండఁ బట్టమహిషియగు కేశిని కుమారుఁడు అసమంజసుఁడు క్రూరస్వభావుఁడై పౌరబాలుర సరయూనదీజలములఁబడవేసి, యాయర్భకులందఱు గొట్టుకొనుచుండఁ జూచి, యానందించుచుండెడివాఁడు. ఇటులఁ గొంతకాలముగడువఁ బురజనులు గర్భశోకములు భరింపఁజాలక, సగరునికడకు గుంపుగుంపులుగా వచ్చి, యసమంజసుని యసమంజసకృత్యముల నివేదించిరి.

సాకేతసార్వభౌముఁడు శ్రుతిపుటదారణములగు నాదారుణవార్తలవిని, లజ్జితుఁడై తనసుతుఁడొనర్చుచున్న శిశుహత్యలకు దుఃఖితుఁడాయెను.

" ఆహా ! బురదలేనికాసారమును, విచారములేనిసంసారమును, భూవలయమునఁ గానరావు. అంతఁ బ్రజాసౌఖ్యసంపాదనాసక్తుఁడగు సగరుఁడు వెంటనేరాజసభనుగావించి, మంత్రి పురోహితాదులతోఁ దనతనయుఁడగు నసమంజునిక్రూరకృత్యములఁ దెలియఁజేసి "ఈపాపాత్మునకుఁ దగుదండనమువిధించినగాని నేనిలువఁజాల ఈదుష్టుఁడు జీవించియున్న, ఇక నెన్ని శిశుహత్యలఁ జేయునో! కావున పీడఁగడతేర్చుటయే నాకుసమ్మతము. మీయభిప్రాయములఁగూడఁదెలుపుడు." అన ధర్మనిర్ణేతయగు నాచార్యుఁడిట్లుపలికెను.

ఆచార్యుఁడు:— రాజేంద్రా! ఇందరుబాలుర హతమొనర్చినవానికి వధయేతగుశిక్ష కానియీయపరాధి మీకగ్రమహిషియందుపుట్టిన సుతుఁడగుటచేమందీతఁడు యువరాజుగాను చక్రవర్తిగానుకానున్నవాఁడు ధర్మశాస్త్రములుకొన్ని చక్రవర్తులవధకనుమతించుటలేదు. దేశాంతరములకు దరిమివేయుటకంగీకరించుచున్నవి కావున వెంటనేనసమంజసుని విదేశములకుఁబంపివేయుటన్యాయము, అని తెలిపెను ప్రాడ్వివాకాదిధర్మనిర్ణేతలెల్లరు దానినేబలపరిచిరి. సగరుఁడు వెంటనేయసమంజసునకు సంకెలలవేయించి కింకరులచే విదేశములవిడిచిపెట్టించెను. "ఆహా ! సూర్యవంశనృపాలురకు రాజ్యపాలనమున ధర్మసూత్రములు ప్రమాణములుగాని, పుత్రాదిప్రేమపాశములు ముఖ్యములుకావు కావుననే వారు విఖ్యాతుల్వైరై ప్రజలచేఁబూజింపఁబడుచున్నవారు."

రామచంద్రా ! కంటివా ? నీపూర్వుల ధర్మానురక్తి వింటివా ? వారిసుతమమతావిరక్తి నీపూర్వులు విషయభోగములకై సింహాసనములనెక్కలేదు. ప్రజాసౌఖ్యసంపాదనమునకై రాజ్యములస్వీకరించిరి పుట్టిన భానుకులముననేపుట్టవలయు ఆమాటలవిని రాముఁడిట్లుపలికెను.

రాముఁడు:—మునిచంద్రా! నిజదేశోద్ధారచరితముల వినుటకంటె ఘనానందము వేతొకటుకలదా? అందును స్వవంశ్యజీవితములెంతయునుత్సాహజనకములు. గురువర్యా ! పిమ్మట నేమాయె ?

కౌశికుఁడు:—రామా ! అట్లసమంజసుని దేశమునుండి తరిమివేసినతోడనే అతనినందనుఁడగు నంశుమంతుని యువరాజునిగాఁజేసి, సగ

యుఁడు తాపూర్తిచేయవలసియున్న తుదివాజిమేధమును చేయఁదలంచి, పౌత్త్రుఁడగు నంశుమంతుని యాగాశ్వరక్షకునిగా నియమించి, తురగమునువిడచెను. అంశుమంతుఁడు సైన్యసమేతుఁడై సపరివారముగా నావారువమువెంటఁ గొంతదూరమేగ దేవేంద్రుఁడువచ్చి, ఆహయమును రహస్యముగా గొంపోయి, పాతాళలోకమునఁ గపిలమహర్షియాశ్రమములో విడచెను.

అంశుమంతుఁడశ్వమును గానరేక, పితామహునికడకునచ్చి, హయమదృశ్యమగుటను దెల్పెను. ఆమాటనువిని సగరుఁడు తనయులఁ జాఁబిలచి "పుత్త్రులారా! మీరాత్రాత్రితేజములు మిరయ జన్నంపుతేజి వేగమెకొనివచ్చి, నాచేనవభృథస్నానము చేయింపుఁడు.

సగరులు:—కోసలరాజేంద్రా! ఇదెనుల్లోకములగాలించి యాగసైంధవమునుగొనిదెచ్చి, మీయజ్ఞము సాంతమగునట్లు చేయుదుము. తండ్రియాజ్ఞల నెఱవేర్పనేఅని సుతులుజీవించుటకేల, హతులగుట మేలు అని యాయధర్మమునై, పుడమియందర నయోధ్యనుండిబయలు వెడలి, భూచక్రమంతయుఁదిరిగి, తేజినిగానరేక, పాతాళమునకేగి, కపిలాశ్రమమునన్న సవనఘోటకమునుగనుంగొనిసంతసించి, మృత్యువాసన్నమగుటచే నటఁదపముచేయుచున్న కపిలునిగాంచి, ఇట్లుతలంచిరి.

"ఈతఁడే మనతత్తడి నెత్తికొనివచ్చినముచ్చు మహాబలశాలుర మగు మనలఁజూచి, భయమంది, ఈదొంగతపసివేసముఁదాల్చి జపము చేయుచున్నట్లు నటించుచున్నవాఁడు ముందీదొంగపొగరడంచి, పిమ్మటఁ దురగమును గొనిపోవుదము." అనిపలుకుచుఁ గపిలమహర్షిపైఁబడి, బహువిధముల బాధింపఁదొడఁగిరి.

అంత నాకపిలుఁడు కుపితుఁడై యాయూతతాయులగు సగరకుమారుల తపోవహ్నిచే భస్మశేషులనుగాఁ జేసెను. సగరచక్రవర్తి తన తనయులెంతకాలమునకును రాకుండుటచే దిగులొంది, అంశుమంతుని బిలిచి "కుమారా! నీవు నీపినతండ్రులేమైరో? యాగాశ్వమేటుబోయెనో? తెలిసికొని వారినివానిని వెంటనిడికొనిరమ్ము పొమ్ము. నీకు శుభమగుగాక" అనిదీవించిపంపెను. అంత నాసగరపౌత్త్రుఁడు తాతకు

వందన మొనర్చి తిన్నగాఁ బినతండ్రులేగిన దారిని పాతాళమునకుఁ బోయి యటమేధ్యాశ్వమును గాంచి, పితరులఁ గానలేరక, యటునిటు చూచుచుండ నరువదివేల బుగ్గిపోగులు కానవచ్చెను. అతడవ్వి తప్పక తనపితృవ్యుల భస్మరాసులని నిశ్చయించి, చింతించుచుండ మింటినుండి వైనతేయుఁ డిట్లు పలికెను

వైన:—ధీమంతుఁడా! ఓయంశుమంతుఁడా! నీపినతండ్రులందరు కపిలాపరాధ మొనర్చుటచే భస్మరాసులుగాఁ బరిణమించిరి. కావున నీవు వృథాగాఁ గాలహరణ మొనర్పక, వీరికుత్తమగతుల గల్పింపఁ గోరుదువేని, యాకాశగంగను గొనితెచ్చి, ఈ భూతిసమూహములపైఁ బ్రవహింపఁ జేయుము దానిచే వీరికి ముక్తికలుగును.

అంశుమంతుఁడా వినతాసుతోక్తుల నాలించి అశ్వమును జేకొని, సగరునికడకు వచ్చి దానినిసమర్పించి, ఆగరుడభాషణముల వినిపించెను. సగరుఁడా దుఃఖవార్త నువిని తనయులముక్తికై తపించుచుండెనుఁ బీడెను. సగరానంతరము అంశుమంతుఁడు చక్రవర్తియై, పినతండ్రులముక్తికై తలపోయుచుండెను.

ఇటులుండ నాయంశుమంతునకు దిలీపుఁడను పుత్రుఁడుదయించెను. దిలీపుఁడు రాజ్యకార్యనిర్వహణదక్షుఁడైనవెంటనే అంశుమంతుఁడాతనికిఁ బట్టముఁగట్టి, హిమవంతమునకేగి, గంగనుగూర్చి తపమొనర్చి, గంగనుగానకయే దేహమునువిడచెను. ఆయంశుమంతునకుఁ బిమ్మట దిలీపచక్రవర్తి "గంగదివినుండి భువికివచ్చుటయెట్లు? నేనాసురనదీపావనజలములలోఁ బితరులకుఁ దర్పణ మొసంగి, వారలముక్తులఁగాఁ జేయుటయెట్లు?" అనియోజించుచుండ నాదిలీపునకు భగీరథుఁడను భాగ్యశాలిపుట్టెను దిలీపుఁడాసుతునిఁ జక్రవర్తినిగాఁ జేసి, మందాకినిని గొనిరానేరక, మనోవ్యాధిచే మరణించెను.

దిలీపానంతరము భగీరథచక్రవర్తి, నిజప్రపితామహుల నుత్తమలోకములకుఁ బంపనిశ్చయించి, రాజ్యము మంత్రులనశ మొనర్చి, గోకర్ణక్షేత్రమునకేగి, పంచాగ్నిమధ్యమునఁ జతురాననునిగూర్చి తీవ్రముగాఁ దప మొనర్ప, నాసరోజసంభవుఁడు ప్రత్యక్షమై "రాజేంద్రా! నీనిరుప

మానతపమునకు సంతసమందితిని. నీకుఁగావలసినవరమేదియో కోరుకొ
నుము." అనభగీరథుఁడిట్లుపలికెను.

భగీరథుః—వాణీరమణా! నాపితరులగు సగరులభస్మదేహముల
పై నాకాశగంగ ప్రవహించునట్లుచేసి, వారలకుత్తమలోకములనొసంగి
సంతానహీనమై నాతోనంతరింపనున్న సూర్యవంశము సంతతివంతమై
సంతోషముతో వెలయునట్లు వరముఁబ్రసాదింప వేడికొనుచున్నవాడను.

బ్రహ్మః—రఘువంశసరసీరుహభాస్కరా! నృపవరా! నీవుకో
రినయట్లు నీమనోరథము లీడేరఁగలవు కాని గగనమునుండి గంగపుడ
మికిఁ బడునపుడాప్రవాహవేగమును భరింపఁదగినవాఁడువలయును
లేకున్న గంగాపాతవేగముచే భూగతప్రాణిజాతమునకు ముప్పువాటి
ల్లగలదు. అందుకుదక్షుఁడు దాక్షాయణీపతియే. కావున నాశంకరునిఁ
బ్రార్థింపుము. ఆగిరిజాపతి నీకుసహాయుఁడగుచో వియన్నది క్రిందికివ
చ్చునట్లుచేయును. అనియంతర్ధానమాయెను. భగీరథుఁడాసంతాపహరము
లగు భారతీపతిశీతలోక్తుల నాలించి, వికసితహృదయారవిందుఁడై, అంగు
ష్ఠాగ్రమున నిలచి, సదాశివునిధ్యానింప నాకపర్ది యాపార్థివునకుఁ ప్ర
త్యక్షమాయెను. భగీరథుఁడాసౌమ్య సుందరాకృతినిఁజూచి, ఇట్లుప్రా
ర్థించెను.

భగీరథుఁడు :—ఓతాపహరణా! ఉమారమణా నాప్రార్థనలఁ
జేకొని, నాయందుఁగృపయుంచి, మందాకిని సురలోకమునుండి భూలో
కమునకు వచ్చునపుడాసురనదీవేగముచేఁ బ్రాణివినాశముకలుగకుండఁ
గాపాడఁగోరుచున్నవాఁడను అన దీనబాంధవుఁడగు శివుఁడందులకంగీక
రింప నాతేఁడుగగనవాహినినిప్రార్థించెను. అంతనాదివ్యనది మహావేగ
ముతో నాకసమునుండి, యాపినాకపాణిజటామకుటమునకవతరించి,
యందుండి మెల్లగాహిమగిరితటమునకుజారి యటనుండి భూస్థలిపైఁబడి,
భగీరథునివెంటఁ బాతాళమునకుఁ బ్రవహింపఁదొడంగెను

భగీరథుఁడట్లాదివ్యతరంగిణిని జహ్నుమునీంద్రుని తపోవనమార్గ
మునఁ గొనిపోవుచుండ నామునీంద్రుఁడా నదీవేగధ్వానమునువిని, యా
సురనదిని తనకమండలమున నణచివేసెను. ప్రవాహమునకు ముందేగు

చున్నదిలీపనందనుఁడు ప్రవాహధ్వని వినరాకుండుటచే వెఱగంది, వెనుకకుఁదిరిగిచూడ నాత్రిదశనదీప్రవాహము కానరాదయ్యెను. అంతభగీరథుఁడు అదిజహ్నుమునీంద్రుని ప్రభావమనితలంచి, యాసంయమీంద్రునిట్లుప్రార్థించెను.

భగీరథుఁడు:—ఓయమేయతపోవైభవా! సుహోత్రసంభవా! నాప్రపితామహులగు సగరాత్మజులకు సద్గతులఁగలుగఁజేయఁగోరి,అనేకవత్సరములన్నహారాదులఁజేకొనక, తపమొనర్చి అబ్జాసనాబ్జవైరిశేఖరులఁ బ్రసన్నులనుగాఁజేసికొని, ఈయమరాపగను నాతోఁబాతాళమునకుఁదీసికొనిపోవుచుంటిని సదయహృదయా! ఇంతిదనుక నావెనుక వచ్చుచున్న మిన్నేటివెల్లువమ్రోత వినరాకుండుటచే నేవెనుతిరిగిచూడఁ నాకాయాపగయే కానరాకున్నయది. కావున నాయందు వాత్సల్యముంచి, చదలేటినీటినిఁ దిరుగఁబ్రవహింపఁజేయఁ బ్రార్థించుచున్నవాఁడను.

కరుణారసపూరితమగునాభగీరథప్రార్థనముచే హృదయముద్రవింప, నాతఁడుపావనరసపూరితమగు గంగాప్రవాహమును నిజకమండలువునుండి ప్రసరింపఁజేసెను అందుచే గంగకు జాహ్నవియను పేరువచ్చినది.

అంతనాభగీరథుఁడు సంతసమంది, జాహ్నవిని పాతాళమునకుఁ గొనిపోయి, తనముత్తాతల బూడిదప్రోగులపై నాపావననదీజలములఁ బ్రవహింపఁజేసి, అత్తోయములతో సాగరులకు జలాంజలులొసంగ, వారెల్లరుముక్తులైరి. భగీరథునిచే దీసికొనిరాఁబడినదగుటచే గంగభాగీరథియని పేర్కొనఁబడుచున్నది. కౌసల్యాగర్భశుక్తిముక్తామణీ! వింటివా? నీపూర్వుఁడగు భగీరథునిచరితమును తాఁదలఁబెట్టినదుర్ఘటకార్యమును విఘ్నములకుజంకక, యోర్పుతోసాధించువాఁడే పురుషసింహుఁడు.

రామచంద్రా! ఈభగీరథోపాఖ్యానమువలన నార్యసంతతివారు తెలిసికొనఁదగిన ఘనభావమేదియన, ఒకమహనీయుఁడు తలపెట్టిన ఘనకార్యమాతనికాలములో సాగకున్నను సత్సంతానము కలిగినచోఁ గొం

తకాలమునకైనఁ దప్పక నెరవేర్పఁగలవనియుఁ, దనపితరులు మొదలిడిన ధర్మకార్యమును, ఆవంశమునజనించినపురుషునకుఁ బూర్తిసేయుట విధియనియు, అట్లునిజకులజసంతోషములఁ బూర్తిచేసిననాఁటికీర్తి గంగాప్రవాహమువలెఁ బావనమై, చిరస్థాయినిగానుండుననియు, స్పష్టమగుచున్నది.

కౌసల్యానందనా! నిజశౌర్యమును ప్రదర్శించి స్వకులమునకు యశమునందఁజేయనేరని బుడుతలగనుటకంటె నాయింట కోడండ్రు గొడ్డ్రాండ్రగుటయే మేలు. ఆహా! యిరువదివేలపితరులనొక్క కుమారుఁడు పాపకూపములనుండియుద్ధరించి, పుణ్యలోకోన్నతప్రాసాదముల నివసింపఁజేసెను. అట్టివాఁడుకదా! నందనుఁడు. వందనీయుఁడు. వంశకరుఁడు.

రాముఁడు:—మునివరేణ్యా! వింటిమి, వినిపావనులమైతిమి, భానువంశరాజేంద్రుల చరితములు శ్రావ్యములు, పాపహరములు; వానినెంతవిన్నను తనివితీరదు.

లక్ష్మణుఁడు:—కౌశికమునీంద్రా! భగీరథసార్వభౌముఁడు ఒక్క గంగాప్రవాహమునే కొనిరాలేదు. అసమానయశోవాహినినికూడఁ దోడ్తెచ్చినాఁడు. మునికులతిలకా! మీయనుగ్రహముచే నుభయలోకతారకములగు పావనామూల్యోపాఖ్యానముల వినుచుంటిమి. ఆదశరథనందనులసంభాషణములకుఁ గౌశికుఁడలరి, ఆరాత్రి రాముదులతో సురనదీతటమున శయనించెను.

విశ్వామిత్రాదులుషఃకాలముననే మేల్కని, గంగనుదాటుటకుఁ బ్రయత్నించుచుండఁ గన్నులముందుఁదెరవేసినట్లుఁ దుహినము దట్టముగా వ్యాపించియుండెను. ఆమంచుముసుంగులో నొకమనోహరమగు హరిగానము వినరాఁదొడంగెను. అంతఁ గౌసల్యానందనుఁడు లలితభూపాలరాగకలితమగు శ్రీహరిగానమునాలించి, కుశికనందనునితో ఇట్లుపలికెను.

రాముఁడు—యతీంద్రా! ఈప్రాతఃకాలమున నీనీహారపటలములో నింతశ్రుతిలయముగా భగవల్లీల భక్తిరసమొలుక గానముసేయువారలెవ్వరైయుందురు? కిన్నరనందనలెవ్వరైన గంగానదీస్నానమునకు

వచ్చియుందురా? ఆహా! ఈగంగావేణివలె నీగానవాహిని నామానసము నాకర్షించుచున్నది.

విశ్వామిత్రుఁడు:—గానలోలా! ఈమించు మంచుమునుంగులో గాన మొనర్చువారెవ్వరైయుండునదియుఁ దెలియవచ్చుటలేదు. ఈభారతవసుధాస్థలిని మాలఁడు మొదలు మహారాజువఱకును గలమానవులెల్లరును భగవన్నామసంకీర్తనపరులే. అనుచుండ నొకపాటలాధరి శ్రీరామచంద్రుని పాటలఁబాడుచు నావనుదీసికొని దరిజేరి, గంగయొడ్డున నిలచియున్న రామచంద్రుని దివ్యసుందరరూపమునుజూచి, తోడనే చేతనున్న తెడ్డు నొడ్డునఁబడవైచి, గంగానీరములతో రామపదసరసీరుహములఁగడిగి ఆపాదోదకముల శిరమునఁజల్లికొని, పానమొనర్చియాదాశకన్య యా దాశరథినిట్లు నుతింపఁదొడఁగెను.

దాశకన్య:—ఓపతితపావనా! రమామోహనా! నీదివ్యసందర్శనముచేతను, నీపావనపాదోదకస్పర్శనముచేతను, నేను బాహ్యాభ్యంతరములఁగలుష విరహితనైతిని. ఓసర్వాంతర్యామీ, సామీ! వేదాంతవిదులగు యోగులే నీమహిమలఁదెలుపఁజాలకున్నయపుడు, నాబోటి మూఢులగుచేడియలు నీలీలలనుతించుటయెట్లు? కావున నోసరసిజలోచనా! నీచరణపంకజసౌరభ సమీరకరణములు నాపైనెప్పుడును ప్రసరించునట్లను గ్రహింపుము. అన, నాపల్లెదానిసంలాపములవిని సౌమిత్రి యిట్లుప్రశ్నించెను.

లక్ష్మణుఁడు:—సోదరీమణీ! నీవెవ్వతెవు? ఇట్టిదివ్యసౌందర్యకల్పవల్లివి పల్లియఁవిదవెట్లైతివి?

దాశకన్య:—రామానుజా! నేనురంభయనునచ్చరలేమను ము న్నొకప్పుడు సురేంద్రుఁడీగాధేయుని తపమునకు విఘ్నమొనర్పుమని నన్నుబంపెను. నేనాయమరనాయకునియానఁ దలనుదాల్చి, యీముని తపోవనమునకేగి, నేనేర్చిన శృంగారకళావిలాసములఁ బ్రదర్శింపమొదలిడితిని. ఈసంయమిసార్వభౌముఁడు నాకునున్న వన్నెలాడియగు మేనకచేఁజిక్కి మోసపోయినవాఁడగుటచే నావిలాసములకు భ్రమపడక తపమాచరించుచుండెను.

ఒకనాఁడు శాంతమగు వసంతసమయమునఁ జల్లగాలి మెల్లగా వీచుచుండ, విపంచి శ్రుతిచేసి, మోహజనకములగు శృంగారపదముల గానమొనర్పఁదొడఁగితిని సుమిత్రానందనా! ఆనాఁడు నాకుముప్పుమూఁడుటచే నీతపసితేఁడు సమాధినిఁజాలించి, నావైపుచూపులసారించి, కనుదమ్ములెఱ్ఱఁజేసి, "ఓసీదేవదాసీ! నీమురిపెంపుసొబగుల నాకుఁజూపి, మోసగింపవచ్చితివిగా? దుశ్శీలా! నీవీదివ్యరూపమునువీడి, భూలోకమునఁ బల్లితొయ్యలివై జనింతువుగాక!" యనిశాపమొసంగెను. రామానుజా! ఆకాలమున నీమునిచంద్రుఁడిట్లు ప్రశాంతరూపుఁడుకాక, గ్రీష్మకాలప్రచండభాస్కరుమాడ్కి దుర్నిరీక్ష్యుఁడై యుండెను. నేనాశాపమును విన్నతోడనే యామునీంద్రునిపాదములకడ సాష్టాంగముగాఁబడి "దయామయా! గాధేయా! నేనుసురేంద్రకింకరిని. నాయేలికయానపై నిటకువచ్చితినికాని నేస్వయముగాఁ గామునికై రాలేదు. కావున నాపైఁగరుణించి, నాకొసంగినశాపము మరలింపవేఁడికొనుచున్నదానను నేనుశబరనారినిగాఁబుట్టి, చేపలబుట్టల మోయఁజాలను కావున శాంతాత్ముఁడవై నాదోసముల సైరణచేయఁ గోరుచున్నదానను." అనిప్రార్థింప, ఈకౌశికుఁడు ననుజూచి యిటులపలికెను.

"ఓసురేంద్రకింకరీ! నీవుపరాధీనవగుటచే నీప్రార్థననుమన్నించితిని. కానినీకు భూలోకమునఁబుట్టుటతప్పదు. ముందుశ్రీహరి దాశరథియైపుట్టి మిథిలకేగుచు నీదారినివచ్చును అపుడు నీవాపురుషోత్తముని పాదతీర్థములఁ బానమొనర్చి, శాపవిముక్తవగుదువు. నీవంతదనుక శ్రీహరినామకీర్తనముచేయుచు గంగపై బాటసారుల దాటించుచుండుము." అని శాపమునకుగడువొసంగెను. ఆవెంటనే నేను శృంగబేరపురనాయకుఁడగు గోహుఁడను పల్లివానికిఁ బుత్రికనై భాగవోత్తముఁడగుగుహునకుఁ జెల్లెలినై జన్మించి, పెండ్లియాడకకన్యగానుండి, నీరాకకెదురుచూచుచు, నీలీలలగానమొనర్చుచు, నీగంగాప్రవాహినిపైఁ బడవనుదాటించుచుంటిని. నీదివ్యసందర్శనముచే శబరీజన్మమునువీడి దివ్యకాంతనైతిని అని నిజశాపోదంతమునుదెలిపి పూతగాత్రియగు నాపోతనెత్రి వారినందఱిని గంగావారినిదాటించి శ్రీరామచంద్రునకుఁ బ్రదక్షిణనమస్కారములొనర్చి వెడలిపోయెను.

—: చతుర్వింశత్యధ్యాయము :—

అహల్యాశాపవిమోచనము.

విశ్వామిత్రుఁడు గంగనుదాటి మిథిలకేగుచు "రామచంద్రా! రేపుదయమునకుమనము జనకునియజ్ఞవాటమునకుఁ జేరఁగలము. కావున నెమ్మదిగారమ్మా వనమధ్యమునుండిపోవుదము." అని గౌతమాశ్రమములోఁ బ్రవేశించినతోడనే రాముడు కౌశికునిట్లుప్రశ్నించెను.

రాముఁడు:—గురువరా! ఈతపోవనమతిసుందరముగఁ గానవచ్చుచున్నయది కాని యిందుఁదాపసజనులు కానరాకున్నవారు కారణమేమి?

కౌశికుఁడు:—రామచంద్రా! ఈతపోవనచరితము వినదగినదియు, విచారింపదగినదియు, నైయున్నయది. సుచరితా! యెంతటివిద్వాంసులును, మఱెంతటితాపసోత్తములును యికనెంతటి చక్రవర్తులును, అంతకుమించిన సురేంద్రపుంగవులును, కూడ కామక్రోధములకు వశమగువారేకాని వానిఁదప్పించుకొనఁ జాలువారుకానరారు. ఇందుకు లెక్కనిదర్శనములుకలవు. ఇప్పుడు నేదెలుపఁబోవు విషయమాయంశమునే బలపఱచును. వినుము.

మున్ను జగన్నిర్మాణచతురుఁడగు చతురాననుఁడు లోకోత్తరరమణీమణిని నిర్మింపఁదలఁచి, ప్రకృతిసౌందర్యమునంతను బోగుచేసి, దానితో నహల్యయను సుందరీరత్నమును నిర్మించెను. ఆయపూర్వకామినీనిర్మాణమును దిక్పాలురువిని, యహమహమికతో నహల్యకొఱకు నాత్మభావునికడకేగి, తమకాసుందరాంగి నొసంగుమని ప్రార్థింప బ్రహ్మవారిలో నెవరికిచ్చుటకును మనస్సొప్పక, "దిక్పాలులారా! ఎవరుభూప్రదక్షిణముచేసిముందుగానాముందునకువత్తురో వారికీవనరుహేక్షణనిత్తును" అని తెలుప ఆదిక్పతులొకరికంటెనొకరు ముందువచ్చి, ఆమందయానను బడయుకోరికతో వారివారివాహనములనెక్కి, యొక్కపెట్టున వెడలిపోయిరి.

అంతఁ గమలాసనుఁడాసరోజముఖిని ముద్గలమునీంద్రుని యాశ్రమమునకుఁగొనివచ్చి "ఈబింబాధరిని నీయొద్దనుంచి విద్యాబుద్ధులఁగఱ

పుచుండుము." అని తెలిపి వెడలిపోయెను. ముద్గలుండు భారతీపతియా నతిని, అహల్యను పుత్రికనువలెఁ బోషించుచుండెను. ఇటులుండ గౌతమమునీంద్రుఁడు భార్యనుఁబడయఁగోరి, తగుకన్యకామణి నన్వేషించుచు, ముద్గలునికడకువచ్చి, అటనసమానరూపగుణశీలములతో, వెలయుచున్న యహల్యనుగాంచి, సంతసించి, ముద్గలమునీంద్రునిఁ దన కాకన్నియనిమ్మనికోరెను. అదివిని యాతపసి యిట్లుప్రతివచనమొసంగెను.

ముద్గల:— గౌతమమునీంద్రా! ఈచంద్రవదన చతురానన నందన. ఈపెను బరిణయమాడుటకు నియమముకలదు.

గౌత:— మునిపుంగవా! అనియమమెట్టిది. నాకదిసాధ్యముగునా?

ముద్గ:—వినుమాశపథమును. ఈభూవలయమును చుట్టుతిరిగి మొట్టమొదటనెవరు కమలభవునిసందర్శింతురో వారికీసుదతినిచ్చుటకు బ్రహ్మశాసచేసెను. అట్లుతిరిగివచ్చి యీమోహనాంగిని జేపట్టుటకు దిక్పాలురేగియున్నవారు నేడోరేపో రానున్నారు. ఆమాటలువిన్నతోడనే గౌతముఁడు విస్మయంబోయి "అహా! నేనెక్కడ! భూగోళమును జుట్టివచ్చుటయెక్కడ! అట్లుచేయకున్న నీకన్నియను జేకొనుటయెక్కడ అని చింతించుచుండ నాయతపోవనమునకు ముందొకయాగధేనువు దూడ నీనుచుండుట కానవచ్చెను. అంత గౌతముఁడాగోవుకడకేగి దానికి మున్మారు ప్రదక్షిణమొనర్చి, యావెంటనే బ్రహ్మకడకుబోయి, యహల్యను దనకిమ్మనికోరెను. అదివిని బ్రహ్మ "మునివరా! భూప్రదక్షిణమొనర్చినవానికి నాపుత్రికనియ్య నిశ్చయించితిని. నీకీనియమము తెలియదుకాఁబోలు.

గౌత:— పద్మాసనా! ఒకసారికాదు. త్రివారము ధరావలయమును గ్రుమ్మరివచ్చితిని. నీకుసందియమున్న ముద్గలునిదెలిసికొనుము. అననావిధాత యబ్బురమంది, యాతనితో ముద్గలునివద్దకేగి యడుగ నామహర్షి "భారతీరమణా! గౌతముఁడు ప్రసవించుచున్న ధేనువునకుఁ బ్రదక్షిణముచేసెను. అదియు భూప్రదక్షిణమునుసమము లే. కావున

గోప్రదక్షిణముచేసి ముందునిన్ను సందర్శించిన యీగౌతమునకు నహల్యనియ్యవలసినదే” అని తెలిపెను, విధాత ముద్గలునిబోధననుసరించి, యహల్యను గౌతమునకొసంగెను. గౌతముఁడు అహల్యను జేకొని, బ్రహ్మకు వందనమొనర్చి వెడలిపోయెను.

అహల్యావివాహమైన మఱునాడు దేవేంద్రుఁడు దిక్పతులకు ముందుగావచ్చి, యహల్యనిమ్మని యజునికోరెను, “నీకంటెముందుగా వచ్చిన గౌతమునకు నహల్యనిచ్చిపెండ్లిచేసితినని” సరసిజాననుఁడు తెలుపనావేల్పులరాయఁడు వెల్లఁబోయి ఇట్లుపలికెను.

ఇంద్రు:—భారతీరమణ! ఆగౌతముఁడు మాతోబయలుదేర లేదు. మాకెదురుపడను లేదు. అతఁడేదియొమోసముచేసి యహల్య నపహరించినాఁడు.

బ్రహ్మ:—శచీవల్లభా! గౌతముఁడు గోప్రదక్షిణమొనర్చి, మీకుముందువచ్చి యహల్యనందుకొనెను. గోభూప్రదక్షిణములు తుల్యబలములు ఆధర్మసూక్ష్మము నాతఁడు తెలిసికొనెను. మీరెఱుంగరైతిరి. ఆమాటలువిని యింద్రుఁడు గౌతమునిపైఁ బగగొనివెడలిపోయెను.

అట్లుసురేంద్రుఁడు గౌతమునిపరాభవింప సమయమునకు వేచియుండి తుదకొకనాఁడు చంద్రుని సహాయునిగాఁజేకొని, నిశీథసమయమున గౌతమాశ్రమముచేరి, యానిశానాథునిచే గోడికూతకూయించెను. గౌతముఁడాధ్వని చరణాయుధకూజితమనిభ్రమసి, దర్భాసనాదులఁజేకొని, స్నానమునకై గంగానదికేగెను.

అంతఁ బాకశాసనుఁడు గౌతమరూపముతోఁ బర్ణశాలలోఁ బ్రవేశింపనాగౌతమపత్ని యాతనిపతిగాభావించి “ప్రాణేశా! స్నానాదులఁదీర్పకయే తిరుగవచ్చితివేల? యింకనువేళకాలేదా! అన దేవేంద్రుఁడిట్లుపలికెను.

దేవేంద్రుఁడు:—కాంతామణీ! ఎంతకాలమునకుఁ జెవికింపగు సంబోధనమునువింటిని! పికవాణీ! తిరుగనొకసారి “ప్రాణేశా అనిపిలచి నన్నానందసాగరమున నోలలాడింపుము.

అహల్య:—ఓరీ! నీవెవ్వఁడవు, నాపతిరూపముతో నిటకేల వచ్చితివి?

దేవే:—బింబాధరీ! గౌతముఁడు కృత్రిమభూప్రదక్షిణ మొనర్చి బ్రహ్మనుమోసగించి, నిన్ను పరిగ్రహించెను. అట్లుకాకున్నచో నీవు నాకర్ధాంగివై యుండెడిదానవు. నారాకకొంచెమాలస్యమగుటచే నాతనిరేఖ బయలుపడ నీవామోటుతపసిచేతఁ బడితివి. సురేంద్రమహిషివై యుండఁదగిననీవు ఇట్లుబీదబాపనికి నాలివైతివి.

అహల్య:—ఓసురనాయకుఁడా! నీనిజరూపమెఱుంగక నావల్లభుఁడవనుకొని నిన్నట్లు సంబోధించితినికాని నీపైఁబ్రేమచేగాదు. మారుపలుకక తత్క్షణము పర్ణశాలనువిడచి, వెడలిపొమ్ము. లేకున్న గౌతమశాపానలమునకు శలభమగుదువు.

ఇంద్రుఁడు:—చకోరాక్షీ! నాదివ్యరూపము చూడకుండుటచేతను నాదివ్యైశ్వర్యములఁ దిలకింపకుండుటచేతను, నన్ను నిరాకరించుచుంటివి. అని దివ్యమణిభూషణాలంకృతుఁడై, మందారసుమమాలగళమునఁగ్రాల నిజరూపముతో బ్రత్యక్షమాయెను. అట్లుప్రత్యక్షమైన సురపతిని జూచినతోడనే శరీరముకంపింప, ప్రాణములుపైకెగుర, నాలుకతడియార, నాగౌతమపత్ని గద్గదకంఠముతో నిట్లుపలికెను.

అహల్య:—శచీవల్లభా! ఇట్లుసాహసించి మర్యాదాహీనముగా మాటలాడదగునా మాతృసములగుపరకాంతల నాశింపనగునా? వలదు వలదు. నీకీదుర్బుద్ధివలదు. ఓజడాత్ముఁడా! వేల్పులతేఁడా! దినపతిపాదప్రసాదముచే వికసించు పద్మినీలతికల ఖద్యోతకాంతిప్రసరములచే వికసితములనుగా చేయఁగోరుటయు, నిజపతిపాదప్రసాదముచే సంతసించు సాధ్వీతిలకములఁ గాంచనప్రదర్శనములచే సంతసింపఁజేయఁజూచుటయు మూర్ఖకృత్యములుకావా? సతీమణులనేత్రములకుజరిత్రహీనులసంపదలు చితాభస్మములవలెఁ గానబడునని తెలిసికొనుము. నాశీలసితచేలముపై లోకనిందాంజనవర్షమును కురియింపకుము.

ఇంద్రుడు:—అలివేణీ! భీతిల్లకుము నిన్నా గౌతముఁడేమియుఁ జేయఁజాలడు అనిమెల్లగా నాపెదగ్గఱకు రాఁదొడంగెను.

అహల్య:—ఓ! తులువా! ఏమనివాగుచుంటివో తెలియకుంటివి. అత్యున్నతమగు నమరరాజ్యగిరిశిఖరమునుండి కామాంధుఁడవై దుస్తరపాపకూపమునఁ బడనుంటివి. నానాథుఁడింటలేక నేనొంటరిగానుంటను గనుఁగొని నాకుటీరమునఁ జోరునివలెఁ జొరఁబడుటయే కాక, తుచ్ఛసుఖమునకాశించి, నశింపనుంటివి. నీయట్టినీచస్వభావుఁడు విబుధసార్వభౌముఁడగుట ఎట్లుతటస్థించె ఓ! పాపీ! నాపతివచ్చులోపున నన్నంటఁజూచుచుంటివిగా! కట్టా! పాపాత్ముఁడా! పావనచరితులగు కశ్యపాదితులకుఁబుట్టి, పావననాముఁడగు వామనునకు సోదరుఁడవై యజ్ఞకాలముల వేదమంత్రములచే నాహూతుఁడవై పవిత్రమగు హవిర్భాగమునుభుజించునీనాలుక యిట్లునరకప్రాపకములగు హీనోక్తులఁ బలుకుటకెట్లు సిగ్గుచెందకున్నయది? ఓమందుఁడా! నాముందునిలువకపొమ్ము అనినిందించుచుండ గౌతమునిపాదుకాధ్వానము పర్ణశాలలోనికి వినవచ్చెను. వెంటనే గుండెలవియ నాయాఖండలుఁడు పర్ణశాలనుండి రహస్యముగాఁ బరిగిడఁబోయి, తొట్రుపాటుచే గౌతమునికెదురుఁగాఁబోయెను. ఆతఁడాదేవేంద్రునిఁ బరికించి కంటనగ్నికణములురాల నిట్లు పలికెను.

గౌతముఁడు:—ఓరీ! కుటిలాత్ముఁడా! శచీకాంతుఁడా! ఎంతటిద్రోహము చేయనెంచితివి. నిశాచరుఁడగు జాబిల్లిని కోడిగాఁజేసి, మలిజామునసే తుదిజాము కూఁతఁగూయించి నన్నుమోసపుచ్చి, నాకుటీరములోఁజేరితివిగా! ఔరా! హీనుఁడా! బిడౌజసుఁడా! ఇంతటినుండి నీవు దేహమాపాదమస్తకము అసహ్యానుగురూపముతో నుందువుగాక. నీకీపాతకకార్యములో సహాయుఁడైన నీదోషాకరుఁడు కళంకితుఁడై యుండుగావుత అనిశపియించి పర్ణశాలలోనికేగి, భీతయైవెలవెలబారి నిలచియున్న యహల్యనుజూచి, యిట్లుపలికెను.

గౌతముఁడు:—ఓదుశ్శీలా! జారునింటఁజేరనిచ్చి, వానితోసంభాషించుచుంటివా? పాపాత్మురాలా! నీవుపాషాణరూపమునుదాల్చి, పడియుండుము అనిశపియించెను అంతఁగోపముతోఁ గుటీరమునువిడచి, పో

ననున్న పతినిగాంచి, యాయహల్య వంతచెంది పతికివందనమొనర్చి, శిరము వంచి యిట్లు ప్రార్థించెను.

అహల్య:—సర్వజ్ఞా! ప్రాణవల్లభా! నేనేపాపమెఱుంగ మీరు పర్ణశాలనువదలి పైకివెళ్లినప్పుడనే, మీరూపముతోఁ జపలచిత్తుఁడగు శచీపతి కుటీరములోనికిరాగా వానిని మిమ్ములనుగాఁదలంచి, పలుకరించితిని. అటుపిమ్మట నాపాపాత్ముఁడు నిజరూపముతోఁ బ్రత్యక్షముకాగానే నేవానిని నిందించి, పొమ్మనుచుంటిని. అంత మీపాదములచప్పుడు వినరావాఁడుభీతుఁడై, పర్ణశాలనుండిపరుగిడెను. ఇంతకుమించి యిటజరిగిన పాపకార్యమేదియునులేదు. నమ్ముఁడునామాట పరమేశ్వరసాక్షిగాఁ దెలుపుచున్నదాన. మీపాదములాన. మునినాథా! నిజమారసి, శాంతాత్ములరై, నాకొసంగిన శాపమును మాపుసేయఁగోరుచున్నదానను పాపమెఱుంగనిసతులపై, మీయట్టి దయామయులగుపతులు కనికరింపవలదా? యోగదృష్టితోఁ బరికించిన మీకుఁదెలియరానిదికలదా! అనితనపాదములపైఁబడి, విలపించుచున్న యహల్యనుజూచి, గౌతముఁడిట్లుపలికెను.

గౌతముఁడు:—అహల్యా! నీవీనిశీథసమయమునఁ బతియింటలేనప్పుడు పరాయివానితో వాదప్రతివాదములొనర్చుట దోషము కాదా? నీపాతివ్రత్యమహిమచే మోసగింపవచ్చిన దోషకారిని శపింపవలదా? కావున నాశాపమునీవనుభవింపవలసినదే కానిపరిశీలింప నీవంతపాపాత్మురాలవుకావని తోఁచుటచే శాపపరిమితి కొంచెముతగ్గించితిని. వినుము.

ఇదిమొదలు నీవుపాషాణరూపముతోఁ బడియున్నను అంతరాత్మకలదానవై శ్రీహరినిధ్యానించుచుండుము. కొంతకాలమైనపిదపఁ బరాత్పరుఁడగు శ్రీహరి మానవకుమారరూపుఁడై రామనామముతోఁ బుడమినవతరించి, కౌశికునివెంట మిథిలకేగుచు, ఈదారినిరాగలఁడు. అప్పుడాపతితపావనుని పదసరసిజస్పర్శచే నీవుపాషాణాకృతినివిడచి యోషామణివై పూర్తజీవితవగుదువు నేను శ్రీరామదర్శనమగువఱకు హిమవంతమునకేగి యటతపమాచరింతును. నేనువచ్చువఱకు ఈతపోవనము

యథాపూర్వముగా శోభించుచుండును. అనిగౌతముఁడు తపోవనమును విసర్జించి, వెడలిపోయెను. అతఁడేగినవెంటనే యహల్య శిలయై, యిందెచటనో పడియుండెను. ఇదియీతపోవనచరితము.

రామచంద్రా! మార్గముననున్న ప్రతిశిలమీఁదను నీపదసరసిజములనుంచుచుఁ రావలయును. అనుచుఁగౌతముఁదునకేఁగ రామపాదమోకరాలికిదాఁక ఆరాయి యహల్యయై లేచినిలచి, చేతులుజోడించి, రామునిట్లుస్తుతించెను.

అహల్య:—సురవందితచరణా! రమారమణా! నాపాపపుపాషాణాకృతిఁ దాకుటచే నీమృదుపదసరసీరుహములు కందెనా? ఓసర్వసాక్షీ! దీనరక్షీ! ఇంతకాలమునకు నాపాపములఁ బరిహరింపఁ గృపకలిగెనా కౌసల్యానందనా! నీచరణనలినప్రసారమునకై నేనెన్నివర్షములనుండియో యెదురుచూచుచుంటిని నేఁడు నీపతితపావనమోహనరూపమును కనుఁగొంటిని ధన్యతగంటిని ఓ! మునిమానసపుండరీకవాసా! చంద్రకానమను-దరమందహాసా! దూరమునుండియే నీనామధేయాక్షరముల నుచ్చరించినమాత్రాన దురితాంధకారము తొలగుచుండనీపాదపంకజస్పర్శముచేఁ గిల్బిషములు దూరమగుటలో వింతయేమున్నది. ఓ! పతితోద్ధారకా! కౌసల్యాబాలకా! మహాత్ములయనుగ్రహమట్లు ఆగ్రహమును, శుభహేతుకమనితలఁచెదను. అటులకాకున్నచో నానాథుఁడు నాపైనలిగి నాకొసంగినశాపముచే నీనీలనీరదశ్యామాకృతిని దర్శించు భాగ్యమెట్లుసమకూరును?

ఏకృపానిధి పదకంజపరాగమహిమల శ్రుతిమస్తకములుకూడ వర్ణింపజాలవో, ఏదీనబాంధవుని నాభికమలకూలమునుండి యీచరాచరసృష్టికర్త యుద్భవమందెనో ఏవనమాలి పావననామసారమును పానమొనర్చి శంకరుఁడానందపరవశుఁడై నృత్యముచేయునో అట్టిదురితహారియగు శ్రీహరి నాకుదర్శనమొసంగుట నేనాదివ్యరూపుని కన్నులారగాంచుట, నాపతిశాపమహిమయే. అనిస్తుతించుచుండ గౌతముఁడటకు వచ్చి, శ్రీరామునికినమస్కరించి పూతజీవితయై నిలచియున్న యహల్య

నుజూచి, సంతసించి యాసతీమణితోఁగూడి రామునిచరణములఁ బ్రక్షాళనమొనర్చి ఆపావనజలముల శిరములపైఁజల్లుకొని యిట్లుపలికెను.

గౌతముఁడు:—ఓభవభయహారా! రమామనోహారా! సంయోగవియోగాదిద్వంద్వములు నీతత్వమెఱింగిన వారినంటఁజాలవు వెలుగుకలజోటుల జీకటులుచేరఁజాలవు ఓ! గరుడవాహనా! సంసారకాలసర్పము నీభక్తులఁగరువఁజాలదు. నిగమాంతసంచారీ! నీస్మరణముతో నిద్రింతును. నీస్మరణముతో మేల్కాందును. నీస్మరణముతో సంచరింతును. నీవెల్లప్పుడును నాయుల్లమున నివసింప ననుగ్రహింపుము అని స్తుతియించి విశ్వామిత్రునీక్షించి, "సుహృదయా! గాధేయా! నీమూలమున నావనభువికి ఈభువనమోహనరూపుఁడగు రాముఁడేతెంచెను నీమూలమున నాకుఁతిరుగ అహల్యసంప్రాప్తమాయెను. నీవు మాయతిథ్యమునంగీకరించి మమ్ముఁగృతార్థులనుగాఁ జేయఁగోరుచున్నవాఁడను.

కౌశికుఁడు:—గౌతమయతీంద్రా! నీవెఱుంగనిరహస్యములుకలవా? నీయాజ్ఞానుసారము మెలఁగవలసినవారముకాని పరాయివారముకాము. శాస్త్రములు శ్రోత్రియాన్నముల యాచించితినవలయుననియుఁ లౌకికోదనములఁ బరిత్యజింపవలయుననియుఁ దెలుపుచున్నయవి కావున మీయట్టి శ్రోత్రియోత్తములయింట, నన్నముతింట, హవ్యభక్షణముకంటె శ్రేష్ఠము. అనిపలికి కౌశికుఁడు రామలక్ష్మణులతోడను మునిపుంగవులతోడను గౌతమాశ్రమమున నారాత్రిగడపి తెల్లవారినతోడనే యహల్యాగౌతములకడ సెలవుగైకొని మిథిలకు వెడలిపోయెను.

—: పంచవింశత్యధ్యాయము :—

సీతాచరితము.

కౌశికుఁడు మిథిలానగరముసమీపించి రామలక్ష్మణులసంబోధించి యిట్లుపలికెను.

విశ్వామి:—రాజనందనులారా! అటుచూడుడు. బంగరుశిఖరములతోఁగూడి తెల్లనివెండికొండలవలెఁ గానవచ్చుచున్న యాయున్నతసౌధమాలికలు మిథిలానగరములోనివియే ఆనగరరాజమును బరిపాలించు జనకుఁడు రాజాధిరాజైయ్యు నిరీహుఁడగుతేఁదని, ప్రసిద్ధికెంది

యున్నవాఁడు. ఈలోకమున నిట్టిసర్వజ్ఞుఁడగు భూపాలుఁడు కానరాఁడు. ఈజనకక్ష్మాపాలునికడ సన్యాసులుకూడ “తత్త్వమసి, సర్వంఖల్విదం బ్రహ్మ”లోనగు వేదాంతవాక్యముల తత్త్వమును దెలిసికొనుచుందురు.

మఱియొకవిశేషమేమన ఈరాజచంద్రునియింటఁ ద్రిలోకాతిశయరూపగుణశోభితయు అనన్యసామాన్యపాతివ్రత్యవిరాజితయు అయోనిజాతయు, నగు సీతయను కన్యకామణికలదు.

లక్ష్మణుఁడు:—మునీంద్రా! ఆజనకనందిని అయోనిజాతయంటిరే ఆపావనచరితమేదియో తెలుపప్రార్థించుచున్నవాఁడను.

విశ్వా:—సుచరిత్రా! సుమిత్రాపుత్రా! వినుమా సీతాలలామ జన్మవృత్తాంతమును పూర్వము బృహస్పతినందనుఁడగు సోమదేవుఁడను మహర్షి రోహిణియనుభార్యతో హిమనగారణ్యమున ఆశ్రమమును నిర్మించుకొని అందుఁదప మొనర్చుచుండెను కొంతకాలమునకా మునిదంపతులకు మాధవానుగ్రహమున నొకకూఁతురుపుట్టెను. వారాబిడ్డకు వేదవతి యనినామకరణ మొనర్చి గారాబముతోఁ బెంపఁదొడఁగిరి. ఆబాలిక శరత్కాలచంద్రికవలె దినదినప్రవర్ధమానయగుచు, నోటమాటలనుకువ నేర్చినదిమొదలు “హరీ, మాధవా, నారాయణా, పుండరీకాక్షా” అని యిట్టిభగవన్నామములఁ బలుకఁదొడంగెను అటుపై నాటలాడుటకు మొదలిడినతోడనే శ్రీహరివిగ్రహములఁ జేకొని వానికినీళ్లుపోయుట, బట్టలుకట్టుట, ఉయ్యెలలోఁబరుండఁబెట్టి యూఁచుట లోనగుకార్యముల తోఁ గాలముగడుపఁదొడఁగెను. ఆయాశ్రమవాసులు “నీవెవ్వరిని పెండ్లి యాడెదవు?” అనిప్రశ్నింప “శ్రీకాంతు”ననియు, తోడిబాలికలు నీమగనిపేరేమన “పుండరీకాక్షుఁడ”నియుఁ బలుకుచుండెడిది. అంతకుపైవయస్సు వచ్చినతోడనే తనపేరుసార్థకమగునట్టుల వేదాదిసకలవిద్యలయందును, కోవిదయై వినయశోభితయై, భూతదయావిలసితయై, పితృపూజలసేయుచు, ఏకాంతముగా శ్రీకాంతుని ధ్యానించుచు వేణువీణాదులఁ జేకొని, వనమాలిలీలల గానమొనర్చుచుఁ గాలముగడుపుచుండెను.

ఆకాలమున వేదవతి కేవలసౌందర్యముననే కాక, యున్నతవిద్యలయందును, వినయసంపదయందును, అసదృశయై వెలయుచుండుటచే,

అసతీమణిని బరిగ్రహింపఁగోరి, నరసురాసురకుమారులు సోమదేవునికడకువచ్చి, తమకు వేదవతి నొసంగుడని కోరఁదొడంగిరి. రోహిణీసోమదేవులు తమకోమలికకుఁ బరిణయమొనర్ప నిశ్చయించి, గుణవంతులగువరుల వేదవతికిఁజూపమొదలిడిరి కాని యాగోవిందచరణేందీవరసేవాతత్పరయగు వేదవతి వారు పరిణయాకాంక్షలు కారని తెలుపుచుండెడిది. అంతనా దంపతులు రహస్యముగా నిజనందినిని జేరఁబిలచి, ఇట్లుప్రశ్నించిరి.

సోమదేవ:—తల్లీ! అసమానలావణ్యశోభితులును, నిరుపమాన విద్యాకోవిదులును, నిస్తులశీలసంపన్నులును, అగుకుమారవర్యులఁ బరిగ్రహింప నిరాకరించుచుంటివి. నీహృదయాంతరమున నెవ్వని బ్రేమించియుంటివో వెల్లడింపుము. పుత్రీ! కన్యాదానముభయలోకానందసంధాయకముగదా!

రోహిణి:—అమ్మా! బిడ్డలు మాతాపితరులకుఁ దమహృదయములఁ దాపనగత్యముండదుకదా! వివేకవతివగు నీకుఁదెలియని ధర్మముకలదా? కావునబిడ్డా! నీకభిమతుఁడగువరుని బేర్కొనుము. లోకమునఁ దలిదండ్రులకు నిజకన్యకాపరిణయమహోత్సవముల నవలోకించుటకంటె మెండగుపండుగ వేఱొండులేదు. కావున, నీహృదయము నెఱింగింపుము.

సోమ:—పుత్రీ! బదులుపలుకవేల? నీజననికి లక్ష్మీసమానవగునిన్ను నారాయణసముఁడగు వరునకు కన్యాదానమొనర్చి, అపరిణమహోత్సవమును గన్నులారఁగాంచఁ గోరికకలదు. కావున నీకభిమతుఁడగు వరుని బేర్కొనుము.

వేదవతి:—ప్రత్యక్షదైవతములారా! మాతాపితలారా! తలిదండ్రులయూహలకు వ్యతిరేకముగా పుత్రికాపుత్రులు నడువరాదు. వారికడ నిజసంకల్పములఁ దెలుపకయుండరాదు. పితరులు నిజసంతానసంతోషసంపాదనమునకై ప్రాణములఁగూడఁ బరిత్యజింతురనుటకు సంశయములేదు. కావున దయాస్వరూపులారా! జననీజనకులారా! వినుడు నానిశ్చయమును నాకు శ్రీమన్నారాయణుని బరిణయమాడ కుతూహలముకలదు. నేనుచిన్ననాటనుండి భగవంతుని భర్తనుగాఁ

బడయఁగోరి యాశ్రీహరిని పూజాధ్యానవిధులతోఁ బ్రార్థించుచుంటిని. ఆపావననాముఁడు స్వప్నములయందు నాకుఁబ్రత్యక్షమై "నీమనోరథ మీడేరనున్నది." అనిపలుకుచున్నవాఁడు అట్టికలలనెన్నిటినో కనియుంటిని. కావున నాయభిలాషకుఁ బరిహాసింపక, నాప్రయత్నమునకు సహాయులుకాఁగోరుచున్నదానను మీరును, నేనును, గలసి ఏకాగ్రచిత్తవృత్తితో ఆనళినాక్షునిధ్యానింతము భక్తవరదుఁడగు భగవానుఁడు మనకోరికలఁ దప్పకయీడేర్పఁగలడు. అనినానిశ్చయము.

తలిదండ్రులు:—సుమతీ! వేదవతీ! నీయభిమతమెంతయుఁ బ్రశంసనీయమనుటకు సంశయములేదు. భగవంతుఁడు భక్తవత్సలుఁడనుటకును సందియములేదు. కానియట్టిముకుందుని మనసుకరిగించుటకుఁ దీవ్రమగుభక్తికాంచితికావలయును. అట్టితేజఃశక్తియున్నవారికాతఁడు కడుసులభుఁడు కావున మనమందరమేకమై యాయిందిరాకాంతుని ధ్యానించుచుందము. అనిపలికి యాదంపతులు తమపుత్రికనుశ్రీహరికిఁ గాంతనుగాఁ జేయఁగోరి యితరులకియ్యనొల్లకుండిరి. అట్లుజననీజనకులు తనకనుకూలురగుటచే వేదవతి సంతసించి, అహర్దివమచ్యుతారాధన పరాయణయై, కాలమును గడుపుచుండెను.

ఇటులుండఁ గుంతలదేశాధీశుఁడగు ననంతసేనుని పుత్త్రుఁడు సుధాముఁడు వేటకైయరణ్యమునకేగి, యట నాఖేటతుస వ్యృగయూథముల సంహరించుచుఁ గొంతవడికొక వనవరాహమునుగాంచి, దానిని సంహరింపనెంచి అశ్వారూఢుఁడై దానివెంపేగెను ఆవిపినసూకరము, ఆతనిరాకనెత్తింగి కడువేగముతోఁ బఱిగిడి, సోమదేవుని తపోవనము చొచ్చెను దానిని వెంబడించి యారాజకుమారుఁడు, తపోవనమునందుఁ బ్రవేశించి, యాయడవిపందికై తిరుగుచు అయ్యది తపోవనమగుటనుగుర్తించి, గుఱ్ఱమునుండిదిగి, వేగముగావచ్చుటచే డస్సియున్నతురగమునకుఁ నీరములనొసంగఁగోరి, ఆతపోవనముననున్న కాసారముకడకు వారవమ్ముననుగొంపోయి, కొలనుగట్టెక్కి చూచుసరికి ఆకాసారనీరములో నొకనీరజాక్షి స్నానమాడుచుండుటను గాంచెను అతఁడాతటినీజలములపై శైవలలతాజాలములవలె వ్యాపించియున్న యాపెశిరోజముల

మధ్యమునఁ గ్రొత్తగా వికసించిన పద్మమువలె సౌందర్యశ్రీవిలసితమై వెలయుచున్న, యాకాంతామణివదనమును గాంచి, విస్మితుఁడై యిట్లు వితర్కించెను.

సుధాముఁడు.—ఏమీ! మానవలోకకాసారముల కమరలోకమత్తకాసినులు వత్తురా! వారికిఁ గాంచనకమలసుందరములగు మందాకినీవారిపూరములు లేవా? ఆహా! నాకీవనవగాహము అపూర్వతరుణీమణిని జూపి, నా నేత్రముల సఫలములనుగాఁ జేసినది. కట్టా! నేను బాని వధింపఁదలచితి. అత్యద్భుతమో నాకు దుర్లభానందము సమకూర్చినది. ఆటవికసత్వములకును, తపోవనమృగములకును తారతమ్యమిద్దియే, అడవిజంతువులు పరులబాధింపనెంచును. తపోవనసత్వములు ఇతరులనానందింపఁ జేయఁగోరును.

అని తలంచుచుండ ఆ వారిజాక్షి వారిమధ్యమునుండి వెలికివచ్చి, నిజకుటీరమునకు వెడలిపోయెను, అంత నా సుధాముఁడు గుఱ్ఱమునకు నీటని బెట్టి, ఆసరస్తీరతరుస్కంధమున దాని గట్టి, నిజచిత్తమత్తేభమును మరుఁడను మావటీఁడు మోహాంకుశముచేఁ బొడిచి మాఱుత్రోవకుఁ ద్రిప్ప వేటమాటుల మఱచి, యా యంచయాన వెంట గుటీరవాటికి కేగి యచటి వటువులవలన, ఆకుటిలాలకవృత్తాంతమును దెలిసికొని, యిట్లు విచారింపఁ దొడంగెను. “అహా! నేనెట్టి దుర్లభవస్తు మోహమునఁ బడుచుంటిని! నా మానసమీ మోహపాశములఁ ద్రెంపఁజాలకున్నయది, పాపములరానిమ్ము. ప్రాణములఁబోనిమ్ము, ఏమైననుసరే నేనీబింబాధరిని బరిగ్రహించితీరుదును. నేనీనీరజాక్షినిగొంపోవ ననువగుసమయము చిక్కువఱకీ మునిపల్లెయందేయుందును. అనినిశ్చయించి, సోమదేవునిదర్శించి, యిట్లుపలికెను.

సుధాముఁడు:—మునిసార్వభౌమ నేను కుంతలసార్వభౌమనందనుఁడ, సుధామనాముఁడ. వేటకై యడవికివచ్చి, దారితప్పి యిటకువచ్చితి. శాంతసుందరమగు మీతపోవనమున రెండుమూఁడునాళ్లుండఁ దలచితిని. అందుకుఁ దామంగీకరింపఁ బ్రార్థించుచున్నవాఁడ, సోమదేవుఁడా మాటల నిజమని నమ్మి ప్రత్యేకముగా నొకకుటీరమునొసంగి, యాదరించెను.

ఆమఱునాఁడు వేదవతి యరుణోదయమునకుఁ బూర్వమే లేచి స్నానార్థమై పర్ణశాలనుండి యొంటరిగాఁ గాసారమున కేగుచుండ సుధాముఁడు గాంచి, అదిమంచియదనని యెంచి, హఠాత్తుగా నాసతీమణిని బట్టికొని, గుర్రముపై నెక్కి యతివేగముగా నశ్వమునుబరుగెత్తించి, మున్యాశ్రమము దాటి వేఱొకయడవిలోని కేగి, దాహబాధకోర్వఁజాలక హఠాదాకర్షణముచే మూర్ఛితయైయున్న వేదవతితో దురగమునుండి దిగి, యాపెనొక శీతలతరుచ్ఛాయను బరుండఁబెట్టి, యాతరుశాఖకుఁ దట్టువమునుగట్టి, సమీపమునఁ గానవచ్చుచున్న పద్మాకరమునకు నీరములఁగ్రోల నేగుచుండెను.

ఇటులుండ వేటకాఁడొకఁడు లేడినిగొట్టఁ బొంచియుండి యాహరిణము గురికివచ్చినతోడనే వింటినుండి యలుగునువదలెను. కానియాకోల జింకకుఁదగులక, గురితప్పి మంచినీటికై పోవుచున్న సుధాముని హృదయమును దూసికొనిపోయెను. ఆశరాహతిచే "హా! చచ్చితి" అని బిగ్గఱగాఁ గేక వేసి యామోసగాఁడు నేలపైనొఱఁగెను.

అటఁబెట్టునీడనున్న వేదవతిదేహమునకుఁ గాసారజలశీకరశీతమగు పవనము సోకుటచే మూర్ఛతొలంగ మెల్లగ లేచుసరికి ఆరాజకుమారు జీవితావసానమును సూచించు నార్తనాదము చెవినిఁబడెను. వెంటనే కరుణాంతరంగయగు వేదవతి యటకుఁబరిగిడి, సరస్తీరమున రక్తసిక్తమగుగాత్రముతో నేలఁబడియున్న రాజనందనునిఁజూచి హృదయము ద్రవింపఁ బైయ్యటకొంగుచింపి, రక్తముపైకిరాకుండ, గాయమునవిడి యిట్లుపలికెను.

వేదవతి:—కటకటా! సోదరుఁడా! ఎంతటిబాధనందుచుంటివి! అయ్యయ్యో! తమ్ముఁడా! ఈపాపపుతలంపు నీకుఁగలుగకయుండినచో నిట్టి దుర్మరణమునకుఁ బాల్పడియుండవుకదా? ఆహా! ఎక్కడికుంతలదేశము ఎక్కడి నగరాజారణ్యము మృత్యువు నిన్నిటకు లాగికొనివచ్చినది. సోదరుఁడా! కుంతలసార్వభౌముఁడవై సౌధాంతరముల సుఖింపనేరక మాయుటజనమున కేలవచ్చితివి? వచ్చితివిపో! సచ్చిత్తముతో నుండక, యిట్లు కుటిలాశయుఁడవై సంచరింపనేల? పిచ్చివాఁడా! నీవొనర్చినది

యనసీతకృత్యమైనను నీదుర్భరదుఃఖవేదనావస్థనుజూడ నాగుండె యవి యుచున్నది. ఈనిర్జనారణ్యమున నీకు వ్రణచికిత్సఁజేయువారు దొరకుటయెట్లు? కన్నులార నీమరణబాధను జూచుచు నేనెట్లూరకొనఁజాలుదును. అని తడియారిపోవుచున్న యాతనినోటిలోఁ బర్ణపుటముతోఁ గాసారతోయములఁ గొనితెచ్చిపోసి, దయామయుఁడగు దైవమునిట్లు ప్రార్థించెను.

వేదవతి :—ఓయాపద్బాంధవా! ఈదీనసోదరునిబాధను తొలగింపరమ్మా ఇటనీవుదక్క వేరెవ్వరు సంరక్షకులులేరు ఇట్టిసమయముల దయజూపుటయే నీయార్తత్రాణపరాయణతకు చిహ్నము. అనుచుండ ఆరాజనందనుఁడు పతివ్రతాశిరోమణియగు వేదవతిచేదత్తమైనపానీయము నోటఁబడుటచేతను ఆపెయొనర్చిన దేవతాప్రార్థనము చెవికిసోకుటచేతను కొంచము ప్రాణముచేరఁ గనులువిప్పి యాపతివ్రతావదనము చూచియిట్లుపలికెను.

సుధా:—అమ్మా!—సోమదేవనందినీ! నాస్మృతికైవిచారింపకుము. సంతసింపుము తల్లిరో! నేనుజీవించియున్నఁ గామాంధుఁడనై యెందఱు సతీమణుల జీవితములమలినములఁగాఁ జేయఁజూతునో యెందఱిని హతమొనర్తునో తెలియదు. కానమాయమ్మా! ఇంతటితో ఈనీచుఁడు మృతినొందుటయేమంచిది మాతరో! పరకాంతలు మాతృదేవతలని, తలంపక వారిఁజెరుపఁగోరు నాయట్టికుటిలాత్ముని నొక్కకోలతోఁ గూలనేసి పుణ్యముఁగట్టికొన్న యావేటకాఁడు నీకంటఁబడినచో నానమస్కారములఁదెలుపుము. మఱియు, నిఁకముందు నిరపరాధములగు మృగయూథముల వధింపక నాయట్టి జారవ్యాఘ్రములఁ గూలనేయుమని బోధింపుము. అమ్మా! ఈపాపాత్ముని తప్పులనుక్షమియించి దీవించి శెలవొసంగుము. ఎముఁడు నారాకకెదురుచూచుచున్నవాఁడు. అనుచుఁ బ్రాణములవిడచెను.

“అత్యుత్కటపాపమునకు ఫలముపెంటనే కానవచ్చును. సతీలలామలపై మనసుగొలుపు తులువలు క్రిమికీటకాది జన్మపరంపరలనె

త్రుద్రులగాని, ముక్తుల కాఁజాలరు. ఈజారవ్యాపారమునందు మనుజులు పశువులకంటెను నికృష్టులుగాఁ గన్పట్టుచున్నారు."

సోమదేవుఁడు తపోవనమున వేదవతి కానరాకుండుటచేఁ గలవరపడి ప్రాజ్ఞులగుశిష్యుల నాపెనువెతుకఁబంపెను. వారతివేగముగ నరణ్యముల వెదకుచు వేదవతియున్న ప్రదేశమునకువచ్చి యాపెనుగాంచి యానందభరితులై "సోదరీ! వేదవతీ! ఇటకేలవచ్చితివి? ఈచచ్చిపడి యున్నవాఁడెవఁడు?" అన నాసోమదేవపుత్రిక జరిగినయుదంతమును వారికెఱిఁగించి ఇంధనములఁదెప్పించి ఆయనాథసోదరదేహమున కగ్ని సంస్కారముచేయించి యచటికాసారమున స్నానమాచరించి మునికుమారులతోఁ దలిదండ్రులకడ కేగెను.

మహీశసోమదేవుఁ డా వేదవతినిగాంచి యెదురేగి గాఢాలింగన మొనర్చి "అమ్మా! ఎటకేగితివి?" అననాపె వారికి నడచినకథను వివరించెను ఆమాటలవిన్నతోడనే సోమదేవుఁడు కుపితుఁడై తనతనయ నవమానించిన సుధాముఁడు క్రూరరాక్షసజన్మ మెత్తునుగాకయని శపించెను ఆశాపమును వేదవతివిని తండ్రిపాదములపైఁబడి "ఓ! దయానిధీ! ఆదీనసోదరుఁడు తాఁజేసిన దుష్కార్యమునకుఁ దీవ్రముగావిలపించుచు పశ్చాత్తప్తుఁడై శ్రీహరినిధ్యానించుచుఁ బ్రాణములవిడచెను. పాపమా జీవికి రక్కసిపుట్టువు రాకుండవారింపుడు.

సోమదే:—అమ్మా! వేదవతీ! నాశాపమనివార్యము కాని వాఁడు నీవొసంగిన జలములపానముచేయుటచే రాఁబోవు రాత్రించర జన్మమున వనమాలిచే నలుఁగుతోఁగొట్టఁబడి ముక్తినొందగలడు అనిపలికెను.

అటుపైని కొంతకాలమునకు దంభుఁడను దనుజరాజు వేదవతిని బెండ్లాడఁగోరి రాక్షసరూపమునుమార్చి దివ్యసుందరమగు యక్షరూపమునుదాల్చి సోమదేవునికడకువచ్చి వేదవతిని దనకిమ్మని కోరనాతఁడు "నాపుత్రికను శ్రీహరికిఁదప్ప వేఱెవ్వరికి నియ్య"నని తెలిపెను. అందుచే నానిశాచరుఁడు మొదటఁగామము పిమ్మటఁగ్రోధము నిజమానసమునఁ బెనఁగొన రాత్రివేళ నిదురించుచున్న సోమదేవునిజంపి పారిపోయెను.

తెల్లవారినతోడనే రోహిణి యెంతసేపటికిని భర్తపర్ణకుటీరము నుండి పైకిరాకుండుటచేఁ గుటీరములోని కేగి మృతుఁడైయున్న పతిని జూచి దుఃఖించి వెంటనే యగ్నినిప్రజ్వలింపఁజేసి వేదవతినిపిలిచి "పుత్రీ! కంటివా నీజనకునిమరణమును బిడ్డా! నిన్నుఁబరిణయమాడఁగోరి యిటకువచ్చిన ఆయాతుకుమారుఁడీదారుణ కృత్యమును జేసియున్నాఁడు. అమ్మా! పతివ్రతలకు సహజమగు సహగమనమును చేయఁబోవుచున్నదానను. కాని నందినీ నిన్నానందముతోఁ బురుషోత్తమునకుఁ గన్యాదానమొసగు భాగ్యము మాదంపతులకు సమకూరదాయె జనార్దనుని కృపచే రాబోవుజన్మమునందైన నట్టిసంపద సమకూరుగావుత అమ్మా! నీవుమాకై బెంగటిల్లక గోవిందపదనీరజధ్యానాసక్తచిత్తవై కాలమును జక్కఁగాఁగడపుచుండుము ఆకృపాసాగరుఁడు నీమనోరథమీడేర్పగలఁడు. అని తెలిపి పతిదేహముతోఁ జితిఁజొచ్చి, పతిలోకమున కేగెను.

అంత వేదపతి నంతచెంది తనమూలమున నకాలమృత్యుప్రాప్తులైన తలిదండ్రులకై విచారించుచుఁ బ్రాజ్ఞురాలగుట నిట్లుతలంచెను. "పితృవిహీననై యొంటరిగా జీవించుట దుర్భరదుఃఖావమానముల నందుటకే యగునుకాని విశ్రాంతిగా శ్రీహరిని ధ్యానింప వలనుకాదు. దుర్బలమానసులు నారూపమునుజూచి మోహపరవశులై నన్నెట్టియవమానముల పాలుసేతురో యెన్ని ఘోరకృత్యముల నాచరింతురో కావున నేను ముకుందునిధ్యానించుచు జీవితమును జాలించుట యొంతయు సమంజనము. అనినశ్చయించుకొని భగవంతునిట్లుస్తుతించెను.

వేదవతి:—ఓ! యార్తశరణ్యా! నేనునీకు నిజమగుదాసురాల! నేని నాచరితము నిష్కళంకమేని ఓ! భక్తపాలనశీలీ! వనమాలీ! నన్ను ముందుజన్మమునఁ బరమపావనచరితులగు రోహిణీసోమదేవులకుఁ గుమరితనుగాఁ బుట్టింపుము. మఱియు నోభక్తజనమానసకువలయసోమా పావననామా! నన్ను భావిజన్మమున నిన్నుజేపట్టు భాగ్యశాలినినిగాఁ జేయఁగటాక్షింపుము. అని గోవిందుని ధ్యానించుచు యోగాగ్ని యందుఁ దనువునువేల్చి సత్యలోకమున కేగెను.

ఆరోహిణీసోమదేవులు అనంతరభవమున సుమేధాజనకులుగాఁ బుట్టిరి. వేదవతి యాత్మకుఁ గమలభవుఁడు లావణ్యరాశియగు శిశురూపమును గల్పించి యొకసువర్ణకరండమునఁ బరుండఁబెట్టి యాకరవాటము నారదునిచే వైకుంఠవాసియగు శ్రీపతికడకుఁ బంపెను. ఖగరాజవాహనుఁడా పుత్తడిబరణి నందుకొని యందు శయనించియున్న బాలికామణి లావణ్యకాంతి కానందించి ఆకాంచనకరండమును వినతానందనునకిచ్చి విదేహరాజయాగభూమిసడి రమ్మని యాజ్ఞాపించెను. పక్షిఱేఁడా కరండమును గొంపోయి జనకసవనస్థలి నొకయాపగర్తమునవిడి వెడలిపోయెను ఆరంధ్రము క్రమముగా మట్టిచేఁగప్పబడి నాకరండము కానరాకుండెను

అంతఁగొంతకాలమునకు జనకరాజేంద్రుఁడు సంతానకాంక్షియై సవనము సేయనెంచి స్వయముగా నాగలిచేఁబూని యజ్ఞభూమిని దున్నుచుండ నాగలియలుగునకు నొకకరండము తగిలిపగుల నందొకదివ్యమంగళరూపయగు బాలిక కానవచ్చెను జనకుఁడా బాలికనుజూచి యమందానందముతో నామందసమునుండి యాబిడ్డను పైకిఁదీసి ముద్దాడి సీతయనిపేరిడి తనభార్యయగు సుమేధకునొసంగ నాసాధ్వి యాబిడ్డనుచూచినతోడనే స్తన్యముద్రవింప నాపెనుజేకొని పరమామోదముతోఁ బెంచికొనఁదొడఁగెను. జనకరాజేంద్రుఁడు తాఁదలపెట్టిన యాగమునుముగించినతోడనే సుమేధకొక సుతుఁడుదయించెను. జనకుఁడానందనునకు ఆనందుఁడని పేరుపెట్టెను. అటుపిమ్మటఁ గొంతకాలమునకు నాదంపతులకు ఊర్మిళయను పుత్త్రికకలిగెను. ఇటులజనకుఁడు సంతానవంతుఁడై సంతోషముతోఁ గాలముగడుపుచుండెను.

ఒకనాడు తనయింటనున్న శివశరాసనము సీతయిటునటు జరుపుచుండఁగనుగొని, యామెశక్తికి వింతఁజెంది; హరశరాసనమునకు నెవఁడు నారినిసమకూర్చునో యట్టివానికి సీతనిచ్చి, వివాహమొనర్తునని ప్రతినచేసి స్వయంవరమును ప్రచురించెను.

ఆస్వయంవరవార్త చెవినిఁబడినతోడనే సుగుణాలవాలయగు సీతను బాణిగ్రహణమొనర్ప సకలధరాధీశులును మిథిలకేతెంచి, శివ

కార్ముకమును చూచివెడలిపోవుచుండిరి. ఇటులఁ గొంతకాలము జరుగఁ త్రిగర్తదేశాధిపతియగు సుధన్వుఁడు మిథిలకువచ్చి, తనకు సీతనొసంగుమని జనకునడుగ, నాతఁడు మహేశ్వరచాపమెత్తినఁగాని సీతనుబరిగ్రహింప వలనుకాదని తెలిపెను. అందుపైసుధన్వుఁడు కుపితుఁడై యుద్ధసన్నద్ధుఁడుకాఁగా జనకుఁడు వానినిర్జించి, త్రిగర్తరాజధానియగు సాంకాశ్యమునఁ దనసోదరుఁడగు కుశధ్వజుని నభిషిక్తునిగాఁ జేసెను. అదిమొదలు కుశధ్వజుఁడు సాంకాశ్యమున సకుటుంబముగా నివసింపఁదొడఁగెను.

ఇపుడా జనకనృపాలుఁడు తానేర్పాటుచేసిన శపథప్రకారము మాహేశకోదండమునెక్కిడి, సీతను బరిగ్రహించువాఁడు కానరాకుండుటచే ధరణిజాపరిణయము నిర్విఘ్నముగా సమకూరుటకు సకలదేవతాసంతసావహమగు నొకక్రతువును జరిపించుచున్నవాఁడు. మమ్మాక్రతువునకు రాఁబిలిచినాఁడు. అందుచే మీసోదరుల వెంటనిడికొని, మేము జనకయాగమునకు బయలువెడలితిమి. లక్ష్మణా! సీత యయోనిజాతయగుట తెలిసెనా? అనిపలుకుచు విశ్వామిత్రుఁడు జనకుని యజ్ఞవాటిక సమీపించెను. తోడనే విదేహనృపాలుఁడు శతానందుని ముందిడికొని విశ్వామిత్రాదులకెదురేగి అర్ఘ్యపాద్యాదులచేఁ బూజించి, వారిని యాగశాలలోనికిఁ దోడ్కొనివచ్చి, ఉచితాసనాసీనులనుగాఁ జేసి కౌశికునిగూర్చి ఇట్లుపలికెను.

జనకుఁడు:—కౌశికమునీంద్రా! మీరాకచే ధన్యుఁడనైతిని. మిముఁజూచినతోడనే, పేదకుఁబెన్నిధిదొరకినట్లు, గ్రుడ్డివానికిచూపులు చేకూరినట్లు నాహృదయమానందపారవశ్యము నందుచున్నయది. గాధినందనా! సుమశర సమానసుందరరూపములతో, వీరశాంతరస సమ్మిళనస్థానములట్లు చూపఱులహృదయముల నాకర్షించుచుఁ, జేతుల ధనుర్బాణములతోడను, మూపులఁదూణీరములతోడను, చూపుల గాంభీర్యములతోడను, వదనముల మందహాసములతోడను, గూడి, ముద్దులు మూటగట్టుచున్న యొద్దికలో విరాజిల్లు ఈబాలవీరకుమారు లెవ్వరో? వివరముగాఁ దెల్పి, నన్నానందింపఁ జేయఁగోరుచున్నాను. మునివరా!

చంద్రోదయముచే సంజెచీఁకటి చెదరిపోవునట్లు వీరియవలోకనముచే నాహృదయపరితాపము సడలిపోవుచున్నది.

విశ్వామి:—జనకరాజేంద్రా! వీరలు కోసలసార్వభౌముఁడగు దశరథరాజేంద్రనందనులు, రామలక్ష్మణాభిధానులు నాయాగవిఘ్న కారులగు మారీచసుబాహుల హతమొనరించి నాజన్నమును గాపాడుటకై దశరథనృపాలుని యాచించి, వీరలఁగొని తెచ్చితిని. ఈసుమారసింహులు రాక్షసమొత్తేభముల సంహరించి నాచే నవభృథస్నానము చేయించిరి. అంత నేనీయాహ్వానముపై వీరిని నావెంటనిడికొని ఇటకు వచ్చితిని.

జనకరాజేంద్రా! మేము నిన్నటికే ఇచటికిరా నిశ్చయించితిమి. కాని మార్గమధ్యమున నీలేందీవర శ్యామసుందరుఁడగు రాముని పద సరసిజపరాగస్పర్శచే గౌతమధర్మదారయగు నహల్య శిలారూపమును వదలి రుచిరకాంతారూపయై ఈరాకాశశాంకవదనుని జూచి సంతుష్టాంతరంగయై రాముని నుతించి మాకాతిథ్యమొసగ నటనాపూట నాపుటచే నిటకు రాఁజాలమైతిమి. అని తెలిపినతోడనే అహల్యానందనుఁడగు శతానందుఁడు నిజజననీశాపవిమోచనమును విని, సహర్షానందుఁడై గాధేయునితో నిట్లుపలికెను.

శతానందుఁడు:—కౌశికమునీంద్రా! సుధాతిమధురమగు నెంతటి పావనసువార్తను దెలిపితివి! శిలారూపయై పడియున్న తపస్వినియగు నాజననిని రామునకుఁజూపితివా? నిర్దోషిణియగు మాయమ్మవిషయమై కుటిలుఁడగు నాదేవేంద్రుఁడొనర్చిన యపరాధతత్వమును ఈపావననామునకు బోధించితివా? మాతండ్రి గౌతమమునీంద్రుఁడు మాతల్లిని ప్రేమగౌరవములతోఁ బరిగ్రహించెనా? సంయమివరేణ్యా! మంగళావహమగు మీరాకచే ముందు నేనును, ఇకముందు జనకుడును బొందినట్టియుఁ, బొందఁబోవునట్టియు నానందమునకు మేరయుండనేరదు.

బ్రహ్మర్షిసత్తమా! నిజమారయ నీవీనావమచంద్రుని నీయాగరక్షణమునకుఁ గొనిరాలేదు. పతివ్రతల గౌరవసంరక్షణమునకుఁ దోడ్కొని వచ్చితివి. ఇదిసత్యము. అట్లుకాకున్నఁ జాప శాపప్రయోగ

సుప్రసన్నుఁడవగు నీకు నిశాచరభయమేమి? నీయనుగ్రహముచే నేనిపు డహల్యానందనుఁడనని, యెలుగెత్తి పలుకుదును. అని రాముని వైపునకుఁ దిరిగి "రామచంద్రా! రామచంద్రా! నిన్నొకసారిగాఢాలింగనము చేసికొనుట కనుమతింపుము. నీపావనదేహస్పర్శచే నాదురితౌఘములు దూలిపోవును.

ఓనరరూపధారీ! వైకుంఠవిహారీ! నేను నీపదపద్మములకు ప్రొక్కవలయునో! లేక నీపదసరసిజపరాగములకు నమస్కరింపవలయునో! తెలియకున్నయది. ఓవనరుహనయనా! కౌసల్యానందనా! నారాయణ పదకమలస్పర్శచే గంగావాహిని పావనజీవనయైనది. నీచరణసరసీరుహ పరాగసంపర్కముచే గౌతమగేహిని పూతజీవితయైనది. అందుచే నీపద నలినరేణువులే మాగౌతమగోత్రమునకు పాస్యదైవతములు కాఁగలవు.

రాముఁడు:—అహల్యానందనా! సాధ్వీమణుల పావనగర్భకోశమునఁ బెరిగిన సంతానములకుఁ గలుషములును, ప్రశస్తశుక్తిపుటమున నెదిగిన మౌక్తికములకు మలికలును, కలుగనేరవు. తపోధనా! నీజనయిత్రియగు యహల్యాదేవి కులరూపగుణశీలములచే నద్వితీయ. ఇందుకు సందియములేదు. నిజమారయ నహల్య తనతపశ్శక్తిచేఁ బవిత్రగాత్రియైనది కాని నాపాదపరాగముచే కాదు. సాధ్వీమణుల జీవితములను, భాగీరథీజీవనములను, పావనములనుగాఁ జేయఁజాలు పదార్థము లీసృష్టిలో లేవు. వాని సందర్శనముచే నితరవస్తువులు పావనములగును. నేనాసాధ్విని సందర్శించుటచే ధన్యుఁడనైతిని.

విశ్వామి:—అహల్యానందనా! మీయమ్మను మీయయ్యఘన గౌరవముతోఁ జేకొనినాఁడు. ఆదంపతులు మమ్మెల్లర గౌరవించినారు లోకులు నిజముగా జరిగినదెద్దియో తెలిసికొనకయే, యన్యాయముగా నపవాదములఁ బుట్టింతురు. ఇది లోకస్వభావము. దానికై విచారింప బనిలేదు. శతానందుఁడామాటలువిని ఆనందపరవశుఁడై రామునిగూర్చి ఇట్లు పలికెను.

శతాన:—రామచంద్రా! బ్రహ్మర్షిసత్తముఁడగు నీకౌశిక మునీంద్రుఁడు నిరుపమానాద్భుత చరితుఁడు. కౌసల్యానందనా! పూర్వము

మీయునవవంశజుఁడగు భగీరథుఁడెట్లు దుర్ఘటకార్యమగు గంగావతరణమును సాధించి కీర్తినిగడించెనో యటులనే కార్యశూరుఁడగు నీగాధేయుఁడును దుర్లభమగు బ్రహ్మర్షిత్వమును సంపాదించి వాసిగాంచెను. అందుచే సూర్యవంశమునకా భగీరథచక్రవర్తియుఁ, జంద్రవంశమునకీ విశ్వామిత్రచక్రవర్తియు, మేటికిరీటములై వెలయుచున్నవారు. ఈగాధేయుని గాథాసారమగాధము. సకలలోకప్రసిద్ధము. అనిపలికి శతానందుఁడు రామలక్ష్మణుల గాఢముగాఁగౌగిలించి దీవించెను.

జనకుఁడునుఁ దనయాగమును నిర్విఘ్నముగసాగించి తనమనోరథమును సమకూర్ప విశ్వామిత్రునిఁబ్రార్థించి వారికిఁదగిన విడుదుల నేర్పరచి అందు వారిని విశ్రమింపఁజేసి విశ్వామిత్రునికడ సెలవుగైకొని శతానందునితో వెడలిపోయెను.

విశ్వామిత్రుఁడు రామునితో ఇట్లుపలికెను. "దశరథనందనా! నీవీశిరధ్వజుని యింటనున్న వృషధ్వజునివింటిని జేఁబట్టితివా? మొదట ననదృశకీర్తికాంతాకరమును, పిమ్మట నిరుపమాన ధర్మపత్నీపాణిపల్లవమును జేపట్టఁగలవు. రామచంద్రా! ఇట్లొనర్చుట నీకభిమతమా?

రాముఁడు:—గురువరా! మీసేవలోనున్నంతకాలము మీరే పనివిధింతురో దానినినెరవేర్చుటయే నాకువిధి. ఇదివఱకు రక్కసులఁ గొట్టుటలోఁగాని ఇపుడు పురారిశరాసనమును జేఁబట్టుటలోఁగాని ఇక ముందు విధింపుకార్యమును సాధించుటలోఁగాని మీయాజ్ఞయే ప్రమాణము. కావున నాయిష్టమునడుగఁబనిలేదు. మీకిష్టమున్న పనులనెల్ల జేయింపుడు.

విశ్వామి:—నిగర్వచూడామణీ! వినయోక్తులు మీదినమణికులకుమారులసొత్తులు కౌసల్యానందనా! నిజముగానిన్నిటకు నేఁగొనితెచ్చిన ముఖ్యోద్దేశము నీచేహరచాపమెత్తించి, జనకాత్మజను జేఁబట్టించుటయే కావుననే "శర్వశరాసనమౌర్వీసంధానోత్సవము నేర్పాటుచేయింపుమని, శతానందునికిదివఱకే వార్తనంపియుంటిని, అనిరామునితో మాటలాడుచుండ సీతచెలికత్తెయగు వాసంతి మార్గవశమున నటకువచ్చి రామలక్ష్మణుల నవలోకించి ఇట్లుచింతింపఁనొడంగెను.

—: షడ్వింశత్యధ్యాయము :—

చిత్రలేఖనము.

"నేనిదివఱకెందఱినో రాజసూనులను, మఱెందరినో గుమరనందనులను, జూచియుంటిని కానివారియందెవ్వరును నింతటిసుందరాంగులు కానరారైరి. కోదండమండితములగు నాజానుబాహుదండములతోడను సువిశాలోరస్థలమండలములతోడను, పుండరీకదళాయతనేత్రములతోడను మందహాససుందరములగు వదనారవిందములతోడను ఈకుమారవీరులు తేజరిల్లుచున్నవారు ఇట్టిసుందరాంగులఁ జేబట్టు భాగ్యమునుగన్న కన్యకామణులెవ్వరై యుందురో ?" అని ముందరికిఁ జూచి "అడుగో ! అంతఃపురసంచారియగు కంచుకియిటువచ్చుచున్నవాఁడు. ఈతనికిఁ దెలియని విషయములుండవు కావున నీతనినడిగి పరిస్థితిగతుల దెలిసికొందును. ఈకంచుకినడకఁజూడ నేదిశుభసంతోషవార్త నెరికో తెలుప నేగుచున్నట్లు కన్పట్టుచున్నది." అని కంచుకినిగలిసికొని యిట్లుప్రశ్నించెను.

వాసంతి:—ఆర్యా ! వాతాయనా ! వందనము. మీరీనాడు వార్థకలక్షణములు లేక పిన్నవయసువారివలె నేగుచున్నవారు. వదనమున మందహాసచంద్రికను, నడకల నిష్కంపపదవిన్యాసములను జూడమీరేదియో శ్రోత్రపేయమగు నపూర్వసంతోషామృతాస్వాదన మొనర్చి, త్రిదశులైనట్లు తెలియవచ్చుచున్నవారు. బంధువత్సలా! మీసంతసహేతువేమి? నేవినఁదగునా?

వాతాయనుఁడు:—వత్సా! వాసంతీ! బాగుగగుర్తించితివి. వినుము నేనునేనొక్కరుఁడనేకాదు త్రిలోకములును సంతోషింపఁదగిన సువార్తనువింటిని. దానిచే నానందపరవశుఁడనై నాముసలితనమును ముందునకుఁ గెంటియుంటిని.

వాసంతి:—ఆర్యా!అసకలలోకమంగళావహమగుసువార్తయేమి?

వాతా:—శుభాంగీ ! కేపోకసార్వభౌమనందనుఁడు చంద్రశేఖరశరాసనగుణనకు నాఁడిసమకూర్చి నిజాసమానవిక్రమసంపదను బ్రకటింపఁబోవుచున్నవాఁడు.

వాసంతి:—అట్టిజెట్టి పుడమినిబుట్టియున్నాఁడా! ఆశూరశిఖామణి పేరేమి ? ఆతఁడెపుడీతావునకువచ్చును ?

వాతా:—పుత్రీ! ఆపన్నార్తిహారియగుశౌరి కోసలసార్వభౌముఁడగుదశరథునకు రాముఁడనుపేరఁ బట్టిగాఁబుట్టియున్నవాఁడు ఆరాముఁడే రేపు పురారిశరాసనమును సంధింపఁబోవుచున్నవాఁడు ఇపుడాతఁడు కౌసికమునీంద్రునికడ నున్నవాఁడు

వాసంతి:— అటులనా! నిజముగానిది సకలప్రాణి సంతసావహమగు సువార్తయే సందేహములేదు. వాతాయనా! నీకీయుదంత మెట్లుతెలిసె ?

వాతా:—నిన్నటిరేయి అహల్యానందనుఁడగు శతానందుఁడు తన తల్లిశాపమును విమోచనమొనర్చిన రామునిగూర్చి ప్రశంసించుచుండ కార్యవశమున నేనాతనియొద్దకేఁగ, ఆమహాశయుఁడు శ్రీరామోదంతమును నాకెఱింగించెను.

వాసంతి:—వాతాయనా! నేనిప్పుడు కౌశికమునిచంద్రుని కిరుపార్శ్వముల నీలోత్పలసుమదళమువలె నొకఁడును, తెల్లకలువ పూరేకువలె వేఱొకఁడును తేజరిల్లుచుండుటను జూచితిని. వారలెవ్వరో తెలియరాకుండుటచే నిన్నడుగవచ్చితి.

వాతా:—వారే దశరథనందనులు ఆనీలోత్పల దళశ్యామసుందరుఁడు రాముఁడు. ఆతెల్లకలువరేకువన్నెవాఁడు లక్ష్మణుఁడు. రేపా రాముఁడు శివశరాసనమెత్తుట కేర్పాటుచేసి, ఆసంగతిని కౌశికునకుఁ దెలియఁజేసి రమ్మని, శతానందుఁడు నాకాజ్ఞాపించుటచే విశ్వామిత్రుని కడ కేగుచున్నాఁడను. నీవిక్కడికేలవచ్చితివి?

వాసంతి:—మనపట్టపురాణి సుమేధాదేవి నన్ను గౌరీసహస్రనామార్చనమునకు నల్లకలువలఁ దీసికొనిరమ్మని ఆజ్ఞాపించినది. వానికై నేతెల్లవారకముందే కుసుమోద్యానములోని కాసారమునకేగి ఇందీవరములఁగోసి తీసికొనివచ్చుచు దశరథనందనుల సౌందర్యాతిశయముఁ గాంచి విస్మితచిత్తనై ఇటనిలిచితిని. ఇంతలో మీరేతెంచితిరి.

వాతా:—అగును. అరిష్టపరిహారార్థము సుమేధ సీతచే గౌరీ

పూజచేయింప నిశ్చయించినదని వింటిని. వాసంతీ! పూజాకాలమతిక్ర మింపకుండ నీవంతఃపురమునకుఁ బొమ్ము. నేను విశ్వామిత్రునిసంద ర్శించి ధనుర్ధగణవార్తను దెలిపి, రాణివాసమునకు వత్తును. అని వెడలిపోయెను. వాసంతియు సీతామందిరమునకుఁ జనెను.

అట సీత తెల్లవారకమున్నె పాన్పునుండి లేచి తనమందిరమున నొంటరిగాఁగూర్చుండి ఇట్లు వితర్కింపఁదొడఁగెను. "ఆహా! నేనెంతటి స్వప్నముఁగంటిని! నాజీవితములో నేనింతవఱకుఁ గలగనియెఱుంగ. గత రాత్రి నిద్రలో సాక్షాత్కరించిన సుందరాంగుఁడు అశ్రుతాదృష్టపూ ర్వుఁడు ఈలావణ్యసుధానిధి కల్లమానసికయో లేక సత్యరూపుఁడో తెలి యరాదు కాని యపుడే నామానససరోవరమున సంకల్పకల్హారకోరక ములు వికసింపఁ దొడంగుచున్నవి.

స్వప్నవలోకితములగు ననిశ్చితరూపములే ఇంతటి హృదయో న్మాద హేతువులగునపుడు ప్రత్యక్షదృష్టములగు సదూపములు ఎం తగా జిత్తోన్మత్తతా హేతుకములగునో కదా! ఆయిందుసుందరవదనుని రూపము కనుమూసిన హృదాకాశమునందును కనుదెఱచిన బహిరాకా శమునందును గానవచ్చుచున్నది. నాకేమిచేయుటకును తోఁచుటలేదు. నాసోదరి ఊర్మిళ ఇంకనునిటకు రాలేదు కావున చిత్తవినోదార్థము నేఁగలలోఁగాంచిన మోహనరూపమును బటముపై స్ఫుటముగాఁజిత్రించి కనులారఁగాంచి యానందింతును. అని తలంచుచుండ మైత్రియనుదాసి యాపెకడకు వచ్చెను. సీత దానినిఁజూచి ఇట్లుపలికెను.

సీత:—మైత్రీ! చిత్రఫలకమును వర్ణకరాటమును తూలికాపేటి కను గొనితెచ్చి తలుపుదగ్గరగవేసి ద్వారముకకయుండుము. నాకు తెలు పనిదే లోనికెవరిని రానీయవలదు. అన మైత్రి యామె తెలిపినట్లొనర్చెను అంతఁగొంతసేపటికి ఊర్మిళ సీతామందిరమునకువచ్చి మైత్రితో నిట్లు పలికెను

ఊర్మిళ:—మైత్రీ! మాయక్క సీత నిద్రనుండి లేచెనా?

మైత్రి:—అమ్మా! మీసోదరి సూర్యోదయముకాకమున్నె మే ల్కొని యంతఃపురాంతరమునఁ గూర్చుండి యంతరంగమున నేమేమో

ధ్యానించుచుండెను. ఆసమయమున నేనామెనుసమీపింప నావైపుజూచి "చిత్రలేఖనోపకరణముల గొనిరమ్మని" తెలిపెను. వానినిగొనితెచ్చి నేనందీయఁజేకొని నన్నిటఁగావలియుండి లోనికెవ్వరిని రానీయకుమని యాజ్ఞాపించినది. అందుచే నేనిటఁగూర్చుండియుంటిని.

ఊర్మిళ:—అట్లైన నన్ను లోనికిఁబోనిత్తువా? లేక నాపుదువా?

మైత్రి:—అమ్మా రాజపుత్రీ! మిమ్మునిరోధింప నేనెంతటిదానను. మీయిష్టానుసారముచేయుడు. అదియుఁగాక మీయక్కసెల్లెండ్రిరువురు నొక్కమనసువారు. మీచెవినిబడని రహస్యమామెనోట నేదియునుండనేరదు.

ఊర్మిళ:—చేటీ! నిజమే. మాహృదయముల నొకరికొకరము తెలుపుకొనకున్నఁ బరితాపమొందుదుముగాని తెలిసి పరిహసించుకొనువారలముకాము.

మైత్రి:—ఇది లోకవిదితమే కాని యమ్మా! అధరణిజకు నాపైఁ గోపమురాకుండఁ జేయుభారము మీపైనున్నయది.

ఊర్మిళ:—మైత్రీ! నీవున్నచోటఁ గోపమునకవకాశముండదు. భయపడకుము. అనిమెల్లగాఁ పదపల్లవముల మణిమయకుట్టిమములపై నిడుచు సీతయున్నగదిలోనికేగి యామెకు వెనుకభాగమున నిశ్శబ్దముగా నిలచి పటముపైఁజిత్రితమైయున్న రూపమునుజూచి తనలో "మాయక్కసుమశరుని వ్రాసినదేమొకో? ఇదివసంతసమయమగుట మనసిజునర్చింప నెంచెఁగాఁబోలు. తిరుగఁబరికించి ఇది చెఱకువిలుకాని బొమ్మయగుచోఁ జేతనిక్షుదండముండవలయును కాని, వేణుకోదండమెట్లుండును! మఱియు రెప్పపాటులుంగని చూపులుండవలయునుగాని నిమేషలసితములగు వాల్గన్నులుసరిపడునా? పోనిమ్ము, ఈసాధ్వితాను నిత్యమర్చించు విష్ణురూపమందుమా? దేహకాంతిసరిపోయియున్నను చతుర్భుజములుండవలదా? గిరిజావల్లభుఁడందుమా? సర్పాభరణములుకానరావు. నీరజాసనుఁడందుమా? నలుమొగములుచూపట్టవు ఇదేదియో మాయక్కయొక్క మానసికసృష్టియైయుండనోపు. ఈపె యీచిత్రపటమును రెప్పపడకుండఁ జూచుటనుబాడ ఈసుందరాకారముపై నీపె

తనజ్ఞానేంద్రియములనన్నిటిని ముద్దగాచేసి యంటించినట్లు తోచుచున్నది." అనితలంచుచుండ సీత యాచిత్రాకృతివిగ్రహమునకు నమస్కరించి యాపటమును శిరమునఁబెట్టికొనఁ బైకెత్త ఊర్మిళకట్టినపుట్టమునకు ఆపటపుచట్టముతగిలెను. అంతసీత పటమును బయ్యెటచేఁగప్పి వెనుకకుఁదిరిగిచూచెను. అపుడు ఊర్మిళ పక్కునవ్వి యిట్లుపలికెను.

ఊర్మిళ:—అక్కా! ఈవరపురుషుఁడెవ్వఁడు? వీనికేల మ్రొక్కుచుంటివి? ఇట్టివాఁడీలోకమునందెవ్వఁడైనఁగలఁడా? లేక నీభావముల కభిమతమగు సుందరరూపమునుజిత్రించి యానందించుచుంటివా? నీవ యోనిజవగుటచే నీమనోహరుఁడుకూడ నట్టివాఁడుగానే యుండఁగోరితివా? అటుగాకున్న భూవలయమున నింతటివరమోహనాంగులుందురా!

సీత:—సోదరీ! నేనుమైథిలోఁబరులలోనికి రానీయకుమని తెలిపియుంటిని అదిద్వారమాకడలేదా?

ఊర్మిళ:—ప్రియసోదరీ! నన్నుఁబరులలోఁజేర్చితివా?

సీత: – నాముద్దుచెల్లెలా! నేఁబరలోకమునకేగువఱకు నీవునా యాత్మరూపవేకాని పరురాలవుకానేరవు. పరశబ్దమునకర్థము ఆత్మకంటె వేఱైనవారని నాయభిప్రాయము.

ఊర్మిళ:— అక్కా! నీచేవ్రాయఁబడిన ఈశ్రీమంతుఁడెవ్వఁడు? ఇదివఱకు మనమిట్టిరూపమందగానిని యూహించి వినియుండలేదే! అస్వరూపములు నిన్నాదింపజేయఁజాలవుకదా? కావునఁగలనిజమితెఁగింపుము.

సీత :—సోదరీ ! నిన్నరాతిరినిదురలో నేనొక కలగంటిని ఆస్వప్నములో నేనిపుడుపటముపై వ్రాసిన సుందరాంగుఁడు ప్రత్యక్షమై నాపైఁదనయనురాగావలోకనములఁ బఱపుచుఁగొంతసేపునిలచి, అదృశ్యుఁడాయెను. అంతనేమేల్కని నలువైపులఁ గలయఁబరికించితిని. కానినాకెవ్వరును గానరారైరి అటుపిమ్మట నాకుఁదిరుగ నిదురపట్టలేదు. అందుచేఁ గాలక్షేపమునకై కలలోఁగన్నరూపమును పటముపైఁ జిత్రించితిని ఆచిత్రితరూపము నాచిత్తమునుహరింప నానందపరవశనై మ్రొక్కులిడి ముద్దిడఁబైకెత్తుచుండ నీవువచ్చితివి. ఇదినిజము. నాచేతల నీవునవ్వినను సరే! నమ్మినను సరే!

ఊర్మిళ:—విజ్ఞానవతీ! నీవుకలలోఁగన్నరూపము కల్లయెంతమాత్రమును కానేరదు నీయట్టిసతీమణుల హృదయములు పరపురుషులఁ గలలలోఁగూడఁ గాంచఁగోరవు. నీవు స్వప్నమునఁగాంచిన నృపకుమారవరాళి భూతలమున నెక్కడనో యవతరించియున్నవాఁడు. ఆపురుషవరేణ్యుఁడు నీకరతలమును బట్టనున్నవాఁడు గతస్వప్నమాకళ్యాణరూపమును నీమానసఫలకముపై జిత్రించినయది. ఇందుకుసందేహములేదు.

సీత:—వెఱ్ఱిదానా! ప్రత్యక్షరూపులగు రాజకుమారవీరులు హరచాపోద్ధరణమునకు జంకుచుండ స్వప్నదృష్టపురుషుఁడు శివశరాసనమునెత్తుటయెట్లు? నామనోరథమీడేరుటయెట్లు? ఇట్లాసోదరీమణులు ప్రశంసించుచుండ వాసంతియటకువచ్చి నల్లకలువపూలసజ్జ వారియెదుటనుంచి నిలచెను. సీత వాసంతినిజూచి ఇట్లుపలికెను.

సీత:—చెలీ! వాసంతీ! పూవులఁదెచ్చుటకింత జాగేలచేసితివి?

వాసంతి:—శోభనాంగీ! నీకొకమనోహరసందేశఫలమునందిచ్చుటకు

సీత:—సఖీ! నాప్రశ్నకు నీయుత్తరమంతగాసరిపడలేదు. అయినను నీవు తెలుపు సువార్తయేమిః?

వాసంతి:—భూపుత్రీ! ఇదివఱకు సరిపడకున్నను ఇపుడుసరిపోవును లే.

ఊర్మిళ:—వాసంతీ! శుభవార్తలఁదెలుపుట కాలస్యముచేయరాదు, కావున వేగముగా నాసువార్తను వివరింపుము!

వాసంతి:—క్షుధార్తుల నిరోధింపవచ్చును. పిపాసాపీడితుల నిలుపవచ్చును. కాని వరనామశ్రవణాసక్తుల నాపశక్యముకాదు. కావున వినుఁడు వివరింతును. నేనీకువలయములఁ జేకొని వచ్చుచుండ కుశకాత్మజునిచెంత నీలోత్పలవర్ణుఁడువాఁడొకఁడును, తెల్లకలువచాయవాఁడొకఁడును, కూర్చుండియుండిరి. ఆరూపజితసుమశరులఁ జూచి వీరెవ్వరైయుందురా? యనితలంచుచు నటనిలచితిని.

ఊర్మిళ:—సఖీ! తుదకువారెవ్వరో తెలిసికొంటివా?

వాసంతి:—రాకొమరితలారా! త్వరపడకుము. వారెవ్వరో తెలిసికొంటిని. యూవెంటనేవింటి నొకసువార్తను

సీత:— వారెవ్వరు?

ఊర్మిళ:— అసువార్త యేమి?

వాసంతి:— జనకనందినులారా! నేనాసువార్త తెలిపిన నాకేమి బహుమానమిత్తురో ముందు తెలుపుఁడు.

సీత:— మాయానందసంపదలో నీకుఁ గొంతభాగమిత్తుము.

వాసంతి:— ఆసుందరవదనారవిందులు దశరథనందనులు రామలక్ష్మణాభిధానులు. వారిలో బెద్దవాఁడగు రాముఁడు రేపు గిరిజాకాంతుని బాణాసనమును జేపట్టి నారిని సంధానింపనున్నవాఁడు.

ఊర్మిళ:— ఏమీ! రేపు నిజముగా గిరిజామనోహర శరాసనాకర్షణము జరుగునా?

వాసంతి:— రాజపుత్త్రీ! కేవల హరశరాసనాకర్షణమే కాదు. వసుధాత్మజా కరపల్లవాకర్షణముకూడ జరుపఁబడును.

సీత:— అధూర్జటికార్ముకము దుస్సంధానమనుసంగతి నారాజనందనుఁడెఱుంగునా?

వాసంతి:— రాజపుత్త్రీ! ఆమహనీయుని రూపసౌష్ఠవమునుజూడ నొకకరమున హరచాపమును వేఱొకచేత హరికార్ముకమును బట్టుటకు దగినదిట్టయని తోఁచినది. ఇంతియకాదు. ఆకువలయదళశ్యాముఁడు భూవలయమునంతను తనగోటికొనను మోయఁగలఁడు. వక్షముపై వజ్రములఁ బగులఁగొట్టఁగలఁడు.

ఊర్మిళ:— సఖీ! అతఁడంతటి మోటుమానిసియా? అట్లగుచో శిరీషాతిసుకుమారియగు నాయక్కకెట్లు సరిపడును?

వాసంతి:— ఊర్మిళా! కౌముదీస్పర్శచేఁ జంద్రకాంతోపలము వలె సీతాకరస్పర్శచే నాతఁడు సరసుఁడుకాఁగలఁడు. ఆవీరుఁడు మీయక్కకెంతయుఁ దగియున్నవాఁడు. వీరిరువురఁ ద్రాసులోనుంచి తూచినఁ గులరూపగుణాదులలో సమానముగాఁ దూఁగుదురు. దేహగుణములో నీవిదేహాత్మజకంటె నాదశరథాత్మజునివైపు తక్కెడ కొంచెము మొగ్గునని తోఁచుచున్నది

ఊర్మిళ:— అట్లైననాతఁడు ఈభూమిజకుఁదగినవాఁడేయందువా?

వాసంతి:—నాయూహాచే నంతయే. కాని లోకమునకు నచ్చిన వారు కన్యకామణులకు రుచింపకపోవచ్చును. కమలిని దినకరునివరించె గుముదిని శీతకరుని బ్రేమించెఁ గావునఁ గన్యలు వరులనెంచుటలో వారి వారి రుచులఁబట్టియుండును

ఊర్మిళ:—వాసంతీ! ఆసొగసుకాని రూపమిట్లుండునా? చూడుము. అని సీతచేతనున్న చిత్రఫలకమునుతీసికొని వాసంతికిచ్చెను.

వాసంతి:—రాజపుత్రీ! ఇతఁడేయూతఁడు, జాణలారా! నాకంటె ముందుగా నాయినకుల నందనులఁ గనుగొనియుంటిరా? ఎప్పుడు చూచితిరి?

ఊర్మిళ:—మాయక్కకలలో నీనల్లకలువరంగువానిని గాంచి వరించి లిఖించినది. ఆతఁడీతఁడేయైనచో మాయక్కకుఁ దగినవాఁడే.

సీత:—సఖీ! వాసంతీ! నీవుచూచిన యాపున్నమవెన్నెల వన్నె చిన్నవాఁడు ఊర్మిళయకుఁ దగియుండునా?

వాసంతి:—సౌభాగ్యవతులారా! మీసోదరీమణుల నిమిత్తమే నలువ ఈవార్షికఘనరూపుని, ఆశారదాభ్రసంకాశుని, నిర్మించెనని నాయూహా.

ఊర్మిళ:—వాసంతీ! నీవుపువ్వులఁగోసి తెచ్చుటకుఁ బోలేదు. వకుళసమకూర్ప నేగితివని తోచుచున్నది.

వాసంతీ:—ఊర్మిళా! నేనొకచట సుమములను, వేరొకచోట వర ఫలములను సమకూర్పఁబోతిని.

సీత.—నిజమే! నీవువాసంతివగుటచే సుమఫలములరెంటిని సమకూర్పఁజాలుదువు.

వాసంతి:—రాజనందనలారా! మీకాదశరథనందనులునచ్చిరా?

ఊర్మిళ:—శివచాపమెత్తిన పిమ్మటఁగదానీప్రశ్నకు సమాధానము.

సీత:—కాత్యాయనీకటాక్షమున్నఁగాని హరచాపసముద్ధరణము సాధ్యముకాదు.

వాసంతి:—కావుననే మీయమ్మ సుమేధాదేవి నీచే నీనాడు గౌరీపూజ చేయింపఁదలంచినది. అనుచుండ సుమేధాపరిచారిక వచ్చి

"అమ్మా! జానకీ! మీతల్లిగారు మిమ్ముఁబిలుచుకొని రమ్మన్నారు" అన నామాటవిని సీత యిట్లుపలికెను.

సీత:—"వాసంతీ! లెమ్ము. మాయమ్మగారిమందిరమున కేగుదము" అని యూర్మిళావాసంతులతో పరిచారికవెంట సుమేధామందిరమున కేగి యాపెకు నమస్కరింప ఆరాణి "కల్యాణపరంపరావాప్తిరస్తు" అని దీవించి యిట్లుపలికెను.

సుమేధ—పుత్రీ! నీవీదివసమున గౌరీపూజనమొనర్పవలయు నందుకువలయు పూజాద్రవ్యములు గౌరీమందిరమున సిద్ధముగానున్నయవి కావున వెంటనేస్నానమాచరించి, నవవస్త్రాలంకారకలితవై, లలితను బూజింపుము అందుచే నీకు నిరంతరాయముగా నీప్సితార్థసిద్ధిచేకూరును. అన సీత తల్లి యాజ్ఞానుసారము సుస్నాతయై నూత్నవస్త్రాభరణాదుల ధరియించి, భూమికవతరించిన లక్ష్మియోయన గౌరీమందిరమున కేగి, కాత్యాయనీవ్రతమును విధినియమములతో నాచరించి, యాగౌరీదేవినిట్లు ప్రార్థించెను.

"శివంకరీ! శంకరీ! దశరథనృపాలసూనుఁడగు రాముఁడు నీమనోహరుండగు హరునికోదండము నెక్కువెట్టి నాగళమునఁ దాళిఁగట్టునట్లు ప్రసాదింపుము. దయావతీ! పార్వతీ! ఇదివఱకెందరో యుద్ధతులు చంద్రమౌళిశరాసనోద్ధరణమునకు వచ్చియుండిరి అప్పుడు నామానసమున వారు వింటినెక్కిడుదురేమోయను ఖేదమేకాని మోదమొనవదాయెను. నేడేలకో తెలియరాని యమితానందము నాయంతరంగమున తరంగితమగుచున్నది. తల్లీ! పార్వతీ! తన్నువంచింపవచ్చిన పంచశరుని బంచత్వమొందించిన పంచాననునికై పరితపించి, పంచాగ్నిమధ్యమున నచంచలముగానిలచి తపమాచరించి యాత్రినేత్రునిలోనేకమై తుదకు పంచనయనవై వెలసిన నీకు నిప్పట్టున నాహృదయమెట్లుండునో తెలుపవలయునా? ఓశివసుందరీ! నాయందుదయఁగొని రాముఁడు నాకరగ్రహణమొనర్చునట్లు చేయుము." అనిప్రార్థించి పూజాంతమున నంతఃపురములోనికి వెడలిపోయెను.

ఆనాడు సుమేధాజనకులుపవసించి నిజాభీష్టసిద్ధికై యుమామహేశ్వరవ్రతమూచరించి యారాత్రి జాగరణమొనర్చిరి. మిథిలాపురజనులు ఎప్పుడు తెల్లవారునా! ఎప్పుడురాముఁడుశివునివిల్లెక్కు డునా! ఎప్పుడుసీతాకల్యాణమును కనులారఁగాంతుమా! యని త్వరపడఁదొడంగిరి. మిథిలానగర మెటుచూచినను, మంగళాలంకార శోభితమై జనకదంబ బంధురమై వెలయుచుండెను.

సప్తవింశత్యధ్యాయము.

—♦ శివచాపోద్ధరణము ♦—

తెల్లవారినతోడనే జనకరాజేంద్రుఁడు శతానందునితోఁ గలిసి విశ్వామిత్రునికడకువచ్చి ఇట్లుప్రార్థించెను.

జనకుఁడు:—కౌశికమునీంద్రా! మీయనుగ్రహముచే యాగము నిరంతరాయముగా సాగినది ఇకముందు మీయాశీఃప్రభావముచే సీతాకల్యాణోత్సవము జరుగవలసియున్నది. హరశరాసనోద్ధరణమునకు రాజనందనులందరు స్వయంవరమంటపమునకు వచ్చియున్నవారు. మీరు దశరథనందనుల వెంటనిడికొని సభామంటపములోనికి దయచేసి నా మనోరథమీడేర్పఁ బ్రార్థించుచున్నవాఁడను.

విశ్వామిత్రుఁడు:—విదేహరాజమౌళీ! నీమనోరథమీడేరుటయే మాయభీష్టము. అనిపలికి రామలక్ష్మణులతో జనకునివెంట స్వయంవరమంటపమున కేగెను.

ఆస్వయంవరమంటపము నాకేగునప్పటికే పౌరజన సమూహములతోడను భూపాలకుమార నివహములతోడను మునిగణములతోడను సీమంతినీకదంబములతోడను నిండి నిబిడీకృతమైయుండెను. జనకుఁడు విశ్వామిత్రాదులతో సభామందిరములోని కేగి యుచితాసనముల వారలనుపవసింపఁజేసి ప్రధానామాత్యుఁడగు సుధామునితో స్వయంవరనియమముల గూర్చి రాజనందనులకందరికిఁ దెలుపుమని నియమింప ఆమంత్రిపుంగవుఁడు లేచినిలచి ఇట్లు రాజకుమారుల సంబోధించెను.

సుధాము:—శౌర్యసాగరులారా! క్షత్రియకుమారులారా! మీ మొదుట నుంచబడిన ఈత్రిపురారి శరాసనమునకు నారిని సమకూర్చిన వారు నారీమణియగు సీతను జేకొనవచ్చును. కావున ధనురుద్ధరణము నకుఁ బ్రయత్నింపుఁడు. అన, ఆవిదేహమంత్రి వచనముల నాలించిన వారేకాని సాహసించి శరాసనాకర్షణమునకు ముందునకు వచ్చినవాఁడా రాజకుమార మండలములో నొక్కరుఁడును గానరాఁడయ్యెను. అంత నాజనకామాత్యుఁడు తిరుగ నిట్లుపలికెను.

ఈవిశాలసభాస్థలిలో నీశేసికంటివింటినెక్కిడి కలువకంటియగు మాజనకరాజేంద్రనందన సీతను జేకొనఁదగు సమర్థులొక్కరును లేరా? అన సభాభవనము నిశ్శబ్దమాయెను. అపుడు లక్ష్మణుఁడు సుధాముని సూదిపోటుమాటలకు తనదేహమునఁ బ్రవహించుచున్న క్షాత్రరుధిర ముడుకెత్త రాముని వైపుచూచెను. ఆసౌమిత్రిచూపుల వీరభావమును గుర్తించి రాముఁడు నిజనయనరక్తేందీవర కాంతులఁ గౌశికునిపైఁ బ్రసరింపఁజేసెను. విశ్వామిత్రుఁడు రామలక్ష్మణుల యింగితమును గుర్తించి సుధామునితో నిట్లుపలికెను.

విశ్వా:—మంత్రిపుంగవా! నీవుతలంచినట్లు ఈసభాస్థలిని చాపోద్ధరణసమర్థులు లేకపోలేదు. సుధాముఁడా! నీయాహ్వానము నిందు గల పెద్దలెవ్వరేని మన్నింతురేమోయను తలంపుతో వినయసంపన్నులగు నీదశరథకుమారులు తటస్థులైరికాని చాపమెక్కిడలేక యూరకొన లేదు. చూడుమీరాజకుమారులవైపు ఆజ్యధారలచే హోమాగ్నులట్లు నీహేళనవాక్యములచే నెట్లు ప్రజ్వలించుచున్నవారలో. కత్తి వరలో నున్నపుడు తనవాడిని జూపనేరదు. క్షత్రియుఁడు వినయముతో నున్నపుడు తనపరాక్రమమును జూపనోపఁడు. కాని వరనుదూసిన కత్తియు వినయమునుబాసిన క్షత్రియుఁడును తమవాఁడులఁ జూపఁదొడంగుదురు అని రామునివైపుజూచి ఇట్లుపలికెను.

విశ్వామిత్రుఁడు:—అసమానవిక్రమా! రామా! అమందసమున నున్న మాందాకినీధరుని వింటినెక్కువెట్టి నీవంటివీరుఁడు నృపకుమార లోకమున లేడనుకీర్తిని జేకొని పిమ్మట సరసీరుహదళ మృదులమగు

జనకజాకరపల్లవమును జేకొనుము. కట్టుము కటితటమున కౌశేయమును నిలుపఁబెట్టుము. సూర్యాన్వయగౌరవమును అన రాముఁడు కుశికాత్మజుని యాజ్ఞానుసారము లేచినిలచి నడుముబిగియించి కౌశికునిపాదములకు నమస్కరించి సింగపుకొదమ కరికరగ్రహణమున కేగుకరణి గంభీరముగా నడుగులిడుచుఁ దిన్నగా మందసముకడ కేగి మోమున సుందర మందహాసము తాండవింప నందున్న గిరీశశరాసనముఁ జేఁబట్టి విశ్వామిత్రునివైపుఁ జూచుచు నిలచెను.

అపుడు సురేంద్రచాపకలితమగు నీలనీరదమువలె కరగతశివచాపముతోఁ బ్రకాశించుచున్న శ్యామసుందరుఁడగు రాముని వదనారవిందమునఁ గల్యాణలక్ష్మి తళుకొత్తఁ దొడఁగెను. జానకీముఖకమలమున సౌభాగ్యసంపద ప్రకాశింపఁదొడంగెను. శీరధ్వజుని మానసారవిందమున సంతోషసౌరభము జనింపఁజొచ్చెను కౌశికహృదయహ్రదమున నానందరసతరంగములు చెలరేగ మొదలిడెను బృందారకమాకందబృందములఁ బ్రమోదపల్లవము లుదయింపనాయెను షట్పదసమూహములు సరసిజముపై వ్రాలునట్లు సభ్యావలోకనసందోహములు శ్రీరామముఖారవిందముపైఁ బడఁదొడంగెను. ఆకసమున నాకవాసులొండొరుల నొత్తికొనుచుఁ గుసుమవర్షములఁ గురియింపఁ గుమిగూడఁ దొడంగిరి.

అట్టిసంతోషసమయమునఁ గౌశికుని కనుసంజ్ఞచే రాముఁడుహరకోదండమునకు నల్లిత్రాటిని దగిలింపఁబోవ నాప్రావిల్లు నడిమికి రెండుగావిరిగి నేలఁబడెను. ఆవెంటనే మింట దేవదుందుభిధ్వానములు చెలరేగెను. దివ్యకుసుమవర్షములు గురిసెను. సభాసదులెల్లరు కరముల తట్టుచుఁ దమయానందముల వెల్లడింప నారంభించిరి.

అపుడు జనకనృపాలుఁడు ఆనందభరితుఁడై విశ్వామిత్రునకు సాష్టాంగనమస్కారమొనర్చి సంయమీంద్రా! మేచకమణిశ్యామసుందరమగు రామనీరదమును దోడ్కొనివచ్చి హరధనుర్భంగగర్జనములతో వీరరసవర్షమును గురిపించి, నామానసమహీరుహమున సంతోషపల్లవముల నుదయింపఁజేసితిరి! మునివరేణ్యా! సీతాపాణిగ్రహణమహోత్స

వమును గూడ సాగింపఁగోరుచున్నవాఁడను. రామపాదములఁ గడుగు టకు నాకరములును, సీతనుబరిగ్రహింపుమని తెలుపుటకు నానాలు కయు, అట్టి కల్యాణమువలోకింప నానేత్రములునుఁ దర్వరపడుచున్న యవి. కావునఁ గర్తవ్యమును యోజింపుడు. విశ్వామిత్రుఁడు జనకుని యుత్సాహమును గుర్తించి యిట్లుపలికెను.

విశ్వామిత్రుఁడు:—నృపావతంసా! నీకోరికయెంతయు సమంజ సము కాని దశరథనృపవరేణ్యునకుఁ దెలుపక మనమువేగిరపడి కల్యా ణోత్సవమును నెఱపరాదు. మఱియు దశరథాజ్ఞలేక సీతనుజేకొనుటకుఁ గౌసల్యానందనుఁడంగీకరింపఁడు. కావున మనమా కోసల సార్వభౌముని కడకు గుశలుఁడగు సచివునిచే శుభలేఖనుబంపి ఇటకు రాఁబ్రార్థింతము

జనకుఁడు:—సర్వజ్ఞులరగు మీరు తెలిపినదియే మర్యాద కాని "శ్రేయాంసి బహువిఘ్నాని" అనుటచేఁ జిరకాలవాంఛితమగు సీతా కల్యాణమును శీఘ్రముగాజరుపఁ దర్వరపడుచుంటిని.

విశ్వామిత్రుఁడు:—జనకరాజేంద్రా! నీవేగిరపాటునకుఁ గార ణమునేనెఱుంగుదును హరధనుర్భేదియు వరధనుర్ధారియు నగు రాముఁ డు లక్ష్మణసహాయుఁడై యుండ రాత్రించరవీరులకు యుద్ధముచేయుటకు గాని మాయలఁబన్నుటకుగాని సాధ్యముకాదు. సూర్యకరప్రసారమెంత వఱకుండునో యంతదనుక జీకటిదోసములు పొసగనేరవు. అటులనే శ్రీ రామ బాణప్రసారమున్నంతవఱకు దోషాచరవీరులు కలుగఁజాలవు. కావున శాంతచిత్తుఁడవై జానకీపరిణయమహోత్సవమును సావకాశము గా సాగింపుము. మఱియు దశరథునకు రామలక్ష్మణులేకాక భరతశత్రు ఘ్నులను మఱిద్దరు నందనులుకలరు వారును వీరితోపమానులే. కా వున నీసోదరుఁడగు కుశధ్వజునిపుత్రికలను భరతశత్రుఘ్నుల కొసంగ నేర్పాటుచేసి ఏకముహూర్తమున నలుగురికిని కన్యాదానములఁ జేసిన బాగుండును. జనకుఁడు విశ్వామిత్రునిబోధలవిని వెంటనే ముఖ్యామా త్యుఁడగు సుధాముని బిలిచి స్వయముగా శుభలేఖనులిఖించి యాతని కిచ్చి "శీఘ్రముగా నయోధ్యకేగి దశరథసార్వభౌమున కీశుభలేఖనిచ్చి యాతేని దగుమర్యాదలతో సపరివారముగ నిటకుఁదోడ్కొనిరమ్ము."

అని యాజ్ఞాపించి ఆవెంటనే "నాసోదరుఁడు కుశధ్వజుని సకుటుంబము గా మిథిలకుఁ దీసికొనిరమ్మని" స్వనందనుఁడగు నానందుని నియమించెను. ఆనందుఁడు వెంటనే సాంకాస్యమున కేగి, కుశధ్వజుని సకుటుంబముగా మిథిలానగరమునకుఁ దోడ్కొనివచ్చెను.

జనకమంత్రియగు సుధాముఁడు వస్త్రాభరణాది పారితోషికముల దీసికొని సాకేతనగరమున కేగి దశరథునిసందర్శించి తాఁదెచ్చిన బహుమానముల సమర్పించి శుభలేఖనందిచ్చెను. దశరథుఁడును సుధామునాదరించి యాతడిచ్చిన శుభలేఖనుజూచి రామునిపరాక్రమాతిశయమునకు నానందించి వసిష్ఠాదులకు శుభలేఖార్థముల వినరించెను. వారెల్లరును రామునికిఁ బరిణయోత్సవము జరుగనుండుటను దెలిసికొని పరమానందముతోఁ గొనలేంపుని సీతాకల్యాణమునకుఁ బ్రోత్సహించిరి. దశరథుఁడు గురుమిత్రసామంతాదుల వెంటనిడికొని సాకేతమునుండి బయలువెడలి మార్గమధ్యమున మూడురాత్రులుగడపి నాల్గవనాటి సాయంతనమునకు మిథిలానగరము సమీపించెను.

జనకుఁడు దశరథాగమనవార్తను దెలిసికొని శతానందాదులతోఁగూడి మహానందముగా ముందున కేగి వసిష్ఠదశరథాదుల భక్తిగౌరవములతో నిజరాజధానికిఁ దోడ్కొనివచ్చి దివ్యసుందర ప్రాసాదముల వారినందరి నర్హరీతిని విడియఁజేసెను. అపిమ్మట గాధిసుఁడు రామలక్ష్మణుల వెంటనిడికొని దశరథునికడకేగ అతఁడు కౌశికునికి నమస్కరించెను. రామలక్ష్మణులు దశరథపదములకు వందనమొనర్ప అతఁడువారి నానందముతోఁ గౌగలించుకొనెను. విశ్వామిత్రుఁడు దశరథునకు రామలక్ష్మణులయోధ్యను వీడినదిమొదలు హరచాపభంజన మొనర్చువఱకు జరిగినచరితమును వివరముగాఁదెలుప నాన్నృపుఁడు విని, యానందించి విశ్వామిత్రునిగూర్చి యిట్లుపలికెను.

దశరథుఁడు:—మునీంద్రా! అగ్నివేదిమికి వారియావిరియై యంత్రములనడపించు శక్తికలనియగునట్లు మీకటాక్షవీక్షణముచే నీబాలుఁడు శూరుఁడై కార్యతంత్రముల నడుపుసామర్థ్యము కలవాఁడాయెను రాముఁడు కీర్తిధి రాజితుఁడగుటకు మీయాశీఃప్రభావమే ప్రధానసాధ

నము. అటులఁగాకున్న ప్రౌఢవీరులకుఁగూడ జయింపనలవికాని మారీచాది రాత్రించరశూరులేడ? నూగుమీసములుకూడ రానిరాముఁడేడ?

విశ్వామిత్రుఁడు:—కోసలేంద్రా! భానుకిరణములకు నుష్ణకాంతియు భాస్కరకులజులకు విజయకీర్తియు సహజములుకాని పరసహాయజనితములుకావు. అజనందనా! ఈజనకరాజేంద్రుఁడు నీసుతులకుఁగన్యాదానములుచేయఁ బరమోత్సాహముతో నీరాకకై వేచియున్నవాఁడు. కులరూపవయోగుణాదులచే మైథిలకన్యకలు నీనందనులకెంతయుఁ దగియున్నవారు. మీయుభయవంశములకును సంబాధమేర్పరుప మేమెల్లరమును పరీక్షించుచున్నవారము. అని తెలిపినతోడనే జనకుఁడు దశరథునిగూర్చి ఇట్లుపలికెను.

జనకుఁడు:—మిత్రమా! కోసలరాజచంద్రమా! నేనెంతకాలమునుండియో మీతోసంబంధము నెఱుప నభిలషించుచుంటిని. నేటికాయభిలాషను ఈకుశకాత్మజుఁడు నీయాత్మజులఁదోడ్కొనివచ్చి పూరించెను కావున జాగుసేయక నాపుత్రికలగు సీతోర్మిళల రామలక్ష్మణులకును, నాయనుజసుహితలగు మాండవీశ్రుతకీర్తుల భరతశత్రుఘ్నులకును కళత్రములనుగాఁజేకొని నన్ను గృతార్థునిగాఁ జేయఁగోరుచున్నాఁడను.

దశరథుఁడు:—ప్రియసఖుఁడా! జనకభూపాలుఁడా! లోకములో దాతలు ప్రార్థింపఁబడువారుగాని ప్రతిగృహీతలుకారు నీవిపుడు దాతవును నేను ప్రతిగ్రహీతనునై యుంటిమి. కావున నీయభీష్టానుసారము చేయుము. మనమిరువురము వసిష్ఠవిశ్వామిత్రుల యాజ్ఞలపై శుభకార్యముల సాగించుటెంతయు శ్రేయస్కరము అనిపలికి వసిష్ఠునిజూచి ఇట్లు పలికెను.

దశరథుఁడు:—దేశికేంద్రా! వింటిరికదా? కౌశికోక్తులను జనకాభిలాషములను ఇకముందు నన్నేమిసేయుమందురో సెలవిండు.

వసిష్ఠుఁడు:—దశరథ రాజేంద్రా! బోధింపనలసిన దేమున్నది దాత్రు ప్రతిగ్రహీతలగు మీరిరువురును నేకమైయుంటిరి. మధ్యపురోహితునిదా? యాటంకము నృపేంద్రా! నీపుత్రులకు జనకపుత్రికలఁ జేకొనుటయే కర్తవ్యము. కావున నీవు రేపు నీసుతులకు స్నాతకవ్రతముల

బూర్తిచేయింపుము అని తెలిపెను అనంతరము జనకుఁడు వసిష్ఠ విశ్వామిత్రాదులకడ సెలవుగైకొని శతానందునితో వెడలిపోయెను.

దశరథుఁడు మిథిలానగరమునకు వచ్చిననాఁడే కైకేయీసోదరుఁడగు యుధాజిత్తు గిరివ్రజపురమునుండి మిథిలానగరమునకువచ్చి, దశరథునితోఁ గలిసికొనెను దశరథుఁడు కేకయయువరాజును గారవించి, "కేకయసార్వభౌములు కుశలముగా నున్నవారా?" యని ప్రశ్నించెను. అందుపై యుధాజిత్తు "మాజనకులు కడువృద్ధులైయున్నవారు మాయక్క సంతానవతియైనసంగతి మీరువ్రాసిన శుభలేఖవలనఁ దెలిసికొనిరి. అప్పటినుండియు తమదౌహిత్రునిజూడ నభిలషించుచున్నవారు. మిమ్మునడిగి, యొకపర్యాయము భరతునిదీసికొనిరమ్మని నన్నుబంపినారు నేనుమొదట నయోధ్యకేఁగితిని. మీరు మీపుత్రులకుఁ బాణిగ్రహణమహోత్సవములజరుప మిథిలానగరమునకేఁగితిరను సువార్తనువిని తిన్నగా నిటకువచ్చితిని. కాకతాళీయముగా నాకీకల్యాణ మహోత్సవము చూచుట సంప్రాప్తమైనది.

దశరథుఁడు:—కేకయయువరాజా! "శ్రీరామాదిసోదరులకు మైథిలరాజకన్యకల నొసఁగుటకేర్పాటుచేసియుంటిమి వెంటనే రమ్మని" విశ్వామిత్రుఁడుత్తరము వ్రాయించుటచే నవ్యవధిగాఁ బయలుదేరవలసి వచ్చినది అందుచే నాప్తబంధువులనుగాని ప్రియమిత్రులనుగాని పిలుచుటకు వీలుకాదయ్యెను కాని హితులగు నీయట్టిబంధువులు పిలుపుల నరకుచేయక శుభకార్యములకువచ్చి సాయపడుదురు. నీవీవివాహ మహోత్సవమునకువచ్చుట మాకెంతయుఁ బ్రమోదావహమైనది. వివాహమహోత్సవములు పూర్తియైనపిమ్మట నీమేనల్లుఁడు భరతుని మామగారికడకుఁ దీసికొనివెళ్ళవచ్చును అని తెలిపి యాతనికిఁదగు మర్యాదలఁ జేయించెను.

ఆమరునాడు దశరథుఁడు వసిష్ఠమునీంద్రులచే నిజనందనులకు స్నాతకవ్రతముల జరిపించుటకు నేర్పాటుచేసెను. అంతజనకుఁడు స్నాతకమునకుఁ గావలసిన మంగళద్రవ్యముల వెంటనిడికొని బంధుబృందములతోడను మంగళవాద్యములతోడను దశరథమందిరమునకువచ్చి

తాఁ దెచ్చిన మంగళవస్తువులనొసంగెను. వసిష్ఠుఁడు విశ్వామిత్రాదిమహర్షులతోఁ గూడి రామలక్ష్మణభరతశత్రుఘ్నులచే స్నాతకవ్రతములఁ జేయించి బ్రహ్మచారిసంస్కారముల నపనయించి గార్హస్థ్యచిహ్నములగు నవవస్త్రభూషణాదులతో దశరథనందనుల నలంకరింపఁ జేయించి మహర్షులచేతను భూసురోత్తములచేతను మహదాశీర్వాదములఁ జేయించెను. అపిమ్మట ఆకుమారులు స్నాతకవేషాలంకృతులై తమమంగళరూపములచే నటనున్న వారిమానసముల నాకర్షింపఁ దొడంగిరి. వారియపూర్వసుందరవేషములఁ జూచి జనకరాజేంద్రుఁడు అపరిమితానందభరితుఁడై వసిష్ఠదశరథులఁ గూర్చి ఇట్లుపలికెను.

జనకుఁడు:—మునిమానవసార్వభౌములారా! వసిష్ఠదశరథులారా! మీరెల్లరు బంధుపరివారసమేతులై వివాహమహోత్సవముల నెరపనా మందిరమునకు రాఁ బ్రార్థించుచున్నవాఁడను వైవాహికమహోత్సవమును జూచుటకుఁ బౌరులెల్లరును ఉవిలోత్సుకులై యున్నవారలు కావున వేగముగా విడిదినుండి కల్యాణమంటపమునకు రావలయును. అని ప్రార్థింప వసిష్ఠదశరథులు ఇట్లుపలికిరి. "విదేహసార్వభౌమా! నీయాహ్వానము మాకెంతయు సంతసావహము ఇదేబయలుదేరి వచ్చుచున్నవారము" అన జనకుఁడు శతానందాదులతో నిజమందిరమున కేగెను.

—: అష్టావింశత్యధ్యాయము :—

సీతాకల్యాణము.

దశరథుఁడు వసిష్ఠవిశ్వామిత్రాది మునిగణములతోడను, సామంతరాజసమూహము లతోడను, బంధుబృంధములతోడను, సైనికనివహములతోడను, గూడి భేరీమృదంగాదిమంగళవాద్యనాదములు మిన్నుముట్టుచుండ రామలక్ష్మణభరతశత్రుఘ్నుల వరాభరణవస్త్రాదులచే మనోహరముగా నలంకరింపఁజేసి చతురశ్వయానములపైఁ గూర్చుండఁబెట్టి విడిదిమనికిపట్టునుండి మహావైభవముతో నూరేగుచు మిథిలాపురరాజవీధిని వచ్చుచుండెను.

అపుడు పౌరనారీమణులు శివచాపఖండనవీరుఁడగు రాముఁడు సీతాపాణిగ్రహణమునకు నూరేగుచు వచ్చుచున్నాఁడను వార్తను సఖ

జనులవలనవిని ఆజగన్మోహనాకారుని వివాహనైపథ్యమును జూచునభిలాషతో మందిరాంతరములనుండి తొందరగారావొడంగిరి.

అందొకయలివేణి యుత్సవఘోషము వినినతోడనే గట్టువాలొనర్చుచున్న పూలజడయల్లిక ముగియకమున్నే జడనులాగికొని గ్రుచ్చిన పువ్వులు నీలవేణినుండి నేలరాల గవాక్షముకడకుఁ బరుగిడెను.

వేఱొకమందయాన పరిచారిక పాదతలములకు లత్తుకరసమును బూయుచుండ అరచన పూర్తికాకమున్నే మార్గముపొడవునను నిజపదరాగచిహ్నముల ముద్రించుచు కిటికీకడ కేగెను. మరియొకసారసాక్షి కుడికంటికి కాటుకనుదిద్ది యెడమకంటికి నంజనమును బెట్టఁగాటుకబరిణె నుండి నేలిలో నంజనమునుదీసి దానిని కంటికిఁబెట్టకయే జాలముకడ కుఁబోయెను. ఇకనొకసుందరాంగి మొలనూలును వ్రేలికిజుట్టి బంగరు మువ్వలగుచ్చుచు చేతనున్నదారపుకొస నట్టెవిడచి గుంభితములైన పసిడిగజ్జెలు క్రిందఁబడ పచ్చనిసూత్రము పసిరికపామువలె పాదమునంటిరాఁ బరుగిడఁజొచ్చెను. మఱొక్క మోహనాంగి మోమునఁ గస్తూరీ తిలకమును దిద్దునుద్దేశముతో నొకచేతనద్దమును వేఱొకహస్తమున మృగమదశలాకను బట్టుకొని బొట్టిడకయే కిటికీదగ్గర కేగెను.

అట్లామిథిలాపురవిలాసినులు అసమాపితాలంకారకార్యలై విషయాంతరములమరచి యుండుటనుజూడ వారిజ్ఞానేంద్రియములన్నియు నేత్రేంద్రియమున నైక్యమై యాశ్రీరామరమ్యాకృతి నీక్షించుచున్నట్లు తోచెను.

“నిజమే! ఈకాలమునఁ జిత్రలేఖనములయందును. లోహప్రతిమలయందును, శిలావిగ్రహములయందును, మట్టిబొమ్మలయందును జూపట్టుకల్పితరామరూపమే మానవమానసహారమై వెలయుచున్నయపుడు ఆకాలమున శ్రీరాముని సహజసుందర వైవాహికరూపమును గన్నులారఁగాంచువారికి వ్యాపారాంతరములు మందగించినవన సందేహమించుకయుఁ బనిలేదు.?

అట్లామహోత్సవములో దశరథభూపాలుఁడు స్యందనారూఢులగు నిజనందనులఁదోడ్కొని రాజవీధినూరేగుచు దుర్గద్వారముకడకు

రాగా జనకుఁడు ఎదురేగి వియ్యాలవారిని మర్యాదలతో కల్యాణమం టపమునకుఁ బిలుచుకొనిపోయి యథ్థాసనములపై నాసీనులనుగాఁ జేసెను. అంతశతానందుఁడు వసిష్ఠునితో నిట్లు తెలిపెను.

శతానందుఁడు:—భానుకులాచార్యా! వసిష్ఠమునివర్యా! వివాహమునకు వలయుమంగళపరికరములన్నియు సిద్ధముగానున్నవి. దశరథనందనులకుఁ గన్యాదానములొనర్చి కృతార్థులగుటకు నిమికులనృపాలురగు జనకకుశధ్వజులు ప్రతీక్షించుచున్నవారలు. కావునఁ బాణిగ్రహణ విధానమును జరిపింపఁ బ్రార్థించుచున్నవాఁడను అనవసిష్ఠసంయమీంద్రుఁడు కల్యాణప్రాసాదమధ్యమున నిర్మింపఁబడియున్న వేదికయందుఁ బావకుని ప్రతిష్ఠింపఁజేసి అందుమంగళహోమములజరిపించి కంకణబంధములనమకూర్చి "గౌతమనందనా! మాపక్షమునఁజేయింపవలసిన వైవాహికసంవిధానములు పూర్తి చేయింపబడినవి. ఇక కన్యాదానమునకు సంకల్పముచేయింపుము." అని తెలిపినతోడనే శతానందుఁడు జనకుని చేఁగన్యాదానమునకు సంకల్పముచేయించి నిమివంశప్రవరనుపఠించెను. వశిష్ఠుఁడు సూర్యవంశప్రవరను పఠించెను. అట్లుభయప్రవరలు తెలుపఁబడినపిమ్మట భేరీమృదంగాది మంగళవాద్యములు మ్రోగుచుండ ఆకసమున దేవదుందుభిధ్వానములు చెలరేగుచుండ మహర్షులు వైవాహికమంత్రములఁ జదువుచుండ వీణావేణుమృదంగాది గానవాద్యములు ధ్వనించుచుండ సభాసదులెల్లరు పరమామోదముతో రెప్పవాల్పక చూచుచుండ జనకభూపాలుఁడు తనపట్టపుదేవియగు సుమేధ సువర్ణకలశముతో జలములఁబోయ శ్రీరామచరణారవిందముల బంగరుపళ్ళెరమున నుంపఁజేసి ప్రక్షాళనమొనర్చి యాపవిత్రోదకములఁ బత్నీసహితముగా శిరముపైఁజల్లుకొని శ్రీరామునకు సీతకరమునందిచ్చుచు నిట్లుసంబోధించెను.

జనకుఁడు:—ఓయినకులసాగరసోమా! రామా! ఈసతీలలామ సీతానామ సుగుణాలవాల నాబాల ఈపెను నీవు సహధర్మచారిణినిగాఁ జేకొనఁగోరుచున్నాను. ఈసుముహూర్తసమయమునఁ గల్యాణకరమగు నీకరముతో మంగళావహమగు ధరణిజాపాణిపల్లవమును గ్రహింపుము

ఈఘనాశయయగు సీత నీడవలెనిన్నెడబాయక వెంటనంటియుండును. నీకు శుభములు కలుగుగావుత అనిమంత్రోదక పూర్వకముగా సీతాకరసరసిజమునందీయ శ్రీరాముండు నిజవదనవిలాసములచే వినయానందములం దెలియంజేయుచు ననురాగముతో వరరాగకలితమగు జానకీకరమును బరిగ్రహించెను.

సకలలోక కల్యాణసంధాయకమగు ఆసీతాపాణిగ్రహణ సుముహూర్తసమయమున సురలోకమునుండి సుపర్వులు సుమవర్షములంగురిపించిరి. వేదవేదాంగవిదులగు విప్రోత్తములు సువర్ణాక్షతలంజల్లిరి. సతీమణులగు సౌభాగ్యవతులు ముత్తెములను పేలాలనుజల్లిరి. వందిమాగధులు మంగళగీతములం బాడిరి.

పెళ్ళిపీటలపైం గూర్చుండియున్న నూతనవధూవరులగు నాసీతారాములం దిలకించి "ఆహా! ఈవరుడెంతటి రూపముకలవాండనువారును ఓహో! ఈసీతకీతండే తగుననువారును, సృష్టికర్త యీరిరువురిని దంపతులనుగా సమకూర్పకున్నం దాజేసిన సుందరరూపనిర్మాణము వ్యర్థము చేసియుండుననువారును, సుమేధకిట్టియల్లుండు సమకూరుట కెంతపుణ్యమొనర్చెనోయనువారును, మనసీతయే వరునికన్న హెచ్చువన్నె కలదనువారును; కాదుకాదు నిజమారయ భూమిజకన్న రాముండే వన్నెకాండనియును" ఇట్లేవేవో సంతోషపూరితములగు సంభాషణముల సభాసదులెల్లరు చేయందొడంగిరి.

ఆహా! నీలేంద్రమణిశ్యాముడగు రాముండు బంగారుచాయగల సీతయొక్క కరమును ఘనానురాగముతో గ్రహించుచుండుటను కన్నులారచూచు భాగ్యమబ్బుటకు అచటివారెంతటి పుణ్యములు చేసియుందురో కదా! పూర్వజన్మసుకృతపుంజమున్నగాని అట్టిదివ్యలావణ్యరూపుల కళ్యాణము గాంచుభాగ్యమబ్బనేరదు.

"పాఠకమహాశయులారా! సీతాకరగ్రహణ మొనర్చుటచేతనే రాముండు పురాణప్రసిద్ధుడగు పురుషవరేణ్యుండాయెను. ఇటనుండియే రాముండు శ్రీవిలసితుండై శ్రీరాముండాయెను. ఇదివఱకానీరజాక్షుండు

కేవలరాముఁడే. సోదర సోదరీమణులారా వింటిరికదా? మహదానంద జనకమగు సీతాకల్యాణమును ఇకనితరపరిణయములఁగూడవినుఁడు."

జనకుఁడు సీతనురామునకొసంగి ఆవెంటనే లక్ష్మణునిబిలిచి "సుమిత్రానందనా! లక్ష్మణా! ఈయూర్మిళను జేకొని నన్ను సంతసింప జేయుము." అని యూర్మిళను లక్ష్మణునకొసంగెను. అటుపిమ్మట శీరధ్వజుఁడు తనయనుంగుతమ్ముఁడగు కుశధ్వజునిబిలిచి భరతశత్రుఘ్నులకు మాండవీశ్రుతకీర్తుల నొసఁగుమన నన్నయనుమతిని కుశధ్వజుఁడు భరతునిరాబిలిచి తనయర్ధాంగియగు సత్యవతి కాంచనపాత్రలో జలములఁబోయ భరతునిపాదములఁగడిగి మాండవిని కైకేయీనందనునకొసంగి శత్రుఘ్నునాహ్వానించి యుదకపూర్వకముగా శ్రుతకీర్తి నాసుమిత్రాసుతునకిచ్చెను పిమ్మట నావధూవరులందరును పురోహితులయాజ్ఞానుసారము అగ్నులకుఁ బ్రదక్షిణనమస్కారములొనర్చి నవరత్నమణిమయములగు పెళ్ళిపీటలపై వరుసదీరికూర్చుండిరి. అపుడు పెద్దవయసుగల ముత్తయిదువులు బంగరుపళ్ళెరములలో గర్పూరహారతుల మంగళగీతములతో వధూవరులకొసంగిరి. ఇట్లాకల్యాణములు ఆనందనామ సంవత్సర వైశాఖశు॥ దశమిని ఉత్తరఫల్గునీనక్షత్రయుక్త మిథునలగ్నమున మహోత్సాహముగా జరుపఁబడినవి.

ఏకోనత్రింశత్త్యధ్యాయము.

— పరశురామాగమనము —

మహావైభవముగాఁ గల్యాణోత్సవములు నెరవేరినతోడనే విశ్వామిత్రుఁడు నూతనవధూవరుల నాశీర్వదించి వసిష్ఠాదులతో నేఁబోయి వచ్చెద"నని తెలిపి హిమగిరికి వెడలిపోయెను. జనకమహారాజు వసిష్ఠాది మహామునులకును భూసురోత్తములకును వస్త్రములగు సన్మానముల జలపి దశరథాదిబంధుజనుల సువర్ణమణిభూషణములతో బహూకరించి మంత్రిసామంతాదుల బహువిధముల గౌరవించెను.

దశరథుఁడా వివాహమహోత్సవము ముగిసినతోడనే క్రొత్త కోడండ్రవెంటనిడికొని సాకేతమునకుఁ బ్రయాణమగుచుండ జనకనృ

పలుఁడు రామాదిజామాతలకు ననర్ఘవస్తువాహనాదులఁ గానుకలఁగా నొసంగి నిజకన్యకలకు వలయుసారెచీరల నొసంగెను. అనవవధువులు త ల్లులకడ కేగి నమస్కరింప సుమేధాసత్యవతులు వారినిదీవించి కౌగలించి "బిడ్డలారా! ఇటపుట్టింట స్వేచ్ఛగా మాకడమసలినట్లు అట నత్తింట నత్తమామలకడ మసలికొనక వారుబోధించురీతిని సంచరించుచు, భర్త లకును అత్తమామలకును విధేయులై యుపచారములనెరపి వారలకు సంతసమును సమకూర్పుడు. దాసీదాసాదుల మిత్రసములగ భావించి యాదరింపుడు." అనిబోధించిరి అపుడు సీత తల్లులతో నిట్లుపలికెను.

సీత:—తల్లులారా! మిమ్ము వదలివెళ్లుటకు మాకెంతయో కష్ట ముగానున్నయది. అమ్మలారా! తిరుగమాకు మిమ్ముదర్శించు భాగ్యమెప్పుడు కలుగఁజేతురు?

సుమేధ:—గుణవతులారా! పుత్రికలారా! మీరు గర్భవతుల రైతిరను సువార్త విన్నతోడనే మేమటకువచ్చి మిమ్మిటకుఁ దీసికొనివత్తుము. అచిరకాలములోనే అట్టిసంపద సమకూరుగావుత అని భగవంతుని ప్రార్థించుచుందుము.

సత్యవతి:—కొమరితలారా! మిమ్మెడబాసియుండుటకు మాకును మనసొప్పుటలేదు. కాని కన్యలు వివాహితలైనతోడనే భర్తలతో గృహప్రవేశోత్సవమునకై వెడలుట మర్యాదయగుటచే మేమెట్టియాటంకమును కలిగింపజాలకున్నవారము. మీయక్కసెల్లెండ్రందరును, ఒక్క మనసుకలవారలై, మెలగుచుండవలయును. అని బోధించిరి. వారి సదుపదేశములవిని సీత యిట్లుపలికెను.

సీత:—తల్లులారా! ఆత్మగౌరవసంరక్షణమేజీవితఫలముగానెంచు మీయట్టి సతీమణులకడ శిక్షితులైన కన్యలన్యథాగా మసలుట యసంభవము మఱియు విదేహరాజవంశము నిత్యమగు తత్వసంపదనపేక్షించునుకాని చంచలమగు భౌతికభాగ్యము నభిలషించునదికాదు కావున జనయిత్రులారా! మీపుత్రికలత్తవారింట నెట్లుందురోయని శంకగట్ల కుడు. సంతసముతో సెలవునయొసేయుడు.

ఊర్మిళ:—తల్లులారా! మేము బాల్యమున మీశిక్షలనువలె ఇపుడు మాయక్కసీతబోధలను, నాధారముగా చేసికొని మసలుకొను కాని స్వేచ్ఛగా దిరుగఁబోము. కావున మీరు మాచరితములగూర్చి బెంగ టిల్లకుడు. అనివారెల్లరు తల్లులకువందనములొనర్చి జనకునికడకు వచ్చి నమస్కరించి నిలచిరి.

శీరధ్వజుఁడు నిజతనయుడగు నానందునిబిలచి యిట్లుపలికెను.

జనకుఁడు:—నందనుఁడా! నీవు నీసోదరీమణులతోఁగూడ నయోధ్యకేగి, యట గృహప్రవేశమహోత్సవములు ముగిసినతోడనే దశరథ రాజేంద్రునియొద్ద సెలవుగైకొని రమ్ము. అని యర్ఘ్యములగు పారిబర్హముల సమకూర్చెను.

దశరథుఁడును మిథిలాపురమునుండి సపరివారముగా నూతన వధూవరుల వెంటనిడికొని బయలువెడలి మూడుయోజనముల దూర మేగినతోడనే విపరీతములగు నపశకునములు గన్పట్టదొడంగెను. అతేఁడా దుశ్శకునముల దిలకించి ఏదియో యనివార్యమగు నాపద రానున్న దని భీతిల్లి వసిష్ఠునితో "మహాత్మా! మనకేదియో వినాశమాసన్నమైన ట్లీదుర్నిమిత్తములు తెలియచేయుచున్నయవి. మీకీనుర్దినమున నద్దుపడకున్న దుఃఖాంధకారమున బడవలసివచ్చును." అనుచుండ "ఎవడురా పూజ్యపాదులగుమాగురువులచాపమును విరచి మమ్మవమానించినవాఁడు? వాఁడు బ్రతుకదలంపలేదు కాబోలు లేకున్న పురారిశిష్యుఁడగు నీపరశురాముఁడుండ నిట్టిసాహసమునకు బాల్పడునా?" అనుచు గొండ గుహాలు ప్రతిధ్వనించునట్లు కేకలిడుచు మూపునగండ్రగొడ్డలియు కరమున హరికార్ముకమును బట్టుకొని యటకువచ్చెను.

దశరథుఁడాభీకరాకారుఁడగు భార్గవరాముని చూచినతోడనే భయకంపితగాత్రుఁడై ఇట్లుపలుకఁదొడంగెను.

దశర:—హా! నయనాభిరామా! రామా! నిన్నొకసారి యాలింగనముచేసికొననిమ్ము నీముఖారవిందమును గన్నులారఁజూడనిమ్ము. దురదృష్టవంతుఁడనగునాకు నికనిన్ను జూచు భాగ్యముండదని తోచుచున్నది. ఆహా! ఈభార్గవుఁడెంతటికూరుఁడు. భూవలయమునఁగల

క్షత్రియుల నిరువదియొక్క మారు నిజపరశుపావకునిచే దహించియుం దృప్తితరక తిరుగఁబ్రజ్వలితక్రోధానలుఁడై శ్రీరాముని వెదకుచున్న వాఁడు.

కట్టా! పాపపుదైవమా! శ్రీరామచంద్రుఁడు భువనైకసుందర కోమలాంగియగు సీతతోఁగొన్నిదివసములైన సంసారానందముల ననుభవింపకముందే వివాహకాలమునఁగట్టిన మధుపర్కముల విప్పకముందే నిర్హేతుకముగా నీకట్టకివిని సుగుణసుధానిధియగు నానందమునకు నోట ననరాని యాపదనుదెత్తువని తోఁచుచున్నది కటకటా! జనకనందినీ! నీవద నారవిందమున సౌభాగ్యలక్ష్మి నాట్యమాడుచుండ నట్టివిపరీతము జరుగ నున్నది!

ఓవసిష్ఠాది మహర్షులారా! యుధాజిదాది బాంధుసముద్రులారా! సుమంత్రాది సచివోత్తములారా! స్వామిహితైకపరాయణులగు సేనా నాయకులారా! మీరెల్లరును జాగరూకులైయుండుడు. పరమక్రూరుఁడగు పరశురాముఁడు కోపానలజ్వాలాజాజ్వల్యమానుఁడై మనశ్రీరామునిపై కేగుచున్నవాఁడు. అనిపలికిమూర్ఛితుఁడాయెను.

శ్రీరాముఁడు భార్గవకంఠనాదము విన్నతోడనే జలదగర్జనమును విన్న పిన్నసింగముమాడ్కి తనవారినందరినిదాటి ముందునకేగి పరశు రాముని రాకకెదురు చూచుచుండెను పరశురాముఁడు నిర్భయముగా నిలచియున్న శ్రీరామునిదివ్యరూపమునుచూచి ఇటులఁదలంచెను.

పరశు:—ఓహో! యీపిన్నవాఁడెవ్వఁడో చిరునవ్వుతో నిర్భయ ముగా నావైపు తనధీరావలోకనముల బ్రసరింపఁజేయుచున్నవాఁడు ఈతని వినయగంభీరాకృతిని జూడగనే వేగముగాఁబరుగిడివచ్చుచున్న నాక్రోధనదీప్రవాహము ఘనతరనీలపాషాణాహతికివలె వెనుకకుమరలు చున్నది. ఈవయసుకాని నిర్లక్ష్యభావముచూడ గిరిజాపతిశరాసనమును విరచి, జనకజను జేపట్టిన జెట్టియీతఁడేయని తోఁచుచున్నది ఆహా! ఏమియీతని మనోహరాకారము అనుచు శ్రీరామునికడకేగి ఇట్లు ప్రశ్నించెను.

పరశు:—ఓయీ! సుకుమారాకారా! శివునివింటినివిరచి "నావంటిశూరుఁడులేఁడు" అనితలంచుచున్న రాముఁడెచ్చటనున్నవాఁడు? ఆ మాటవినినతోడనే శ్రీరాముఁడు భక్తివినయములతో భార్గవరామునకు నమస్కరించి ఇట్లుపలికెను.

శ్రీరాముఁడు:—భార్గవమునిచంద్రా! తమకాకుత్థ్సవానితోఁబని యేదియో తెలుపననుగ్రహింతురేని యాతని దోడ్తెచ్చి మీపాదసరసిజముల ముందు నిలువబెట్టుదును.

పరశు:— నేనాతనిపరాక్రమమును బరీక్షించి పిమ్మటనాతనితో యుద్ధముసేయవచ్చితిని. కావున మాతపఃకాలము వ్యర్థముకాకుండ వెంటనేవానిఁజూపుము.

శ్రీరాముఁడు:—రేణుకానందనా! అట్లైనఁ దిలకింపుఁడా దశరథనందనుఁడగు రాముఁడు మీయెదుటనిలిచియున్న యీభక్తుఁడే తాపససార్వభౌమా! అనలమునఁబడి బంగారు వన్నెకెక్కినట్లు వేదపూతమగు మీవదనమునఁబడి నాపేరు పావనమైనది సంయమివరా! తమకీవిధేయునిపై నింతకోపమురాఁగారణమేమి?

పరశు:—తనలో "ఓహో! యేమియీతని వినయవాక్కులు! నేననేకక్షత్రియవీరులఁ బరీక్షించియుంటినికాని, వారిలోనొకఁడును నా యెదుట నిట్లునిర్భయముగానిలచి మాటలాడినవాఁడే లేఁడు. వీనిధీరస్వభావముఁజూడ భూవలయమునఁ దిరుగక్షాత్రమునుద్ధరింప నారాయణుండీరూపముతో నావిర్భవమందినట్లు తోఁచుచున్నది. కానియేదియెట్లైననుసరే యీతనిసమావేశము నాకానందప్రదమే". అనిశ్రీరామునితో నిటులఁబలికెను.

పరశు:—దశరథరామా! నీపరాక్రమములను నీవుశివధనుస్సును విరుచుటను వినియుంటిని. అందుచే నేస్వయముగా నీబాహువీర్యమును బరీక్షింపఁదలంచి యిటకువచ్చితిని. కావున ముందునాచేతనున్న కార్ముకమునందుకొని దీనఁబాణమును సంధింపుము. అట్లొనర్చినచో నీవు పరాక్రమశాలివనియెంచి నీతోయుద్ధమొనర్తును. ఆమాటలవిన్న తోడనే దశరథుఁడు గడగడవడఁకుచు బరశురామునితో నిట్లుపలికెను.

దశర:—ఓయసమానప్రతాపాగ్నీ ! జామదగ్నీ ! నీవుక్షత్రియ క్రోధమునువీడి శాంతాత్ముఁడవై సురపతితో "నేనికశస్త్రమును బరిగ్రహింపను" అనిప్రతిజ్ఞచేసియుంటివి క్షత్రియులసంహరించి నీవుగడించిన భూతలమునంతను వీతరాగుఁడవై కశ్యపునకు దానమొసంగియుంటివి.

అట్టిధీరోదాత్తుఁడవగు నీవాడినమాటఁబాటింపకుంట పాడికాదు. మఱియు శమప్రధానులగు భార్గవశ్రోత్రియుల వంశమునఁబుట్టియున్నవాఁడవు. కావున శాంతాత్ముఁడవై ఈపిన్నవాని తప్పుసైరించి నాకుఁ బుత్రదానమొసంగఁ గోరుచున్నవాఁడను. పరశురాముఁడా దశరథోక్తులఁ బాటింపకయే శ్రీరామునితో నిట్లుపలికెను.

పరశు:—ఓయీ ! నీవేనా ! మాగురుచాపమును విఱచిన రాముఁడవు ?

శ్రీరాముఁడు:—రేణుకాత్మజా ! ఇదికొంతవఱకునిజమే జరిగిన సంగతిని నివేదింతును. ఆగ్రహింపకవినుడు మాశస్త్రగురువులగు విశ్వామిత్రమునీంద్రులు విదేహరాజసభలో నన్నాశివధనుస్సు నెక్కిడుమని యాజ్ఞాపించిరి. వారియాజ్ఞానుసారము నేనాశివునిచాపమునుఁ జేపట్టి యెత్తబోవునరికి రెండుగావిఱిగి నేలఁబడినది. అయ్యదియిదివఱకే విఱుగు చూపియున్నదో ! లేక ప్రాతదగుట నేనాకరస్పర్శమువలనఁ దునుకలైనదియో నేఁదెలుపఁజాల. మాగురువరుల యాజ్ఞానుసారము మీగురువరుల కార్ముకమును ముట్టితిని. లేకున్న నాకాచీకువింటితో బనియేమి ? ప్రాతవిల్లువిరుచుట యొకపరాక్రమలక్షణమా ? మునివరా ! జరిగినదింతయ. ఇందుతప్పున్నచో క్షమింపుడు దశరథసుతులు మునివిధేయులు కాని విజేతలుకారు.

పరశు:—ధూర్తక్షత్రియుఁడా ! ఏమినీవినయవాక్కులు ! అగునునీవనినట్లు నీకాచీకువింటితోఁ బనిలేనిమాటనిజమే. కానీ యిదిగో నాచేతనున్న శివసేవితశరాసనమును జేకొనియెక్కిడుము పిమ్మటనీగర్వభంగమొనర్తును. ఇకమాటలతోఁ గాలయాపనచేయకుము అనితనచేతనున్న వాఁటికోదండమునుజూప శ్రీరామచంద్రుఁడు మందహాసముతోఁ

బరశురాముని చేతినుండి యాతని తేజస్సుతోఁగూడ శ్రీహరిశరాసనము నాకర్షించి యిటులబలికెను.

శ్రీరాముఁడు: — భార్గవకులావతంసా! విరాగులై శమప్రధానులై అహింసామార్గమునఁ గాలముగడుపఁదగు మీయట్టిబ్రహ్మర్షుల కిట్టి క్రూరశరాసనములతోఁబనిలేదు. అవి మాయట్టిక్షత్రియకుమారులకుఁ దగియున్నవి. అందుచే మీకరమునుండి యీకార్ముకమును నేఁ జేకొంటిని క్షమియింపుడు అని శీతలవారిసేచనముచే శిరోతాపము శాంతించునటుల శ్రీరామకరసంస్పర్శచే నురవాంకారమంతరింప భార్గవరాముఁడు దశరథరాముని శ్రీకాంతునిగా భావించి యిట్లు ప్రార్థింపఁదొడఁగెను.

పరశు: — శ్రీరామచంద్రా! నీవుమానవకుమారుఁడవుకావు అద్వంతరహితాఖండ చిదానందస్వరూపము పరబ్రహ్మమవు. నిరీహుండవును నిష్క్రియుఁడవును నిర్వికారుఁడవును నగునీయందు జలమున నురుగువలెను, అనలమునఁ బొగవలెను. అనంతబ్రహ్మాండములావిర్భవించుచున్నవి. అంతియకాని నీకుజన్మాది షడ్వికారములు లేవు. ప్రకృతి వ్యామోహితులగువారు నీనిజతత్త్వమును తెలియఁజాలక నీవును జరామరణములు కలవాడవేయని భ్రమించుచుందురు.

ఓపావననామా! శ్రీరామా! నేడు నీదివ్యసందర్శనముచే నా జన్మసఫలమయినది నాకులము వన్నెగాంచినది సీతారమణా! నిన్నుఁ గూర్చినేఁబలికిన కఠినోక్తులకుఁ గారణము నీవుపన్నినమాయయే ఇపుడు నీపాణిపంకజస్పర్శచే నాయవిద్యాతిమిరము నశింప నీస్వరూపము గానవచ్చెను. ఓభక్తవత్సలా! ఇక నాకు జన్మలేకుండఁజేసి నన్ను నీదివ్యపదసరసీరుహసన్నిధిని చేర్పుము.

ఓదయాసింధూ! జానకీబంధూ! మున్నుఁ గార్తవీర్యనందనులు నీచులై నాతండ్రి జమదగ్నిమునీంద్రుని దారుణముగాఁజంప నేనాదుర్భరదుఃఖమును భరింపజాలక ఆదుష్టక్షత్రియుల నాశనమొనర్పఁగోరి నిను గూర్చి తపమొనరించితిని. భక్తవరదుఁడవగునీవు నాతపమునకు సంతసించి ప్రత్యక్షమై "నీవీకార్ముకమును జేకొని కుత్సితులగు క్షత్రియుల

సంహరింపుము" నేను త్రేతాయుగమున దశరథనందనుఁడనుగా నవతరించి నీయొద్దనుండి తిరుగ నీశరాసనమునంబుకొని నిన్నుద్ధరింతును" అని నాకీచాపమునొసఁగి యంతర్ధానమైతివి. కావున ప్రపన్నార్తిహరా! సీతామనోహరా! క్షత్రియహింసాజనితములగు నాయఘౌఘముల నీయమోఘబాణముచే ఛేదించి నన్ను నీపదయుగనళిన మధుపానమత్తునిగాఁ జేయఁ బ్రార్థించుచున్నవాఁడను అనిపలుక శ్రీరాముఁడాధ్యాత్మికముగాఁ బరశురామునకభయమొసఁగి లోకలీలకై భార్గవపదములకు వందనమొనర్చి చిరునగవుతో "మునివరా! పరశుధరా! నాపైఁగినుక తొలగెనా? అనిపలికినతోడనే పరశురాముఁడు పరమానందభరితుఁడై "శ్రీరామచంద్రా! దయాశీతలమగు నీస్మితచంద్రికాప్రసారముచే నాక్రోధతాపము చల్లారినది. శాంతాత్ముఁడనైతి"నని పలికి వెంటనే యటనుండి మహేంద్రగిరికి వెడలిపోయెను.

అంతదశరథుఁడు క్షత్రియాంతకుఁడగు పరశురాముని శాంతాత్మునిగాఁజేసి మందహాసముతో నిలచియున్న నిజనందనుని గాఢముగా నాలింగనమొనర్చి దీవించెను. శ్రీరాముఁడు వసిష్ఠాదులకు నమస్కరించి వారిదీవనలనందికొని సీతకడకేగ ఆసతీమణి భర్తకునమస్కరించి "ప్రాణేశ్వరా! మీరు నన్నువిడచి యాపరశురాముని కెదురేగునపుడు నాకమితమగు భయముకలిగినది.

శ్రీరాముఁడు:—జనకనందినీ. నీయట్టిక్షత్రియాంగనలకట్టి భయములిగునా? ఉత్తమక్షత్రియకుమారుఁడు సమరాహ్వానమునువిని యూరకుండునా?

సీత:— శూరాగ్రణీ! నాభీతికిఁగారణము క్షత్రియవీరకుమారుల మర్యాదలు తెలియక కాదు. మరేమన ఆభార్గవుఁడు మీజనకుల నిర్లక్ష్యముచేయుటచే మీరుక్రోధావేశపరవశులై పాపమా వృద్ధబ్రాహ్మణుని సంహరింతురేమోయని.

శ్రీరాముఁడు:— సుభాషిణీ! క్షమాతనూజాతయగు సీతయొక్క కరమును బట్టినవానికంతటి కోపమెట్లువచ్చునను కొంటివి? రవికులకుమా

రులు భూసురవీరుల నెట్లుశాంతులనుగాఁ జేయవలయునో తెలియనివారుకారు. నీకాసంగతి తెలిసియుండినచో నీవింతటిభయమందియుండవు.

సీత:—వీరావతంసా! సాగరక్షారోదకమున నమృతమిమిడియున్నట్లు సాగరకుమారవీర్యములో నొప్పు చేరియున్నది. సందియము లేదు. కావుననే సమరసంరంభము సంబరముగా మారినది. ప్రాణేశా! గుణములాచరణముచేతఁగదా? తెలియనగును. అందువలన మునుపట్లుతలంచితిని.

అన ఆసీతామధురాలాపములకు శ్రీరాముఁడత్యంతానంద మందెను.

త్రింశత్యధ్యాయము.

—♦ నూతన వధూగృహప్రవేశము ♦—

సాకేతవాసులగు స్త్రీపురుషాదులెల్లరును తమసార్వభౌముఁడగు దశరథుఁడు నూత్నవధూవరులఁ దోడ్కొని వచ్చుచున్నవాఁడను సువార్త తెలిసినతోడనే నిజనగరమును వైకుంఠనగరమట్లు సుందరముగా నలంకరించి వారిరాకకై యెదురుచూచుచుండిరి.

అంతదశరథుఁడు మంగళవాద్యనాదములు చెలరేఁగుచుండ మహోత్సవముతో సాకేతనగరద్వారము కడకు రాఁగానే సౌభాగ్యవతులగు పురంధ్రీమణులు నూతనవధూవరులకు వసంతకలశములను, సువర్ణాక్షతలను, దిగనుడిచిరి పిమ్మటఁ బచ్చకప్పురపు నివాళులొసంగిరి. ఆలాంఛనములైన వెంటనే కోసలక్ష్మాపాలుఁడు వధూవరులఁ బట్టపుటేనుగులపై బంగారునంబారీలలోఁ గూర్చుండఁబెట్టి సకలజనపరివృతుఁడై రాజవీధినూరేఁగుచు రాఁదొడంగెను.

అప్పుడు పౌరకాంతలెల్లరు సౌధాళిందములలో వరుసలుదీఱినిలచి వధూవరులపై కుసుమములను, లాజలను, ముత్తెములను, నక్షతలను సంతోషముతోఁ జల్లఁదొడంగిరి. అట్లాపురకాంతలు చూపుచున్న గౌరవానందకృత్యములఁ దిలకించుచు శ్రీరామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు తమభార్యలతో నూరేఁగుచుండ సాకేతపురజనులా వధూమణులఁగాంచి "మనదశరథరాజేంద్రుని మందిరములకుఁ గ్రొత్తగానలుగురు లక్ష్మీకాంతలు వచ్చియున్నారని పలుకఁజొచ్చిరి. కోసలక్ష్మాపాలుఁడు నూతనవధూగృహప్రవేశమును మహావైభవముగా సాగించి గురుబంధుమిత్రు

డుల నత్కారీతిని సన్మానించి కైకేయీసోదరుఁడగు యుధాజిత్తునకును సీతాసహోదరుఁడగు నానందునకును మహారాజసన్మానములఁ జేసి గారవించెను.

అట్లాయుత్సవము పదునారుదినములవఱకు నొక్కరీతిని నడచెను అటుపిమ్మట శ్రీరామచంద్రుఁడు తమకుఁగావలసిన సకలసౌకర్యములఁ దమతల్లులు సమకూర్చుచుండఁ దమకెట్టిభారము లేకుండ స్వసౌఖ్యముల నిజజనకుఁడు కనుగొనుచుండ అమందానందముతో పదేహకన్యయగు సీతతోఁగూడి పద్మాలయతోఁగూడిన పుండరీకాక్షునిపగిది వివిధము లగు భోగములననుభవించుచు తమవిలాసములఁగనుగొని తోడఁబుట్టు లును పురజనులును సంతసింప సాకేతమున దమ్ములతోఁగలిసి నానంద ముగాఁ విహరింపఁదొడంగెను.

భరతాదిసోదరులును శ్రీరామునిమాటలకడ్డుగుచాటక సదావిధే యులగు భృత్యులకైవడి నడువఁదొడంగిరి. సీతాలోనగు శ్రోత్రకోడం డ్రు నిజభర్తలకును, అత్తమామలకును అనువర్తనులై ఘనమర్యాద లచే బంధుబృందముల నంతసింపజేయుచు, నత్తవారిఁట గావురములఁ జేయుచుండిరి.

శ్రీరాముఁడు కేవల విషయభోగలోలుపుఁడుకాక, సోదరులతోఁ గూడి ప్రజాక్షేమముల నరయుచుఁ గోసలవాసులకపేక్షితములగు మనో రథములఁ గనిపెట్టి, నానిని దశరథసార్వభౌమునకుఁ దెలియఁజేసి, జన కునియంగీకారముపై నలయుసౌకర్యముల సమకూర్చుచు, పండితులతో గలసి ధర్మనిర్ణయములఁగూర్చిచర్చించుచుఁ గవివరులనాదరించి సత్కా వ్యనిర్మాణములకుఁ బ్రోత్సహింపుచు, సేనానాయకులతో పిఠశాంత రసములగూర్చి ముచ్చటించుచు పఠశాలలకేగి విద్యార్థులఁ బరీక్షించి బహుమతులనొసంగుచు. సభలగావించి ప్రజాసమూహములకు సోదర భావములగూర్చి బోధించుచు పౌరసుఖసంపాదనపరుఁడై కోసలదేశము నకుఁ గ్రొత్తకాంతిని సమకూర్పఁదొడంగెను.

సీతయు శ్రీరామునకు శ్రోత్రసాహజనకములగు ప్రసంగముల చేయుచు తననాథుడొనర్చు ధర్మకార్యములయందు సహధర్మచారిణియై

వెలుగుచుండెను ఆదంపతులకు శరీరభేదముతక్క వేఱెట్టిభావభేదమును కానరాకుండెను శ్రీరాముని హృదయములో సీతయు, సీతాహృదయమున శ్రీరాముఁడును అద్దములయందుఁ బ్రతిబింబములవలెఁ బ్రత్యక్షమగుచుందురేకాని కానరామి కానరాదు.

ఆమిథిలారాజన్యకన్యకలు కాపురమునకు వచ్చినతోడనే దశరథ గృహలక్ష్మి క్రొత్తవిన్నాణముతోఁ ప్రకాశింపఁదొడంగెను. దశరథనృపాలుఁడా కోడండ్రను ఆపుత్రులను గాంచి తనయంతటి భాగ్యశాలి యీధరణీతలమున లేరని గర్వింపఁజొచ్చెను.

ఇటుల మహదానందముగా వైవాహికోత్సవములు ముగిసినతోడనే యుధాజిత్తు దశరథుని భరతుని తనవెంటఁ గేకయదేశమునకు దీసికొని వెళ్ళుటకనుమతింపఁగోరెను. అంతఁబుత్రైకప్రాణుఁడగు నాతేఁడు కొంత వఱకు మారుపలుకక యెట్టకేలకు స్వాంతము శాంతముచేసికొని భరతుని, మేనమామతోఁ దాతగారింటికి బంపుటకనుమతించి, భరతునిఁ బిలిపించి యిట్లుబోధించెను.

దశర:—భరతకుమారా! నీమాతామహులగు నశ్వపతిమహారాజేంద్రులు నినుఁజూడఁగోరుచున్నవారలు. నీమేనమామ నిన్నుఁ దోడ్కొనివెళ్ళుటకు వచ్చియున్నవాఁడు కావున నీవచటికేగి, కొన్నివారములుండి వెంటనేరావలయును నిన్నెడబాసి నేయుండఁజాలను. పోయిరమ్ము.

భరతుఁడు:—దయానిధీ! మీసెలవుప్రకారము చేతును. కాని శత్రుఘ్నునిగూడ నాతోఁబంపవలయును. నేనాతనివిడచి యుండఁజాలను.

దశర:—కుమారా! మీసౌభ్రాత్రమును నేనెఱుంగుదు. నీకు శత్రుఘ్నుఁడును నీయన్న శ్రీరామునకు లక్ష్మణుఁడును తోడుండినగాని యెట్టిపనియుసాగనేరదు. కావున నీతో నీతమ్ముని దీసికొనివెళ్ళుము. అన భరతుఁడు తండ్రిసెలవుగైకొని తిన్నగాఁ గౌసల్యామందిరమునకేగి యటదమతల్లులు మువ్వురును గలసియుండుటను దెలిసికొని లోనికేగి ముందుఁగౌసల్యకు వందనమొనర్చెను. అంతఁగౌసల్య భరతుని బుత్రి

చెంతనుండవు కమ్మనిదివిర్చి తనయొద్దఁగూర్చుండఁబెట్టుకొని యిట్లు ప్రశ్నించెను.

కౌసల్య:—నాయన్నా! నీవు మీ తాతగారింటికేగుదువని యిప్పుడు వింటిని నిజమేనా?

భరతుఁడు:—అమ్మా! కౌసల్యాదేవీ! నిజమే మీకు వందనము నర్పి సెలవుగైకొనుటకే వచ్చియుంటిని.

కౌసల్య:—సత్యరతా! భరతా! యథార్థముగఁ దెలుపుచున్నదానను, నీవు నాకు రామునికన్న గారాబుబిడ్డఁడవు. నిన్ను విడచి యుండుట కష్టమే కాని నా సోదరుఁడు యుధాజిత్తునకు భారముకలుగునని తలంచి నీపోకనంగీకరించుచున్నదానను.

భరతుఁడు:—అమ్మా! పట్టమహిషీ! తమకు నాయందెక్కుడు వాత్సల్యముండుట నేనెఱుంగుదును మీయట్టి దయామయులగు మాతల విడచి యుండుటకు నాకును ఇష్టము లేదు. కాని మీ రనినయట్లు మామయ్యగారికిఁ గోపమువచ్చునని యే నేను ప్రయాణమున కంగీకరించితిని. అని సుమిత్రకు మ్రొక్కి యిట్లు పలికెను.

భరతుఁడు:—అమ్మా! సుమిత్రాదేవీ! నా విన్నప మొకటికలదు. వినుడు నా తమ్ముఁడు శత్రుఘ్నుని నాతోఁ గొంపోవ ననుగ్రహింపుడు.

సుమిత్ర:—చిరంజీవీ! అందులకింత ప్రయత్నమేల? నీ వెవరినైన నెడబాసియుందువుకాని శత్రుఘ్ను నీవిడి యుండనేరఁ డిది లోకవిదితము.

భరతుఁడు:—అమ్మా! మేమిరువుర మెంతయభేదముగా నున్నను నా తమ్ముని దూరముగాఁ గొంపోవునపుడు మీతో మనవిచేయవలదా!

సుమిత్ర:—సోదరీ! కైకేయీ! కంటివా? నీగర్భశుక్తిముక్తాఫలవినయవిలాసమును

కైకేయి:—తలవంచి చిరునగవుతో అక్కలారా! యీమర్యాదలన్నియు మీరుకఱపినవియేకదా?

భరతుఁడు:—తల్లికి నమస్కరించి "అమ్మా! శత్రుఘ్నుతోఁ దాతగారిని సందర్శించి, వచ్చుటకనుమతింపుమన ఆకేకయాత్మజ బిడ్డా! మమ్ము సెలవడుగ బనిలేదు. మాయక్క కౌసల్య సెలవుగైకొన్న చాలును.

కౌసల్య:—భరతకుమారా! మీయిరువురిభార్యలను మాయొద్దనే యుంచికొందుము. మీకుమమ్ముమఱచినను మీయర్ధాంగులం[illegible] చిత్తైన వేగముగావత్తురు

భరతుఁడు:—అమ్మా! యిట్లంటిరేల! గర్భవతులైనది మొదలు నేటివఱకొక్కరీతిని శ్రమించిపెంచిన తల్లులు మఱపునకువచ్చునెడ నిన్నమొన్నవచ్చిన ముద్దలు తలుపునకు వచ్చుటయెట్లు? అమ్మా! వారిని మీకు నుపచారములఁజేయ మీకడనేయుంచిపోయెదము. అనివారి యొద్దసెలవుగైకొని శత్రుఘ్నుతోఁగలసి శ్రీరామునిమందిరమునకేగెను శ్రీరాముఁడు భరతశత్రుఘ్నులఁ జూచినతోడనే యెదురేగి కౌగలించుకొని లోనికిఁదోడ్కొనివచ్చి యాసనములనొసంగి యిట్లుప్రశ్నించెను.

శ్రీరాముఁడు:—తమ్ముఁడా! భరతుఁడా! చిన్నతమ్ముఁడు శత్రుఘ్నునితో రాజగృహమునకేగుదువటకా? సోదరులారా! మిమ్ము విడిచి యుండుట ఖేదావహమైనను పెద్దలయాజ్ఞ యగుటచే మాఱుమాటాడ వీలుకాదు. అందుపితృవాక్యపరిపాలనము రఘువంశజులకు ముఖ్యకర్తవ్యము.

భరతుఁడు:—అన్నా! శ్రీరామచంద్రా! మనతండ్రిగారి యాజ్ఞ యగుటనే యనుజవత్సలురగు మిమ్మెడబాసి, వెళ్ళవలసివచ్చినది. కావున నఁబోయివత్తుమాజ్ఞనొసంగుడు. అని శత్రుఘ్నునితో శ్రీరామునకు నమస్కరించి పక్కనిలచియున్న లక్ష్మణునితోఁ బోయివచ్చెదమని తెలిపి వెడలిపోయెను.

ఓం తత్సత్

కల్యాణకాండము సంపూర్ణము.

శ్రీరామార్పణమస్తు.